'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 315

గురువారం 5-2-2026

రికార్డు ఛేదనతో ఫైనల్‌కు..

అండర్‌–19 వన్డే వరల్డ్‌కప్‌లో అఫ్గాన్‌పై భారత జట్టు ఘన విజయం - 14లో

షేక్‌ చేసిన ఐటీ షేర్స్‌

ఏఐలో కొత్త టూల్స్‌ ఆవిష్కరణతో ఐటీ షేర్లు డీలా.. సూచీలకు భారీ నష్టం - 14లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్‌ జగన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం

బాబు జంగిల్‌ రాజ్‌ - భయానక పాలనతో

ప్రజాస్వామ్యం ఖూనీ

చంద్రబాబు సర్కారు అరాచక పాలనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌ నిప్పులు

అంబటి కుటుంబసభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న వైఎస్‌ జగన్‌

తిరుమల శ్రీవారి పట్ల చేసిన తప్పలకు లెంపలు వేసుకోవాల్సింది పోయి.. ప్రశ్నిస్తున్న వారిపై భౌతిక దాడులకు పురిగొల్పుతావా చంద్రబాబూ?

లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు, సీబీఐ సిట్‌ చార్జిషీట్‌లో స్పష్టంగా తేల్చినా నిస్సిగ్గుగా ఎదురుదాడేనా?

- అంబటి, జోగి ఇళ్లపై విధ్వంసకాండ, నిప్పు పెట్టడం దారుణం
- పోలీసుల సమక్షంలోనే యథేచ్ఛగా దాడుల పర్వం
- ఇప్పుడు తప్పులు చేస్తున్న ఎవరినీ వదిలిపెట్టం
- వచ్చేది మా ప్రభుత్వమే.. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం
- అన్నీ విచారణ చేయిస్తాం.. కోర్టు బోను ఎక్కిస్తాం
- చంద్రబాబు లాంటి దిగజారిన నేత ప్రపంచంలోనే ఉండరు
- సీబీఐ సిట్‌ చార్జిషీట్‌లో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి పేర్లు లేవంటే క్లీన్‌ చిట్‌ ఇచ్చినట్లే కదా..
- గుంటూరులో అంబటి కుటుంబాన్ని పరామర్శించి భరోసానిచ్చిన వైఎస్‌ జగన్‌

2లో

కచ్చితంగా ప్రతిఘటన..

"ఇలాంటివి మళ్లీ జరిగితే మాత్రం చూస్తూ ఊరుకునేది ఉండదు. దానికి కచ్చితంగా ప్రతిఘటన ఉంటుంది. అవసరమైతే రాష్ట్రవ్యాప్త బంద్‌కి కూడా పిలుపునిస్తాం. ఇప్పటికైనా ఆపకపోతే అడుగులు ఇంకా వేగంగా పడతాయి. ఇష్యూస్‌ పెద్దవి అవుతాయని చంద్రబాబును గట్టిగా హెచ్చరిస్తున్నా. ఈ ఘటనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తున్నాం. సుప్రీంకోర్టు తలుపులు కూడా తడతాం. అన్నిరకాల పోరాటాలు చేస్తాం.

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

జంగిల్‌రాజ్‌ను తరిమికొడదాం

చంద్రబాబు పాలనపై జనాగ్రహంతో దద్దరిల్లిన గుంటూరు

జంగిల్‌ రాజ్‌కు వ్యతిరేకంగా ఏకమైన జనం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌కు ఘన స్వాగతం

అడుగడుగునా బారికేడ్లు, తనిఖీలతో పోలీసుల ఆంక్షలు

జగన్‌ను చూడటానికి వెళ్లకూడదంటూ ఎక్కడికక్కడ అడ్డగింత

ముఖ్యనేతలకు నోటీసులు.. వారిని అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలింపు

అయినా ఆంక్షలు ఛేదించుకుని కదిలిన జనం.. ఎగిసిపడ్డ అభిమాన సంద్రం

35 కిలోమీటర్ల దూరానికి ఏకంగా ఆరు గంటల సమయం

3లో

చంద్రబాబు, పవన్‌ ఏకాంత చర్చలు

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయిందని విష ప్రచారం చేసి దొరికిపోయిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ వ్యవహారంలో ఏం చేయాలనే అంశంపై ఇద్దరూ మంతనాలు సాగించారు.

15లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 133 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 160 కిలో

డ్రెస్డ్ స్కిన్‌తో 232 కిలో

స్కిన్ లెస్ 264 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఏపీలో జంగిల్‌రాజ్‌పై ఫ్యాక్ట్‌ కమిటీ

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ జస్టిస్‌ వి.రామసుబ్రహ్మణియన్‌ వెల్లడి

- ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకుని, దోషులపై చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ఆంధ్రప్రదేశ్‌లో మాజీ మంత్రుల ఇళ్లపై దాడి చేశారా? అంటూ ఆగ్రహం
- ఆయా ప్రాంతాల్లో పోలీసుల ప్రేక్షక పాత్రను తప్పుపట్టిన వైనం
- పోలీసు వ్యవస్థ పని తీరుపై ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ కిషోర్‌ మక్వానా మండిపాటు.. దళితులను వెలివేయడం క్షమించరాని నేరమని ఆగ్రహం
- త్వరలో ఎన్‌సీఎస్‌సీ బృందం రాష్ట్రంలో పర్యటిస్తుందని వెల్లడి

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు, నాయకులు, సాల్మన్‌ కుటుంబసభ్యులు

- రాష్ట్రంలో రాజ్యాంగం అపహాస్యం పాలవుతోందని వైఎస్సార్‌సీపీ బృందం ఆధారాలతో ఫిర్యాదు
- చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు
- 20 నెలల్లో 390 హత్యలు, 766 దాడులు.. పూర్తిగా క్షీణించిన శాంతి భద్రతలు
- ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ కమిషన్‌ దృష్టికి తీసుకెళ్లిన వైఎస్సార్‌సీపీ

10లో

'జల'కంటక సర్కారుపై

పోరుకేక..

నేడు చలో పోతిరెడ్డిపాడుకు రాయలసీమ రైతాంగం

ఎత్తిపోతల పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన

తరలిరానున్న నేతలు, కార్యకర్తలు, రైతులు

ప్రజా, రైతు సంఘాల సంఘీభావం

సభకు అనుమతివ్వకుండా చివరి క్షణం వరకూ అడ్డుకున్న ప్రభుత్వం

అనుమతి లేకున్నా.. పోతిరెడ్డిపాడు పోరుకు సిద్ధమైన సీమ, నెల్లూరు రైతులు, ప్రజలు

చివరకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసిన ఆత్మకూరు డీఎస్పీ

సభకు ఏర్పాట్లు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

10లో



బాధ్యత దులిపేసుకున్న మోదీ

- చైనాతో ఘర్షణ సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు... అప్పటి ఆర్మీ చీఫ్‌పైకి నెట్టేశారు
- నరవణే పుస్తకంలో ఏముందో యువత తెలుసుకోవాలి
- కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ వెల్లడి

లోక్‌సభలో రచ్చరచ్చ

6లో

గాంధీ కుటుంబంపై వచ్చిన వివాదాస్పద పుస్తకాలను సభలో ప్రదర్శించిన నిషికాంత్‌ దూబే

రాష్ట్రంలో పాలన హైజాక్‌ అవుతోంది

■ రాష్ట్రంలో చట్టబద్ధ పాలన హైజాక్‌ అవుతోందని పది వామపక్ష పార్టీల ముఖ్య నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు, ఘర్షణలు, అక్రమ కేసులతో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని విమర్శించారు. ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ తీరు మార్చుకోవాలని.. ఉద్యమకారులు, రాజకీయ పార్టీల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు.

16లో

నిందితులను రోడ్లపై ఎలా పెరేడ్‌ చేయిస్తారు?

- నేర నిరూపణ అయ్యే వరకు నిందితులు నిరపరాధులే
- సామాన్యుల పట్ల పోలీసులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారు
- చట్ట నిబంధనలను పాటించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది
- నిందితుల పెరేడ్‌పై కౌంటర్లు వేయండి.. రాష్ట్ర ప్రభుత్వానికి, డీజీపీకి హైకోర్టు ఆదేశం

16లో

జనంపై 'సర్‌' బుల్డోజర్‌

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. 'ఎస్‌ఐఆర్‌'ను నిరసిస్తూ 'సుప్రీం'లో స్వయంగా మమతా బెనర్జీ వాదన

వాదనకు 5 నిమిషాలడిగితే 15 నిమిషాలిచ్చిన కోర్టు

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని సీజేఐ వ్యాఖ్య

విచారణ సోమవారానికి వాయిదా

6లో

ఆంధ్రజ్యోతికి హైకోర్టు నోటీసులు

■ ఆంధ్రజ్యోతి దినపత్రికకు విశాఖలో రూ.కోట్ల విలువైన భూమిని కట్టబెడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఆమోద పబ్లికేషన్స్‌ (ఆంధ్రజ్యోతి)కి నోటీసులు జారీ చేసింది.

10లో

గుంటూరు చుట్టుగుంట సర్కిల్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇసుకేస్తే రాలనంతగా జననీరాజనం

భారీగా తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బాబు జంగిల్ రాజ్ - భయానక పాలనతో...

ప్రజాస్వామ్యం ఖూనీ

చంద్రబాబు సర్కారు అరాచక పాలనపై మాజీ సీఎం వైఎస్ జగన్ నిప్పులు

గుంటూరులో అంబటి కుటుంబాన్ని పరామర్శించి భరోసానిచ్చిన వైఎస్ జగన్

తనకు కావాల్సిన వారిని నియమించుకుని..

చంద్రబాబు తనకు కావాల్సిన కొంతమందిని మాత్రమే సీఐలు, ఎస్సైలు, డీఎస్పీలు, డీఐజీలుగా నియమించుకున్నారు. ఎస్పీలు గత్యంతరం లేని పరిస్థితుల్లో చంద్రబాబు ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నారు. బిహార్‌లో ఏం జరుగుతోందో తెలియదు కానీ రాష్ట్రంలో వీరందరితో చంద్రబాబు జంగిల్ రాజ్ పాలన సాగిస్తున్నారు. దాదాపు 200 మంది సీఐలు, ఎస్సైలు, డీఎస్పీలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అలా రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన సాగుతోంది.

అలా అనుకుంటే బాబు మూర్ఖుడే!

వైఎస్సార్‌సీపీపై ఈ రకంగా దాడులు చేస్తే కార్యకర్తలు భయపడతారని చంద్రబాబు అనుకుంటే ఆయన కన్నా మూర్ఖుడు ఇంకొకరు లేనట్టే. బంతిని ఎంత బలంగా నేలకేసి కొడితే అంతకన్నా నాలుగింతలు బలంగా పైకి లేస్తుందన్నట్లుగా.. మా కార్యకర్తలు చంద్రబాబు ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేస్తారు.

- మీడియాతో వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబు జంగిల్ రాజ్‌ను నడుపుతూ ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న చంద్రబాబు ఆరోపణల్లో నిజం లేదని దేశంలోనే ఒక ప్రఖ్యాత ప్రభుత్వ ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ నిర్ధారిస్తూ రిపోర్టులు ఇచ్చినా.. అదే విషయాన్ని సీబీఐ తన చార్జిషీట్‌లో పొందుపరిచినా.. పాపభీతి లేకుండా, తప్పు ఒప్పుకోకుండా చంద్రబాబు ఎదురు దాడికి దిగుతున్నారని మండిపడ్డారు. చేసిన తప్పులకు లెంపలు వేసుకోవాల్సింది పోయి దీనిపై ప్రశ్నిస్తుంటే భౌతిక దాడులు, విధ్వంసం, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. గుంటూరులో టీడీపీ గూండాల చేతిలో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిని, కార్యాలయాన్ని బుధవారం వైఎస్ జగన్ పరిశీలించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏమన్నారంటే..

అబద్ధాలతో ఫ్లెక్సీలు..

తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు, సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిన తరువాత చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్ తమ తప్పులకు లెంపలు వేసుకుని శ్రీవేంకటేశ్వరస్వామివారిని, ప్రజలను క్షమాపణ కోరాల్సిందిపోయి.. అంతా కూడబలుక్కుని మళ్లీ అవే అబద్ధాలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. తప్పుడు సమాచారాలతో, కులమతాలను రెచ్చగొట్టే విధంగా, అబద్ధాలతో ఫ్లెక్సీలు పెడుతున్నారు. ఇదే చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ఎన్నికలప్పుడు బాండ్లు ఇచ్చి అబద్ధాలతో మోసగించారని మేం కూడా ఫ్లెక్సీలు పెడితే ఒప్పుకుంటారా?

ఇది హత్యాయత్నం కాదా..? కుట్రలో భాగం కాదా?

ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే ఐదు కార్లు ధ్వంసం చేశారు. ఇల్లు, ఆఫీసు మొత్తం తగలబెట్టారు. ఇంట్లో అద్దాలు, సామగ్రిని, ఆఫీసులో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇంట్లో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా లోపలికి వచ్చి ధ్వంసం చేశారు. ఇది హత్యాయత్నం కాదా..? పోలీసులు దగ్గరుండి మరీ ఈ కుట్రలో భాగం కాలేదా? పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఈ మాదిరిగా జరిగేదా? ఇక్కడి నుంచి డీజీపీ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు కూతవేటు దూరంలోనే ఉన్నాయి. ఎంత మంది డీఎస్పీలు, సీఐలు లేరు..? మంగళగిరిలో పోలీసు బెటాలియన్ కూడా ఉంది. కనీసం ఫోన్ చేస్తే కూడా పోలీసులు స్పందించలేదు. మా పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ తదితరులు ఇంటెలిజెన్స్ డీజీ, ఎస్పీ, ఐజీ, ఇతర అధికారులు, చీఫ్ సెక్రటరీ ఆఫీసులకు ఫోన్లు చేస్తే స్పందించలేదు. మరి ఇది కుట్రలో భాగం కాదా? సాయంత్రం ఐదు గంటల నుంచి ఒంటి గంట దాకా విధ్వంసం చేశారు. ఇది ధర్మమేనా? న్యాయమేనా? ఇంతటితో ఆగకుండా ఆ రాత్రి రాంబాబును అన్యాయంగా అరెస్టు చేశారు. చంద్రబాబును తిట్టాడని కేసు పెట్టి అరెస్టు చేశారు. చంద్రబాబుని తిట్టించడం రాంబాబును అన్యాయంగా అరెస్టు చేసినప్పుడు.. మరి రాంబాబు ఇంటికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను హత్య చేయాలని ప్రయత్నించి, ఐదు కార్లను ధ్వంసం చేసి, అద్దాలన్నీ పగలగొట్టి, ఆఫీసుకు నిప్పంటించడం అంతా ఎమ్మెల్యే, ఆమె భర్త సమక్షంలో జరిగితే వారిమీద ఏం యాక్షన్ తీసుకున్నారు? సింపుల్‌గా స్టేషన్ బెయిలిచ్చి పంపేశారు. అంబటి మీడియా సమక్షంలో వివరణ ఇచ్చారు. జరిగిన దానికి క్షమాపణ కూడా కోరారు. అయినా ఆయన ఇంటిపై దాడి చేశారు. అసలు మీరు మనుషులేనా? ఇది జంగిల్‌రాజ్ కాదా? రాంబాబును అక్రమంగా అరెస్టు చేయడమే కాదు.. అర్ధరాత్రి దాటిన తరువాత ఆయన్ను నల్లపాడు స్టేషన్‌లో ముగ్గురు సీఐలు దారుణంగా హింసించి వేధించారు. ఓ మాజీ మంత్రి పట్ల ఆ విధంగా వ్యవహరించడం, టార్చర్ చేయడం ఏం న్యాయం? మరి ఇది జంగిల్‌రాజ్ కాకపోతే మరేమిటి? మాజీ మంత్రి అంబటి రాంబాబు కాపు కులంలో ఒక టైగర్... విలువలున్న వ్యక్తి. అలాంటి వ్యక్తిని తప్పుడు కేసులో అక్రమంగా అరెస్ట్ చేయడమే కాకుండా నల్లపాడు సీఐ వంశీ, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఆయన్ను తీవ్రంగా దూషించి కొట్టారు. ఇదంతా చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అని అనుమానం కలుగుతోంది. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు.

జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు...!

మరుసటి రోజు జోగి రమేష్ ఇంటిపై దాడి! అక్కడా మళ్లీ పోలీసుల సమక్షంలోనే. అక్కడ ఏకంగా పెట్రోల్ బాంబులు. బాటిళ్లలో పెట్రోల్ పోసి వాటిని ఇంట్లోకి విసిరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు విధ్వంసం సృష్టించారు. దాదాపు 300–400 మంది పోగయ్యారు. వారంతా అక్కడికి వచ్చేటప్పుడు పోలీసులు అక్కడే ఉన్నారు. పోలీసుల సమక్షంలో అదంతా జరుగుతున్నా చూస్తుండిపోయారు. పోలీసుల సమక్షంలోనే జోగి రమేష్ ఇంటికి నిప్పంటించారు.

పోలీసుల సమక్షంలోనే..

అంతకు ముందు రోజు విడదల రజని గుడిలో పూజ చేసుకుని వస్తుంటే ఆమెను అడ్డగించి తిట్టారు. దుర్భాషలాడుతూ పోలీసుల సమక్షంలోనే ఆమెపై దాడికి యత్నించారు. ఇంకా అన్యాయం ఏమిటంటే.. తిరిగి ఆమె మీదే కేసు పెట్టారు. ఇది కూడా ఏమని? ఆమె గుడికి వెళ్లి వారందరిపై అటాక్ చేయడానికి ప్రయత్నం చేశారని! మాట్లాడటానికి హద్దూ పొద్దూ ఉండాలి! ఇది జంగిల్ రాజ్ కాదా? బొల్లా బ్రహ్మనాయుడు అన్న చేసిన పాపం ఏమిటి..? చంద్రబాబు, ఆయన కుమారుడు, పవన్ కళ్యాణ్‌కు జ్ఞానోదయం కలగాలని కోరుతూ పూజ చేయటానికి ఆయన గుడికి బయలుదేరారు. దారిలో ఆయన మీద అటాక్ చేశారు. అది కూడా పోలీసుల సమక్షంలోనే జరిగింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి విషయంలో కూడా ఇదే జరిగింది.



అసలు తప్పు చేసింది బాబే

అసలు తప్పు చేసింది చంద్రబాబు. తప్పుడు ఆరోపణలు చేసిందీ చంద్రబాబే. అవి తప్పుడు ఆరోపణలనీ దేవుడు మొట్టికాయలు వేసినా.. ఏకంగా సీబీఐ చార్జిషీట్‌లోనే చెప్పినా.. కేంద్ర ప్రభుత్వ ల్యాబ్‌లు నెయ్యిపై క్లీన్ చిట్ ఇస్తే... దేవుడు, ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందిపోయి చంద్రబాబు చేస్తున్నదేమిటి? ప్రతి విషయంలోనూ దుర్మార్గమైన రాజకీయాలే! సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని ఎన్నికలప్పుడు మాట ఇచ్చారు. ఇంటింటికీ బాండ్లు ఇచ్చి పథకాల ద్వారా ఆ ఇంటికి ఎంతెంత వస్తుందో చెబుతూ సంతకాలతో సహా హామీ ఇచ్చారు. మీ ఇంట్లో నిరుద్యోగులు ఉన్నారా? ఇదిగో మీకు రూ.36 వేలు. మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా? ఇదిగో మీకు రూ.15 వేలు. మీ ఇంట్లో రైతులు ఉన్నారా? ఇదిగో మీకు రూ.26 వేలు. మీ ఇంట్లో చిన్నమ్మలు, పెద్దమ్మలు 55 ఏళ్ల వయసులో ఉన్నారా? వాళ్లకు రూ.48 వేలు అంటూ ప్రజలను మోసం చేశారు. సూపర్ సిక్స్, సెవెన్ అమలు చేశామంటూ సిగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారు. చంద్రబాబు చేస్తున్నది తప్పని, మోసమని ఎవరైనా ప్రశ్నిస్తే.. కేసులు పెట్టి జైలుకు పంపుతున్నాడు. చివరకు పిల్లలని కూడా చూడకుండా సోషల్ మీడియా యాక్టివిస్టులపై గంజాయి కేసులు పెట్టి జైలుకు పంపి వారి కెరీర్ నాశనం చేస్తున్నాడు.

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే.. చేసేవన్నీ మోసాలే!

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే.. చేసేవన్నీ మోసాలే! టీడీపీ సైన్యానికి లాటరీలో ప్రైవేటు మద్యం షాపులన్నీ కట్టబెడతాడు. ఏకంగా ఎమ్మెల్యేలు దగ్గరుండి ప్రతి గ్రామంలో ఆక్షన్ పాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. లిక్కర్ షాపుల పక్కనే ఇల్లీగల్ పర్మిట్ రూములు నడుపుతూ పెగ్గులతో అమ్ముతున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు. అవి పక్కదోవలో చంద్రబాబుకింత.. ఎమ్మెల్యేకి ఇంత.. వారి మాఫియా సైన్యానికింత.. అనే లాటీ పద్ధతిలో పంచుకుంటున్నారు. ప్రతి గ్రామంలో ఒకటి, రెండు కాదు. పది వరకు బెల్టు షాపులున్నాయి. లిక్కర్ ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు అమ్ముతున్నారు. అది సరిపోదన్నట్లు ఏకంగా ప్రతి ఐదు బాటిళ్లకు ఒకటి నకిలీ. వీళ్లే కుటీర పరిశ్రమను పెట్టి చీప్ లిక్కర్ తయారు చేసి అమ్ముతున్నారు. ఆ కల్తీ లిక్కర్ తాగి ఇంజనీరింగ్ విద్యార్థులు నలుగురు చనిపోయారు. నకిలీ లిక్కర్‌ను టీడీపీ నాయకులే తయారు చేస్తూ సాక్ష్యాధారాలతో దొరికిపోయారు. తంబళ్లపల్లెలో టీడీపీ తరఫున పోటీచేసిన జయచంద్రారెడ్డి కల్తీ లిక్కర్ తయారు చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు దొరికాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్నదంతా ఇదే. ఎక్సైజ్ అధికారులకు, జయచంద్రారెడ్డికి వాటాలు పంచుకోవడంలో తేడాలొచ్చి దొరికిపోతే మా నాయకుడు జోగి రమేష్‌ను ఈ కేసులో అక్రమంగా ఇరికించారు. ఒకపక్క రాక్షస పాలన సాగిస్తున్న టీడీపీ నాయకులతో కలిసి మా పార్టీకి చెందిన జోగి రమేష్ కల్తీ లిక్కర్ తయారు చేయడం సాధ్యమేనా? వీళ్లు నకిలీ లిక్కర్ తయారు చేసి చంద్రబాబు తీసుకొచ్చిన బెల్ట్ షాపుల్లో జోగి రమేష్ అమ్ముతున్నాడని అక్రమ కేసు పెట్టారు. నకిలీ, కల్తీ లిక్కర్ తయారు చేసేది వారే! బెల్ట్ షాపులు తీసుకొచ్చిందీ వారే! వాటిలో కల్తీ లిక్కర్ అమ్మకాలు చేసేదీ వారి మనుషులే! కానీ కేసు మాత్రం జోగి రమేష్ మీద పెట్టి జైలుకు పంపారు.

విచారణ చేయిస్తాం... వడ్డీతో చెల్లిస్తాం

ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయాయి. కళ్లు మూసి తెరిచేలోపు మరో మూడేళ్లు గడిచిపోతాయి. అప్పుడు వచ్చేది మా ప్రభుత్వమేనని ఖచ్చితంగా చెబుతున్నా. చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు, ఆయనకు కొమ్ము కాస్తున్న ఇతర పార్టీ నాయకులకు, కొంత మంది పోలీసు అధికారులకు కూడా చెబుతున్నా.. ఎల్లకాలం ఇలాగే అన్యాయం చేస్తుంటే దేవుడు చూస్తూ ఊరుకోడు. ఖచ్చితంగా వీరికి మొట్టికాయలు పడతాయి. రేపు మా ప్రభుత్వం వచ్చాక ఈ అరాచకాలన్నింటి మీదా విచారణలు చేయిస్తాం. వడ్డీతో సహా చెల్లిస్తాం. అందర్నీ బోనులో నిలబెట్టి సాక్ష్యాధారాలతో వారి యూనిఫాంలు విప్పిస్తాం. ఈ దారుణాల్లో భాగస్వాములైన కూటమి నాయకులు ఎవరున్నా వారిని జైలుకు పంపించి బాధితులకు న్యాయం చేసి తీరుతామని ప్రతి ఒక్కరినీ హెచ్చరిస్తున్నా.

మా కార్యకర్తలూ ఇలాగే స్పందిస్తే..

రాష్ట్రంలో విషపు విత్తనాలు నాటుతున్నారు. ఈ సంస్కృతిని ఇప్పటికైనా ఆపండి. ఈ విషపు విత్తనాలు, కూటమి నాయకులు చేస్తున్న అన్యాయాల కారణంగా గ్రామ స్థాయి నుంచి ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త, నాయకుడు దెబ్బతిని ఉన్నారు. ఈ విషపు విత్తనాలు పెరిగి పెద్దవై చెట్టుగా మారినప్పుడు, రేపొద్దున్న మా ప్రభుత్వం వచ్చినప్పుడు మా నాయకులు, కార్యకర్తలు ఇలాగే స్పందిస్తే మీకు ఏం జరుగుతుందో ఆలోచన చేసుకోవాలని చంద్రబాబుని గట్టిగా హెచ్చరిస్తున్నా.

చేతనైతే ఇవన్నీ చెయ్ బాబూ..!

ఇప్పటికైనా దేవుడంటే భయం, భక్తితో వ్యవహరించి బుద్ధి జ్ఞానం తెచ్చుకుని మంచి పరిపాలనతో ప్రజలకు మేలు చేసి వారి వద్ద మంచి పేరు తెచ్చుకునే ప్రయత్నం చంద్రబాబు చేయాలి. చేతనైతే సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ విషయంలో అబద్ధాలు చెప్పకుండా, మోసాలు చేయకుండా నెరవేర్చే కార్యక్రమం చేయాలి. కూటమి వచ్చాక నిర్వీర్యం అయిన స్కూళ్లను బాగుచేయాలి. 8 క్వార్టర్లకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలి. పేదవాడికి ఉచితంగా వైద్యం అందించే ఆలోచన చేయాలి. చేతనైతే ఆపేసిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేసి పేద, మధ్యతరగతి వారికి నాణ్యమైన వైద్యం అందించే కార్యక్రమం చేసి చూపించాలి. చేతనైతే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. అన్నదాత సుఖీభవ కింద రూ.10 వేలిచ్చి వదిలేశారు. బకాయి పడ్డ రూ.30 వేలు కూడా తక్షణం చెల్లించాలి. వ్యవసాయాన్ని చక్కబెట్టే కార్యక్రమం చేయాలి. కానీ మీకు వీటన్నింటి మీద ధ్యాస లేదు. అన్నీ అబద్ధాలు, మోసాలు, ప్రశ్నించే గొంతులు నొక్కడమే.

తనకు అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకే కమిషన్!

చంద్రబాబు ఎంత దుర్మార్గుడు, రాక్షసుడో ప్రజలకు ఇప్పుడు స్పష్టంగా తెలిసింది. తిరుమలలో వాడిన నెయ్యిలో జంతుకొవ్వు, పందికొవ్వు, చేపనూనె కలిసిందని తాను చేసిన ఆరోపణలు పూర్తిగా తప్పు అని స్పష్టంగా తేలడం, ఆధారాలతో సహా రుజువు కావడంతో ఆ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి గోబెల్స్ ప్రచారానికి తెర తీశారు. ఈ అంశంలో తానే ఓ కమిషన్ వేస్తామని చెబుతున్నారు. సీబీఐ చెప్పింది తప్పు..! ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ రిపోర్టులు తప్పు అని చెప్పిస్తూ, తనకు అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి మరో కమిషన్ ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. తాను చెప్పినట్టే నివేదిక రావాలని ఒత్తిడి చేసి, దానిని రాష్ట్ర ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత దిగజారిపోయిన రాజకీయ నాయకుడు ప్రపంచ చరిత్రలో ఉండరు.

- వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, విడదల రజిని, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, నంబూరు శంకరరావు, అన్నాబత్తుని శివకుమార్, కోన రఘుపతి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవినేని అవినాష్, వనమా బాలవజ్రబాబు, అంబటి మురళీకృష్ణ, షేక్ నూరీ ఫాతిమా, దొంతిరెడ్డి వేమారెడ్డి, దేవభక్తుని చక్రవర్తి, తన్నీరు నాగేశ్వరరావు, పోతిన మహేష్, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పలువురు రాష్ట్ర కార్యదర్శులు, అధికార ప్రతినిధులు జగన్ పర్యటనలో పాల్గొన్నారు.

అంబటి నివాసంలో టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న వైఎస్ జగన్

ప్రశ్నిస్తుంటే దాడులు...

దుర్బుద్ధితో ఫ్లెక్సీలు పెట్టి భావోద్వేగాలను రెచ్చగొడుతున్న చంద్రబాబును.. ఎందుకయ్యా అబద్ధాలు చెప్పావు? అన్యాయం చేశావు? ఎందుకయ్యా శ్రీవారి ప్రసాదం ప్రతిష్టను దెబ్బ తీశావు? అని ఎవరైనా గట్టిగా నిలదీస్తే ఆయన ఏం చేశారో తెలుసా..? అంబటి రాంబాబు అన్న మీద దాడి! ఆ రోజు (శనివారం) ఉదయం ఆయన గుడికి వెళ్లి చంద్రబాబుకు జ్ఞానోదయం కలగాలని పూజ చేసి బయటకు వస్తుంటే.. గుడి నుంచి ఇంటికి వచ్చే మార్గంలో ఏకంగా కట్టెలు పట్టుకుని, పోలీసులను పెట్టుకుని అడ్డుకున్నారు. (కర్రలు పట్టుకున్న టీడీపీ కార్యకర్తల ఫోటోలను చూపారు). కారులో ఉన్న రాంబాబును అడ్డగించి, కారును కర్రలతో బాదుతూ, పోలీసుల సమక్షంలోనే అనకూడని మాటలు అంటూ బూతులు తిట్టారు. ఒకేసారి అంతమంది దుండగులు



చేతిలో కర్రలతో కారుపైకి దూసుకు రావడం.. బూతులు తిడుతూ మీదకు రావడంతో ఆయన కాస్త ఘాటుగా స్పందించాడు. ఆయన నోటి నుంచి ఒక తిట్టు పదం వచ్చింది. ఒక రియాక్షన్‌గా జరిగింది. అదే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ మీద ఎటువంటి అటాక్ లేకపోయినా రొటీన్‌గా తిడుతున్నారు. అంబటి రాంబాబు అన్న ప్రాణం మీదకు వచ్చినప్పుడు రియాక్షన్‌గా ఆయన తిడితే మాత్రం ఇంకో రకంగా చిత్రీకరిస్తున్నారు. అయినప్పటికీ రాంబాబు ఇంటికి వచ్చిన తర్వాత ఒంటి గంట ప్రాంతంలో ప్రెస్‌మీట్ పెట్టి జరిగిన విషయమంతా వివరించారు. ఆయన పెద్ద మనిషి, సంస్కారం ఉన్న వ్యక్తి కాబట్టి తాను తిట్టకుండా ఉండాల్సింది అని కూడా చింతిస్తూ చెప్పాడు. అంతటి సంస్కారం ఉన్న వ్యక్తిని చేతనైతే పొగడాలి. కానీ వాళ్లు దాన్ని కూడా వక్రీకరిస్తూ ఏకంగా రాంబాబు అన్నను హత్య చేయడానికి సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు సాక్షాత్తూ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో మనుషులను వేసుకుని వచ్చి అంబటి ఇంటిపై దాడి చేశారు. ఐదు కార్లు ధ్వంసం చేశారు. ఇంట్లో కిటికీల అద్దాలు, సామగ్రి ధ్వంసం చేశారు. పక్కనున్న ఆఫీసులో అన్నీ పగలగొట్టారు. ఆ ఇంట్లో ఆడవాళ్లు ఉన్నారు. వారి ప్రాణాలకు నష్టం జరిగే విధంగా.. వారిని తిడుతూ వ్యవహరించిన తీరు ఆక్షేపణీయం.

అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దేవుడంటే కనీసం భయం, భక్తి లేకుండా..

రాష్ట్రంలో ఈరోజు జంగిల్ రాజ్ ఏ స్థాయిలో ఉందంటే.. ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయింది. ఒక భయానక వాతావరణంతో రాష్ట్రాన్ని పరిపాలించే కార్యక్రమం జరుగుతోంది. అంబటి రాంబాబు ఇంటిపైన దాడి.. జోగి రమేష్ ఇంటి మీద దాడి.. విడదల రజినిపై అటాక్.. బొల్లా బ్రహ్మనాయుడు మీద అటాక్.. ఇవన్నీ జంగిల్ రాజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు కొన్ని ఉదంతాలు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజినమ్మ, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్ అన్న చేసిన తప్పేమిటి? చంద్రబాబు దాదాపు ఏడాదిన్నరగా ఉద్దేశపూర్వకంగా అబద్ధాలతో కూడిన ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ వచ్చారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతువుల కొవ్వు, గొడ్డు మాంసం కొవ్వు, పంది కొవ్వు ఉందని, చేప నూనె కలిసిందంటూ రకరకాలుగా చంద్రబాబు, ఆయన కుమారుడు, పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం చేశారు. దేవుడంటే కనీసం భయం, భక్తి లేకుండా స్వార్థ రాజకీయాల కోసం వాడుకున్నారు.

ఆ ఆరోపణలన్నీ అవాస్తవమని తేల్చిన ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ

నెయ్యిపై చంద్రబాబు ఆరోపణలన్నీ అవాస్తవం అని ఎన్‌డీఆర్‌ఐ (నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్), ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) రిపోర్టు ఇచ్చాయి. ఈ రెండూ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ల్యాబ్‌లు. వీళ్ల హయాంలో.. వీళ్లే ఇచ్చిన టెస్ట్ శాంపిళ్లు అవి. వాటిని విశ్లేషించి ఆ నెయ్యిలో జంతువుల కొవ్వుగానీ, గొడ్డు మాంసం కొవ్వులు గానీ, పందికొవ్వు గానీ, చేప నూనెగానీ.. ఇటువంటివి ఇంకొకటిగానీ ఇంకొకటి గానీ లేవని నిర్ధారణ చేసి సర్టిఫికెట్లు ఇచ్చాయి. అదే విషయాన్ని సీబీఐ తన చార్జిషీట్‌లో పొందుపరిచి ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ సర్టిఫికెట్లను జత చేసి క్లోజర్ కూడా ఇచ్చింది. సీబీఐ క్లీన్‌చిట్ ఇస్తోంది. ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు కూడా క్లీన్ చిట్లు ఇస్తున్నాయి.

ఏ తప్పూ చేయలేదు కాబట్టే సీబీఐ క్లీన్‌చిట్..

ఒకవేళ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తప్పు చేసి ఉంటే వారి పేర్లు ఎందుకు చేర్చలేదు? వారు ఒకవేళ తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే, తప్పు నిజమే అయితే ఎందుకు అరెస్టు చేయలేదు? వారు ఏ తప్పూ చేయలేదు కాబట్టే సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఎటువంటి తప్పూ జరగలేదు కాబట్టే వారి పేర్లు చార్జిషీట్‌లో పెట్టలేదు. తప్పు చేయలేదు కాబట్టే అరెస్టు చేయలేదు. అసలు ఈ వ్యవహారంలోకి సీబీఐ ఎలా వచ్చిందో తెలుసా..?రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని, దీనిపై విచారణకు ఆదేశించాలని వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టుకు వెళ్లి పిటిషన్ వేశారు కాబట్టే దీనిపై స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించింది.

జనం కేక..

గుంటూరులోని చుట్టుగుంట వద్ద వైఎస్ జగన్ వెంట కదులుతున్న అశేష జనవాహిని

జంగిల్‌రాజ్‌ను తరిమికొడదాం

దద్దరిల్లిన గుం'టూరు'.. జంగిల్ రాజ్‌కు వ్యతిరేకంగా ఏకమైన జనం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రోడ్డుపై కిలోమీటర్ల కొద్దీ కనుచూపు మేర జనం.. రాష్ట్రంలో జంగిల్ రాజ్‌కు వ్యతిరేకంగా జనం ఏకమయ్యారు.. చంద్రబాబు సర్కారు దుర్మార్గాన్ని ధైర్యంగా దుయ్యబట్టారు.. సర్కారు ఆంక్షలను లెక్క చేయకుండా రోడ్డుపైకి వచ్చారు.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అడుగులో అడుగేస్తూ దిక్కులు పిక్కటిల్లేలా జై జగన్ అంటూ నినాదాలు చేశారు.. జంగిల్ రాజ్‌కు రోజులు దగ్గర పడ్డాయని గర్జించారు.. ఇందుకు బుధవారం గుంటూరు వేదికైంది.. గుంటూరు నగరం జన సంద్రమైంది.. నినాదాలతో దద్దరిల్లింది. తెలుగుదేశం పార్టీ గూండాల దాడికి గురైన అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జన సందోహం అపూర్వ స్వాగతం పలికింది. జగన్ పర్యటన ఖరారైందని తెలిసిన వెంటనే జిల్లాలో 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించి, నాయకులందరికీ ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దని పోలీసులు నోటీసులు ఇచ్చారు. తాడేపల్లి నుంచి అంబటి రాంబాబు ఇంటి వరకు మార్గ మధ్యంలో అనేక చోట్ల బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. జగన్ కాన్వాయ్‌ను మాత్రం అనుమతించి.. ఆయన వెనుక వస్తున్న వాహనాలను, జన సందోహాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఇన్ని అడ్డంకుల మధ్య కూడా వైఎస్ జగన్ పర్యటన విజయవంతమైంది.

35 కిలోమీటర్లు.. ఆరు గంటలు

- తాడేపల్లి నుంచి గుంటూరు నగరంలోని అంబటి రాంబాబు నివాసం వద్దకు 35 కిలోమీటర్ల దూరం చేరుకోవడానికి వైఎస్ జగన్‌కు ఏకంగా ఆరు గంటల సమయం పట్టిందంటే జనం ఎంతగా పోటెత్తారో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ జగన్‌ను చూడటానికి స్వచ్ఛందంగా వెళ్తున్న వేలాది మంది ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అడుగడుగునా ఆంక్షలతో ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసింది.
- జగన్ కాన్వాయ్ తాడేపల్లిలో బయలుదేరిన తర్వాత కాజా టోల్‌గేట్ వద్ద వాహనాలను ఆపారు. ఆయనతోపాటు కొద్ది వాహనాలు మాత్రమే పంపి మిగతా వాటిని నిలువరించారు. అనంతరం కాన్వాయ్ గుంటూరు ఆటోనగర్ వై జంక్షన్‌కు చేరుకోగానే అక్కడ బారికేడ్లు అడ్డుగా పెట్టి పూర్తి స్థాయిలో వాహనాలు ఆపేశారు.
- ఏటుకూరు బైపాస్ వద్ద కూడా కార్యకర్తలు పత్తిపాడు నుంచి గుంటూరు నగరంలోకి రాకుండా బారికేడ్లు పెట్టి ఎక్కడికక్కడ నిలువరించారు. బైక్‌లపై వస్తుంటే బైక్‌ల తాళాలు లాక్కున్నారు. గుంటూరు జిల్లాను దిగ్బంధనం చేశారు. పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వెళ్లే సరిహద్దు మండలాలైన నరసరావుపేట, యడ్లపాడు, సత్తెనపల్లి, అమరావతి మండలాల పరిధిలో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు.
- ఎక్కడికి వెళ్తున్నారు.. ఎందుకు వెళ్తున్నారు.. అంటూ ఆరా తీశారు. వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొనేందుకు వెళ్తున్న వారిని అడ్డుకొని వెనక్కి పంపారు. కొందరిని పోలీసు స్టేషన్‌లకు తరలించి సాయంత్రం ఐదు గంటల తర్వాత వదిలిపెట్టారు.

వైఎస్ జగన్ రాకతో ప్రజలతో కిక్కిరిసిన గుంటూరులోని పట్టాభిపురం రోడ్డు

జననేతకు జనం జేజేలు

- గుంటూరు నగరానికి వచ్చిన జననేత వైఎస్ జగన్‌కు ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జేజేలు పలికారు. విద్యార్థి విభాగం నేతలు, యువజన విభాగం నేతలు, అనుబంధ విభాగాల నేతలు, యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ జన నేతకు ఎదురేగి స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వైఎస్ జగన్ పర్యటనకు మద్దతు తెలిపారు.
- కంకరగుంట ఓవర్ బ్రిడ్జి, పట్టాభిపురం స్వామి థియేటర్ వద్ద సైతం పార్టీ నేతలు భారీగా చేరుకుని పూల వర్షం కురిపించారు. చేబ్రోలు హనుమయ్య కంపెనీ, గుజ్జనగుండ్ల సెంటర్‌లో తీన్మార్ డప్పు వాయిద్యాలతో స్థానిక నేతలు స్వాగతం పలికారు. యువత భారీగా బైక్ ర్యాలీలతో సందడి చేశారు. జగన్ గుంటూరు చేరుకున్న తర్వాత ఏటుకూరు వద్ద సర్వీస్ రోడ్డు మీదుగా వీఐపి రోడ్డులోకి రావడానికి ముందుగా పోలీసులు ఆ దారిన వచ్చిన వాహనాలను అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం దాటిన తర్వాత కంకర్ గుంట ఓవర్ బ్రిడ్జి వద్ద సైతం వాహనాలను నిలువరించారు. అయినా జన సందోహం ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు.
- గుంటూరు రోడ్లన్నింటిపై ప్రజలు, అభిమానుల కోలాహలం కనిపించింది. ఉదయం 10 గంటల నుంచే రోడ్లపైకి వచ్చి తమ అభిమాన నేత కోసం ఎదురు చూశారు. పెద్ద సంఖ్యలో వస్తున్న నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని అంబటి ఇంటికి వెళ్లనీయకుండా ఆపివేసినప్పటికీ.. సాయంత్రం 5 గంటలయ్యే సరికి ఆ ప్రాంతం జనసంద్రంగా మారిపోయింది.
- గుంటూరు నగరంలోకి ప్రవేశించిన వైఎస్ జగన్ కాన్వాయ్‌కు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో చుట్టుగుంట సెంటర్ నుంచి అంబటి రాంబాబు నివాసానికి వచ్చేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. అంబటి రాంబాబు నివాసంతో పాటు చుట్టుపక్కల ఇళ్లపైన, గోడలపైకి ఎక్కి ప్రజలు తమ అభిమాన నేతను చూశారు. పర్యటన ఈ స్థాయిలో విజయవంతం కావడంతో అధికార పార్టీ నేతల్లో గుబులుపుట్టింది.

అడుగడుగునా అడ్డంకులే..

సాక్షి, నరసరావుపేట: జంగిల్ రాజ్ అరాచకాలను ఎండగట్టేందుకు గుంటూరు నగరానికి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా వెళ్తున్న వేలాది మంది ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అడుగడుగునా ఆంక్షలతో ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసింది. పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వెళ్లే సరిహద్దు మండలాలైన నరసరావుపేట, యడ్లపాడు, సత్తెనపల్లి, అమరావతి మండలాల పరిధిలో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. జగన్‌ను చూడటానికి వెళ్తున్న వారిని గుర్తించి వెనక్కు పంపారు. ఉదయం 7 గంటల నుంచే వాహనాల తనిఖీలు ప్రారంభించారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ, యడ్లపాడు మండలం బోయపాలెం హైవే వద్ద, సత్తెనపల్లి మండలం నందిగం అడ్డరోడ్డు వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. సత్తెనపల్లి, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, దాచేపల్లి, అచ్చంపేట, బెల్లంకొండ తదితర మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్తున్న వాహనాలను సత్తెనపల్లి నందిగం అడ్డరోడ్డు వద్ద సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఆపేశారు. వారిని సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్‌లోనే నిర్బంధించారు. సత్తెనపల్లి కార్యకర్తలను సైతం ఇదే స్టేషన్‌లో సాయంత్రం వరకు ఉంచారు. వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొనేందుకు అనుమతి లేదంటూ పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు గుంటూరులోని నివాసంలో పోలీసులు నోటీసులు అందజేశారు. చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ఎంత కట్టడి చేసినా పల్నాడు జిల్లా మీదుగా గుంటూరు నగరానికి వేలాది మంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలి వెళ్లడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పడుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

జగనన్న 2.0 లోడింగ్

సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా వైఎస్ జగన్ గుంటూరు పర్యటన

హోరెత్తిన జనహృదయ విజేత పేరు	అదరని, బెదరని గుండె అది అంటూ పోస్టులు వైరల్	గ్రూపుల్లో షేర్ చేస్తూ షేక్ చేస్తున్న నెటిజన్లు

సాక్షి, అమరావతి: 'జగనన్న 2.0 లోడింగ్'.. అంటూ సామాజిక మాధ్యమాల్లో వైఎస్ జగన్ పేరు హోరెత్తిపోతోంది. మాజీ మంత్రి అంబటిపైనా, ఆయన ఇంటిపైనా కూటమి రౌడీ మూకల దాడి నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి వైఎస్ జగన్ బుధవారం గుంటూరు వెళ్లారు. ఈ సందర్భంగా ఉవ్వెత్తున జన అభిమాన తరంగం ఎగిసిపడింది. కార్యకర్తలకు జగన్ అండగా ఉంటాడని, ఎవరికీ భయపడేది లేదనే మీమ్స్‌ను నెటిజన్లు పోస్ట్ చేస్తున్నారు. జగన్ కాన్వాయ్ వీడియోలను వైరల్ చేస్తున్నారు. జగన్ పర్యటనకు జనం భారీ స్థాయిలో రావడం అనేది సహజం. కానీ అంతే స్థాయిలో ఇప్పుడు సోషల్ మీడియాలోనూ ఆయనకు మద్దతు లభిస్తుండటం, వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో, వాటి గ్రూపుల్లో లెక్కకు మించి జగన్ పర్యటనపై పోస్టులను నెటిజన్లు షేర్ చేస్తుండటం విశేషం.

నగరంపాలెంలో భారీ జనసందోహానికి నమస్కరిస్తున్న వైఎస్ జగన్

వెంకటప్పయ్య కాలనీ రోడ్ వద్ద జగన్‌కు అభివాదం చేస్తున్న చిన్నారి

ప్రజలతో కిక్కిరిసిన పట్టాభిపురం రోడ్డు

ఏటుకూరు క్రాస్ వద్ద వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న అక్కచెల్లెమ్మలు

జగన్‌కు మద్దతుగా గుంటూరులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

గుంటూరు హైవేలో బారికేడ్లు పెట్టి ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

బాధ్యత అనేది వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది.
బాధ్యత వహించే చొరవ లేకుంటే 'నేను' అనే భావన
కేవలం నీడగానే మిగిలిపోతుంది.
– రోమన్ విటోల్డ్ ఇంగార్డెన్

సాక్షి
గురువారం, 5 ఫిబ్రవరి 2026

పాక్‌కు బలూచ్ సవాలు!

బలూచిస్తాన్ స్వాతంత్ర్య కాంక్షను ఉక్కుపాదాల కింద తొక్కివుంచాలని ఏడు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్న పాకిస్తాన్ పాలకులకు యథాప్రకారం మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గత వారం చివరిలో తొమ్మిది జిల్లాల్లో కొనసాగించిన ఆత్మాహుతి దాడుల్లో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 84 మంది పాక్ సైనికుల్ని హతమార్చి, మరో 18 మందిని అపహరించింది. ప్రతీకారంగా తాము జరిపిన దాడుల్లో 133 మంది బీఎల్ఏ మిలిటెంట్లు చనిపోయారని పాక్ సైన్యం ప్రకటించింది. ఒకప్పుడు తూర్పు పాకిస్తాన్ భాషనూ, సంస్కృతినీ విస్మరించిన పర్యవసానంగా అది విడివడి బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసి కూడా దేశంలో 40 శాతం భూభాగం గల బలూచిస్తాన్‌ను పాక్ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటిన్నరమంది జనాభా నివసించే ఆ ప్రాంతానికి ఒకపక్క అఫ్గానిస్తాన్, మరోపక్క ఇరాన్, మూడోవైపు అరేబియా సముద్రం ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా అత్యధిక భూభాగంలో భూగర్భ జలాలే ఆధారం. అక్కడ పండే యాపిల్స్, ద్రాక్ష, బాదం, ఖర్జూరం వగైరాలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. పాక్ పండ్ల ఎగుమతుల్లో 90 శాతం వాటా బలూచిస్తాన్ ప్రాంతానిదే. నీటి పారుదల సదుపాయం పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో గోధుమ, వరి, బార్లీ, ఆలుగడ్డ పండుతాయి.

ఇంతగా దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నా బలూచిస్తాన్ అభివృద్ధిని పాలకులు పూర్తిగా మరిచిపోయారు. అక్కడి భూపొరల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. రాగి, సీసం, క్రోమైట్, గ్రానైట్, జింకు వగైరాలున్నాయి. చమురు, సహజ వాయువు, బొగ్గు, బంగారం ఉన్నాయి. వీటిల్లో బంగారం, రాగి గనుల నిర్వహణ చైనా చేతుల్లో ఉంది. అది పెట్టుబడి పెట్టి నిర్మించిన గ్వాదర్ నౌకాశ్రయం బలూచిస్తాన్ ప్రాంతం లోనిదే. 6,500 కోట్ల డాలర్లతో చైనా నిర్మించతలపెట్టిన చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనాలోని షిన్‌జియాంగ్ నుంచి గ్వాదర్ వరకూ ఉంటుంది. చైనా దోపిడీ చాలలేదన్నట్టు నిరుడు సెప్టెంబర్‌లో అమెరికా కూడా వచ్చింది. ఆ దేశానికి చెందిన బహుళ జాతి సంస్థ స్ట్రాటజిక్ మెటల్స్‌తో పాక్ సైన్యం అనుబంధ సంస్థ 50 కోట్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఇదంతా ఆ ప్రాంత అభివృద్ధి కోసమేనంటూ ప్రభుత్వం చెబుతున్నదంతా బూటకమనీ, గ్వాదర్ నౌకాశ్రయం తర్వాత తమ మత్స్యకారులు జీవిక కోల్పోయారనీ, గుక్కెడు మంచినీళ్లు దొరకడం కూడా కష్టమవుతున్నదనీ బీఎల్ఏ ఆరోపణ.

పాకిస్తాన్ ఆవిర్భవించాక 1948లో బలూచిస్తాన్‌ను బలవంతంగా విలీనం చేసుకుంది. అప్పటి నుంచి తిరుగుబాట్లు సాగుతూనే ఉన్నాయి. అణిచేద్దామని చూసిన ప్రతిసారీ అవి మరింత తీవ్రంగా పోటెత్తుతున్నాయి. పాక్ సంస్కృతి, సంప్రదాయాలతో తమకేమాత్రం పోలిక ఉండదని, ఒక దేశంగా ఉంటేనే అస్తిత్వ పరిరక్షణ, అభివృద్ధి సాధ్యమని ఆ ప్రాంతవాసుల వాదన. ఇందుకోసం వామపక్ష భావాలతో ప్రభావితుడైన మీర్ గౌస్ బిజెంజో ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిధిలో పోరాటాలు జరిగాయి. పాక్ పరిధిలోనే స్వయంపాలనకు హామీ ఇవ్వాలన్న డిమాండ్‌తో నేషనల్ అవామీ పార్టీ (ఎన్ఏపీ) ఏర్పాటు చేసి, 1970 ఎన్నికల్లో బలూచిస్తాన్, ప్రస్తుత ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ప్రాంతాల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ మరో మూడేళ్లకే అప్పటి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం సైనిక చర్య ద్వారా ఆ రెండు ప్రభుత్వాలనూ కూలదోసింది. ఈ అప్రజాస్వామిక చర్యే అనంతర కాలంలో మిలిటెన్సీకి బీజం వేసింది.

బలూచిస్తాన్‌లో పాక్ సైన్యం చేయని దురాగతం లేదు. బలూచ్ యూనివర్సిటీ లోనూ, వెలుపలా యువతను అపహరించటం, హతమార్చటం దానికి అలవాటైన విద్య. 2011 నుంచి ఇంతవరకూ 10,000 మంది మాయమయ్యారంటే ఇదెంతగా ఉందో అంచనా వేయొచ్చు. 2018 తర్వాత బలూచ్ మిలిటెంట్ సంస్థలు ఏకం కావటంతో పోరాటాలు ఉద్ధృతమయ్యాయి. నిరుడు మార్చిలో జాఫర్‌ఖాన్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేయటం మొదలుకొని పాక్ సైన్యంపై సాగిస్తున్న నిరంతర దాడులు పాలకుల్ని ఊపిరాడకుండా చేస్తున్నాయి. చారిత్రక ఆకాంక్షలను అణగదొక్కి, అభివృద్ధిని విస్మరించే ఏ పాలకులకైనా ఇదే దుఃస్థితి ఎదురవుతుంది. తప్పు తెలుసుకోకుండా, గుణపాఠం నేర్చుకోకుండా, మిలిటెంట్లకు భారత్ మద్దతుందని అనవసర యాగీ చేయటం పాక్ పాలకుల నిస్సహాయతకు అద్దం పడుతోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.చవితి రా.2.04 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తర రా.12.53 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.7.35 నుండి 9.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.07 వరకు తదుపరి ప.2.54 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** సా.5.26 నుండి 7.06 వరకు, **సంకటహర చతుర్థి.**

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

కోచ్

జనం మీరు సాధించిన బంగారు పతకాన్ని మాత్రమే చూస్తారు. మీ మూతి చిట్లి కారుతున్న రక్తాన్ని పట్టించుకోరు. బాక్సర్ కూడా అంతే! బరిలో రక్తం ఓడుతున్నా, బంగారం కోసమే చూస్తాడు. నా ముఖం మీద పడ్డ ప్రతి పంచ్, నాకొక కోచ్!!

– సురంజయ్ సింగ్, ఇండియా 'లిటిల్ టైసన్'

చప్పట్లు

నువ్వున్న చోట నువ్వు అత్యుత్తమంగా ఉండకపోతే, అక్కడ ఎందుకు ఉండాలి? జన సమూహం కొట్టే చప్పట్ల కోసం ఎదురుచూస్తూ నువ్వక్కడే ఉండిపోయావంటే, నీ మనస్సాక్షి కొట్టే చప్పట్ల కోసం నువ్వు ఒక్క ప్రయత్నమైనా చేయలేవు.

– అభిషేక్ బచ్చన్, సినీ నటుడు

ప్రాణి



ఆసుపత్రి నుండి ఆరోగ్యంగా బయటికి వచ్చే రోగిని చూసినప్పుడు కలిగే ఆనందం నాకు గొప్ప ప్రేరణను ఇస్తుంది. మనిషి అనే ప్రాణికి అందించే వైద్యంలో రెండవ ఉత్తమ ప్రయత్నం అంటూ ఉండదు. కనుక ప్రతిసారీ 100 శాతం నిబద్ధత అవసరం.

– డా॥ సి. ప్రతాప్ రెడ్డి (92), 'అపోలో' వ్యవస్థాపకులు

ఆగకండి!

జనాలు ఒకప్పుడు నా వయసు చూసి ఆశ్చర్యపోయేవారు. తర్వాత, నా పనిని చూసి వారు ఆశ్చర్యపోయేలా చేసుకున్నాను. ఏదైనా ప్రారంభించటానికి 'తగిన' వయసు వచ్చేవరకూ ఆగకండి. ఈ రోజు మీకు ఆలోచన వస్తే ఈ రోజే మొదలుపెట్టండి.

– శ్రీలక్ష్మి సురేష్, వరల్డ్స్ యంగెస్ట్ సీఈవో

ఇద్దరు

సముద్రం మధ్యలో మీ అతిపెద్ద శత్రువూ, మీ ప్రాణ స్నేహితుడూ ఇద్దరూ మీరే! సముద్రం మీ పతకాల గురించి, మీ గతం గురించి పట్టించుకోదు. మీ ముందు ఉన్న తుపానును మీరెలా ఎదుర్కొంటున్నారన్నది మాత్రమే చూస్తుంది.

– అభిలాష్ టోమీ, రిటైర్డ్ నేవీ ఆఫీసర్

ఇల్లు

దేశసేవ పార్ట్ టైమ్ ఉద్యోగం కాదు. ఇంట్లో ప్రారంభమై సమాజంలోని ప్రతి మూలకూ విస్తరించే జీవన విధానం. కుటుంబానికి స్త్రీ కేంద్ర బిందువు. ఆమె బలంగా ఉంటే ఇల్లు బలంగా ఉంటుంది. ఇల్లు శక్తిమంతంగా ఉంటే దేశం అజేయమైనది అవుతుంది.

– వి. శాంత కుమారి (శాంతక్క), రాష్ట్ర సేవిక సమితి చీఫ్

బాబు సీమ ద్రోహానికి ప్రతిఘటన

అభిప్రాయం

భూమన కరుణాకరరెడ్డి

సీమ సమాజం నీళ్లను కలవరిస్తోంది, పలవరిస్తోంది.
నీళ్లలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉన్నాయి.
నీళ్లలో సుఖ సంతోషాలున్నాయి.
నీళ్లలో నాగరికత ఉంది.
నీళ్లలో సృష్టి రహస్యం దాగివుంది.
నీళ్లలో బీడు భూముల్ని సస్యశ్యామలం చేసే మహాద్భుత శక్తి ఉంది.
నీళ్లలో పవర్ ఉంది.
నీళ్లలో అమ్మ ప్రేమ, తండ్రి సాంత్వన ఉన్నాయి.
అసలు సమస్త ప్రపంచం మనుగడే నీళ్లలో ఉంది.

అలాంటి నీళ్లకు రాయలసీమ సమాజం దశాబ్దాల తరబడి నోచుకోలేదు. రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే కృష్ణా జలాలే దిక్కు. అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుని నోట్లో శని అనే సామెత చందంగా రాయలసీమ వాసుల పరిస్థితి తయారైంది. కళ్లెదుటే కృష్ణా జలాలు ప్రవహిస్తున్నా, వాడుకోలేని దయనీయ స్థితి. సీమకూ, కృష్ణా జలాలకూ అడ్డంకిగా చంద్రబాబు నాయుడు ఉన్నారు. అందుకే సీమకు పట్టిన 'చంద్ర'గ్రహణం బాబు అని మా కరవు సమాజం భావిస్తోంది.

మరో స్వాతంత్ర్య పోరాటం

బ్రిటిష్ వారి పీడన పాలనను ప్రత్యక్షంగా చూడని తరం... దాని గురించి కథలు కథలుగా విని ఉంటారు. కానీ బాబు పీడన పాలనను ప్రత్యక్షంగా చూస్తూ, నరకాన్ని అనుభవిస్తున్నాం. రాయల సీమ అంటే కరవు పీడిత ప్రాంతం కాదు, బాబు పీడిత ప్రాంతమని గతంలో చెప్పిన విషయాన్ని

> **రాయలసీమ అంటే కరవు పీడిత ప్రాంతం కాదు, బాబు పీడిత ప్రాంతం. బాబు పీడన పాలన నుంచి రాయలసీమకు సాగు, తాగునీటి హక్కుల్ని సాధించుకునేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

మరోసారి గుర్తు చేస్తున్నాను. బాబు పీడన పాలన నుంచి రాయల సీమకు సాగు, తాగునీటి హక్కుల్ని సాధించుకునేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఔను, రాయలసీమ ప్రజలు నీళ్ల కోసం అలమటిస్తున్నారు. ఇక్కడి బీడు భూములు నీళ్ల కోసం నోళ్లు బార్లా తెరుచుకున్నాయి. నీళ్లంటే రాయలసీమ సమాజానికి ఒక కలగా మారింది.

రాయలసీమ ప్రాంతం నుంచి రాజకీయంగా ఎదిగిన నారా చంద్రబాబు నాయుడు తన మాతృభూమికి చేసింది శూన్యం. కరవు ప్రాంతం నుంచి అంచెలంచెలుగా ఎదిగి, తొమ్మిదేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు పాలించినా, ఏనాడూ కరవు ప్రాంతానికి గుక్కెడు సాగు, తాగునీళ్లు అందించాలన్న ఆలోచన చేసిన పాపాన పోలేదు.

'ఏ దేశ మేగినా ఎందుకాలిడినా
ఏ పీఠ మెక్కినా, ఎవ్వ రేమనిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవం' అని మహాకవి రాయప్రోలు సుబ్బారావు జన్మనిచ్చిన గడ్డ గురించి ఎంతో గొప్పగా చెప్పారు. చంద్రబాబు సీఎం పీఠమెక్కినా, తానొచ్చిన ప్రాంతాన్ని విస్మరించడం, ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం. ఒక నాయకుడి విజన్ అంటే... సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడం. తాను పాలిస్తున్న ప్రాంత జీవనోపాధి ఏంటో తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా సమృద్ధిగా సౌకర్యాలు కల్పించడం.

రాయలసీమ కరవు కాటకాలతో అల్లాడుతోందని అక్కడ పుట్టి పెరిగిన చిన్నపిల్లలకు కూడా తెలుసు. తొమ్మిదేళ్లుగా సీఎంగా ప్రజలు అవకాశం కల్పిస్తే, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం, అధికారాన్ని దుర్వినియోగం చేశారన్న చెడ్డపేరు తప్ప, ప్రజలు గుర్తించుకునేలా ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చంద్రబాబు చేయలేదు. అధికారంలో ఎంత కాలం ఉన్నామన్నది ముఖ్యం కాదు, ప్రజలకు ఏం చేశామన్నదే ప్రధానం.

మంచి పాలకులంటే, ప్రజలు శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. భౌతికంగా మన నుంచి దూరమైనా, మానసికంగా సంబంధం కలిగి ఉండేలా పాలించాలి. అలాంటి ఘనతను దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి దక్కించుకున్నారు. రాయలసీమ సమాజం ఆయనను అపర భగీరథుడిగా ఆరాధిస్తోంది. ఈ ప్రజాభిమానం ఊరికే రాలేదు. రాయలసీమకు తాగు, సాగునీళ్లు అందించేందుకు ఐదేళ్ల పాలనలో ఆయన చేసిన కృషిని కరవు (బాబు) పీడిత సమాజం గుర్తించింది.

సాగు, తాగునీటికి గేట్ వే!

సాగు, తాగునీళ్ల విలువ బాగా తెలిసిన రాజశేఖరరెడ్డి, 2004లో అధికారంలోకి వచ్చిన వెంటనే పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కుల నుంచి ఏకంగా 44 వేల క్యూసెక్కులకు పెంచారు. అప్పట్లో ఈ పెంపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వివాదానికి దారి తీసింది.

ఇటు కాంగ్రెస్‌లోని స్వపక్షం, అటు చంద్రబాబు నాయకత్వంలోని విపక్షం కలిసి రాజశేఖరరెడ్డిపై దండెత్తాయి. ఎవరెంతగా ఒత్తిడి తెచ్చినా, రాయలసీమకు సాగు, తాగునీళ్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన భీష్మించారు. అదీ మాతృగడ్డపై ప్రేమ అంటే! కరవు ప్రాంతానికి నీళ్లు అందించి, పీడన నుంచి విముక్తి కల్పించాలనే నిజమైన సంకల్పం ఉన్న నాయకులు చేయాల్సిన పని. అందుకే రాయలసీమ గుండెల్లో వైఎస్సార్ కొలువుదీరారు.

తండ్రి ఆశయ సాధనలో భాగంగా 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో పది అడుగులు ముందుకేశారు. రాయలసీమను శాశ్వతంగా కరవు నుంచి విముక్తి చేసేందుకు రూ. 3,825 కోట్ల ఖర్చుతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు 2020 మే 5న శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్‌ను శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీలు చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా రూపకల్పన చేశారు. 2023 ఆగస్టు 11న జగన్ ప్రభుత్వం మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టింది.

ఈ ప్రాజెక్ట్ రూపకల్పన వెనుక ఎంతో దూరదృష్టి ఉంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు. అయితే 854 అడుగులకు చేరినప్పుడే పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం. అది కూడా రోజుకు 7 వేల క్యూసెక్కులు మాత్రమే. ఈ పద్ధతిలో ఎప్పటికీ రాయలసీమను సస్యశ్యామలం చేయలేమని జగన్ భావించారు. 854 అడుగుల కంటే ఒక అడుగు తక్కువ ఉన్నా పోతిరెడ్డిపాడు నుంచి చుక్క నీరూ అందదు. ఈ ఇబ్బందిని గమనించి, రావాల్సిన నీటిని 800 అడుగుల నుంచే తీసుకునేలా పోతిరెడ్డిపాడు దిగువన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి నీటిని పోతిరెడ్డిపాడు కాలువలో ఎత్తిపోసే పనులు చేపట్టడం ఒక చరిత్ర. రాయలసీమ పాలిట సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టిన మహా నాయకుడిగా, తండ్రిని మించిన తనయుడిగా వైఎస్ జగన్‌ను కరవు ప్రాంతం గుర్తుంచుకుంటుంది.

అడుగడుగునా అడ్డంకులు

శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు చేరుకోకపోయినా, 800 అడుగుల నుంచే హక్కుగా రావాల్సిన నీటిని దక్కించుకోవచ్చని రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభించడంపై కరవు ప్రాంతం ఆనందానికి అవధుల్లేవు. 2024 మే నెల నాటికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రూ.990 కోట్ల విలువైన పనులు పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది. అయితే ఆ ప్రాజెక్ట్ రూపకల్పన సమయంలోనే చంద్రబాబు నేతృత్వంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయించి, రాక్షసుల్లా అడ్డంకులు సృష్టించడం జగమెరిగిన సత్యం. ఈ అడ్డంకుల్ని లెక్క చేయకుండా మా ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడంలో అడుగులు ముందుకే వేసింది. అందుకే ఆ మాత్రం పనులు పూర్తయ్యాయి.

ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం పొరుగు రాష్ట్రంలో శిష్యుడైన రేవంత్‌రెడ్డి ప్రలోభాలకు తలొగ్గి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్ని అర్ధంతరంగా నిలుపుదల చేసింది. తాను చెప్పడం వల్లే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్ని నిలుపుదల చేసినట్టు అసెంబ్లీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆశ్చర్యం, ఆందోళన కలిగించాయి.

సీమకు కృష్ణా జలాలు అందించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేలకు జగన్ పెంచడమే ఒక అద్భుతం. రాయలసీమతో పాటు నెల్లూరు, చెన్నైకి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఒక సంజీవనిగా జగన్ భావించారు. సాగు, తాగునీళ్లకు నోచుకోని రాయలసీమ ప్రాంతానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఇక ఇన్సూరెన్స్ పాలసీగా భావించి జగన్‌మోహన్ రెడ్డి తీసుకొస్తే, దాని గొంతుకోసిన పాలకుడిగా చంద్రబాబు చరిత్రలో చీకటి అధ్యాయాన్ని రాసుకున్నారు.

పోరాడితే పోయేదేమీ లేదు!

రాయలసీమకు తాగు, సాగునీటితో పాటు నెల్లూరు సాగునీటికి చేస్తున్న ద్రోహాన్ని నిరసిస్తూ

> **బాబు సీమ వ్యతిరేక విధానాలపై పోరాడితే పోయేదేమీ లేదు... సాగు, తాగునీళ్లను సాధించుకోవడం తప్ప! తద్వారా గొంతుల్ని తడుపుకోవడం, బీడు భూముల్ని సస్యశ్యామలం చేసుకోవచ్చు. కోన సీమను తలపించేలా రాయలసీమను తయారు చేసుకోవచ్చు.**

వైఎస్సార్‌సీపీ ఫిబ్రవరి 5న 'చలో పోతిరెడ్డిపాడు' తలపెట్టింది. ఇది రాయలసీమ సమాజం చేపట్టిన నీటి స్వాతంత్ర్య పోరాటంగా చూడాలి. తమ ప్రాంతానికి చంద్రబాబు చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టడానికి రాయలసీమ, అలాగే నెల్లూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజానీకం తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే మాతో పాటు ప్రజానీకాన్ని అక్కడికి వెళ్లకుండా నిలువరించాలని చంద్రబాబు సర్కార్ కుట్రలు చేస్తోంది.

యావత్ బాబు పీడిత సమాజానికి వాస్తవాలు తెలియకూడదనేదే ప్రభుత్వ దురుద్దేశంగా కనిపిస్తోంది. బాబు సీమ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడితే పోయేదేమీ లేదు... సాగు, తాగునీళ్లను సాధించుకోవడం తప్ప! తద్వారా గొంతుల్ని తడుపుకోవచ్చు, బీడు భూముల్ని సస్యశ్యామలం చేసుకోవచ్చు. పచ్చని పంటలతో కోనసీమను తలపించేలా రాయలసీమను తయారు చేసుకోవచ్చు.

ఈ ప్రాజెక్ట్ వస్తే, తిరుపతి పూర్తి దాహార్తి కూడా తీరుతుంది. రాయలసీమ వ్యాప్తంగా 9.6 లక్షల ఎకరాలకు సాగునీళ్లు అందించి కరవు నుంచి విముక్తి చేయాలన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాన్ని నెరవేర్చడానికి అందరం కలిసి పోరాడుదాం. ఆశయ సాధనలో పిడికిలి బిగిద్దాం.

రాయలసీమ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట పట్టింది. అయితే రాజకీయ విభేదాలు సృష్టించడం చంద్రబాబుకు తెలిసిన విద్య. రాయలసీమ విడిపోవడమే చంద్రబాబుకు బలం. కావున రాయలసీమను సస్యశ్యామలం చేసుకునేందుకు సాగు, తాగునీటి హక్కుల కోసం చేపట్టే నీటి స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వేడుకుంటున్నా. మన భవిష్యత్ తరాలకు తాగు సాగునీళ్ల కంటే మనమిచ్చే ఆస్తి మరొకటేదీ లేదు. ఎందుకంటే, ఈ ఆస్తికి వెలకట్టలేం!

వ్యాసకర్త తిరుపతి మాజీ శాసన సభ్యులు
(నేడు 'చలో పోతిరెడ్డిపాడు')

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ప్రచారానికా... అభివృద్ధికా?

అభిప్రాయం



జాన్సన్ చోరగుడి

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సుల ప్రాముఖ్యతను కేవలం పెట్టుబడుల సేకరణ కోణంలోనే కాకుండా, మారుతున్న అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర విధానాలను సరిదిద్దుకునే అవకాశంగా చూడాలి. 2026 సంవత్సరానికి సంబంధించి 'బ్లూ దావోస్' నినాదం తెరపైకి వచ్చింది. ఐక్యరాజ్యసమితి ఆ సంవత్సరాన్ని 'నీటి సంవత్సరం'గా ప్రకటించబోతున్న నేపథ్యంలో, డిసెంబరులో జరగబోయే 'యూఎన్ వాటర్ కాన్ఫరెన్స్'కు ఈ సదస్సు ఒక ముందస్తు భూమికగా నిలుస్తోంది.

సుదీర్ఘ సముద్ర తీరం ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ అంశం అత్యంత కీలకం. సముద్ర జలాలను త్రాగు నీరుగా మార్చడం, తీర ప్రాంత ప్రజల జీవనోపాధి మెరుగుపరచడం, ఆహార భద్రత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో ఈ 'బ్లూ ఎకానమీ' సూత్రాలు దిశా నిర్దేశం చేస్తాయి. మరోవైపు, 2026ను 'మహిళా రైతు సంవత్సరం'గా పరిగణించాలనే ప్రపంచ ఆర్థిక వేదిక లక్ష్యం మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సరిగ్గా సరిపోతుంది. వ్యవసాయ రంగాన్ని కేవలం పంటల ఉత్పత్తికే పరిమితం చేయకుండా, 'అగ్రి ఫుడ్ సిస్టమ్స్'గా మార్చడం ద్వారా క్షేత్రస్థాయి నుంచి వాణిజ్యం వరకు మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రత్యేక శాఖగా మార్చడం ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం లభించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రగతిలో నాయకత్వ శైలుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడు వచ్చే ఫలితాలకు దావోస్ ఒక గ్లోబల్ ఉదాహరణగా నిలుస్తుంది. 2023 సదస్సుకు ముందు డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బెర్జె బ్రెండే రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన సందేశంలో ఏపీ పారదర్శకతను, అధికార వికేంద్రీ కరణను, సాంకేతికత వినియోగంలో చూపుతున్న నిబద్ధతను ప్రశంసించారు.

తయారీ రంగం ఇప్పుడు 'అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ వాల్యూ చైన్స్' శ్రేణిలోకి మారాలని ప్రపంచ ఆర్థిక వేదిక ఆశిస్తోంది. దీనికి 'గ్లోబల్ నెట్‌వర్క్' అనుసంధానం తప్పనిసరి. ప్రధాన పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎమ్ఈల సామర్థ్యాన్ని పెంచడం, కార్మికులకు నూతన నైపుణ్యాలను (అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్) నేర్పించడం వంటి చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలి. గతంలో విశాఖపట్నంలో సంభవించిన ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ వంటి దుర్ఘటనల నుంచి పాఠాలు నేర్చుకుని, తయారీ రంగంలో కఠినమైన భద్రతా ప్రమాణాలు అమలు చేసేందుకు రాష్ట్రం సిద్ధపడింది. ఈ క్రమంలోనే 2022లో ఆంధ్రప్రదేశ్ 'ఫోరం ప్లాట్‌ఫార్మ్ పార్టనర్'గా తన స్థాయిని పెంచుకుంది. విద్య, వైద్యం, డీ–కార్బనైజ్డ్ ఎకానమీ వంటి కీలక రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యానికి ఇది బాటలు వేసింది. బ్రిటిష్ కాలం నాటి 'పోర్టు కేంద్రీకృత' పరిపాలన నుంచి నేడు 2022 నాటి జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ఆంధ్రప్రదేశ్ ఒక 'సామాజిక ప్రయోగశాల'గా రూపాంతరం చెందింది. దావోస్ వేదికను కేవలం రాజకీయ ప్రచారానికో లేదా పెట్టుబడుల సేకరణకో పరిమితం చేయకుండా, రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి ఉపయోగించుకోవాలి.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

డేటా పాయింట్

'పద్దు' కోసం ఎక్కువ సమయమే!

బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభలూ అనుకున్న సమయం కంటే దాదాపుగా ఎక్కువ సమయంపాటు పనిచేస్తున్నాయి. 2023లోనే తక్కువ సమయం వెచ్చించాయి.



అజ్ఞానబంధం తెంచుకుంటేనే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మత్తుపదార్థాల ప్రభావంలో ఉన్నవారికి తమ ప్రవర్తనపై నియంత్రణ ఉండదు. ఒకసారి కొంతమంది తాగిన మైకంలో సముద్ర తీరానికి చేరుకుని, అక్కడ ఉన్న ఒక పడవను చూసి పరవశించిపోయారు. ఆ పడవ గట్టిగా స్తంభానికి కట్టివేసి ఉన్నా గమనించే స్థితిలో వారు లేరు. అందరూ పడవలోకి చేరి, తెడ్లు పట్టుకుని ఉత్సాహంగా నడపడం ప్రారంభించారు. తెల్లవారి సూర్యోదయ సమయానికి మెల్లగా మత్తు దిగింది. రాత్రంతా ప్రయాణం చేస్తున్నామనే భ్రమలో గడిపిన వారు... తాము ఇప్పుడు ఎక్కడ ఉన్నామా అని చుట్టూ చూడగా, పాత ఇసుక దిబ్బలే కనిపించాయి.

నేటి మానవ స్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. అజ్ఞానమనే మత్తులో మునిగి, తమ వాస్తవ స్థితిని గ్రహించలేక పోతున్నారు. అజ్ఞానాన్ని అద్దంపై పట్టిన దుమ్ముతో పోల్చవచ్చు. మందపాటి దుమ్మును దులపనిదే అద్దంలో ప్రతిబింబం స్పష్టంగా కనిపించదు. మనసును ఆవరించిన ఈ మలినాన్ని వదిలిస్తేనే సత్యం గోచరిస్తుంది. పాత్రకు పట్టిన పాచిని శుభ్రం చేసినట్లు, మనసును సద్గురువు బోధనలతో నిత్యం సంస్కరించుకోవాలి. అప్పుడే గురువు ఇచ్చే ఉపదేశం మనసులో స్థిరంగా నిలుస్తుంది. తుప్పు పట్టిన పాత్రలో పాలు పోయడం ఎలా కుదరదో, అజ్ఞానంతో నిండిన హృదయంలో జ్ఞానామృతం కూడా అలానే నిలవదు.

'బంధం హిత్వానావం చాలయ' అన్నట్లు, ముందు బంధాన్ని తొలగించి నావను నడపాలి. ఆది శంకరులు చెప్పినట్లు, జ్ఞానం పొందకుండా ఎన్ని యాత్రలు చేసినా ప్రయోజనం శూన్యం. జ్ఞానం ద్వారానే అజ్ఞానం నశిస్తుంది, అదే మోక్షానికి మార్గం. అందుకే భ్రమలను వీడి, జ్ఞాన కాంతిలో ప్రయాణించడమే ముక్తికి ఏకైక మార్గం.

దీర్ఘకాలిక లీజుకా.. పీపీపీకా?

అంజుమన్ ఇ ఇస్లామియా భూములపై ప్రభుత్వం మల్లగుల్లాలు

- 71.57 ఎకరాల వక్ఫ్ భూములను భూసేకరణతో ఏపీఐఐసీకి కట్టబెట్టడంపై పునరాలోచన
- వక్ఫ్ టైటిల్ మార్పునకు చట్టం అంగీకరించక పోవడంతో ప్రత్యామ్నాయం వైపు అడుగులు
- నేడు వక్ఫ్ బోర్డ్ సమావేశంలో నిర్ణయం?
- వక్ఫ్ భూములు అన్యాక్రాంతం చేసేలా ప్రభుత్వ తీరు ఉందని ముస్లిం సమాజం మండిపాటు



సాక్షి, అమరావతి: గుంటూరు అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థకు చెందిన రూ.కోట్ల విలువైన భూములను అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో వాటిని మరో మార్గంలో మళ్లించేందుకు చంద్రబాబు ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ముస్లిం సమాజం నుంచి ఆగ్రహం పెల్లుబుకడంతో ఆ భూములను ఏపీఐఐసీకి బదలాయించేందుకు చేపట్టిన భూసేకరణ విషయంలో పునరాలోచనలో పడింది. ఈ నేపథ్యంలో.. గుంటూరు జిల్లా చినకాకానిలోని 71.57 ఎకరాల అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థకు చెందిన భూములను ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకునే అంశాన్ని వక్ఫ్‌బోర్డు పరిధిలోకి ప్రభుత్వం నెట్టింది. దీంతో.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ముస్లిం సమాజాన్ని మభ్యపెట్టేందుకు ఏపీ వక్ఫ్‌బోర్డు రంగంలోకి దిగింది. దీర్ఘకాలిక లీజుకు ఇద్దామా? ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ వ్యక్తులకు పీపీపీ పద్ధతిలో అప్పగిద్దామా? అనే దానిపై తీర్మానం చేసేందుకు వక్ఫ్‌బోర్డు రంగం సిద్ధంచేసింది. ఇందుకోసం గురువారం విజయవాడలో ఏపీ వక్ఫ్‌బోర్డు కీలక సమావేశం నిర్వహిస్తోంది. అయితే, ఈ సమావేశం ఎజెండాను బుధవారం సాయంత్రం వరకు పలువురు సభ్యులకు అందించలేదు.

మల్లాయపాలెంతో మొదలైన ప్రయత్నాలు..

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రాగానే రూ.వందల కోట్ల విలువైన వక్ఫ్ భూములను ఏపీఐఐసీకి బదలాయించి తద్వారా పచ్చనేతలకు పప్పుబెల్లాల్లా పంచేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ, ప్రభుత్వ ప్రయత్నాలు వక్ఫ్ చట్టానికి విరుద్ధమని న్యాయ నిపుణులు, ముస్లిం నేతలు హెచ్చరిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తుల టైటిల్‌ను వేరొక సంస్థ, వ్యక్తి పేరున మార్చడానికి వీల్లేదు. అయినా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్టం–2018లోని సెక్షన్–22 అనుసరించి అతితక్కువ ధరకు ఏపీఐఐసీకి అప్పగించాలనే ప్రతిపాదన తెచ్చింది. ఇందులో భాగంగా.. తొలుత గుంటూరు షాహీ జామియా మసీదుకు చెందిన మల్లాయపాలెంలోని 233.18 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్కు పేరుతో ఏపీఐఐసీకి భూసేకరణ ద్వారా బదలాయించేందుకు గతేడాది యత్నించింది. ఈ ప్రయత్నాలపై ముస్లిం సమాజం మండిపడడంతో వెనక్కి తగ్గింది. భూసేకరణను వాయిదా వేసి దీర్ఘకాలిక లీజు లేదా పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు వక్ఫ్‌బోర్డు ప్రతిపాదన చేసేలా స్కెచ్ వేసింది. కానీ, వక్ఫ్‌బోర్డు సభ్యుల నుంచి ముస్లిం నేతల వరకు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో మల్లాయపాలెం భూముల బదలాయింపునకు తాత్కాలిక బ్రేక్ పడింది.

ఇప్పుడు అంజుమన్ ఇ ఇస్లామియా భూముల వంతు..

ఈ నేపథ్యంలో.. చినకాకానిలోని అంజుమన్ ఏ ఇస్లామియా సంస్థకు చెందిన 71.57 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్కు పేరుతో ఏపీఐఐసీకి భూసేకరణ ద్వారా బదలాయించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు. దీనిపై కూడా తీవ్ర అభ్యంతరాలు రావడంతో ఇప్పుడు దీర్ఘకాలిక లీజుకు ఇద్దామా? పీపీపీ పద్ధతిలో ఇద్దామా? అంటూ కొత్త డ్రామాకు తెరలేపారు. వాస్తవానికి.. వక్ఫ్ భూములు లీజు, విక్రయం, బహుమతి (గిఫ్ట్)గా ఇవ్వడం కుదరదని వక్ఫ్ చట్టం–1995లోని సెక్షన్–51 స్పష్టంచేస్తోందని ముస్లిం ప్రతినిధులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. వక్ఫ్‌బోర్డు సమావేశం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది.

ఏమైనా.. కుర్చీని వీడేదే లేదు

- హైకోర్టు తీర్పును ప్రభుత్వమే చూసుకుంటుందంటున్న వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు
- ఇప్పటికే నియామకం చెల్లదని తీర్పు ఇచ్చిన హైకోర్టు

సాక్షి, అమరావతి: పశుసంవర్థక శాఖ డైరెక్టర్ గిరీ కోసం కుర్చీలాట కొనసాగుతోంది. ప్రభుత్వం వెటర్నరీ డైరెక్టర్‌గా రిటైరైన దామోదరనాయుడుకు పునర్నియమించడంపై ఆ శాఖ ఉద్యోగులు కొందరు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేస్తూ హైకోర్టు దామోదరనాయుడు నియామకం చెల్లదంటూ ఆదేశాలు జారీచేసింది. అయినా సరే ఈ పోస్టు నుంచి తప్పుకునేందుకు ఆయన ససేమిరా అంటున్నారు. హైకోర్టు తీర్పును ప్రభుత్వమే చూసుకుంటుందన్న ధీమాతో ఉన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తక్షణమే ఆ పోస్టులో ఉన్న వారిని తప్పించి, ఆ తర్వాత సీనియర్ల పేర్లను సూచిస్తూ సంబంధిత శాఖ కార్యదర్శి పంపే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. ఇప్పుడు దామోదరనాయుడిని తప్పిస్తూ తర్వాత స్థానంలో ఉన్న సీనియర్లు ఏపీ షీప్ అండ్ గోట్ ఫెడరేషన్ ఎండీ రెడ్నం అమరేంద్ర కుమార్, ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎపీఎల్‌డీఏ) సీఈఓ మర్రిపూడి శ్రీనివాసరావు పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్ సీఎంఓకు పంపారు. ప్రభుత్వ పరంగా అప్పీల్‌కు వెళ్లేందుకు కూడా అవకాశం లేని విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందని న్యాయనిపుణులు చెబుతున్నారు. తక్షణమే డైరెక్టర్ పదవి నుంచి వైదొలిగి, ఆ తర్వాత రేసులో ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని కోరుతూ ఇటీవల ఏపీ పశువైద్యులు, పశుసంవర్థక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, అధికారుల సంఘాల ప్రతినిధులు డైరెక్టర్ దామోదర నాయుడ్ని కలిసి సూచించారు. ప్రభుత్వాదేశాల మేరకు నడుచుకుంటానంటూ ఆయన బదులిచ్చినట్టు చెబుతున్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలాంటి విధానపరమైన, ఆర్థిక పరమైన లావాదేవీలపై సంతకాలు చేయకూడదని, కానీ డైరెక్టర్ హోదాలో దామోదరనాయుడు ఎడాపెడా సంతకాలు చేసేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛందంగా వైదొలిగి ఉంటే గౌరవంగా ఉండేదని, దామోదర నాయుడు ఇందుకు విరుద్ధంగా కొనసాగుతున్నారంటూ సంఘ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వ్యక్తితోనే డైరెక్టర్ పోస్టును భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ తీర్పు అమల్లో ఏమాత్రం జాప్యం చేసినా ఏపీ పశుసంవర్థక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మరోసారి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతుందని.. త్వరలోనే చలో అమరావతికి పిలుపునిస్తామని సంఘ నేతలు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా...

భారతీయ విద్యా భవన్ చైర్మన్‌గా జస్టిస్ చలమేశ్వర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ భారతీయ విద్యా భవన్ పాలక మండలి చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్, సికింద్రాబాద్ భవన్ కేంద్ర కమిటీ సభ్యునిగా మాజీ సమాచార శాఖ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ జగదీశ్ లఖానీ ఆదేశాలు జారీ చేశారు. వీరు రెండేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు.

లడ్డూ దుష్ప్రచారం ఫ్లెక్సీలపై ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: తిరుమల లడ్డూలో ఎలాంటి కల్తీ జరగకపోయినా టీడీపీ కూటమి నాయకులు ఫ్లెక్సీలు, పోస్టర్ల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారంటూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వడ్డి రఘురాం మండిపడ్డారు. కూటమి విష ప్రచారానికి నిరసనగా బుధవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, పట్టణ ఇన్‌చార్జి సీఐ బీబీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ కూటమి నేతలు దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగారని, ఈ పాపం వారికి కచ్చితంగా చుట్టుకుంటుందని రఘురాం అన్నారు.

అమరావతిలో ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం

శిలాఫలకం ఆవిష్కరించిన శ్రీనివాసులశెట్టి

సాక్షి, అమరావతి: అమరావతిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయానికి ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసుల శెట్టి బుధవారం భూమి పూజ చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక సమ్మిళత వృద్ధికి ఎస్‌బీఐ కట్టుబడి ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలతో కలిసి పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా రూ.5.08 కోట్లతో రెండు సామాజిక సేవా కార్యక్రమాలను ఎస్‌బీఐ ప్రారంభించింది. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె సంబంధిత అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు రూ.4.22 కోట్లు, విజయవాడ సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌కు రూ.86 లక్షల చెక్కును చైర్మన్ అందజేశారు. రాష్ట్ర సామాజికాభివృద్ధిలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు.

సంస్కృతం భారతీయ సంస్కృతికి సంకేతం

ప్రసంగిస్తున్న జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగీ

తిరుపతి సిటీ: సంస్కృతం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు సంకేతమని జార్ఖండ్, ఒడిశా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగీ పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నాలుగు రోజులపాటు జరగనున్న ఇండియన్ శాన్‌స్క్రిట్ స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్–2026 బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి షడంగీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంస్కృతంలో అనేక విషయాలు దాగి ఉన్నాయని, ప్రత్యేకించి దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి ఇది ఉత్తమ భాష అని కొనియాడారు. అనంతరం ప్రధాన వక్తగా పాల్గొన్న మధ్యప్రదేశ్ మహర్షి పాణిని సంస్కృత వైదిక విశ్వవిద్యాలయం వీసీ శివశంకరమిశ్రీ మాట్లాడుతూ సంస్కృతం సర్వసిద్ధికి మూలమని, ఆధునిక భారతావనికి అవసరమైన అన్ని విషయాలూ సంస్కృతంలో నిక్షిప్తమై ఉన్నాయని చెప్పారు. ఈ పోటీల్లో విద్యార్థులు వివిధ శాస్త్రాల్లో ఉన్న జ్ఞానాన్ని వెలికితీసి, అధ్యయనం చేయనుండటం విశేషమని అభినందించారు.

దాడుల సంస్కృతి చెడే చేస్తుంది

- అంబటి ఇంటిపై దాడి సరికాదు
- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖ సిటీ: మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంపై జరిగిన దాడి సరికాదని విశాఖ ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాల్లో దాడుల సంస్కృతి చెడే చేస్తుందన్నారు. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్ష ఉంటుందని, అంతేకాని, ఇళ్లు, కార్యాలయాలపై కూటమి నాయకులు దాడులు చేయడం మంచిది కాదన్నారు. అంబటి రాంబాబుపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

ప్రజా సేవకులమని మర్చిపోయి..
పాలకుల్లా వ్యవహరిస్తున్నారు

- ఎల్లవేళలా ప్రజలను ప్రతిపక్షంలా చూస్తున్నారు
- కోర్టులు ఏం చేస్తాయిలే అనుకుంటే మిమ్మల్ని ఎవరూ కాపాడలేరు
- మా ఆదేశాలను మూలనపడేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు
- ప్రభుత్వ అధికారులపై నిప్పులు చెరిగిన హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ అధికారుల తీరుపై హైకోర్టు నిప్పులు చెరిగింది. అధికారులు ప్రజా సేవకులన్న విషయాన్ని మర్చిపోయి, వారే పాలకులన్నట్లు వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. అధికారులందరూ ఒక కుటుంబంగానే ఉంటారని, కానీ ప్రజలను ఎల్లవేళలా ఓ ప్రతిపక్షంలా చూస్తుంటారని తెలిపింది. కోర్టులు ఏం చేస్తాయిలే అనుకునే అధికారులను ఎవ్వరూ కాపాడలేరని స్పష్టం చేసింది. ప్రతి ఒక్కరూ కోర్టు ఆదేశాలను అమలుచేసి తీరాల్సిందేనని తేల్చి చెప్పింది. కోర్టులో మా ఆదేశాలను అమలుచేస్తామని చెప్పి, ఆఫీసులకు వెళ్లిన తరువాత మూలన పడేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. సింగిల్‌జడ్జి ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టర్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావును న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం బుధవారం ఆదేశించింది.

ప్రజాధనంతో పథకాలు తెస్తూ ప్రచారం కోసం వాడుకుంటున్నారు

సర్వశిక్ష అభియాన్ పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన మెమోను పరిశీలించిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వ తీరును కూడా తప్పుపట్టింది. పథకాలను ప్రచారం కోసమే వాడుకుంటున్నారు తప్ప, అమలు బాధ్యతను తీసుకోవడంలేదని వ్యాఖ్యానించింది. దీని వల్ల పథకం ఉద్దేశం నెరవేరడంలేదని తెలిపింది. ప్రభుత్వాలు బాధ్యతల నుంచి తప్పుకున్నా న్యాయస్థానాలు మాత్రం బాధ్యత నుంచి తప్పుకోవని హైకోర్టు స్పష్టం చేసింది. పథకం అమలుపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది.

నోటీసులిచ్చి చేతులు దులిపేసుకుంటారా?

తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాలు చేస్తూ కేజీబీవీ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. వారి సేవలను కొనసాగించాలని ఆదేశించారు. ఈ తీర్పుపై అధికారులు దాఖలు చేసిన అప్పీల్‌పైన, సింగిల్ జడ్జి తీర్పును అమలు చేస్తామంటూ కోర్టుకిచ్చిన హామీని ఉల్లంఘించినందుకు సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుపై తమ ఆదేశాల మేరకు నమోదైన సుమోటో కోర్టు ధిక్కార వ్యాజ్యం పైనా జస్టిస్ బట్టు దేవానంద్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ధర్మాసనం ఆదేశాల మేరకు కోర్టుకు హాజరైన శ్రీనివాసరావును సింగిల్ జడ్జి ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని ధర్మాసనం ప్రశ్నించగా.. కింది స్థాయి అధికారుల తీరు వల్ల తన ఆదేశాలు అమలు కాలేదని, ఆ అధికారులకు నోటీసులు ఇచ్చానని ఆయన చెప్పగా, నోటీసులిచ్చి చేతులు దులిపేసుకున్నారా అంటూ నిలదీసింది. మరో ప్రశ్నకు శ్రీనివాసరావు సూటిగా సమాధానం చెప్పకపోవడంతో.. 'ఇది మీ అధికారుల రివ్యూ మీటింగ్ కాదు. మీకు తోచింది చెప్పడానికి. కోర్టు అన్న విషయం గుర్తు పెట్టుకోండి' అని ధర్మాసనం మండిపడింది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) తరపున హాజరైన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) విష్ణుతేజ అధికారుల చర్యలను సమర్థించబోగా.. ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. సుమోటో కేసులో కోర్టు సహాయకారిగా వ్యవహరించాల్సిన అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సైతం అధికారులను సమర్థించేలా వాదించకూడదని స్పష్టం చేసింది. ఏజీ ఓ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించాలంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

శ్రీవారి సేవలో మాజీ న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీందర్‌నాథ్, జార్ఖండ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిద్యుత్ రంజాన్ సారంగి బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. – తిరుమల

ఆలయం వెలుపల సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీందర్ నాథ్

జార్ఖండ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిద్యుత్ రంజాన్ సారంగి

అధికారి ఒత్తిళ్లకు ఉద్యోగి బలి!

కార్యాలయ ఆవరణలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య

- మృతుడు ఐటీడీఏలో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్
- ఓ అధికారి వల్ల ఒత్తిడికి లోనవుతున్నట్టు గ్రూప్‌లో మెసేజ్

పెద్దదోర్నాల: ఓ అధికారి ఒత్తిళ్లు తాళలేక ఐటీడీఏ (ఉపాధి హామీ పథకం)లో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేశపోగు ప్రసాద్ (45)ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మార్కాపురం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు అతిథి గృహ సముదాయంలోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలోనే బుధవారం ఉదయం జరిగింది. ఐటీడీఏ ఉన్నతాధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేకే ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ప్రసాద్ (ఫైల్)

చెంచు గిరిజనులకు ఉపాధి పనులు కల్పించలేదన్న కారణం చూపి ఉన్నతాధికారులు తాఖీదులు ఇవ్వడంతోనే ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని సహచర ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఆత్మహత్యకు ముందు ఆఫీస్ గ్రూప్‌లో మెసేజ్

ప్రసాద్ బుధవారం ఆత్మహత్యకు పాల్పటానికి ముందు తన ఫీల్డ్ ఆఫీస్ గ్రూప్‌లో పెట్టిన మెసేజ్ చర్చనీయాంశమైంది. ఓ అధికారి ఇచ్చిన తాఖీదుల వల్ల మానసిక క్షోభకు గురైనట్లు పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సైబర్ మోసగాళ్ల అరెస్టు

ఎస్ఐ పేరిట బెదిరించి మోసానికి పాల్పడిన మహబూబ్‌నగర్‌కు చెందిన నేరగాళ్లు

కోవెలకుంట్ల: అమాయక ప్రజలను ఎస్ఐ పేరిట బెదిరించి సైబర్ మోసాలకు పాల్పడిన నిందితులను కోవెలకుంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు చెందిన అక్కపల్లి చంద్రశేఖర్ గతనెల 28న తాను గద్వాల్ ఎస్ఐగా పని చేస్తున్నానని కోవెలకుంట్ల పట్టణానికి చెందిన కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఫోన్ చేశాడు. గద్వాల్‌లో ఉంటున్న కండక్టర్ భార్యకు అసభ్యకరంగా మెసేజ్ పెట్టావని, అది చూసి భర్త ఆమెను కొట్టడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని బెదిరించాడు. రోజుకు రూ.2 లక్షల చొప్పున రెండు రోజులకు రూ.4 లక్షలు ఇవ్వాలని, లేకపోతే పోలీస్ కేసు అవుతుందని భయపెట్టాడు. ఏదైనా రాజీ ప్రయత్నం ఉంటే ఆమె భర్తతో మాట్లాడుకోవాలని చెప్పి అదే జిల్లా హన్వాడకు చెందిన దాసరి సందీప్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించాడు. వెంటనే సందీప్‌కుమార్ కండక్టర్‌లా మాట్లాడి రూ.4 లక్షలకు మొదట రూ.30 వేలు ఫోన్‌పేలో నగదు వేయించుకున్నాడు. ఆ తర్వాత వారి ఫోన్లు పని చేయకపోవడంతో అనుమానం వచ్చి బాధితుడు 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన కోవెలకుంట్ల పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటి వరకు రెండు నెలల కాలంలో 13 మందిని ఇదే తరహాలో బెదిరించి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల చొప్పున దాదాపు రూ.15 లక్షల వరకు నిందితులు ఫోన్‌పేలో వేయించుకుని మోసం చేసినట్లు తేలింది.

సారీ.. నో అపాయింట్మెంట్స్!

- మంత్రి లోకేశ్‌కు కేంద్ర మంత్రులు నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ వచ్చిన మంత్రి లోకేశ్ రోజంతా ఖాళీగానే ఉన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఇక్కడకు వచ్చారు. అదే రోజు రాత్రి ఎంపీల విందుకు హాజరైనట్లు తెలిసింది. బుధవారం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకు పార్లమెంట్‌లో ఉంటారని, పార్లమెంట్‌లో పలువురు కేంద్ర మంత్రులను కలుస్తారని వారి వ్యక్తిగత సిబ్బంది, ఎల్లో మీడియా పేర్కొంది. తీరా, ఉదయం కేంద్ర మంత్రుల నుంచి 'నో అపాయింట్‌మెంట్స్' అనే ఫోన్ రావడంతో ఆయన హోటల్లోనే ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత పలువురు ఎంపీల నివాసాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆయన బస చేసిన హోటల్ వద్దకు, ఆయన వెళుతున్న ఎంపీల నివాసాల వద్దకు ఎవరినీ రావొద్దంటూ ఏపీ భవన్ అధికారులు, సిబ్బంది ఆంక్షలు విధించడం గమనార్హం.

నిధులు లేకుండానే రోడ్లు మంజూరు

- కేంద్రం అప్పగా ఇస్తామన్న సాస్కీ నిధుల నుంచి రూ.2,123 కోట్లతో రోడ్ల మంజూరుకు గతేడాది డిసెంబరులో ఉత్తర్వులు
- ఇప్పుడు ఆ రోడ్లను మార్చి అవే డబ్బులతో కొత్తగా 4122 కి.మీ. మేర 1392 రోడ్ల మంజూరుకు మళ్లీ ఆదేశాలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రత్యేకించి తగినన్ని నిధులు లేని పద్దు కింద గ్రామీణ ప్రాంతాల్లో ఏకంగా రూ.2,123 కోట్ల రోడ్ల పనులు మంజూరు చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు ఆ రోడ్ల పనులకు భారీగా మార్పులు చేస్తూ బుధవారం కొత్తగా మరో ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రాష్ట్ర గ్రామీణ రహదారుల బలోపేతం ప్రాజెక్టు కింద 4007 కిలోమీటర్ల పొడవున 1299 గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.2,123 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 9న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయా రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆర్థిక శాఖ పద్దులో తగిన నిధులు కేటాయించకుండా.. ఆయా నిధులను ప్రస్తుత ఏడాది, వచ్చే ఏడాది కాలంలో నాబార్డు రుణం లేదంటే కేంద్రం ఇచ్చే సాస్కీ (ఎస్ఏఎస్‌సీఐ – స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) నిధులకు మార్పిడి జరుగుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఆయా రోడ్ల పనులను మంజూరుకు పరిపాలనపరమైన అనుమతులు తెలిపి దాదాపు రెండు నెలలు పూర్తవలేదు. అందుకు అవసరమైన నిధుల పైనా ఇంకా స్పష్టత లేదు. కానీ బుధవారం రెండు నెలల క్రితం మంజూరు చేసిన పనులను భారీగా మార్పులు చేస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పుడు మంజూరు చేసిన 4007 కిలోమీటర్లకు సంబంధించిన 1299 పనుల స్థానంలో అదే రూ.2123 కోట్ల ఖర్చుతో కొత్తగా 4,122 కిలోమీటర్లకు సంబంధించిన 1392 రోడ్డు పనులకు పరిపాలనా అనుమతులిస్తున్నట్లు బుధవారం జారీ చేసిన ఉత్వర్వుల్లో పేర్కొంది. ఆయా పనుల వివరాలను కూడా ఉత్తర్వులకు జత పరిచింది. తాజాగా జారీ చేసిన ఆదేశాల్లో కూడా ఈ పనులకు అవసరమయ్యే నిధులకు పాత జీవోలో పేర్కొన్న ఆర్థిక శాఖ పద్దునే పేర్కొంది. ఆ పద్దుకు ఇప్పటికీ తగిన నిధుల కేటాయించకుండా.. ఆయా నిధులను ప్రస్తుత ఏడాది, ఈ ఆర్థిక ఏడాది లేదా వచ్చే ఆర్థిక ఏడాది కాలంలో నాబార్డు రుణం లేదంటే కేంద్రమిచ్చే సాస్కీ (ఎస్ఏఎస్‌సీఐ– స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) నిధులకు మార్పిడి జరుగుతుందని పేర్కొనడం గమనార్హం.

ప్రభుత్వం మాది.. రాయల్టీ ఎందుకు కట్టాలి?

- అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడ్డుకున్న ఉద్యోగిపై టీడీపీ మండలాధ్యక్షుడి బెదిరింపు
- ఎలా అడ్డుకుంటావని దుర్భాషలు

దుర్భాషలాడుతున్న సర్పంచ్ భర్త శివప్ప

సాక్షి టాస్క్‌ఫోర్స్: కర్నూలు జిల్లా ఆదోని టీడీపీ మండల అధ్యక్షుడు, దొడ్డేనగరి సర్పంచ్ భర్త శివప్ప ఓ ప్రైవేట్ సంస్థ ఉద్యోగిపై రెచ్చిపోయాడు. అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నాడన్న ఆక్రోశంతో పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడాడు. ప్రభుత్వం మాది.. రాయల్టీ ఎందుకు కట్టాలి.. రారా.. నా కొ.. నీ..మ్మా.. కారు తగలబెడతానని బెదిరించాడు.

ఇదీ పరిస్థితి

గతేడాది అక్టోబర్ 8న ఈ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడానికి అధికారులు టెండర్లు పిలిచారు. సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ అనే ప్రైవేట్ సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనింగ్‌కు టెండర్ దక్కించుకుంది. అక్రమంగా మైనింగ్‌కు చెక్ పెట్టడానికి ఆ సంస్థ ప్రైవేట్ ఉద్యోగులను ఏర్పాటు చేసుకుంది. ఆదోని నియోజకవర్గానికి భరత్‌కుమార్ అనే వ్యక్తితో పాటు మరో నలుగురిని నియమించింది. అయితే వారం రోజులుగా దొడ్డనగేరి కొండల్లో గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్నారని సమాచారం అందడంతో బుధవారం భరత్‌కుమార్ అక్కడికి వెళ్లి జేసీబీ, ట్రాక్టర్లను నిలిపివేశాడు.

రెచ్చిపోయిన సర్పంచ్ భర్త

ఈ విషయం తెలుసుకున్న దొడ్డనగేరి సర్పంచ్ భర్త, టీడీపీ మండలాధ్యక్షుడు శివప్ప తన అనుచరులతో వెళ్లి హంగామా సృష్టించాడు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడికి ఫోన్ చేసి ఉద్యోగి భరత్‌కు ఇచ్చాడు. సదరు ఉద్యోగి మీనాక్షినాయుడిని సార్ అని సంబోధించలేదని శివప్ప మరోసారి కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగిపై రెచ్చిపోయాడు. నీ కారును ఇక్కడే తగలబెట్టేస్తా.. లం..కొడకా అంటూ దాడిచేయబోయాడు. ఈ ఉదంతాన్ని కాంట్రాక్టు సంస్థ ఉద్యోగులు రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో టీడీపీనేత తీరు వెలుగులోకి వచ్చింది.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

మైనింగ్ చేపట్టడానికి మా సంస్థ టెండర్ దక్కించుకుంది. ఎవరైనా టన్నుకు రూ.90 చెల్లించి గ్రావెల్ తోలుకోవచ్చు. దొడ్డి దారిన గ్రావెల్ తరలించడాన్ని అడ్డుకున్నందుకు శివప్ప నాపై దూషణకు దిగాడు. విషయాన్ని సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాం.

– భరత్‌కుమార్, సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ ఉద్యోగి

ఏసీబీ వలలో రిమ్స్ ఉద్యోగులు

కడప అర్బన్: వైఎస్సార్ కడప జిల్లా కడపలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి (రిమ్స్)లో సూపరింటెండెంట్ మేదర సుబ్బయ్య, సదరం సర్టిఫికెట్ల విభాగంలో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లును బుధవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సీతారామారావు మీడియాకు వివరాలను వెల్లడించారు. వీరపునాయనపల్లి మండలం పెందుర్తి గ్రామానికి చెందిన వీరపు శేఖర్ తన భార్య కోటేశ్వరికి చెవుడుకు సంబంధించిన దివ్యాంగుల సర్టిఫికెట్ ఇప్పించాలని గత ఏడాది నవంబర్ నుంచి రిమ్స్‌కు తిరుగుతున్నాడు. ఈ సమయంలో ఈఎన్‌టీ విభాగం డాక్టర్లతో మాట్లాడి సర్టిఫికెట్ ఇప్పిస్తామని మేదర సుబ్బయ్య నమ్మబలికాడు. రూ.30,000 లంచంగా ఇస్తేనే సర్టిఫికెట్ ఇప్పిస్తామని తేల్చి చెప్పాడు. దీనికి ఒప్పుకున్న బాధితుడు, లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం శేఖర్, రూ.30వేలను సుబ్బయ్యకు ఇచ్చాడు. అతడు డబ్బు తీసుకుని సదరం కార్యాలయానికి వెళ్లి, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు రూ.25వేలు ఇచ్చి, తాను రూ.5 వేలు ఉంచుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
నెం. 14/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది 31.01.2026
పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీరాజ్ సర్కిల్, ఒంగోలు పరిధిలోని 4 పనులకు అంచనా మొత్తం రూ.194.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు లభ్యమగు తేదీ : 05.02.2026, సా. 5.00 గం.ల నుండి. పూర్తి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఒంగోలు
DIPR RO No.18993/CL/Advt/1/1/2021-22, Dt: 04.02.2026

సభలో రచ్చరచ్చ

ఆగని విపక్షాల ఆందోళన

- అమెరికాతో ఒప్పందం, నరవణే పుస్తకంపై సమాధానం చెప్పాలని డిమాండ్
- ప్రధాని మోదీ స్థానాన్ని చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు
- పరిస్థితి అదుపులో లేకపోవడంతో సభకు గైర్హాజరైన మోదీ

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణే పుస్తకంపై లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు బుధవారం సైతం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు నిజాలు బహిర్గతం చేయాలని పట్టుబట్టారు. సభలో బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, ఆయన సభకు హాజరు కాలేదు. ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు ప్రారంభించారు. శాంతించాలంటూ స్పీకర్ విజ్ఞప్తి చేసినా వారు వినిపించుకోలేదు. దాంతో స్పీకర్ సభను ఉదయం 11 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యుల ఆందోళన ఆగలేదు. ప్రభుత్వం సమాధానం చెప్పేదాకా విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. విపక్ష ఎంపీలు తొలుత వెల్‌లో బైఠాయించారు. అనంతరం బ్యానర్లు ప్రదర్శిస్తూ అధికార పక్ష సభ్యులవైపు దూసుకొచ్చారు. నరవణే పుస్తకంపై సభలో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి తీరును కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా తప్పుపట్టారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా, తర్వాత 2 గంటల దాకా వాయిదా వేశారు. మరో వాయిదా తర్వాత 5 గంటలకు సభ మళ్లీ ప్రారంభమయ్యాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ సమయంలోనే ప్రధాని ప్రసంగించాల్సి ఉంది. కాంగ్రెస్ మహిళా ఎంపీ వర్షా గైక్వాడ్ సహా మరికొందరు మహిళా సభ్యులు ప్రధాని కూర్చొనే స్థానం వద్దకొచ్చి ఘెరావ్ చేశారు. అప్పుడు మోదీ సభలో లేరు. వెనక్కి రావాలంటూ కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కోరినా విపక్ష సభ్యులు పట్టించుకోలేదు. పరిస్థితి సద్దుమణగకపోవడంతో స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. పరిస్థితి అదుపులో లేకపోవడం వల్లనే మోదీ సభకు రాలేదని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ చెప్పారు.

రాజీవ్, సోనియాపై వచ్చిన వివాదాస్పద పుస్తకాన్ని సభలో ప్రదర్శిస్తున్న దూబే

రాహుల్‌కు పోటీగా దూబే పుస్తక ప్రదర్శన..

మధ్యాహ్నం 2 గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే 'ఎడ్వినా అండ్ నెహ్రూ', 'మిత్రోఖిన్ ఆర్కైవ్' అనే పుస్తకాలను సభలో ప్రదర్శిస్తూ వాటి గురించి ప్రస్తావించడంతో వివాదం మొదలైంది. దివంగత ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీపై ఆయన విమర్శలు చేశారు. వారు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే, సభలో పుస్తకాల గురించి ప్రస్తావించడానికి వీల్లేదని సభాపతి స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి స్పష్టంచేశారు. నిషికాంత్ దూబే తీరుపై మండిపడుతూ కాంగ్రెస్ సహా ఇతర విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. పరిస్థితి అదుపు తప్పేలా ఉండడంతో సభాపతి లోక్‌సభను సాయంత్రం 5 గంటల దాకా వాయిదా వేశారు. తర్వాత కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. నిషికాంత్ దూబేపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు.

ద్రోహి.. శత్రువు

రాహుల్, బిట్టూ మధ్య తీవ్ర వాగ్వాదం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం కొనసాగింది. బుధవారం ఉదయం పార్లమెంట్ మకరద్వారం వద్ద ఇరువురు నేతలు ఎదురుపడ్డారు. పార్లమెంట్ నుంచి సస్పెండైన విపక్ష ఎంపీలకు సంఘీభావంగా రాహుల్ మాట్లాడేందు సిద్ధమవుతుండగా ఇంతలోనే బిట్టూ అక్కడికి వచ్చారు. విపక్ష ఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఏదో యుద్ధంలో గెలిచి వచ్చినట్లు ఇక్కడ కూర్చున్నారంటూ బిట్టూ ఎద్దేవా చేశారు. దానిపై రాహుల్ ఘాటుగా బదులిచ్చారు. ''ఒక ద్రోహి మన పక్కనుంచే వెళ్తున్నాడు. అతడి ముఖం చూడండి. ఎలా కనిపిస్తున్నాడో చూడండి. హలో బ్రదర్. నా ద్రోహి మిత్రుడా.. ఆందోళన చెందకు. నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తావు'' అంటూ వ్యాఖ్యానించారు. బిట్టూతో కరచాలనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే, రాహుల్‌తో కరచాలనానికి బిట్టూ నిరాకరించారు. రాహుల్ వైపు చూస్తూ దేశానికి శత్రువు(దేశ్ కీ దుష్మన్) అంటూ నిందించారు. అక్కడున్న సస్పెండైన ఎంపీలను, కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి దేశ్ కీ దుష్మన్ అంటూ పలుమార్లు అన్నారు. ఈ వీడియోలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్టుచేసింది. అనంతరం బిట్టూ మీడియాతో మాట్లాడారు. 'రాహుల్ గాంధీ చెడిపోయిన పిల్లాడు' అంటూ నిందించారు. అక్కడ ఎంతోమంది ఎంపీలు ఉండగా, సిక్కు మతస్థుడినైన తనను ఉద్దేశించి అనుచితంగా మాట్లాడారని రాహుల్‌పై మండిపడ్డారు. ''తామే పెద్ద దేశభక్తులమని గాంధీలు పదేపదే చెప్పుకుంటారు. రాహుల్ తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అంటుంటారు. మా తాత బియాంత్ సింగ్ పంజాబ్‌లో బలిదానం చేశారు. గాంధీ కుటుంబం సృష్టించిన ఉగ్రవాదానికి ఆయన బలయ్యారు. సిక్కుల రక్తంతో గాంధీల చేతులు తడిచాయి. సిక్కు వ్యతిరేక గొడవల్లో ఎంతోమంది చనిపోయారు. సిక్కులను హత్య చేసి, గురుద్వారాలను కూల్చేసిన గాంధీ కుటుంబ వారసులతో ఈ సర్దార్ ఎప్పటికీ చేతులు కలపడు. మళ్లీ కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తే లేదు. నాకు జరిగిన అవమానాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్తా'' అని బిట్టూ స్పష్టం చేశారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి

కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూ ద్రోహి అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి సహా బీజేపీ నేతలు, సిక్కు నాయకులు తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ సిక్కులకు వ్యతిరేకం అన్న సంగతి మరోసారి తెలిసిపోయిందని అన్నారు. రాహుల్ గాంధీని సిక్కులు ఎప్పటికీ క్షమించబోరని తేల్చిచెప్పారు. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. సిక్కు వర్గాన్ని కించపర్చినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. రాహుల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ అమరీందర్ సింగ్ రాజా సమర్థించారు. ద్రోహిని ద్రోహి అనకపోతే ఇంకేం అంటారని ప్రశ్నించారు. బిట్టూకు కాంగ్రెస్ ఎంతో చేసిందని, అయినా సరే పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయాడని ఆరోపించారు.

పార్లమెంటు మకర ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ, తదితర విపక్ష ఎంపీలు

బాధ్యత దులిపేసుకున్న మోదీ

- చైనాతో ఘర్షణ సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు
- అప్పటి ఆర్మీ చీఫ్‌పైకి నెట్టేశారు
- చైనా ట్యాంకులు మీదకు వస్తున్నా సంబంధం లేదన్నట్లుగా మాట్లాడారు
- నరవణే పుస్తకంలో ఏముందో యువత తెలుసుకోవాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య 2020లో జరిగిన ఘర్షణ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ముఖ్యమైన బాధ్యతను అప్పటి ఆర్మీ చీఫ్‌పైకి నెట్టేసి, చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. దేశ భద్రతకు సంబంధించిన అత్యంత సంక్షోభ సమయంలో మోదీ అలా తప్పించుకోవడం ఏమిటని నిలదీశారు. ప్రజలు ప్రశ్నలు అడిగితే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా పారిపోతోందని విమర్శించారు. రాహుల్ బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణే రచించి, ఇంకా అధికారికంగా విడుదల చేయని జ్ఞాపకాల పుస్తకాన్ని ప్రదర్శించారు. అందులోని కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ పుస్తకం నిజంగా ఉందన్న సంగతిని యువత తెలుసుకోవాలని కోరారు. అసలు ఇలాంటి పుస్తకమే లేదని ప్రభుత్వం నమ్మబలుకుతోందని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ అదేమాట చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తూర్పు లద్దాఖ్‌లో గల్వాన్ ఘర్షణ సమయంలో ఏం జరిగిందో నరవణే సవివరంగా రాశారని తెలిపారు.



పార్లమెంట్ ఆవరణలో నరవణే పుస్తకంతో రాహుల్

మోదీ వస్తే పుస్తకం అందజేస్తా..

''చైనా యుద్ధ ట్యాంకులు కైలాస పర్వతం దాకా దూసుకొచ్చాయి.. ఇప్పుడేం చేయాలని ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అడిగారు. అందుకు వారు సమాధానం చెప్పలేదు. దాంతో రాజ్‌నాథ్ సింగ్‌ను మళ్లీ అడిగారు. ఉన్నత స్థాయి వాళ్లను(ప్రధానమంత్రి) అడిగి చెప్తానని రాజ్‌నాథ్ బదులిచ్చారు. రాజ్‌నాథ్ వెళ్లి ప్రధానమంత్రిని అడిగితే.. మీకు ఏది సముచితం అనిపిస్తే అదే చేయండి అంటూ మోదీ బాధ్యత దులిపేసుకున్నారు. చైనా యుద్ధ ట్యాంకులు మన భూభాగంలోకి ప్రవేశించినా తనకు సంబంధం లేదన్నట్లుగా మాట్లాడారు. దాంతో ఈ అంశంలో పూర్తిగా ఒంటరిగా మారిపోయినట్లు భావించానని నరవణే తన పుస్తకంలో రాశారు. ఇదే విషయం నేను పార్లమెంట్‌లో చెప్తానని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే నన్ను సభలో మాట్లాడనివ్వడం లేదు. లోక్‌సభకు వచ్చేంత ధైర్యం ప్రధాని మోదీకి ఉందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ ఆయన వస్తే ఈ పుస్తకం అందజేస్తా'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఈ పుస్తకం ప్రతిపక్ష నేత గానీ, విదేశీ రచయిత గానీ రాయలేదని వెల్లడించారు. మాజీ ఆర్మీ చీఫ్ రాశారని పేర్కొన్నారు. అయినా ఇలాంటి పుస్తకం లేనేలేదని అంటున్నారని తప్పుబట్టారు. పార్లమెంట్‌కు వచ్చి, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదని తేల్చిచెప్పారు.

ప్రభుత్వం భయపడుతోంది: ప్రియాంక

చైనాతో ఘర్షణ జరిగినప్పుడు మోదీ ప్రభుత్వ నిర్వాకం ఏమిటో జనరల్ నరవణే బయటపెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. నిజాలు ప్రజలకు తెలుస్తాయని మోదీ సర్కార్ భయపడుతోందని, అందుకే లోక్‌సభలో మాట్లాడేందుకు రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వడం లేదని బుధవారం విమర్శించారు. బీజేపీ ఎంపీలు కూడా గతంలో పుస్తకాలు, మేగజైన్లు, రిపోర్టులను ప్రస్తావిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడారని గుర్తుచేశారు. ప్రధాని మోదీ కూడా సంజయ్‌బారు పుస్తకం గురించి మాట్లాడారని తెలిపారు. నరవణే పుస్తకంపై రాహుల్ మాట్లాడితే తప్పేమిటని ప్రశ్నించారు. అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఎంపీలకు ఉందన్నారు.

ఖేమ్‌చంద్

మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పరిణామాలు ఒక్కరోజులో మారిపోయాయి. రాష్ట్రపతి పాలన రద్దు కాగా, ఆ వెంటనే నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. దాంతో ఏడాది కాలంగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెర పడింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. సీఎంగా బీజేపీ సీనియర్ నేత వై.ఖేమ్‌చంద్ సింగ్‌తో గవర్నర్ అజయ్ భల్లా లోక్‌భవన్‌లో బుధవారం ప్రమాణం చేయించారు. బీజేపీ ఎమ్మెల్యే, కుకీ వర్గానికి చెందిన మహిళా నేత నేమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ ఎమ్మెల్యే ఎల్.డిఖో ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ సభ్యుడు గోవింద్‌దాస్ కాంథౌజమ్, ఎన్‌పీపీ సభ్యుడు కె.లోకేన్‌సింగ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్డీయే ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న కిప్‌జెన్ అక్కడి నుంచే వర్చువల్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మణిపూర్ కొత్త ప్రభుత్వ గడువు వచ్చే ఏడాది దాకా ఉంది. ప్రమాణ స్వీకారం కంటే ముందు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను రద్దు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వు జారీ చేశారు.

జనంపై 'సర్' బుల్డోజర్

- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- ఎస్ఐఆర్ ప్రక్రియను నిరసిస్తూ నేరుగా సుప్రీంకోర్టులో మమత వాదన
- వాదనకు 5 నిమిషాలడిగితే 15 నిమిషాలిచ్చిన కోర్టు
- ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని సీజేఐ వ్యాఖ్య
- విచారణ సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే సక్రమంగా జరగట్లేదని, పనిఒత్తిడితో బూత్ లెవల్ అధికారులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, బాధితులను ఢిల్లీకి తీసుకొచ్చి బెంగాల్ అంశాన్ని హస్తిన వేదికగా చర్చనీయాంశంగా మార్చిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఈ అంశంపై నేరుగా సర్వోన్నత న్యాయస్థానంలో తన వాదనలు స్వయంగా వినిపించారు. ఐదు నిమిషాలు సమయం ఇస్తే సూటిగా, స్పష్టంగా తమ వాదనలను విన్పిస్తానని మమత కోరగా ధర్మాసనం ఏకంగా 15 నిమిషాల సమయం కేటాయించడం విశేషం. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా స్వయంగా ముఖ్యమంత్రి సుప్రీంకోర్టులో రాష్ట్ర కేసును వాదిస్తుండటంతో ఆమె వాగ్ధాటిని వినేందుకు న్యాయవాదులు సీజేఐ కోర్టురూమ్‌లోకి ఎగబడ్డారు. ఈ ఘటనకు సర్వోన్నత న్యాయస్థానం వేదికైంది.

సుప్రీంకోర్టులోకి వెళ్తున్న మమత

ఈసీ ఒక వాట్సాప్ కమిషన్..

తమ రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ మమతా బెనర్జీ, మొస్తారీ బానూ, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియాన్, దోలాసేన్‌లు వేసిన పిటిషన్‌పై తానే స్వయంగా వాదనలు విన్పించేదుకు అనుమతించాలంటూ ఇప్పటికే మమత ఇంటులాక్యుటరీ పిటిషన్ వేశారు. దీంతో మమతను వాదనలకు కోర్టు అనుమతించింది. మమత తన వాదనల సందర్భంగా ఎన్నికల కమిషన్‌ను వాట్సాప్ కమిషన్‌గా అభివర్ణించారు. '' ఈసీ ఒక వాట్సాప్ కమిషన్. ఉన్నతాధికారులకు కీలక నిర్ణయాలను వాట్సాప్‌లలో పంపిస్తోంది. మా రాష్ట్రంలో అక్రమంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోవాలి. ఎన్నికల నేపథ్యంలోనే మా రాష్ట్రాన్ని ఈసీ లక్ష్యంగా చేసుకుంది. ఓటర్లపై ఈసీ 'ఎస్ఐఆర్' బుల్డోజర్‌తో తొక్కిస్తోంది. ఎస్ఐఆర్ పేరిట బూత్ లెవల్ అధికారులను ఈసీ అధికారాలు వేధిస్తున్నారు. వేధింపులు, పని ఒత్తిడితో పెద్దసంఖ్యలో బీఎల్ఓలు ఆత్మహత్యచేసుకున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని మీరే కాపాడాలి. ఈ కేసులో న్యాయం కోసం మొదట్నుంచీ మా లాయర్లు శతథా పోరాడుతున్నారు. అయినాసరే మాకు ఎక్కడా న్యాయం దక్కట్లేదు. నేను కూడా కట్టుబానిసను. సాధారణ కుటుంబం నుంచి వచ్చా. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడట్లేను. రాష్ట్ర ఓటర్ల ఓటింగ్ హక్కుల కోసం పోరాడుతున్నా. ఇదే విషయమై ఇప్పటికే ఆరు సార్లు ప్రధాన ఎన్నికల కమిషన్ వద్ద మొరపెట్టుకుంటూ లేఖలు రాశా. అయినాసరే ఎలాంటి స్పందన రాలేదు. స్పెల్లింగ్‌లో చిన్నచిన్న తప్పులను ఎత్తిచూపి కోట్లాది ఓట్లను తొలగించొద్దు. ఇతర డాక్యుమెంట్లు అడక్కుండా ఎస్ఐఆర్ వెరిఫికేషన్‌లో ఆధార్‌కార్డ్‌ను గుర్తింపుకార్డుగా అంగీకరించండి'' అని మమత కోరారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంఛోలీల ధర్మాసనం స్పందించింది. ''మీరు చేస్తున్న వాదనల్లో నిజం ఉంది. అయితే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది'' అని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ఫిబ్రవరి 9వ తేదీ(సోమవారం)కల్లా మీ స్పందన తెలపాలని ఎలక్షన్ కమిషన్‌కు, పశ్చిమబెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారికి నోటీసులు జారీచేసింది. బీఎల్ఓలు, ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్‌లతో సున్నితంగా వ్యవహ రించాలని, వాళ్లకు నోటీసులు జారీచేసే ముందు ఆలోచించాలని ఈసీకి ధర్మాసనం సూచించింది. కేసు విచారణ సోమవా రానికి వాయిదా వేశారు.

ఎందుకింత తొందర?

''ఎస్ఐఆర్ సర్వేను సమగ్రంగా, సంపూర్ణంగా చేయాలంటే కనీసం రెండు సంవత్సరాలు పడుతుంది. కానీ హడావుడిగా కేవలం మూడునెలల్లో ముగించాలని ఎందుకు నిర్ణయించారు? ఇదే సమయంలో రాష్ట్రంలో పండగ సీజన్ ఉంది. పంటల సాగు నడుస్తోంది. అంతా బిజీగా ఉండే సమయంలో హడావిడిగా ఎస్ఐఆర్ ముగించాలని ఎందుకు భావిస్తున్నారు?'' అని మమత వాదించారు. వేధింపులతో బీఎల్ఓలు చనిపోతున్నారని మమత వాదించగా ఎలక్షన్ కమిషన్ తరపు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది కలగజేసుకుని '' ఉద్దేశపూర్వకంగా మమత సర్కార్ తక్కువ పనితనం ఉన్న 80 మంది గ్రేడ్–2 అధికారులను మాకు సహాయకులుగా అందించింది'' అని వాదించారు. దీనిపై మమత మాట్లాడారు. '' ఈసీ నిబంధనల్లో పేర్కొన్న మేరకే తగు రాష్ట్ర ఆఫీసర్లను ఈసీ కోసం కేటాయించాం'' అని బదులిచ్చారు. మళ్లీ ద్వివేది మాట్లాడబోగా మమత చేతులు జోడించి '' జడ్జిగారు దయచేసి మమ్మల్ని పూర్తిగా మాట్లాడనివ్వండి'' అని వేడుకున్నారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ''మమత ఇంతదూరం వచ్చిందే మాట్లాడేందుకు. అయినా నిజమైన ఓటరు పేరు ఖచ్చితంగా ఓటర్లజాబితా తుది లిస్ట్‌లో ఉండాల్సిందే. తుది జాబితా నుంచి ఏ ఒక్క అమాయకుడిని పేరు తొలగింపునకు గురికావొద్దు'' అని అన్నారు. ఇంగ్లిష్ స్పెల్లింగ్‌లో తప్పులుంటే కూడా నోటీసులు ఇస్తున్నారని శ్యామ్ దివాన్ వాదించగా కోర్టు ''ఇంగ్లిష్ అంటేనే స్పెల్లింగ్ తప్పులమయం'' అని ఒక బెంగాలీ సామెతను గుర్తుచేశారు. తెలుపురంగు చీర, నలుపు రంగు శాలువా ధరించి న్యాయవాదులు, పార్టీ ఎంపీ, సీనియర్ న్యాయవాది కల్యాణ్ బెనర్జీలతో వచ్చిన మమతను చూసేందుకు సుప్రీంకోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పలు కేసుల పిటిషనర్లు ఎగబడ్డారు.

సారీ నాన్నా..!

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

- గేమ్స్ ఆడొద్దని తండ్రి వారించడంతో విపరీత నిర్ణయం తీసుకున్న వైనం
- 9 అంతస్తుల భవనం నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి
- యూపీ ఘజియాబాద్‌లో ఘటన

ఘజియాబాద్: కోవిడ్‌కాలంలో స్మార్ట్‌ఫోన్‌లకు అతుక్కుపోయిన టీనేజర్లలో కొందరు పూర్తిగా ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలై చివరకు వాటికి బలవుతున్న దారుణోదంతం తాజాగా ఉత్తర ప్రదేశ్‌లో వెలుగుచూసింది. ఘజియాబాద్‌కు చెందిన ముగ్గురు టీనేజీ అక్కాచెల్లెళ్లు నిషిక(16), ప్రాచీ(14), పఖీ(12) మంగళవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో తాము నివసించే అపార్ట్‌మెంట్ 9వ ఫ్లోర్ నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో చిన్నారుల ఫోన్ వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం ఎంతటి దారుణాలకు దారితీస్తుందోన్న విస్తృతచర్చలకు తెరలేచింది. ఆత్మహత్య ఘటన తెల్సి పోలీసులు రంగంలోకి దిగి వాళ్లింట్లో సోదాలుచేసి సూసైడ్ నోట్‌ను స్వాధీనంచేసుకున్నారు. ఏడుస్తున్న ఎమోజీని జతచేసి ' సారీ నాన్నా. నిజంగా సారీ'' అంటూ పలు వాక్యాలు రాసి ఉన్న లేఖను చూసి తండ్రి చేతన్ కుమార్ బోరున విలపించారు. షాలిమార్ గార్డెన్ అసిస్టెంట్ కమిషనర్ అతుల్ సింగ్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం సాహిబాబాద్‌లోని భరత్‌సిటీలో ఉన్న చేతన్‌కుమార్ ఫారెక్స్ ట్రేడింగ్ చేస్తుంటాడు. ఇతను ఇద్దరు అక్కాచెల్లెళ్లను పెళ్లాడాడు. వీళ్లకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కలిగారు. అందరూ ఒకే అపార్ట్‌మెంట్‌లో కలిసే ఉంటున్నారు. నలుగురు కుమార్తెల్లో నిషిక, ప్రాచీ, పఖీలు కోవిడ్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కు అందులోనూ ఆన్‌లైన్‌గేమ్‌లకు బాగా అలవాటు పడ్డారు. కొరియన్ ఆన్‌లైన్ గేమ్స్ అంటే విపరీతమైన పిచ్చి. దీంతో చదువుల్లో బాగా వెనకబడ్డారు. చివరకు పాఠశాలకు వెళ్లడం మానేశారు. గత రెండేళ్లుగా ముగ్గురూ స్కూల్ ముఖం చూడలేదు. ఇంట్లో తమ గదికే పరిమితమయ్యారు. ఎప్పుడూ కలిసి స్నానం చేయడం, తినడం, పడుకోవడం, ఫోన్ చూడటం తప్ప మరో పని చేసిందే లేదు. దీంతో ఫోన్ వాడకం ఆపేయాలని తండ్రి ఎంత మొత్తుకున్నా వినిపించుకోలేదు. అయితే మంగళవారం మాత్రం ఈ విషయమై గొడవ జరిగిందని వార్తలొచ్చాయి. రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎదురుగా ఉన్న మరో అపార్ట్‌మెంట్ పదో అంతస్తు ఫ్లాట్‌లో ఉండే అరుణ్ అనే వ్యక్తి తన బాల్కనీలోకి వచ్చి నిల్చున్నాడు. అదే సమయానికి ఈ అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తులోని తమ బాల్కనీ వద్దకు చేరుకున్నారు. పెద్దవాళ్లు ఇద్దరు హత్తుకుని ఒక్కటిగా కిందకు పడిపోగా వాళ్లను పట్టుకోబోయి చిన్న చెల్లెలు సైతం కిందకు పడటం చూసి హుతాశుడయ్యాడు. వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ముగ్గురు హాహాకారాలు చేస్తూ కిందకు దూకడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఉలిక్కిపడ్డారు. నేలపై రక్తపుమడుగులో పడి ఉన్న ముగ్గురినీ సమీప లోనీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయారని వైద్యులు ధ్రువీకరించారు.



అక్కాచెల్లెళ్ల సూసైడ్ నోట్

కొరియాకు వెళ్తామనేవారు..

ఘటనపై తండ్రి మీడియాతో మాట్లాడారు. ''వాళ్లు ఫోన్ చూస్తున్నారని అనుకున్నా. గేమ్స్ ఆడుతున్నారనిగానీ, టాస్క్‌లు ఉండే ఆన్‌లైన్ ఆటలాడుతున్నారని గానీ నాకు తెలీదు. ఒక గేమ్‌నయితే వాళ్లు దాదాపు మూడేళ్లుగా ఆడుతున్నారు. మేం కొరియాకు వెళ్లొస్తామని తరచూ నాతో అనేవాళ్లు. భయంకరమైన టాస్క్‌లు గేమ్‌లో ఉంటాయని నాకు తెలియదు. వీళ్ల మొబైల్ ఫోన్లను పోలీసులు పరిశీలించాకే నాకీ విషయం తెల్సింది. గేమ్‌ల సంగతి తెలిస్తే ముందే వీళ్లను హెచ్చరించేవాడిని. కనీసం ఫోన్లు ఇచ్చేవాడినే కాదు. వ్యసనపరులుగా మారేదాకా ఏ తండ్రీ చూస్తూ ఊరుకోడు'' అని తండ్రి ఏడుస్తూ చెప్పారు. గేమ్‌లో ప్రాచీ బాస్‌గా ఉండేదని, అక్క నిషిక, చెల్లి పఖీ ఈమె ఆదేశాలను శిరసావహించేవారని తెలుస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం ముంబైలో 14 ఏళ్ల బాలుడు ప్రమాదకర బ్లూవేల్ గేమ్ ఆడుతూఆత్మహత్యకు పాల్పడిన ఘటనను ఘజియాబాద్ ఉదంతం గుర్తుకుతెస్తోంది. ఆనాడు రష్యాలో మొదలైన ఈ ఆన్‌లైన్ గేమ్ రష్యా, కజకిస్తాన్, కిర్గిస్తాన్, మధ్యాసియా దేశాల్లో 130 మంది ప్రాణాలుతీసింది. గేమ్ మొదలెట్టిన 50 రోజుల్లోపు గేమ్ ఆడే వ్యక్తి మరణించేలా అందులో టాస్క్‌లు ప్లాన్‌చేశారు.

మన ఆహార, వ్యవసాయ రంగాలకు పూర్తి రక్షణ

- అమెరికాతో ఒప్పందం పట్ల ఆందోళన అక్కర్లేదు
- పార్లమెంట్‌లో మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తేల్చిచెప్పారు. మన దేశ ఆహార, వ్యవసాయ రంగాలకు ఈ ఒప్పందంలో పూర్తి రక్షణలు ఉన్నట్లు తెలిపారు. ఆయన బుధవారం తొలుత లోక్‌సభలో, తర్వాత రాజ్యసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. మన దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని అన్నారు. అమెరికాతో ఒప్పందం వల్ల మనకు లాభం చేకూరుతుందని ప్రకటించారు. అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువులకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. ఎగుమతుల విషయంలో మన పోటీ సామర్థ్యం మరింత ఇనుమడిస్తుందని వివరించారు. ఈ ఒప్పందం హఠాత్తుగా కుదిరిందని కాదని, భారత్, అమెరికా మధ్య పలు దఫాల చర్చల తర్వాతే తుదిరూపు వచ్చిందని స్పష్టంచేశారు. ఇది సమతుల్య, పరస్పర ప్రయోజనాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందమని పేర్కొన్నారు.

పుతిన్, ట్రంప్‌తో జిన్‌పింగ్ మాటామంతి

ఒకేరోజు ఇరువురు నేతలతో ఫోన్‌లో సంభాషణ

బీజింగ్: చైనా అధినేత జిన్‌పింగ్ బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడిన కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్‌తో సంభాషించడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా, రష్యా సంబంధాలపై పుతిన్‌తో జిన్‌పింగ్ విస్తృతంగా చర్చించారు. ఈ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి అందుబాటులో ఉన్న అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఒక 'గ్రాండ్ ప్లాన్'ను పుతిన్ ప్రతిపాదించారు. గత ఏడాది నవంబర్ తర్వాత జిన్‌పింగ్, పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. ఇటీవలి కాలంలో చైనా, జపాన్ సంబంధాలు దెబ్బతింటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పుతిన్‌తో సంభాషణ చర్చనీయాంశంగా మారింది. పుతిన్‌తో, ట్రంప్‌తో జిన్‌పింగ్ ఒకేరోజు మాట్లాడడం అత్యంత అరుదైన ఘటన. అయితే, ట్రంప్‌తో ఏం చర్చించారన్నది తెలియరాలేదు. దీనిపై చైనా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. రష్యా, అమెరికాల మధ్య 2010లో కుదిరిన అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందం గడువు గురువారం ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ కొత్త ఒప్పందాన్ని ప్రతిపాదించారు. ఇందులో చైనా భాగస్వామిగా మారాలని కోరుతున్నారు. అందుకు చైనా అంగీకరించడం లేదు.

సాక్షి
గుంటూరు
గురువారం ၊ 5 ၊ ఫిబ్రవరి ၊ 2026

గుంటూరులో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భారీగా హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

- జననేత గుంటూరు పర్యటన విజయవంతం
- వైఎస్‌ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన జనం
- ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించిన పోలీసులు
- ఆంక్షలను అధిగమిస్తూ తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- అంబటి కుటుంబానికి వైఎస్‌ జగన్‌ పరామర్శ
- దాడికి బాధ్యులైన వారిపై అధికారంలోకి రాగానే చర్యలు
- వడ్డీ సహా అందరికీ చెల్లించేస్తామని హెచ్చరిక

పోటెత్తిన అభిమానం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అడుగడుగునా అంతులేని అభిమానం... ఎక్కడికక్కడ కట్టడికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించినా ఆగని జనసందోహం... ఇవీ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనలో కనిపించిన దృశ్యాలు. అధికార పార్టీ గూండాల దాడిలో ధ్వంసమైన అంబటి ఇంటిని, కార్యాలయాన్ని బుధవారం పరిశీలించి, కుటుంబసభ్యులను వైఎస్‌ జగన్‌ పరామర్శించారు. తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్‌ జగన్‌కు అడుగుడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. రెడ్‌బుక్‌ రాజ్యాంగం, విధ్వంస పాలనతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలు.. వైఎస్‌ జగన్‌ కార్యక్రమానికి తరలివచ్చారు. ఆయన్ను చూసేందుకు పోటెత్తారు. తాడేపల్లి నుంచి గుంటూరు, సిద్ధార్థనగర్‌లోని రాంబాబు ఇంటికి ఆయన చేరుకోవడానికి దాదాపు 6 గంటలు పట్టింది.

అభివాదం చేస్తున్న జగనన్న

తరలివచ్చిన అభిమానులు

కుంచనపల్లి క్రాస్‌రోడ్స్, కాజ టోల్‌గేట్, మంగళగిరి బైపాస్, కాకాని, ఏటుకూరు బైపాస్‌ సర్వీస్‌ రోడ్, గుంటూరులోని కేవీపీ (వీఐపీ) రోడ్, చుట్టుగుంట, కలెక్టర్‌ ఆఫీస్, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల మీదుగా సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు నివాసానికి వైఎస్‌ జగన్‌ చేరుకున్నారు. ఉదయం 10.40 గంటలకు బయలుదేరిన ఆయన.. అంబటి ఇంటికి చేరే సరికి సాయంత్రం 4.35 గంటలు అయ్యింది. మరోవైపు జగన్‌ పర్యటనను అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రతి చోటా ప్రయత్నించింది. తాడేపల్లి నుంచి అంబటి రాంబాబు ఇంటివరకూ ఎక్కడికక్కడ పోలీసులు బ్యారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. జగన్‌ కాన్వాయ్‌ను మాత్రం అనుమతించి.. ఆయన వెనుక వస్తున్న వాహనాలను, జనసందోహాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అడ్డంకుల మధ్య కూడా జగన్‌ పర్యటన విజయవంతం అయ్యింది. ఒకటి, రెండు చోట్ల లారీలను కూడా రోడ్డు మీద పెట్టి అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆయన వెంట తరలివచ్చారు. గుంటూరు నగరం జనసంద్రంగా మారింది. పల్నాడు జిల్లా నుంచి ఎవ్వరూ రాకుండా దిగ్బంధించారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ, యడ్లపాడు మండలం బోయపాలెం హైవే వద్ద, సత్తెనపల్లి మండం నందిగం అడ్డరోడ్డు వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరీ అడ్డంకులు సృష్టించారు.

బందోబస్తు హడావుడి

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్‌ మండలం బొంతపాడు వై జంక్షన్‌ వద్ద డీఎస్పీలు భానూదయ, అరవింద్‌తోపాటు సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, రోప్‌ పార్టీలు, ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించాయి. డ్రోన్‌ కెమెరాలతో పర్యటనపై డేగ కన్ను వేశారు. శనివారం రాత్రి అంబటి రాంబాబు నివాసం వద్ద టీడీపీ మూకలు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ప్రత్తిపాడు నియోజకవర్గం బీసీ విభాగం అధ్యక్షుడు దారం అశోక్‌యాదవ్‌ను వైఎస్‌ జగన్‌ పరామర్శించారు. అంబటి ఇంటికి వెళుతున్న దారిలో ఏటుకూరు బైపాస్‌లోగల ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌ కుమార్‌ కార్యాలయం వద్ద టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన అశోక్, పూర్తిగా ధ్వంసమైన కారును జగనన్న తన వాహనం నుంచి అభిమానుల మధ్యనే పరిశీలించారు.

ఎట్టకేలకు...

ఉదయం 10 గంటల నుంచి అంబటి నివాసం దగ్గరకు వస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు అభిమానులను పోలీసులు బారికేడ్లను అడ్డంగా పెట్టి అడ్డుకున్నారు. సిద్ధార్థనగర్‌కు వెళ్లే అన్ని రహదారులను మూసి వేశారు. అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వస్తున్న నాయకులు, కార్యకర్తలను అంబటి ఇంటికి వెళ్లనీయకుండా ఆపివేశారు. గుంటూరు నగరంలోకి ప్రవేశించిన వైఎస్‌ జగన్‌ కాన్వాయ్‌కు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో చుట్టుగుంట సెంటర్‌ నుంచి అంబటి నివాసానికి వచ్చేందుకు మూడు గంటలకుపైగా సమయం పట్టింది.

ముఖ్య నేతలు హాజరు

కార్యక్రమానికి పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, విడదల రజిని, పేరి నాని, మాజీ డెప్యూటీ స్పీకర్‌ కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, సింహాద్రి రమేష్, మాజీ ఎంపీలు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నందిగం సురేష్, సమన్వయకర్తలు షేక్‌ నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, వరికూటి అశోక్‌బాబు, బలసాని కిరణ్, ఈవూరు గణేష్, డాక్టర్‌ సుధీర్‌రెడ్డి, అవినాష్, నాయకులు పోతుల మహేష్, షేక్‌ గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణ, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిక

అంబటి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని, భయపడవద్దని వైఎస్‌ జగన్‌ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ''మాజీ మంత్రి అంబటి కాపు కులంలో ఒక టైగర్. విలువలున్న వ్యక్తి. అలాంటి వ్యక్తిని తప్పుడు కేసులో అక్రమంగా అరెస్ట్‌ చేయడమే కాకుండా నల్లపాడు సీఐ వంశీ, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఆయన్ను తీవ్రంగా దూషించి కొట్టడం తగదు. రేపు మా ప్రభుత్వం వచ్చాక ఈ అరాచకాలన్నింటి మీదా విచారణలు చేయిస్తాం. వడ్డీ సహా చెల్లిస్తాం. అందర్నీ బోనల్లో నిలబెట్టి సాక్ష్యాధారాలతో వారి యూనిఫాంలు విప్పిస్తాం. ఈ దారుణాల్లో భాగస్వాములైన కూటమి నాయకులు ఎవరున్నా వారిని జైలుకు పంపించి బాధితులకు న్యాయం చేసి తీరుతామని'' హెచ్చరించారు.

అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్‌ జగన్‌

నేతలను అడ్డుకున్న పోలీసులు

వైఎస్సార్‌ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనలో పాల్గొనేందుకు సత్తెనపల్లి, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, దాచేపల్లి, అచ్చంపేట, బెల్లంకొండ తదితర మండలాలకు చెందిన 37 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక వాహనంలో గుంటూరు బయలుదేరారు. సత్తెనపల్లి నందిగం అడ్డరోడ్డు వద్ద సత్తెనపల్లి రూరల్‌ పోలీసులు వారిని అడ్డుకున్నారు. గుంటూరు సమీపంలోకి చేరుకోగానే హైవేపై జనసంద్రం పోటెత్తింది. జననేతను చూసేందుకు అభిమానులు మండే ఎండను సైతం లెక్కచేయక బారులు తీరారు. అభిమానులు, పార్టీ శ్రేణులు తరలిరావడంతో హైవేతోపాటు ఏటుకూరు పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. గుంటూరు రూరల్‌ మండలం ఏటుకూరు ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో మెయిన్‌ హైవేపై నుండి సర్వీసు రోడ్డులోనికి జగన్‌ కాన్వాయ్‌ మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రవేశించింది. కాన్వాయ్‌ కనిపించగానే జననేతను చూసేందుకు అభిమానులు, పార్టీ శ్రేణులు హైవేపైకి పరుగులు పెట్టారు. చేతులు ఊపుతూ, ఫ్లెక్సీలు ప్రదర్శించారు. దీంతో జగన్‌ కారుపై నుండే ప్రజలకు చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

జొన్నలగడ్డ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జగనన్నను చూసిన ఆనందంలో మహిళల చిద్విలాసం

ద్విచక్ర వాహనాలపై యువత సందడి

న్యూస్‌రీల్

మహాదత్తునికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌ గ్రామంలో శ్రీ దత్తపీఠంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న విశేష పూజలు బుధవారంతో ముగిశాయి. ఉదయాన్నే అనఘాదేవి, దత్తాత్రేయ స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. యాగశాలలో మహాదత్తహవనం చేసి పూర్ణాహుతి నిర్వహించి భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీదత్తపీఠం నిర్వాహకులు జయశంకర్‌ పర్యవేక్షించారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

వేమూరు: అమృతలూరు మండలం గోవాడ గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. 2025 మార్చి 1వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 3వ తేదీ వరకు లెక్కింపు చేశారు. 11 నెలలకు గాను రూ.4,70,918 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్‌ పావులూరు రమేష్‌ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయ ఇన్‌స్పెక్టర్‌ ఎం.వెంకటేశ్వరరావు, తెనాలి దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొండవీడు ఫెస్ట్‌కు తరలి రావాలి



నరసరావుపేట: ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించే కొండవీడు ఫెస్ట్‌ ద్వారా కొండవీడు వైభవాన్ని తిలకించేందుకు ప్రతి కుటుంబాన్ని ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక వీడియో ద్వారా తన సందేశాన్ని రిలీజ్‌ చేశారు. తెలుగుజాతి ఘనచరిత్ర, వీరత్వానికి ప్రతీక కొండవీడు కోట అన్నారు. చరిత్ర, వైభవాన్ని నేటితరానికి పరిచయం చేస్తూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హెలీరైడ్, బోటింగ్, శాండ్‌ ఆర్ట్, లేజర్‌షో, క్రాకర్స్‌షో, హార్స్‌ రైడింగ్‌తో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గాయకులు గీతామాధురి, సమీరా భరద్వాజ్, జబర్దస్త్‌ కళాకారులు అలరించనున్నారని తెలిపారు. పిల్లల కోసం ప్రత్యేకంగా అమ్యూజ్‌మెంట్‌ పార్కు ఏర్పాటు చేశామన్నారు. పలు పోటీల్లో విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందవచ్చన్నారు. అన్ని ప్రాంతాల తెలుగు వంటకాలతో ఫుడ్‌ స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ వేడుకలను స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి చూసి ఆనందించాలని కలెక్టర్‌ ఆకాంక్షించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన



పెదకాకాని: పెదకాకానిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో త్వరలో జరగనున్న మహాశివరాత్రి ఏర్పాట్లను ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్‌ బుధవారం ఆలయ ఉప కమిషనర్‌ గోగినేని లీలా కుమార్‌తో కలిసి పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, తాగునీరు, మజ్జిగ, పాలు సరఫరా పాయింట్లను పరిశీలించారు. మహాశివరాత్రి రోజున తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులకు సాధారణ దర్శనాలు అందుబాటులోకి రావాలన్నారు. ప్రతి భక్తుడికి స్వామివారి దర్శనం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, వీఐపీలు స్వామి వారి దర్శనానికి వచ్చిన సమయంలో తగు ఏర్పాటు చేయాలని ఆలయ ఉప కమిషనర్‌ గోగినేని లీలాకుమార్‌కు సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని ఆర్‌జేసీ సూచించారు.

అడుగడుగునా పోలీస్‌ ఆంక్షలు

- ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు
- ఇద్దరు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు సహా కానిస్టేబుళ్లు బందోబస్తు
- డ్రోన్‌ కెమెరాలు, ప్రత్యేక పోలీసు బలగాలతో పహారా
- ఇలా చేసి ఉంటే అంబటి ఇంటిపై దాడే జరిగేది కాదంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పార్టీ కార్యకర్తలు, అభిమానులు హైవేపైకి రాకుండా అడ్డుగా నిలుచున్న పోలీసులు

ప్రత్తిపాడు/ గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పర్యటనలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్‌ మండలం బొంతపాడు వై జంక్షన్‌ వద్ద డీఎస్పీలు భానూదయ, అరవింద్‌లతోపాటు సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, రోప్‌ పార్టీలు, ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. డ్రోన్‌ కెమెరాలతో పర్యటనపై డేగ కన్ను వేశారు.

- హైవేపై నుండి సర్వీసు రోడ్డులోనికి వచ్చే వాహనాలను పోలీసులు ట్రాఫిక్‌ మళ్లించలేదు. దీంతో వందల సంఖ్యలో జనం గుమిగూడిన సర్వీసు రోడ్డులోనికే వాహనాలు వచ్చాయి. రోడ్డుకు ఒక వైపే నిలబడాలని, వాహనాలకు దారి ఇవ్వాలని పదే పదే పోలీసులు సూచించడంతో ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ క్యాడర్‌ను పక్కకు నెడుతూ రూట్‌ క్లియర్‌ చేయాల్సి వచ్చింది.
- మైకులో కార్యకర్తలకు చెబుతాం.. కనీసం మైక్‌ ఇవ్వాలని ముఖ్య నాయకులు అడిగినా పోలీసులు నిరాకరించారు.
- వై జంక్షన్‌ వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి కాన్వాయ్‌లోని వాహనాలు సర్వీసు రోడ్డులోనికి రాకుండా, జగన్‌ కాన్వాయ్‌ వెంట సర్వీస్‌ రోడ్డులోకి వెళ్లకుండా పోలీసులు నేరుగా హైవేపైకి పంపారు. ఇందుకోసం ఏకంగా డీఎస్పీలే రంగంలోనికి దిగారు.

ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ కార్యాలయం ఎదుట పోలీసుల వాహన తనిఖీ

- పోలీసులు ఇంత పెద్ద ఎత్తున మోహరించినా కార్యకర్తలు మాత్రం రెట్టించిన ఉత్సాహంతో హైవేపైకి విడతల వారీగా దూసుకెళ్లారు. వారిని పోలీసులు వెనక్కు తీసుకువచ్చేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది.

పోలీసుల అత్యుత్సాహం

- వైఎస్‌ జగన్‌ గుంటూరు పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. హైవేలో సైతం బారికేడ్లను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకున్నారు. ముఖ్యంగా కార్లు, ద్విచక్రవాహనాలను హైవే పైనుంచి సర్వీస్‌ రోడ్డుపైకి రాకుండా బారికేడ్ల వద్ద అడ్డుకుని హైవే పైనే వెళ్లాలని నెట్టివేశారు. జగనన్న కాన్వాయ్‌తోపాటు కేవలం పదుల సంఖ్యలో మాత్రమే వాహనాలను పంపారు. ఇదే క్రమంలో దారిలో వస్తున్న కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ సింబల్స్‌ ఉన్న వాహనాలను అడ్డుకుని తనిఖీలు చేసి దారి మళ్లించారు.
- ఒక పక్క జగనన్న వస్తున్నాడని తెలిసి పోలీసులు ఏటుకూరు బైపాస్‌లో అత్యుత్సాహం ప్రదర్శించారు. రోడ్డుపై వస్తున్న వాహనాలకు తనిఖీలు చేశారు. అధికార పార్టీ నాయకులు, పైనుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం చేస్తున్నామని కొందరు పోలీసులు చెప్పకనే చెప్పారు.
- అడుగడుగునా పోలీసులు అడ్డుకుంటున్నా వైఎస్సార్‌సీపీ, జగనన్న అభిమానులు మాత్రం లెక్క చేయలేదు. పోలీసులు ఆపిన చోట ఆగి మరో దారిలో జగనన్న కాన్వాయ్‌ను అనుసరించారు. మరికొందరైతే పోలీసులను, బ్యారికేడ్లను సైతం నెట్టుకుంటూ జగనన్న కోసం పరుగులు పెట్టారు. అధికార పార్టీ ఆంక్షలు, పోలీసులు అత్యుత్సాహం జగనన్నపై ఉన్న అభిమానం ముందు తెల్లబోయిందని పోలీసులే బాహాటంగా చర్చించుకోవటం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని రేపింది.

గాయపడిన కార్యకర్తకు జగన్‌ భరోసా

బలసాని కార్యాలయం వద్ద బాధితుడు అశోక్‌ కారు

కారును, బాధితుడిని అంబటి నివాసానికి తీసుకురావాలని చెబుతున్న జగనన్న

గుంటూరు రూరల్: శనివారం రాత్రి విద్యానగర్‌లోని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నివాసం వద్ద టీడీపీ గూండాలు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ప్రత్తిపాడు నియోజకవర్గం బీసీ విభాగం అధ్యక్షుడు దారం అశోక్‌యాదవ్‌ను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. అశోక్‌ వివరాలు తీసుకున్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి అండగా ఉంటానని జగనన్న భరోసా ఇచ్చారు.

అంబులెన్స్‌కు స్వచ్ఛందంగా దారిచ్చిన శ్రేణులు

మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలోకి రానుండగా.. స్వాగతం పలికేందుకు ఏటుకూరు బైపాస్‌లో వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, అశేష జనసందోహం ఆయన రాకకోసం ఎదురు చూస్తున్నారు.. ఈక్రమంలో జాతీయ రహదారి నుంచి గుంటూరు నగరంలోకి వెళుతున్న అంబులన్స్‌ రావడంతో అంతా అడ్డుతొలగి.. స్వచ్ఛందంగా దారి ఇచ్చారు.

జీజీహెచ్‌కు కార్డియాలజీ పరికరాల అందజేత



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌ గుండె జబ్బుల వైద్య విభాగానికి స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ కింద అధునాతన కార్డియాలజీ పరికరాల కొనుగోలుకు నిధులు అందజేశారు. బుధవారం రాజధాని ప్రాంతంలో సుమారు రూ.నాలుగు కోట్లు చెక్కు రూపంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ యశస్వి రమణకు రాంకీ ఎన్జీఓ, ఎస్‌బీఐ చైర్మన్‌ చల్లా శ్రీనివాసులుశెట్టి అందజేశారు.

పత్రికా ప్రకటన

S.M.R.M High School, నగరం, నగరం మండలం, బాపట్ల జిల్లా నందు ఖాళీగా వున్న ఎయిడెడ్ తెలుగు పండిట్ గ్రేడ్-1 ... O.C 1/100 ... R.J.D. గుంటూరు వారు అనుమతి మంజూరు చేసియున్నారు.

ఈ నేపథ్యములో పాఠశాల Secretary & Correspondent ... Grade-1 తెలుగు పండిట్ (O.C) 1/100 ... [illegible] ... https://cse.ap.gov.in/aidedrecruitmentnotifications ... ది.25-02-2026 లోగా దరఖాస్తు చేసుకోవలెను. ... DEO పోర్టల్ నందు ... [illegible]

గమనిక:- 1) ... G.O.M.S. No.58, Dt: 22-6-2023 ... [illegible]

Secretary & Corrspondent
S.M.R.M High School, Nagaram.
Nagaram Mandal, Bapatla District. Pin-522268

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	96,415
అమ్మకాలు	94,351
నిల్వ	22,466

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు–5	13,500–23,000
341	14,000–26,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–21,500
నంబరు–5	13,000–21,500
341	14,500–22,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 20,500
బాడిగ–355	14,000 – 25000
దేవనూరు డీలక్స్	15,500 – 27,000
ఆర్మూర్	12,500 – 17,500
తాలుకాయలు	8,000 – 12,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ – 355	14,000–23,500
తాలు	8,000 – 11,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **881**

కొమ్ములు : **533** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,950	13,325	13,300

కాయలు : **392** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,150	12,900	12,825

మొత్తం అమ్మకాలు : **660.75** క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

అక్షర ఆంధ్ర కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో అక్షర ఆంధ్రా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అక్షర ఆంధ్రా క్రింద శిక్షణ పొందుతున్న వయోజనుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, రానున్న పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. పటిష్ట పర్యవేక్షణ ఉండాలని, కేంద్రంలో అభ్యసిస్తున్న ప్రతీ ఒక్కరూ చక్కని చదవడం, రాయడం రావాలని ఆదేశించారు. అక్షర ఆంధ్రాలో గుంటూరు జిల్లా ఆదర్శంగా నిలవాలని సూచించారు. తమ కేంద్రంలో 140 మంది శిక్షణ పొందుతున్నారని, మండలంలో 4100 మంది అక్షర ఆంధ్రా కార్యక్రమంలో ఉన్నారని అక్షర ఆంధ్రా పర్యవేక్షకులు దాసరి వెంకటస్వామి వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామని. డ్వాక్రా, ఉపాధి హామీ సభ్యులు ఇందులో అభ్యాసకులుగా, అక్షరాస్యులుగా ఉన్న సభ్యులు వాలంటీర్లుగా ఒక్కొక్కరు 10 మందికి బోధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కె శిల్ప పాల్గొన్నారు.

పిన్నెల్లిలో హింసను రూపుమాపేందుకు చర్యలు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ జవహర్

నరసరావుపేట: పిన్నెల్లి ఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ బుధవారం మున్సిపల్ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గ్రామ ప్రజలు శాంతిని బలంగా కోరుకుంటున్నారని, పోలీసులు, ప్రజలు, అధికారుల సహకారంతో హింసను రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ బి.కృష్ణారావు, డీఆర్వో నారద ముని, ఆర్డీవో మురళీకృష్ణ, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాల్మన్ హత్య బాధాకరం

గురజాల నియోజకవర్గం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జరిగిన మందా సాల్మన్ హత్య చాలా దురదృష్టకరం, బాధాకరమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్.జవహర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘటనలో దాడిచేసిన వారు, దాడికి గురైన వారు ఇరువురూ దళితులే అన్నారు. ప్రాణం పోయింది దళితుడిది కాబట్టి తమ కమిషన్‌కు బాధ్యత ఉందన్నారు. చాలా పారదర్శకంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో నిజనిర్ధారణకు ఒక కమిటీని వేశామని, వీరు బాధితులతోపాటు మిగిలిన వారి నుంచి సమాచారం సేకరించి ఒక నివేదికను తయారుచేశారని చెప్పారు.

బారికేడ్లను అడ్డంగా పెట్టి నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

టెలిఫోన్ స్తంభం ఎక్కిన ఓ అభిమాని

ఉప్పొంగిన
అభిమాన సంద్రం

- అంబటి ఇంటి దగ్గర జన కోలాహలం
- మాజీ సీఎం వైఎస్ జగన్ కోసం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూపులు
- పోలీసుల బారికేడ్లను దాటుకుని వచ్చిన అభిమానం

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు పర్యటనలో అభిమాన జన సందోహం ఉరకలెత్తింది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బుధవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యలయం నుంచి బయల్దేరినప్పటి నుంచి గుంటూరు సిద్దార్థ నగర్‌లోని అంబటి నివాసం వద్ద రోడ్లన్నీ అభిమానుల కోలాహలంతో నిండిపోయాయి. టీడీపీ రౌడీమూకల దాడితో ధ్వంసమైన అంబటి రాంబాబు నివాసం, కార్యాలయాన్ని పరిశీలించి, ఆయన కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, తానున్నానని భరోసా ఇచ్చేందుకు వస్తున్న తమ అభిమాన నేత వైఎస్ జగన్‌ను చూసేందుకు అభిమానులు వేలాదిగా చేరుకున్నారు.

ఆంక్షల చట్రాలు దాటుకుని..

ఉదయం 10 గంటల నుంచి అంబటి నివాసం దగ్గరకు వస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులను పోలీసులు బారికేడ్లను అడ్డంగా పెట్టి అడ్డుకున్నారు. సిద్ధార్థ నగర్‌కు వెళ్లే అన్ని రహదారులను మూసి వేసి, బారికేడ్లను అడ్డంగా పెట్టిన పోలీసులు అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వస్తున్న నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని అంబటి ఇంటికి వెళ్లనీయకుండా ఆపివేశారు. గుంటూరు నగరంలోకి ప్రవేశించిన వైఎస్ జగన్ కాన్వాయ్‌కు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో చుట్టుగుంట సెంటర్ నుంచి అంబటి రాంబాబు నివాసానికి వచ్చేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. వైఎస్ జగన్ రాక కోసం వేయికళ్లతో ఎదురు చూసిన అభిమానులు ఆయన వచ్చీ రావడంతోనే పోలీసుల బారికేడ్లను దాటుకుని వచ్చారు. అంబటి రాంబాబు నివాసంతో పాటు చుట్టుపక్కల వాళ్ల ఇంటి గోడలపైకి ఎక్కి తమ అభిమాన నేతను కనులారా చూశారు. అంబటి ఇంటిపైకి ఎక్కిన అభిమానులను చూసిన వైఎస్ జగన్ అభివాదం చేయడంతో పులకించిపోయారు. అంబటి రాంబాబు ఇంటికి సమీపంలోని ఇళ్లలోని ప్రజలు తమ డాబాలపైకి ఎక్కి వైఎస్ జగన్‌ను చూశారు. అంబటి ఇంటి వద్ద చెట్లు, గోడలు, మిద్దెలు ఎక్కిన అభిమానులు సీఎం, సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు.

వైఎస్ జగన్‌ను చూసేందుకు అంబటి రాంబాబు ఇంటిపైకి ఎక్కిన అభిమానులు

రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోంది

ధ్వజమెత్తిన పోతిన మహేష్, నందిగం సురేష్, బలసాని కిరణ్

ప్రత్తిపాడు: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలన అత్యంత దుర్మార్గంగా ఉందని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పెట్టిన పోలీసుల్లో సగం మందిని ఆనాడు మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి వద్ద పెట్టినా అసలు ఘటన జరిగి ఉండేది కాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరురూరల్ మండలం బొంతపాడు వై.జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్ 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రుల మీద అక్రమంగా కేసులు బనాయించి లోపల వేసి, పగ, ప్రతీకారాలు తీర్చుకుంటూ రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్న నారా లోకేష్ ఇప్పటికైనా కళ్లు తెరవాలని మండిపడ్డారు. గత వారం రోజుల నుంచి ముగ్గురు మాజీ మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీల మీద జరుగుతున్న దాడులను చూసి దేశమంతా నివ్వెరపోయి చూస్తుందన్నారు. రాష్ట్రంలో రాళ్లు విసరడం, బాదులు పట్టుకుని కొట్టడం వంటి కొత్త సంస్కృతి వచ్చిందన్నారు. కొత్తగా యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా.. నేతల ఇళ్లపై పెట్రోలు బాంబులు విసరడం, దాడులు చేయడం వంటి పనులు నేర్పించారని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ ప్రశ్నించే గొంతుక కాదని, కూటమిలో చేరిన తరువాత ప్రశ్నించడం మరిచిపోయారని విమర్శించారు.

లోకేష్‌కు కళ్లు నెత్తికొచ్చాయి..

కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లుగా.. లోకేష్ అధికారం చేపట్టే సరికి కళ్లు నెత్తికొచ్చాయని మాజీ ఎంపీ నందిగం సురేష్ తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. అధికార మదంతో రెచ్చిపోతున్నారన్నారు. ఎలాగు వచ్చే ఎన్నికల్లో గెలవమని తెలుసు కాబట్టే.. కూటమి నేతలు అవసరం ఉన్నంతవరకు పోగేద్దాం.. కొడదాం .. తిడదాం.. నరుకుదాం, చంపుదాం, అన్న కాన్సెప్ట్‌లో ముందుకు వెళుతున్నారని మండిపడ్డారు. అణిచివేత నుంచి ప్రభంజనం ఎలా ఉంటుందనేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిదర్శనమన్నారు.

ఏడు గంటలపాటు నిర్బంధించి, విధ్వంసం సృష్టించి..

టీడీపీ గూండాలు అంబటి కుటుంబాన్ని ఏడు గంటలపాటు నిర్బంధించి, విధ్వంసం సృష్టించి, భయభ్రాంతులకు గురి చేసినప్పుడు ఈ పోలీసులంతా ఏమయ్యారని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. పక్కనే డీజీపీ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం ఉన్నా గుంటూరు నగర చరిత్రలో జరగని విధంగా అంబటి కుటుంబంపై దాడి చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనకు వస్తే సెక్షన్లు గుర్తుకొస్తాయి.. ఆంక్షలు పుట్టుకొస్తున్నాయి.. మరి ఆనాడు అంబటి ఇంటి దగ్గర టీడీపీ గూండాలు దాడులు చేసే సమయంలో సెక్షన్లు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. టీడీపీ గూండాలు, నాయకులు కర్రలతో నిలుచుంటే పోలీసులు చూస్తూ ఉండిపోయారని విమర్శలు గుప్పించారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్-2కే26

- జాతీయ స్థాయిలో 80 అంశాల్లో పోటీలు
- విజేతలకు రూ.15 లక్షలకు పైగా నగదు బహుమతులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయస్థాయిలో నిర్వహించనున్న యూత్ ఫెస్టివల్ విజ్ఞాన్ మహోత్సవ్–2కే26కు సన్నాహాలు పూర్తయ్యాయని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం జరిగే ప్రారంభ వేడుకలకు ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. 7వ తేదీన జరిగే ముగింపు వేడుకలకు 2025 ఏసియన్ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్, భారత హెప్టాత్లెట్ నందిని అగసారా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ప్రకటించారు. మహోత్సవ్‌లో రెండో రోజున ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం, మూడో రోజున ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ దీక్షిత్ శెట్టి సందడి చేస్తారని వెల్లడించారు.

విజ్ఞాన్ మహోత్సవ్ 2కే26 సన్నాహాలు

విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మందికి పైగా విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. పోటీల విజేతలకు మొత్తం రూ.15 లక్షలకు పైగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో మొత్తం 80కు పైగా ఈవెంట్లు నిర్వహించనున్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ కేవలం పోటీలకే పరిమితం కాకుండా, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే మహా వేదికగా నిలుస్తుందని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల 'వంట–వార్పు'

ఏడోరోజు వినూత్న నిరసన తెల్పిన ఉద్యోగులు

కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రామయ్య, వెంకటేశ్వరరావు, రఘురామ్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోని శ్యామలానగర్‌లో గల రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన, వంట–వార్పు కార్యక్రమం ఏడవ రోజుకు చేరుకుంది. బుధవారం ఉమ్మడి శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పీఏసీఎస్‌ల ఉద్యోగులు పాల్గన్నారు. ప్లకార్డులు చేతబట్టి రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్పందించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు నిరసన, వంట వార్పు కార్యక్రమం, 13వ తేదీన కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయాల ముట్టడి, కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోతే, 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల రాష్ట్ర నాయకులు తోట వెంకట రామయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, బి.రఘురామ్, ఎస్.ఖాజామొహిద్దీన్, జీబీ రంగనాథ్, యెర్నేని పాపినాయుడు, ఎం.సత్యనారాయణ, పి.విజయభాస్కర్, పి.కృష్ణశాస్త్రి, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబటి రాంబాబు బెయిల్ పిటిషన్‌పై నేడు వాదనలు

గుంటూరు లీగల్: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం స్పెషల్ మొబైల్ కోర్టులో వాదనలు వినిపించనున్నారు. ఈనేపథ్యంలో పోలీసులు తీసుకున్న చర్యలపై న్యాయవాదులు, లీగల్ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

7న క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన

తాడికొండ: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పనున్న క్వాంటం వ్యాలీకి శంకుస్థాపనకు జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాలు బుధవారం పరిశీలించారు. ఉద్దండరాయునిపాలెం వద్ద స్థల పరిశీలన చేసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ భార్గవతేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌టిజీఎస్ అధికారులు ప్రకార్ జైన్, గీతాంజలి శర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి కె శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి కోమలి పద్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. ప్రేక్షకుల ఈలలు, కేరింతలతో ఎడ్ల యజమానులను ఉత్సాహపరిచారు. మంగళవారం రాత్రి ఆరు పళ్ల విభాగంలో పోటీలు పూర్తయ్యాయి. మొత్తం ఎనిమిది జతలు పాల్గొనగా గుంటూరు జిల్లా, పెదకాకాని ఆలా రాజేష్ యాదవ్, ఖాదర్ మస్తాన్‌కు చెందిన ఏఆర్‌వై అండ్ ఎంకేఎం బుల్స్ 3,500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ప్రత్తిపాడు పమిడి అంజయ్యచౌదరి ఎడ్ల జత 3,396 అడుగుల దూరంలాగి రెండో స్థానం, నరసరావుపేట మండలం రావిపాడు వై మనోజ్‌చౌదరి ఎడ్ల జత 3250 అడుగుల దూరం లాగి మూడోస్థానంలో నిలిచాయి.

న్యూకేటగిరి విభాగంలో...

బుధవారం ఉదయం న్యూకేటగిరి విభాగంలో హోరాహోరీగా జరిగిన పోటీల్లో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామ సర్పంచ్ మంగు రమాదేవి, ఏడుకొండలు ఎడ్ల జత 4,783 అడుగుల దూరం లాగి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

మెడికల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

- ప్రతి ఒక్కరూ సందర్శించి అవగాహన పెంచుకోవాలి
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మెడికల్ ఎగ్జిబిషను తిలకిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, మాధవి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో 30 సంవత్సరాల తరువాత ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో ప్రతి ఒక్కరికి శరీర అవయవాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన ఏర్పడడంతోపాటు, అనారోగ్యం బారిన పడకుండా ఎలా ఉండాలో కూడా తెలుస్తుందన్నారు. భవిష్యత్తులో వైద్య వృత్తిలోకి పిల్లలు వచ్చేందుకు ఎగ్జిబిషన్ ప్రేరణ ఇస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా వీక్షించాలన్నారు. గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ వైద్య విభాగంలో స్పెసిమెన్స్ ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఈ ఎగ్జిబిషన్‌ను వీక్షించడం ద్వారా పలు విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఇతర బోధనా సిబ్బందిని మంత్రి అభినందించారు.

జింకానా దేశానికే ఆదర్శం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు జింకానా పేరుతో మాతృ సంస్థ అభివృద్ధికి సేవలు చేస్తున్నారని, జింకానా దేశానికే ఆదర్శమని మంత్రి సత్యకుమార్ చెప్పారు. పూర్వ విద్యార్థులు అంకిత భావంతో కళాశాలకు చేస్తున్న సేవ ఎంతో విలువైనదని, అలాంటి గుంటూరు వైద్య కళాశాల ఏపీకే గర్వకారణమన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టాలి

ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది క్యాన్సర్ బారిన పడి ప్రతి రోజూ మరణిస్తున్నారని, క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టేలా ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు చేస్తున్న సేవల గురించి మీడియాకు వివరించారు. గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో ట్రస్టు సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో ఉచిత క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నట్లు వెల్లడించారు. తొలుత మంత్రి ఎగ్జిబిషన్‌ను గంటకు పైగా తిలకించారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వి. సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, పలు వైద్య విభాగాధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భంలో ఉండే శిశువు

అస్థి పంజరానికి చీరకట్టి స్త్రీ లాగా అలంకరించి స్వాగతం పలికిస్తున్న దృశ్యం

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ITR/ Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి. 7406393937.

BABY CARE CENTER

■ సంతోష్ బేబీకేర్ సెంటర్ 4 నెలల నుండి 4 సం॥ వరకు మీ పాప/ బాబులను జాగ్రత్తగా చూడబడును. 2వ లైను అంకమ్మనగర్, గుంటూరు. 8686209090, 8686309090

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥ ✆ 87907 41166

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368

WANTED

■ మాచర్ల, పిడుగురాళ్ళ, వినుకొండ, నర్సరావుపేట, సత్తెనపల్లి, గురజాల లలో మెడికల్స్ డెలివరీ చేయుటకు P/F, F/T కావలెను. సంప్ర: 8340855728, 7730997214

■ గుంటూరు హాస్పిటల్ నందు ఆయా కావలెను. ANM, GNM, నర్సింగ్ అనుభవం కలిగిన స్టాఫ్ మరియు ఇంగ్లీష్‌లో O.P రాయగలిగిన లేడి రిసెప్షనిస్ట్ లోకల్ వారు కావలెను. 7997777108

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు క్యాంపస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ అడ్మిన్ ప్రిన్సిపల్ మరియు అసిస్టెంట్ అకడమిక్ ప్రిన్సిపల్ గా పని చేయుటకు వివాహితులైన పురుషులు కావలెను. జీతము: 20000/- నుండి 30000/- వరకు విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు, వయస్సు: 25 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరములకు సంప్రదించగలరు. ఫోన నెంబర్: 92487 33324

■ గుంటూరులోని ఆఫీసు నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ & మార్కెటింగ్ చేయుటకు యువకులు కావలెను. జీతం+ కమీషన్. సంప్ర:9048139680, 8978974673

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ గుంటూరు సిటిలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ Saripudi Suzuki is hiring for the following positions: Workshop Manager, MIS executives, System Operators, CRM, CRE & Service Advisors. Both experienced & Freshers can apply. Interview Dt: 10-02-2026, Loc: Guntur. 7799960199,149.

■ గుంటూరులో ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు వైద్య పరిజ్ఞానము గల కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్ : 99083 38379

■ సేల్స్‌మెన్స్ కావలెను. జీ: 18వేలు + కమీషన్ అ: 10th, ఆసక్తి, అనుభవం గలవారు సంప్ర: 98484 14482 శివ కిషోర్ ఇండస్ట్రీస్, మార్వాడి గుడి ఎదురు సందు తెనాలి.

■ రేపల్లె సజ్జావారిపాలెం భారతి పెట్రోల్ బంకులో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. పని నేర్పించి వసతి + జీతం ఇవ్వబడును. 92461 64672

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను.ఫ్రీవసతి భోజనం.జీ: 20K. Ph:9912011499, 9912011899

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్ 9640729906

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 16,000 to 24,000, రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

■ Vishal Singh Bais Security Agency Required Ex-servicemen Gunmen with Gun and License to work at PGCIL Chilakaluripeta on DGR Minimum Wages C city, Interested persons Cont : 9246812289, 9246812250

సాక్షి క్లాసిఫైడ్స్

రూ. 475/- మాత్రమే

ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే

గుంటూరు

7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

ఇంటిపన్ను వసూలుపై సమీక్ష

దుగ్గిరాల: మండలంలోని పలు గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు, శృంగారపురం, పెనుమూలి గ్రామాల్లో ఇంటిపన్నుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరగా పన్ను వసూలు చేయాలని.. విధిగా ప్రతి ఒక్కరికి రసీదు అందించాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూఎఫ్ఎస్ సర్వే పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఇంటింటికి నిర్వహిస్తున్న యూనిటైడ్ ఫ్యామిలీ సర్వే(యూఎఫ్ఎస్)ను బుధవారం ఎంపీడీవో పి.శివ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. క్లస్టర్ వారీగా సచివాలయ సిబ్బంది నిర్వహించే సర్వే పరిశీలించి ప్రజలకు దీని గురించి వివరించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సర్వే వేగవంతంగా నిర్వహించేలా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి, టీమ్‌లుగా విభజించి తగిన సూచనలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

దుగ్గిరాల: విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి కష్టపడి చదవాలని పద్మాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చుండూరు భాస్కరరావు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆయన పరీక్ష ప్యాడ్లు, పెన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బీవీ కృష్ణారావు, విద్యార్థులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

మురుగు కాలువలో చెత్తాచెదారాల తిష్ఠ!

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి సలాం సెంటర్‌లోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం తిష్ఠ వేసింది. దీంతో మురుగు ముందుకు వెళ్లే మార్గం లేక దుర్గంధాన్ని వ్యాపిస్తోంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్త వల్ల స్థానిక పరిసరాలు అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తీవ్రమైన దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ మొత్తం ప్లాస్టిక్, చెత్తాచెదారంతో నిండిపోయి ఉందని.. అధికారులు స్పందించి డ్రెయినేజీలోని చెత్తాచెదారాలను తొలగించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కార్మికుల కష్టాలను తీర్చాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను మంత్రి నారా లోకేష్ తీర్చాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. బుధవారం బ్రహ్మానందపురంలో కార్మికులు చేస్తున్న దీక్షలను నాయకులు నాగేశ్వరరావు, గురవయ్య, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. 428 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. లక్ష్మమ్మ, రమణమ్మ, సువర్ణకుమారి, శారద, రిబ్కా, నాయకులు అంకయ్య, సుబ్బారావు, సూర్యప్రకాష్, ఇస్మాయిల్, నాగమల్లేశ్వరి, శివకుమారి, కాసమ్మ, శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై టాస్క్‌ఫోర్సు దాడి

ఫిరంగిపురం: మండలంలోని 113.తాళ్లూరు గ్రామ శివారులో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. 113.తాళ్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం గుంటూరు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.90,620 నగదు, 6 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా మండలంలో విస్తృతంగా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నా పోలీసుల నిఘా కరువైందని ప్రజలు చెబుతున్నారు. దాడుల్లో దొరికిన నిందితులను స్థల 'మామూళ్లు'గా వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడుగడుగున జననీరాజనం!

వైఎస్ జగన్ గుంటూరు పర్యటనకు సంఘీభావంగా తరలి వచ్చిన ప్రజలు

వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలియజేసేందుకు ప్రాతూరు రోడ్డు వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ గూండాలు దాడిచేసి ఆయనపై అక్రమ కేసు పెట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు గుంటూరు బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఆకురాతి రాజేష్, అమరా నాగయ్య, నాలి వెంకటకృష్ణ, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్యల పిలుపు మేరకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ జగన్ అభిమానులు భారీగా తాడేపల్లికి తరలివచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి ఉదయం 9.38 గంటలకు బయలుదేరగా.. అక్కడి నుంచి తాడేపల్లి రూరల్‌లోని జాతీయ రహదారి వెంబడి ప్రాతూరు అండర్‌పాస్ వద్దకు రావడానికి 10.08 గంటల సమయం అయ్యింది. ప్రాతూరు రోడ్డులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం వేచియున్న వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, వీఎం రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అధినాయకుడిపై పూలవర్షం..

వైఎస్ జగన్ కాన్వాయ్ ప్రాతూరు రోడ్డుకు చేరుకోవడంతో ఒక్కసారిగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పూలవర్షం కురిపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ దిగి ప్రజలకు అభివాదం తెలియజేశారు. సుమారు 10 నిమిషాల పాటు అక్కడ సమయం వెచ్చించారు. అక్కడి నుంచి కాన్వాయ్ 16వ నంబరు జాతీయ రహదారి ఎక్కాల్సి ఉంది. ఆ సమయంలో వైఎస్ జగన్ వాహనాన్ని ముందుకు పంపించి కొంతసేపు పోలీసులు బారికేడ్లు పెట్టి ఒక్కొక్క వాహనాన్ని పంపించారు. అప్పటికే 16వ నంబరు జాతీయ రహదారిపై వైఎస్ జగన్ అభిమానులు భారీగా వచ్చారు. ఆయన కాన్వాయ్ వెంబడి వందలాది కార్లు, బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. జాతీయ రహదారిపై వస్తున్న వైఎస్ జగన్‌కు కొలనుకొండ, వడ్డేశ్వరం, రాధా రంగా నగర్, రత్నాల చెరువు, చినకాకాని, కాజా ప్రాంతాల్లో ప్రజలు స్వాగతం పలికారు.

ప్రజలకు అభివాదం..

టోలుగేటు దాటగానే యూనివర్సిటీ విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు రోడ్డుపై భారీగా నిలబడడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారుపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. జగనన్న కాన్వాయ్, వాహనాలను ఆపేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేసినా ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తిరిగి కాన్వాయ్‌ను అనుసరించారు. కాజా టోల్‌గేటు వద్ద జగన్ కాన్వాయ్ వెంబడి వచ్చేవారిని మంగళగిరి పోలీసులు డ్రోన్ కెమెరాలో చిత్రించారు. టోలుగేటు వద్ద అన్ని గేట్ల నుంచి వాహనాలను వెళ్లనీయకుండా రూరల్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. ఒక గేటులో నుంచి వాహనాలను పంపడంతో వైఎస్సార్ సీపీ అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘీభావ ర్యాలీలో నియోజకవర్గ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కోసం వేచిచూస్తున్న మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

చేనేత గర్జనను జయప్రదం చేయాలి

మగ్గాల షెడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ నాయకులు

మంగళగిరి టౌన్: చేనేతల న్యాయమైన డిమాండ్ల కోసం వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగే చేనేత గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో గల మగ్గాల షెడ్డుల్లో బుధవారం కమిటీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు చేనేత కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీన జరిగే చలో మంగళగిరి చేనేత గర్జన కార్యక్రమం ఎన్ఆర్ఐ వై జంక్షన వద్ద ఉన్న నేతన్న సర్కిల్ నుంచి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ గాలిగోపురం వరకు ప్రదర్శన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాధం పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, స్థానిక నాయకులు పరమేశ్వరరావు, నందం సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ ఏవీ బ్రహ్మం

మంగళగిరి టౌన్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపరచి మత్తును తరిమేద్దామని మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్‌కాలనీ, ఎంటీఎంసీ హైస్కూల్‌లో బుధవారం 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐ బ్రహ్మం మాట్లాడుతూ.. వ్యసనాలకు డబ్బులు ఖర్చు చేస్తూ మద్యం, మత్తు కలిగించే వాటి పట్ల యువత ఆకర్షితులు అవుతూ పక్కదారి పడుతున్నారన్నారు. వీటిని నియంత్రించే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. అక్రమంగా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నా, కలిగియున్నా, విక్రయిస్తున్నా వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, స్థానిక టీడీపీ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలబాలికలు బాధ్యత కలిగి ఉండాలి

బాలల పార్లమెంట్ సభ్యులతో సిస్టర్ విద్య

తాడేపల్లి రూరల్: బాలబాలికలు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్య పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ ఉండవల్లిలోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో బాబు జగ్జీవనరావు బాలల పార్లమెంట్ గ్రూప్ చిన్నారులతో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విద్య మాట్లాడుతూ.. బాలబాలికలు చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని సూచించారు. సమాజం పట్ల అవగాహన పెంచుకుని సమాజంలోని సమస్యలను గుర్తించి స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వివరించారు. బాబు జగ్జీవనరావు బాలల పార్లమెంట్ గ్రూపు పిల్లలకు వారి విధులు, బాధ్యతలను తెలియజేశారు. కార్యక్రమంలో 48 మంది బాలబాలికలు, గ్రామ హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, అనిల్‌కుమార్, స్థానిక అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రమేణా పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

మేరికపూడిలో మాట్లాడుతున్న సీహెచ్‌వో వెంకటలక్ష్మి

దుగ్గిరాల: క్యాన్సర్ అనేది భయంకర వ్యాధి కాదని.. ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం కాగలదని దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ ఇందిర అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఆమె మాట్లాడారు. సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం.. జీవన శైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. దీనిలో క్యాన్సర్ కేసులు కూడా ఎక్కువ నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.సునీత, వి.సుబ్బారావు, విజయ్, ఆలీఖాన్, శ్రీనివాసరావు, బుజ్జి, ఆశా కార్యకర్తల పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు క్యాన్సర్‌పై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. సీహెచ్‌వో ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని అడ్డుకోవడం అసాధ్యం కాదని చెప్పారు. మంచి జీవన విధానం, ఆహారం మార్పు ద్వారా మాత్రమే క్యాన్సర్ దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు. ముందస్తు పరీక్షలు, సరైన సమయంలో చికిత్స చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఒ.లింగరాజు యాదవ్, ఏఎన్‌ఎం దేవకృప, ఆశాలు అరుణ, అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రామచంద్రమూర్తి

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యులు సింధూ కిలారు, ఫణి రాజ్‌కుమార్, ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ కె.రామచంద్రమూర్తి తెలిపారు. నగర పరిధిలోని ఆక్టోపస్ క్యాంపస్‌లో బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆక్టోపస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆక్టోపస్ ఆపరేషన్ ఐజీపీలు సీహెచ్ శ్రీకాంత్, ఎస్.సెంథిల్ కుమార్ ఉత్తర్వుల మేరకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారిన జీవన శైలి, పలు ఆహారపు అలవాట్ల వల్ల పురుషులు, మహిళలు లింగభేదం లేకుండా క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారన్నారు. క్యాన్సర్ నివారణ కేవలం స్క్రీనింగ్‌తోకే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీలు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, కమాండోలు, మినిస్ట్రీయస్ స్టాఫ్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: ఈనెల 12వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ ప్రాతూరులో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చిందని మండిపడ్డారు. కార్మికుల పొట్టగొట్టే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ మరియదాసు, మేకల డేవిడ్, సుధాకర్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

మంగళగిరి టౌన్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి అన్నారు. మంగళగిరి పట్టణంలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో వివిధ సంఘాలు, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ జీవిత చరిత్ర 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ప్రదర్శించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ జీవిత చరిత్రను నాటక రూపం ద్వారా ప్రదర్శించడం మంచి పరిణామమని, నేడు అంబేడ్కర్‌ను మరచిపోతున్న తరుణంలో ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తి నింపుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత సంఘాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ కారుమంచి రామారావు, వివిధ సంఘాల, పార్టీల నాయకులు నన్నపనేని నాగేశ్వరావు, జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ ఆలోచనలు స్ఫూర్తిదాయకం

ఉండవల్లి వీరయ్యను సత్కరిస్తున్న నాయకులు

తాడికొండ: సంత్ రవిదాస్ ఆలోచనలను సమాజం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంతేటి బ్రహ్మయ్య అన్నారు. శ్రీ సంత్ రవిదాస్ వారోత్సవాలలో భాగంగా బుధవారం తాడికొండ గ్రామంలో చెప్పులు కుట్టే ఉండవల్లి వీరయ్యను ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. వారణాసి సమీపంలో జన్మించిన సంత్ రవిదాస్ రామ భక్తుడని వివరించారు. తన తండ్రి చెప్పులు కుడుతూ జీవనం సాగించేవారని.. తండ్రి బాటలోనే ఆయన కూడా చిన్ననాటి నుంచి చెప్పులు కుడుతూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారని అన్నారు. హిందూ సాంప్రదాయాలను గౌరవిస్తూ నిష్టతో జీవనాన్ని సాగించిన రవిదాస్ గురించి యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ తాడికొండ మండల అధ్యక్షుడు బి.అశోక్, మైనార్టీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి షేక్ బిలాల్, యువ మోర్చా నాయకులు ఆరుద్ర గోపి, పార్టీ సీనియర్ నాయకులు సరిపుడి సాంబశివరావు, ఎస్సీ మోర్చా నాయకులు ప్రకాష్‌రావు, ఉండవల్లి నాగేశ్వరరావు, పులి ప్రభుదాస్, మహిళా మోర్చా నాయకురాలు కె.శ్రీదేవి, మైనార్టీ మోర్చా నాయకులు షేక్ సర్దార్, షేక్ శివబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ, జేసీ ఇతర అధికారులు

తాడికొండ: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు తెలిపారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపూడి గ్రామం, ఎంఎల్ఏ క్వార్టర్స్ నుంచి హైకోర్టు వైపు వెళ్లే రహదారిలో గల పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జేసీ అషుతోష్ శ్రీ వాత్సవ, ఎస్పీ ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమ ఏర్పాట్లను పోలీస్ అధికారులు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయాకి వివరించారు. సుమారు 6,000 మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీ నివారణ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ అమలు, ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాల కేటాయింపు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తగిన సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏటీవీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, తుళ్లూరు పోలీస్‌స్టేషన్ సీఐ మాతంగి శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

మంగళగిరి టౌన్: విద్యార్థులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మంగళగిరి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద బుధవారం తిరుపతి జిల్లా మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులపై దాడి, కిడ్నాప్ చేసిన ఘటనపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులపై ఆటవిక చర్యలకు పాల్పడ్డ కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల నుంచి అక్రమంగా రూ.26 కోట్లు వసూలు చేసి ఫీజులను చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ధనుష్, రాజ్‌కుమార్, బాలాజీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ఎల్‌వోసీ అందజేత

తాడేపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న తాడేపల్లి పట్టణానికి చెందిన వ్యక్తికి టీడీపీ నాయకులు బుధవారం ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. నులకపేట 13 వార్డుకు చెందిన అడ్డగట్ల చౌరయ్య అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.45 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)ని మంజూరు చేయించారని, ఆ మంజూరు పత్రాలను లబ్ధిదారుడికి అందజేశామని తెలిపారు. చౌరయ్య కుటుంబ సభ్యులు మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

దుగ్గిరాల: ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ.. ఈనెల 12, 13వ తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థులు మహిళలు, పురుషులకు వేరువేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్లమా ప్రిన్సిపల్ జీవన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

ఏపీలో జంగిల్ రాజ్‌పై ఫ్యాక్ట్ కమిటీ

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రహ్మణియన్ వెల్లడి
- ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకుని, దోషులపై చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ఆంధ్రప్రదేశ్‌లో మాజీ మంత్రుల ఇళ్లపై దాడి చేశారా.. అంటూ ఆగ్రహం

ఢిల్లీలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు, నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జంగిల్ రాజ్‌పై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆ రాష్ట్రంలో ఇంత దమన కాండ జరుగుతోందా.. మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు చేశారా.. అంటూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రహ్మణియన్ ఆరా తీశారు. దాడులకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, వార్తా పత్రికల క్లిప్పింగులు చూసి చలించిపోయారు. రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలపై సెక్షన్ 12 కింద ఫ్యాక్ట్ కమిటీ వేస్తామని చెప్పారు. దాడుల సమయాల్లో ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించిన తీరుపై మండిపడ్డారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి బృందంతో ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకుని, దోషులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏపీలో పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా ప్రశ్నించారు. ఇప్పుడు కూడా దళితులను వెలివేయడం అనేది క్షమించరాని నేరం అన్నారు. త్వరలో స్వయంగా తమ బృందమే రాష్ట్రంలో పర్యటిస్తుందని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జంగిల్ రాజ్‌కు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం బుధవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌సీఎస్‌సీలకు విన్నవించింది. చంద్రబాబు సీఎంగా అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులపై టీడీపీ మూకలు నిత్యం దాడులకు తెగబడుతున్నారని చెప్పింది. పట్టపగలు పెట్రోల్ బాంబులు, కత్తులు, రాడ్లతో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తుంటే.. అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని వివరించింది.

20 నెలలుగా అరాచకం

రాష్ట్రంలో 20 నెలలుగా చంద్రబాబు ప్రభుత్వం ఆటవిక పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ మండిపడింది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు, మహిళలు, సోషల్ మీడియా కార్యర్తలపై టీడీపీ గూండాలు చేస్తున్న ఆగడాలు, ఇటీవల దళిత కార్యకర్త సాల్మన్ హత్య, కాపు నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు, బీసీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌ల ఇళ్లపై దాడుల గురించి ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ కమిషన్‌లకు బుధవారం వేర్వేరుగా ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో చోటుచేసుకున్న ఘటనలన్నింటిపై ఫొటో, వీడియో ఆధారాలతో పాటు వార్తా కథనాలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్‌కు, ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాలకు అందజేసింది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మేడ రఘునాథ రెడ్డి, ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, డాక్టర్ మద్దిల గురుమూర్తి, డాక్టర్ గుమ్మా తనూజారాణి, మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు ఇజ్రాయేలు, అరుణ్‌కుమార్, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు తదితరులు రాష్ట్రంలోని పరిస్థితిని వివరించారు. 20 నెలల్లో 390 హత్యలు, 766 దాడులు జరిగాయని చెప్పారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఆటవిక రాజ్యపాలనను కట్టడి చేయాలని కోరారు. 'మా నాన్నను టీడీపీ రౌడీలు రాడ్లతో దాడి చేసి చంపేశారు. అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఇటువంటి సంఘటన ఏ కొడుకు ముందూ జరగకూడదు. మా నాన్నలా ఎవరికీ ఈ పరిస్థితి రాకూడదు' అని హత్యకు గురైన సాల్మన్ చిన్న కుమారుడు మందా ప్రవీణ్ వివరించారు. అనంతరం వీరంతా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

చంద్రబాబువి డైవర్షన్ పాలి'ట్రిక్స్'

- రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోంది. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కక్షతో చంద్రబాబు తన గూండాలతో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారు. దళిత నేత సాల్మన్‌ను కొట్టి చంపారు. వారికి ఓటు వేయకపోతే చంపేస్తారా? చంద్రబాబు డైవర్షన్ పాలి'ట్రిక్స్'లో ఆరితేరిన వ్యక్తి. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతిసారీ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి, అల్లర్లు సృష్టిస్తున్నారు.
- శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ, పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించినందుకే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేయించారు. చంద్రబాబు అనే నియంత రక్తపాతాన్ని సృష్టిస్తున్నారు. తనకు ఓటు వేయని వారిని గ్రామాల నుంచి తరిమేస్తున్నారు.
- అంబేడ్కర్ కోరుకున్న రాజ్యాంగం రాష్ట్రంలో అపహాస్యం అవుతోందది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు దాడులు, వెలివేతలు జరుగుతూనే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ఓ ఎమ్మెల్యే దళిత ప్రిన్సిపల్‌పై అఘాయిత్యానికి పాల్పడితే ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయలేదు. విజయనగరం జిల్లాలో దళితులపై దాడులు చేసి భూములు లాక్కున్నారు. విశాఖపట్నంలో దళిత మహిళను వివస్త్రను చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితుల్ని వెలివేస్తే చర్యలు లేవు. కాకినాడలో దళిత డాక్టర్‌ను జనసేన ఎమ్మెల్యే కొడితే చర్యలు లేవు. రాజమండ్రిలో దళితుడ్ని పోలీసు స్టేషన్‌లో పెట్టి బట్టలు ఊడదీసి వీడియోలు పెడితే చర్యలు లేవు. గుంటూరు జిల్లాలో దళిత యువకుల్ని కొట్టి, రౌడీషీట్ ఓపెన్ చేస్తే చర్యలు లేవు. పల్నాడు జిల్లా గురజాల గ్రామంలో రెండు వేలకు పైగా కుటుంబాలను వెలివేస్తే స్పందించే నాథుడు లేడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాల్మన్‌ను నిర్దాక్షిణ్యంగా చంపి, అంత్యక్రియలకు వెళ్లకుండా అడ్డుకున్న దుర్మార్గపు ప్రభుత్వం చంద్రబాబుది.
- రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. అందుకే ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని రద్దు చేయాలి. రాష్ట్రపతి పాలన విధించాలి. చంద్రబాబు సర్కారు దమనకాండకు అడ్డుకట్ట వేయకపోతే హస్తిన వేదికగా రాబోయే రోజుల్లో వేలాది మందితో పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం.

క్లుప్తంగా...

నేడు వైఎస్ జగన్ భీమవరం పర్యటన

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి భీమవరం చేరుకుంటారు. అనంతరం పెదఅమిరం చేరుకుని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు.

రేపు జోగి రమేష్ కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి, అమరావతి: టీడీపీ గూండాల చేతిలో దాడికి గురైన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 6న పరామర్శించనున్నారు. ఆ రోజు ఉ.10.30కు తాడేపల్లి నివాసం నుంచి జగన్ ఇబ్రహీంపట్నం బయల్దేరుతారు. కనకదుర్గ వారధి, ఆర్టీసీ బస్టాండ్, భవానీపురం, గొల్లపూడి, గుంటుపల్లి, తుమ్మలపాలెం మీదుగా ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. వైఎస్ జగన్ మధ్యాహ్నం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైకోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: తనపై నమోదైన అక్రమ కేసులను కొట్టివేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు తేలేంత వరకు తనపై నమోదు చేసిన కేసుల్లో తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తిరుమల శ్రీవారి లడ్డూ నెయ్యి వ్యవహారంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, కుల, మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారంటూ నవురుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత టి.మస్తాన్‌బాబు పొదలకూరు పోలీసులకు, మనుబోలుకు చెందిన టీడీపీ నేత పచ్చిపాల రామిరెడ్డి నెల్లూరు దర్గామిట్ట పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా కాకాణిపై ఈ నెల 2న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టేయాలని కోరుతూ బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

బొల్లా బ్రహ్మనాయుడు సహా వైఎస్సార్‌సీపీ నేతలకు ఊరట

చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మరో 24 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు హైకోర్టు ఊరటనిచ్చింది. వీరిపై నమోదు చేసిన కేసులో చట్ట ప్రకారం నడుచుకోవాలని వినుకొండ పోలీసులను ఆదేశించింది. వీరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతికి హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: ఆంధ్రజ్యోతి దినపత్రికకు విశాఖలో రూ.కోట్ల విలువైన భూమిని కట్టబెడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి, ఆమోద పబ్లికేషన్స్ (ఆంధ్రజ్యోతి)కి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఆంధ్రజ్యోతికి భూ కేటాయింపులను రద్దు చేయాలని కోరుతూ విశాఖపట్నానికి చెందిన నక్కా నిమ్మి గ్రేస్ హైకోర్టులో ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం విచారణ జరిపింది. ఇందులో ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

శ్రీశైలం ప్రాజెక్టు క్వార్టర్లు, భూముల్లో ఆక్రమణలను తొలగించాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన భూములు, క్వార్టర్లను ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో ఓ నిబద్ధత కలిగిన అధికారిని రెండు వారాల్లో నియమించాలని రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఆక్రమణల తొలగింపు విషయంలో చట్ట ప్రకారం వ్యవహరించాలని చెప్పింది. ఆక్రమణదారులను ఖాళీ చేయించేందుకు తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భూములను పలువురు అనధికారికంగా వాడుకుంటున్నారని న్యాయవాది డి.కాశీరావు (పిల్) దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

నేడు చలో పోతిరెడ్డిపాడు

పోస్టర్‌ను ఆవిష్కరించిన భూమన, నారాయణస్వామి

తిరుపతి మంగళం, కార్వేటినగరం: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, తెలంగాణతో చేతులు కలిపి సీమకు ద్రోహం చేస్తున్న దుర్మార్గుడు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నీచ రాజకీయాలతో రాయలసీమకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతితో బుధవారం ఆయన ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి 'చలో పోతిరెడ్డిపాడు' ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి సీమ ప్రయోజనాలను రక్షించాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా పుత్తూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోతిరెడ్డిపాడులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

మాపై కేసు కొట్టేయండి

హైకోర్టులో విడదల రజిని తదితరుల పిటిషన్

సాక్షి, అమరావతి: తమపై పల్నాడు జిల్లా యడ్లపాడు పోలీసులు నమోదు చేసిన అక్రమకేసును కొట్టేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజిని, మరో 21 మంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు తమపై పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలో టీటీడీ నేతల దుష్ప్రచారానికి వ్యతిరేకంగా పూజలు నిర్వహించేందుకు యడ్లపాడు మండలం బోయపాలెంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి విడదల రజిని, ఇతర నేతలు వెళ్లారు. ఈ సందర్భంగా వారు తనను కొట్టి దూషించడమే కాక కుల, మత, వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ షేక్ రాజా అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటు మరో 21 మందిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వీరంతా తమపై కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపే అవకాశం ఉంది.

అసెంబ్లీ నుంచి అనేకమార్లు కాల్ చేశాడు

- నేనే కాదు.. మరో ఐదుగురితోనూ అరవ రాసలీలలు
- బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయకుండా ఎమ్మెల్యే టికెట్ ఎలా ఇచ్చారో
- మానవ హక్కుల కమిషన్ మద్దతుతోనే కేసు నమోదు
- కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు వెల్లడి

బంజారాహిల్స్: రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనకు అసెంబ్లీ నుంచి ప్రతిసారీ కాల్ చేసేవాడని, అక్కడ జరిగే అన్ని విషయాలూ చూపించేవాడని అతని బాధితురాలు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని కమలాపురికాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మద్దతుతోనే కేసు నమోదైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను రూ.25 కోట్లు తాను అడగలేదని స్పష్టం చేశారు. సంజీవని ఆస్పత్రిలో డాక్టర్లు ఇచ్చిన మెడిసిన్ వేసుకున్నాకే అబార్షన్ అయిందని పేర్కొన్నారు. అరవ శ్రీధర్ తనతోనే కాకుండా మరో ఐదుగురితోనూ రాసలీలలు నడిపేవాడని చెప్పారు. తనకు ఆ విషయాలు తెలిశాక ఇదంతా ఆపేద్దామని అన్నానని, అందుకే సేఫ్ సైడ్‌గా అన్ని ఆధారాలూ ఉంచుకున్నానని పేర్కొన్నారు. తనను అతను పెళ్లి చేసుకుంటానని చెప్పిన విషయం వాళ్ల ఇంట్లో వారందరికీ తెలుసునని వివరించారు. టీడీపీ నేత ముక్కా రూపానందరెడ్డే వెనుక ఉండి శ్రీధర్‌ను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ నుంచి కాల్స్ చేయడం నిబంధనలకు విరుద్ధం కదా..! దీనిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. శ్రీధర్ బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయకుండా ఎమ్మెల్యే టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌కు శిక్ష పడాలని ఆమె డిమాండ్ చేశారు.

విచారణ కమిటీ వేయాలి: న్యాయవాది ఆజాద్

బాధితురాలి తరఫు న్యాయవాది ఆజాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యేపై మహిళా విచారణ కమిటీ వేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను కోరుతున్నట్లు చెప్పారు. బాధితురాలు రూ.25 కోట్లు డిమాండ్ చేసినట్లు ఫుల్ ఆడియో లేదని పేర్కొన్నారు. ఆ ఆడియో ఉంటే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆస్తులు రూ.3 లక్షలు మాత్రమే అని అఫిడవిట్‌లో ఉందని, అలాంటిది రూ.25 కోట్లు ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. అక్రమంగా సంపాదిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కర్ణాటక అసెంబ్లీలో పోర్న్ వీడియో చూసిన ఎమ్మెల్యేపై స్పీకర్ చర్యలు తీసుకున్నారని, మరి ఏపీ అసెంబ్లీలో కూర్చొని ఇలాంటి పనులు చేసిన ఎమ్మెల్యే శ్రీధర్‌పై స్పీకర్ చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలి ఆవేదనను వినడానికి ఈ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్ష్యాలు కోర్టులోనే సమర్పిస్తా

మరో వీడియో విడుదల చేసిన అరవ శ్రీధర్ బాధితురాలు

పుల్లంపేట: తిరుపతి జిల్లా రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో సాక్ష్యాధారాలను కోర్టులోనే సమర్పిస్తానని బాధితురాలు తెలిపారు. బుధవారం ఆమె మరో వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇందులో ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ నియమించిన త్రిసభ్య కమిటీ ముందు అరవ శ్రీధర్ తన వాదనలు వినిపించారని, తనకూ త్రిసభ్య కమిటీ నుంచి పిలుపు వచ్చిందని వెల్లడించారు. త్రిసభ్య కమిటీ ముందు హాజరై అన్ని విషయాలూ వివరిస్తానని చెప్పారు. సాక్ష్యాధారాలను మాత్రం కమిటీకి ఇచ్చే ప్రసక్తే లేదని, కోర్టులోనే సమర్పిస్తానని ఆమె స్పష్టంచేశారు. ఎమ్మెల్యేపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా కేసు నమోదుచేయలేదని, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడంతో కమిషన్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ వల్ల తాను ఐదుసార్లు గర్భం దాల్చానని సంజీవని హాస్పిటల్‌లో స్కానింగ్ చేసుకున్నానని చెప్పారు. సంజీవని హాస్పిటల్‌కు ఎమ్మెల్యే శ్రీధర్ ఫోన్ చేసి అబార్షన్ చేయాలని చెప్పడంతోనే తనకు ఆస్పత్రి వర్గాలు మాత్రలు ఇచ్చారని వెల్లడించారు. అబార్షన్ చేయించడం చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో ఆధారాలు, రిపోర్టులు తన దగ్గరే ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలో మహిళా కమిషన్‌ను కలిసి వివరాలు సమర్పించి న్యాయం కోసం డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు.

'జల'కంటక సర్కారుపై పోరుకేక

నేడు చలో పోతిరెడ్డిపాడుకు రాయలసీమ రైతులు • ఎత్తిపోతల పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన

సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగా రాయలసీమ ఎత్తిపోతలను నిర్దాక్షిణ్యంగా ఆపేసి ఈ ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరుపై ప్రజానీకం కన్నెర్ర చేస్తోంది. ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాల్సిందేనని నినదిస్తోంది. 'సీమ'కు ద్రోహం చేస్తున్న 'జల'కంటక సర్కారుపై గళమెత్తి గర్జిస్తోంది. 'తీరుమారకుంటే పతనం తప్పదు ఖబడ్దార్' అంటూ హెచ్చరిస్తోంది. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం 'చలో పోతిరెడ్డిపాడు'కు రాయలసీమ రైతాంగం సిద్ధమైంది.

అనుమతివ్వకుండా అడ్డంకులు

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాధాన్యం, చేసిన పనులు, ప్రాజెక్టు ఆవశ్యకత సీమ ప్రజలకు తెలిసేందుకు జనవరిలోనే వైఎస్సార్‌సీపీ నేతలు సమావేశమై ఈనెల 5న పోతిరెడ్డిపాడు వద్ద సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత నంద్యాల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి సభ అనుమతి కోసం యత్నించారు. అయితే ప్రభుత్వ ఆదేశంతో పోలీసులు చివరి క్షణం వరకూ సభకు అనుమతివ్వలేదు. పోలీసులు అనుమతిచ్చినా, ఇవ్వకపోయినా 'సీమ' ప్రయోజనాల కోసం ఆటంకాలను అధిగమించి, పోతిరెడ్డిపాడుకు చేరుకుని నిరసన తెలపాలని రైతాంగం సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ నేతలూ దృఢ సంకల్పంతో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా పోలీసులు అనుమతిచ్చినా, ఇవ్వకపోయినా భారీగా రైతులు, ప్రజలు తరలివస్తారని తెలుసుకున్న సర్కారు.. అనుమతివ్వకపోతే అభాసుపాలవుతామని జంకింది. ఫలితంగా పోతిరెడ్డిపాడు సభకు షరతులతో కూడిన అనుమతులిస్తూ ఆత్మకూరు డీఎస్పీ బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు.

వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకే చలో పోతిరెడ్డిపాడు

తెలంగాణ సీఎం రేవంత్‌తో, చంద్రబాబు చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగానే రాయలసీమలిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిచిపోయాయి. తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా రేవంత్ ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టారు. దీంతో చంద్రబాబు, ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శల నుంచి తప్పించుకునేందుకు అసలు రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని, ఇది వృథా ప్రాజెక్టు అని ఏకంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోపాటు కూటమి ప్రభుత్వంలోని పలువురు వితండవాదానికి దిగారు. ఈ క్రమంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాధాన్యం, తెలంగాణ చేస్తున్న జలదోపిడీ, చంద్రబాబు చేస్తున్న ద్రోహం, ఇప్పటి వరకూ జరిగిన రూ.990 కోట్ల విలువైన పనులను ప్రజలకు చూపించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ చలో పోతిరెడ్డిపాడుకు పిలుపునిచ్చింది.

పిడికిలి బిగించిన సీమ నేతలు

రాయలసీమ ప్రయోజనాలపై రాజీపడబోమని సీమ నేతలు, రైతులు పిడికిలి బిగించారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పోతిరెడ్డిపాడు వద్ద సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగురోజులుగా అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు సమన్వయకర్త ధారా సుధీర్ కూడా ఏర్పాట్లలో చురుగ్గా పాల్గొంటున్నారు. శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌తో పాటు పలువురు నేతలు ఇప్పటికే పోతిరెడ్డిపాడును సందర్శించారు. అలాగే 'సీమ'లోని అన్ని జిల్లాల అధ్యక్షులు, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు భారీగా తరలిరానున్నారు. వీరికి సంఘీభావంగా 'సీమ' ప్రయోజనాలు కాంక్షించే పలు రైతు, ప్రజా సంఘాల నేతలు సభలో పాల్గొననున్నారు.

హైకోర్టులో పిటిషన్‌తో దిగొచ్చిన పోలీసులు

సాక్షి, అమరావతి: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి సీఎం చంద్రబాబు రాయలసీమ, నెల్లూరు జిల్లాకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు అనుమతి ఇచ్చే విషయంలో పోలీసులు దిగొచ్చారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో బహిరంగ సభ నిర్వహించేందుకు నంద్యాల జిల్లా ఎస్పీ అనుమతి ఇచ్చారు. దీంతో పిటిషన్‌ను పరిష్కరిస్తూ న్యాయమూర్తి జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోతులపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డికి చెందిన పొలంలో సభ నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రా గా రాంభూపాల్‌రెడ్డి తరఫు న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. తాము ఈ వ్యాజ్యం దాఖలు చేసిన తరువాత సభ నిర్వహణకు అనుమతి ఇస్తూ పోలీసులు ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. పోలీసులు ప్రొసీడింగ్స్‌ను రికార్డ్ చేస్తూ కేసును పరిష్కరించాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీమకు ద్రోహం చేస్తావా బాబూ?

'సీమ'కు మేలు చేయని అనుభవం, అధికారం ఎందుకు చంద్రబాబు? రాయలసీమ అత్యంత వెనుకబడింది. కరువులతో వలసలు ఎక్కువయ్యాయి. అయినా ఈ ప్రాంతానికి ద్రోహం చేస్తావా చంద్రబాబూ..! రాయలసీమ లిఫ్ట్ ఆపిన ఈ పాపం ఊరికేపోదు. వైఎస్ జగన్ ప్రారంభించిన ఎత్తిపోతలను రాజకీయ ప్రయోజనాల కోసం నిర్దాక్షిణ్యంగా ఆపేస్తావా? నువ్వు చరిత్రహీనుడిగా మిగిలిపోతావు జాగ్రత్త.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

ప్రభుత్వ తీరును ఎండగడతాం

సభ జరగకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. సభ విఫలం కావడానికి సర్కారు చేస్తున్న యత్నాలు ఫలించవు. సభకు చివరి నిమిషం వరకు అనుమతివ్వని ప్రభుత్వం జనంలో పలుచన అవుతామనే భయంతో చివరికి అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ షరతులు విధించింది. సభ నాలుగు గంటలే జరపాలంట. నాలుగైదు వేలమందే రావాలంట. ఏదేమైనా గురువారం పోతిరెడ్డిపాడు వద్ద రైతులు పెట్టే పొలికేక ఈ సర్కారు గుండెల్లో సమరభేరై మోగుతోంది. బాబు ప్రభుత్వ తీరును ఎండగట్టి తీరతాం.

– బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులపై స్పందించిన హైకోర్టు

రాష్ట్ర ప్రభుత్వంతో పాటు వివిధ కంపెనీలకు నోటీసులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూ కేటాయింపుల విధానానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కంపెనీలకు, సంస్థలకు భూములను ఉచితంగాను, నామమాత్రపు ధరలకే ధారాదత్తం చేస్తోందంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రహేజా కార్పొ రియల్ ఎస్టేట్, ఇండిచిప్ సెమీ కండక్టర్స్, అదాని ఇన్‌ఫ్రా, అదాని పవర్, భారతీ ఎయిర్‌టెల్, నెక్స్‌ట్రా డేటా తదితర కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. భూ కేటాయింపుల్లో ప్రభుత్వం చట్ట నిబంధనలకు, గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, ప్రాజెక్టులు ప్రారంభించకముందే భూ విక్రయానికి ఒప్పందాలు చేసుకుంటోందని పేర్కొంటూ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు హైకోర్టులో వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం భూ కేటాయింపులు చేస్తోందని, కొన్నింటికి ఉచితంగా, కొన్నింటికి 99 పైసలకే భూములు కేటాయిస్తోందన్నారు. దీంతో ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి, భూములు పొందిన కంపెనీలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

What is the importance of tourism in India

CHAPTER - 7
LIFELINES OF NATIONAL ECONOMY

KEY POINTS

- India has the second largest road network in the world.
- NHAI means National Highways Authority of India.
- PMGSY means Pradhan Mantri Grameen Sadak Yojana.
- The Golden Quadrilateral connects Delhi, Kolkata, Chennai and Mumbai.
- Golden Quadrilateral roads are six-lane highways.
- These highways reduce travel time between big cities.
- The Border Roads Organisation was started in 1960.
- MSL means Mean Sea Level.
- Atal Tunnel (9.02 km) is the world's longest highway tunnel.
- Atal Tunnel connects Manali with Lahaul-Spiti.
- Atal Tunnel is in the Pir Panjal range at 3000 metres height.
- India's first train ran from Mumbai to Thane in 1853.
- Indian Railways is divided into 16 zones.
- The Himalayan region is not suitable for railways.
- Pipelines are used to carry oil and natural gas.
- The first long gas pipeline was the 1700 km HVJ pipeline.
- India's gas pipelines have grown to 18,500 km.
- Waterways are the cheapest way of transport.
- India has 14,500 km of inland waterways.
- Ganga waterway (Allahabad - Haldia) is National Waterway-1.
- The Brahmaputra waterway is National Waterway No.2.
- The West Coast Canal of Kerala is National Waterway No.3.
- Parts of Godavari and Krishna form National Waterway No.4.
- Brahmani and Mahanadi system is National Waterway No.5.
- India has a coastline of 7,516.6 km.
- India has 12 major ports and about 200 minor ports.
- Major ports handle 95% of India's foreign trade.
- Kandla in Gujarat was the first developed port.
- Kandla is a tidal port and is also called Deendayal Port.
- Mumbai is the largest port in India.
- Jawaharlal Nehru Port was built to reduce pressure on Mumbai port.
- Mormugao port in Goa exports a lot of iron ore.
- New Mangalore port in Karnataka exports Kudremukh iron ore.
- Kochchi is a natural harbour and a major port in the south-west.
- Tuticorin port in Tamil Nadu is also a natural harbour.
- Chennai is one of India's oldest artificial ports.
- Vishakhapatnam is a deep, well-protected, landlocked port.
- Paradip port in Odisha mainly exports iron ore.

2 MARKS

1. Expand NHAI.
A. National Highway Authority of India.
2. Expand PMGSY.
A. Pradhan Mantri Grameen Sadak Yojana.
3. Expand MSL.
A. Mean Sea Level.
4. Expand AIR.
A. All India Radio (Akasha Vani).
5. What is trade?
A. The exchange of goods among people, states and countries is referred to as trade.
6. State any three merits of roadways.
1. Road transport is economical.
2. It is useful in mountain regions.
3. It also provides door to door service.
4. It is also used as a feeder to other modes of transport.

7. Where and why is rail transport the most convenient means of transportation?
1. In the northern plains, rail transport is the most convenient.
2. This region has vast level lands.
3. These plains are suitable for laying tracks.
4. These plains are rich in agriculture resources .

8. What is the significance of the border roads?
1. Border Roads Organisation constructs the roads in the borders.
2. These roads raise access to remote areas with difficult terrain.
3. They help in the economic development of these areas.
4. They play a vital role in national security and development.

9. What is meant by trade? What is the difference between international and local trade?
1. The exchange of goods for economic gain is called trade.
2. Export and import are the components of trade.
3. Trade between two countries is called international trade.
4. Trade occurring within the country is known as local trade.

10. Why are the means of transportation and communication calling the lifelines of a nation and its economy?
1. Transportation help in movement of goods and services.
2. They help in the development of communication.
3. They have brought the world closer.
4. Thus, they are called the lifelines of a nation and its economy.

11. What are National Highways.
1. National Highways link extreme parts of the country.
2. These are the primary road systems.
3. These Highways run in North-South and East-West directions.

12. Write about the Paradip port.
1. Paradip port located in Odisha
2. Paradip port specialises in the export of iron ore.

13. Expand STD.
A. Subscriber Trunk Dialing.
14. Write about border roads.
1. Border Roads Organisation maintains roads in the borders.
2. They improve accessibility in areas of difficult terrain.
3. They help in the economic development of these area.

15. Write about the Atal Tunnel.
1. The Atal Tunnel is the World's longest Highway tunnel.
2. It has been built by Border Road Organisation.
3. This tunnel connects Manali to Lahul-Spiti valley.

16. Write about the Kochchi port.
1. Kochchi is the extreme south-western port.
2. Kochchi is located at the entrance of a lagoon.
3. Kochchi is a natural harbour.

17. Write about the Chennai port.
1. Chennai is one of the oldest artificial ports of the country.
2. Chennai is ranked next to Mumbai in terms of the volume of trade and cargo.

18. How many ports are there in India?
1. India has 12 major and 200 minor / intermediate ports.
2. These major ports handle 95 % of India's foreign trade.

19. Write about the Kandla port.
1. Kandla in Kuchchh was the first developed port.
2. Kandla also known as the Deendayal Port.
3. Kandla is a tidal port.

20. Write about the Marma Gao port.
1. Marma Gao port (Goa) is the premier iron ore exporting port.
2. This port accounts for about 50 % of India's iron ore export.

21. Write about the New Mangalore port.
1. New Mangalore port, located in Karnataka.
2. It caters to the export of iron ore from Kudremukh mines.

22. Write about the Vishakhapatnam port.
1. Vishakhapatnam is the deepest landlocked port.
2. Vishakhapatnam is well-protected port.
3. It is conceived as an outlet for iron ore exports.

23. What are the unfavorable conditions for the construction of railway lines?
1. The Himalayan mountainous regions
2. High relief
3. Sparse population
4. Lack of economic opportunities.
5. The sandy plain of western Rajasthan
6. Swamps of Gujarat

24. What are the problems facing by the railways today in India.
1. Many passengers travel without tickets.
2. Thefting the railway property.
3. Damaging of railway property.
4. Untidy premises.

Continued on next page..

25. What are the major means of communication?
 1. Television 3. Radio
 2. Press 4. Films

26. What are the mass communication methods?
 1. Radio 4. Television
 2. Newspapers 5. Magazines
 3. Books 6. Films

27. What is international trade?
 1. Trade between two countries is called international trade.
 2. International trade is an index to economic prosperity.
 3. It is considered the economic barometer for a country.

28. Write about the Mumbai port.
 1. After Independence, the Mumbai port become important.
 2. Mumbai is the biggest port.
 3. It is a spacious natural and well-sheltered harbour.

29. Write about the Kolkata port.
 1. Kolkata is an inland riverine port.
 2. It serves a very large hinterland of Ganga-Brahmaputra basin.
 3. Kolkata port is a tidal port.
 4. Kolkata port requires constant dredging of Hooghly.

30. Write about the Airways in India.
 1. The air travel is the fastest mode of transport.
 2. It is the most comfortable and prestigious also.
 3. It can cover mountains, deserts, forests and oceanic stretches.
 4. Air travel has made access easier.

31. Write about the Tuticorin port.
 1. Tuticorin port is in Tamil Nadu.
 2. Tuticorin port is a natural harbour
 3. Tuticorin has rich hinterland.
 4. Tuticorin has a flourishing trade with Sri Lanka and Maldives

32. What is Digital India programme?
 1. An umbrella programme.
 2. It is meant for a knowledge-based transformation.
 3. It is based on being transformative to realise.
 4. It focuses on making technology central to enabling change.

33. What are the channels introduced to facilitate quick delivery of mails in large towns and cities?
 1. Rajdhani Channel. 4. Metro Channel.
 2. Green Channel. 5. Business Channel.
 3. Bulk Mail Channel. 6. Periodical Channel.

34. What is the importance of tourism in India.
 1. Nearly 15 million people are engaged in the tourism industry.
 2. Tourism promotes national integration.
 3. It provides support to local handicrafts and cultural pursuits.
 4. It helps in the development of international understanding.

35. What are the types of tourism?
 1. Heritage tourism. 4. Eco tourism.
 2. Adventure tourism. 5. Cultural tourism.
 3. Medical tourism. 6. Business tourism.

36. Write 4 merits of Railways
 1. Railways carry many passengers.
 2. Railways carry heavy goods easily.
 3. Railways connect far places.
 4. Railways are cheap and safe.

37. Write about the waterways in India.
 1. Waterways are the cheapest means of transport.
 2. They are most suitable for carrying heavy and bulky goods.
 3. It is a fuel-efficient and environment friendly.
 4. India has inland navigation waterways of 14,500 km in length.
 5. Inland water ways are Mandavi, Zuari and Cumberjua, Sundarbans, Barak and backwaters of Kerala.

38. Write about the Railways in India.
 1. Railways are useful to transport goods and passengers.
 2. Railways make it possible for people to business.
 3. It has been a great integrating force for 150 years.
 4. It accelerate the development of the industry and agriculture.
 5. It is the largest public sector undertaking in the country.

CHAPTER - 1
THE RISE OF NATIONALISM IN EUROPE

KEY POINTS

- Frédéric Sorrieu, a French artist, printed the idea of "democratic and social Republics" in 1848.
- The Statue of Liberty was made in France.
- The French Revolution showed Liberty as a woman.
- Ernst Renan was a French thinker.
- He said a nation is built by long struggles and sacrifices.
- Nationalism first rose in France in 1789.
- The Estates General became the National Assembly.
- Students formed many Jacobin clubs across Europe.
- Andreas Rebmann made a German almanac.
- Napoleon ended democracy in France.
- His Civil Code of 1804 was called the Napoleonic Code.
- Germany, Italy and Switzerland were once many small states.
- The Habsburg Empire ruled Austria-Hungary.
- Industrialisation began in England after 1750.
- Industrialisation in France and Germany started after 1800.
- Karl Kaspar Fritz painted "Tree of Liberty" scene in Germany.
- Suffrage means the right to vote.
- Liberalism comes from the Latin word liber, meaning free.
- Napoleon invaded Italy in 1797.
- Napoleon fell in 1815, and the Vienna Settlement was made.
- The Greek freedom struggle began in 1821.
- In 1848, revolutions spread in France, Italy and Germany.
- Italy was unified between 1859 and 1870.
- Germany was unified between 1866 and 1871.
- The elle was an old unit used to measure cloth.
- Prussia formed the zollverein (customs union) in 1834.
- Britain, Russia, Prussia and Austria defeated Napoleon in 1815.
- The Vienna Congress was led by Metternich of Austria.
- Its aim was to undo changes made during the Napoleonic wars.
- Giuseppe Mazzini was born in Genoa in 1807.
- He joined the secret society called the Carbonari.
- He was exiled in 1831 for a revolt in Liguria.
- Mazzini started Young Italy and Young Europe.
- Metternich called Mazzini a dangerous enemy.
- Metternich said, "When France sneezes, Europe catches cold."
- The Treaty of Constantinople in 1832 recognised Greece as a nation.
- Johann Gottfried Herder was a German philosopher who supported nationalism.
- Karol Kurpinski promoted the Polish struggle through his music.

1 MARK

1. Who was Frédéric Sorrieu?
 1. A French artist.
 2. He prepared visualising his dream of a world made up of 'democratic and social Republics' In 1848.

2. Where is located the statue of Liberty?
A. In France.

3. Define the term Utopian.
A. A vision of a society that is so ideal that it is unlikely to exist.

4. Define the term Plebiscite.
A. A direct vote by people to decide one important issue.

5. Define the term a nation-state.
A. One in which the most of its citizens, and not only its rulers, came to develop a sense of common identity and shared history or descent.

6. Find out the wrongly matched pair:
 A) Giuseppe Mazzini - German unification
 B) Zollverein - Customs union;
 C) Treaty of Vienna - 1815
A. A) Giuseppe Mazzini - German unification

7. What was the rename of the Estates General?
A. The National Assembly.

8. Match the following

i. Global agricultural economy	( )	a. 1929
ii. First World War	( )	b. 1914-18
iii. Great Depression	( )	c. 1890
iv. Civil disobedience movement	( )	d. 1930

A. i - c , ii - b, iii - a, iv - d.

9. What is Suffrage?
A. The right to vote.

10. Name the customs union formed by Prussia in 1834.
A. Zollverein.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

1. **Why did National Leaders oppose indentured labour migration from India?**
 A. It was very cruel
 B. Ill-health
 C. Low wages D. All the above

2. **Many expeditions set off in search of El Dorado, the fabled city of**
 A. Silver B. Emerald
 C. Diamonds D. Gold

3. **Disease travelled from Europe to America**
 A. Plague C. Smallpox
 B. Hay fever D. Chickenpox

4. **European poor began to eat better and live longer with the introduction of the humble:**
 A. Maize
 B. Potato
 C. Soya D. Rice

5. **Foods introduced in Europe and Asia after Christopher Columbus discovered America:**
 A. Potatoes, soya
 C. Maize, tomatoes
 B. Groundnuts
 D. All the above

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

ఉమెన్ సేఫ్టీ

స్మార్ట్ గ్లాసెస్... సో డేంజర్!

సరికొత్త సాంకేతికతలో స్మార్ట్ గ్లాసెస్ ట్రెండ్ ఒకటి. హ్యాండ్స్-ఫ్రీ సెల్ఫీల నుంచి ఇన్‌స్టంట్ ట్రాన్సాక్షన్స్ వరకు స్మార్ట్ గ్లాసెస్ ఉపయోగాలు ఉన్నాయి. ఆ ఉపయోగాల మాట ఎలా ఉన్నా... మహిళల ప్రైవసీకి సంబంధించి స్మార్ట్ గ్లాసెస్ బ్యాడ్ గ్లాసెస్‌గా తయారయ్యాయి. స్మార్ట్‌గ్లాసెస్‌తో మహిళల వీడియోలు తీసి వివిధ సైట్‌లలో అప్‌లోడ్ చేస్తున్నారు. మహిళలకు తెలియకుండా స్మార్ట్‌గ్లాసెస్ కెమెరాతో వీడియోలు తీయడం అనేది యూఎస్, యూకేలలో ప్రమాదకరమైన ట్రెండ్‌గా మారింది...

బస్‌స్టాప్‌లో నిలబడినప్పుడో, ఏ షాపింగ్ మాల్‌లోనో ఉన్నప్పుడో స్మార్ట్‌గ్లాసెస్ ధరించిన వ్యక్తి మీ దగ్గరకి వచ్చి...

‘హాయ్ అండీ... మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగా ఉంది’ అని మాట కలిపి చాలాసేపు మాట్లాడవచ్చు.

చివరికి...

‘ఒకరి పోలికలతో ఒకరు ఉండడం సహజమే కదండీ. నేను పొరబడ్డాను...సారీ...’ అంటాడు.

‘భలేవారండీ, ఈ మాత్రం దానికి సారీ ఎందుకు!’ అని మనం అంటాం.

■ కట్ చేస్తే...

కొన్ని రోజుల తరువాత మీ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లోనో, టిక్‌టాక్‌లోనో కనిపించవచ్చు. షాక్‌కు గురి చేయవచ్చు. అభ్యంతరకరమైన సైట్స్‌లోనూ కనిపించి మిమ్మల్ని ఆందోళనకు గురి చేయవచ్చు. ‘అసలు.. నా వీడియో ఈ సైట్‌లోకి ఎలా వచ్చింది!’ అని ఆలోచిస్తుండగా మీతో మాట్లాడిన వ్యక్తి గుర్తుకు వస్తాడు.

‘నాతో మాట్లాడింది నిజమేగానీ. అతడి చేతిలో సెల్‌ఫోన్‌లాంటిదేమీ కనిపించలేదే!’ అని అతడికి క్లీన్ సర్టిఫికెట్ ఇస్తారు.

నిజానికి ఆ వీడియో సృష్టికర్త అతడే!

అతను పెట్టుకున్న స్మార్ట్‌గ్లాసెస్ కేవలం గ్లాసెస్ మాత్రమే కాదు.

అందులో కెమెరా కూడా ఉంటుంది.

యూఎస్, యూకేలలో ‘స్మార్ట్ గ్లాసెస్ బాధితులు’ ఎంతోమంది ఉన్నారు.

సాంకేతికతలో మరో ముందుడుగుగా ‘స్మార్ట్ గ్లాసెస్’ వచ్చాయి. హ్యాండ్స్-ఫ్రీ సెల్ఫీలు, ఇన్‌స్టంట్ ట్రాన్సాక్షన్స్, వాయిస్-యాక్టివేటెడ్ అసిస్టెంట్స్‌లాంటి సదుపాయాల మాట ఎలా ఉన్నా కొన్ని సందర్భాలలో ఇవి మహిళల పాలిట పీడకలగా మారుతున్నాయి.

■ భయపడవద్దు

గత నెల ఇంగ్లాండ్‌లో ఓ నలభై ఏడేళ్ల మహిళ ఒక వ్యక్తిని కోర్టుకు లాగింది. ఇంతకీ ఆ వ్యక్తి చేసిన నేరం ఏమిటి? ఒక హోటల్లో ఆమెకు తెలియకుండా తన స్మార్ట్‌గ్లాసెస్‌తో అభ్యంతరకరమైన రీతిలో వీడియో తీయడానికి ప్రయత్నిస్తుంటే ఆమెకు అనుమానం వచ్చి, అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కోర్టుకు లాగింది.



కొద్దిమంది బాధితులు మాత్రం ‘నలుగురికి తెలిస్తే పరువు పోతుంది’ అనుకుంటూ బ్లాక్‌మెయిల్ చేసే వారి బెదిరింపులకు లొంగిపోతున్నారు. వారు ఎంత డిమాండ్ చేస్తే అంత సొమ్ము ఇచ్చేస్తున్నారు.

సూపర్ మార్కెట్‌కు వెళ్లిన తనను అపరిచితుడు ఎవరో రే–బాన్ మెటా స్మార్ట్ గాసెస్‌తో అభ్యంతర కరమైన రీతిలో వీడియో తీశాడని ఒక మహిళ ఆన్‌లైన్‌లో కన్నీరు మున్నీరు అయింది.

‘ఎవరో చేసిన దుర్మార్గమైన పనికి మానసికంగానే కాదు, శారీరకంగా కూడా బలహీన పడిపోయాను’ అని ‘ఎక్స్’లో చేసిన పోస్ట్‌లో వెల్లడించింది ఆ బాధిత మహిళ.

> **డేంజర్ ట్రెండ్!**
>
> యూఎస్. యూకేలలో స్మార్ట్ గ్లాసెస్ కెమెరాలను ఉపయోగించి మహిళలకు తెలియకుండా వారి వీడియోలు తీసి. వివిధ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం అనేది ప్రమాదకరమైన ధోరణిగా మారింది. వీడియో ఫుటేజీని సైకలాజికల్ మేనిప్యులేషన్ కోసం ఉపయోగించే ప్రమాదకరమైన ధోరణి పెరిగింది.
>
> ‘నాకు తెలియకుండానే నా వీడియోను చిత్రీకరించి. ఏదో సైట్‌లో పోస్ట్ చేశారు. ఆ తరువాత నేను పడిన ఇబ్బందులు ఇన్నీ అన్నీ కావు. ఎంత దారుణం ఇది!’ అంటూ న్యూయార్క్‌లో ఉండే కెనీ జనంజని కళ్లనీళ్ల పర్యంతం అయింది.
>
> ‘ఈ పని వారు యాదృచ్ఛికంగా. సరదా కోసం చేశారనుకోవడం లేదు. విషపూరిత ఆలోచనలతోనే చేస్తున్నారు’ అంటుంది కెనీ.

■ ఆ లైట్ వెలగక పోవచ్చు కూడా!

స్మార్ట్‌ఫోన్ కెమెరా తో ఎవరైనా షూట్ చేస్తుంటే వెంటనే గమనించి అడ్డుకోవచ్చు. అయితే స్మార్ట్ గ్లాసెస్‌తో రికార్డ్ చేస్తున్న విషయం తెలియకపోవడం వల్ల ప్రమాదాన్ని పసిగట్టలేము. స్మార్ట్ గ్లాసెస్ విషయానికి వస్తే, ఉదాహరణకు మెటా ప్రాడక్ట్ రే–బాన్ స్మార్ట్ గ్లాసెస్‌ను తీసుకుంటే...రికార్డింగ్ చేస్తున్నప్పుడు గ్లాసెస్‌లోని తెల్లటి చిన్న ఎల్‌ఈడి ఇండికేటర్ వెలుగుతుంది. ఈ లైట్ ఆధారంగా వీడియో రికార్డింగ్ జరుగుతున్న విషయం తెలుసుకోవచ్చు. అయితే ఈ లైట్ పగటి వెలుగులో, ప్రకాశవంతమైన పరిసరాలలో అంతగా కనిపించదు. కొందరు ఈ లైట్ కనిపించకుండా కూడా మ్యానేజ్ చేస్తున్నారు.

కొన్ని గ్లాసెస్‌కు రికార్డింగ్ ఇండికేటర్ లేకపోవడం వల్ల అక్రమంగా వీడియో తీస్తున్నవారి పని మరింత సులువు అవుతుంది. ముఖ్యంగా తక్కువ ధరల్లో వచ్చే చైనీస్ మోడల్స్‌లో ఈ ఫీచర్ కనిపించడం లేదు.

స్మార్ట్ గ్లాసెస్‌లోని ఎల్‌ఈడి లైట్ ఎందుకు వెలుగుతుందనేది చాలామందికి తెలియకపోవడం వల్ల అనుమానం రావడం లేదు. యూఎస్, యూకేలలో ప్రైవసీ చట్టాలు రకరకాలుగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో వీడియోలు తీయడం నేరం కాదు. మనకు తెలియకుండానే కేఫ్, మెట్రోస్టేషన్, పార్క్, ఆలయం సమీపంలో ఎవరైనా వీడియో షూట్ చేసి ఉండవచ్చు. ఆ వీడియోలో మనం ఉన్నామా లేదా అని తెలుసుకోవడానికి, ఫుటేజి తీసివేయాలని డిమాండ్ చేయడానికి చట్టపరమైన అధికారం లేదు. అయితే ఇతరులు అభ్యంతరం చెప్పినప్పుడు రికార్డింగ్ నిలిపివేయాలని టెక్ కంపెనీలు చెప్పవచ్చు. యూఎస్, యూకేలలోనే కాదు మన దేశంలోనూ స్మార్ట్‌గ్లాసెస్ దుర్వినియోగానికి సంబంధించిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

■ పరిష్కారం లేదా?

‘అవగాహన, అప్రమత్తతే సమస్యకు పరిష్కారం’ అంటున్నారు టెక్ నిపుణులు.

‘సందేహంతో ఉండాలి. అప్రమత్తంగా ఉండాలి. అనుమానంగా అనిపిస్తే సమాచారం ఇవ్వాలి’ అని కూడా చెబుతున్నారు. కెమెరాలు ఉన్న అన్ని స్మార్ట్‌గ్లాసులలోనూ స్పష్టమైన లైట్లు, సంకేతాలు ఉండవనే విషయం తెలుసుకోవాలి.

కెరీర్ ముందు... కిడ్స్ తర్వాత

ఆలస్యంగా తల్లికావడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు నేటి తరం మహిళలు. కెరీర్‌కే తొలి ప్రాధాన్యత ఇవ్వడమే దీనికి కారణం. ఇంటి ఖర్చులు, పిల్లల పెంపకం, చదువుల కోసం అయ్యే ఖర్చులను భరించే సామర్థ్యం వచ్చాకే మాతృత్వం వైపు అడుగులు వేస్తున్నారు.

25-29
2024లో 37 శాతం మంది తల్లులు 25–29 ఏళ్ల మధ్య వయసువారే. మాతృత్వానికి ఇదే సరైన వయస్సుగా నేటి మహిళలు భావిస్తున్నారు.

19
19 ఏళ్ల లోపు తక్కువ వయస్సులో తల్లులయ్యే వారి సంఖ్య అభివృద్ధి చెందిన దేశాలలో గణనీయంగా తగ్గింది. అయితే కొన్ని వర్గాలలో గతంలోలాగే ఉంది.

2.5
30–34 ఏళ్ల వయస్సులో తల్లులయ్యే వారి సంఖ్య 2.5 రెట్లు పెరిగింది. 2005లో 9.9 శాతం ఉండగా 2024లో 24.6 శాతానికి చేరుకుంది.

34.8%
గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మహిళల్లో 34.8 శాతం మందికి ఒక్కరే సంతానం, 31.4 శాతం మందికి ఇద్దరు పిల్లలు, 15.9 శాతం మందికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. విద్యావంతులైన మహిళలు చిన్న కుటుంబాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.

33%
2005లో 25 ఏళ్ల లోపు తల్లులు 48.9 శాతం ఉన్నారు. ప్రస్తుతం 29.7 శాతం ఉన్నారు. 30 ఏళ్ల పైబడిన మహిళల్లో తల్లులు అయినవారు గతంలో 21.6 శాతం, ఇప్పుడు 33 శాతం ఉన్నారు. ఇప్పుడు ప్రతి ముగ్గురు తల్లులలో ఒకరు 30 ఏళ్లు పైబడిన వారే.

46.6-27.1
ఈ రెండు దశాబ్దాల కాలంలో 20–24 ఏళ్ల వయస్సులో తల్లులయిన వారి సంఖ్య 46.6 శాతం నుండి 27.1 శాతానికి తగ్గింది.

69.9%
గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తల్లులు 31.1 శాతం, మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వారు 41.5 శాతం, ప్రాథమిక విద్యను మాత్రమే పూర్తి చేసిన తల్లులు 28.4 శాతం ఉన్నారు. గ్రాడ్యుయేషన్ కంటే తక్కువగా చదివిన తల్లులు 69.9 శాతం ఉన్నారు.

ఆలస్యమైనా... సురక్షితమే

కెరీర్‌లో స్థిరపడిన తర్వాతే కుటుంబం గురించి ఆలోచించాలని నేటి తరం కోరుకుంటోందని నిపుణులు చెబుతున్నారు. ఆలస్యంగా తల్లి కావడం అనేది సవాలుతో కూడుకున్న నిర్ణయమే అయినప్పటికీ, వైద్య రంగంలో వచ్చిన పురోగతితో గర్భధారణ, సురక్షితమైన జననాలు సాధ్యమే.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 4న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,65,920	1,63,860	1,60,530	1,63,860	1,66,000	1,62,550
బంగారం (22 క్యారెట్లు)	1,46,210	1,47,150	1,47,150	1,51,560	1,52,720	1,49,000
వెండి	3,05,000	2,95,000	3,20,000	2,95,000	2,93,000	3,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

రిలీజ్ డేట్ ఫిక్స్

● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా రూపొందిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. మార్చి 26న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ మూవీని మార్చి 26న రిలీజ్ చేయనున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ‘‘ఉస్తాద్ భగత్ సింగ్’ నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన ‘గబ్బర్ సింగ్’ మూవీలా ‘ఉస్తాద్ భగత్ సింగ్’ కూడా హిట్ అవుతుంది’’ అని మేకర్స్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... రామ్‌చరణ్ నటిస్తున్న ‘పెద్ది’ సినిమా మార్చి 26న విడుదల కావాల్సి ఉండగా, వాయిదా పడింది. మరి... ‘ఉస్తాద్ భగత్ సింగ్’ కోసం ‘పెద్ది’ని వాయిదా వేశారా? లేక ‘పెద్ది’ వాయిదా పడిందని, ‘ఉస్తాద్ భగత్ సింగ్’ డేట్‌ని ఫిక్స్ చేశారా? అనే చర్చ జరుగుతోంది.

మా సినిమా హాయిగా ఉంటుంది

- చింతా గోపాలకృష్ణా రెడ్డి

‘శ్రీ చిదంబరంగారు’ని క్రౌడ్ ఫండెడ్ మూవీగా ఈ టీమ్ ఆరంభించింది. నాలుగేళ్లుగా వీళ్ల పడుతున్న కష్టం చూసి మా అమ్మాయి వినీషా రెడ్డి... ఈ సినిమా మనం చేద్దామని చెప్పింది. ఈ కథ వినగానే మాకూ బాగా నచ్చింది. కొత్తవాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ‘శ్రీ చిదంబరంగారు’ చిత్రాన్ని నిర్మించాం’’ అని నిర్మాత చింతా గోపాలకృష్ణా రెడ్డి చెప్పారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రం ‘శ్రీ చిదంబరంగారు’. వినయ్ రత్నం దర్శకత్వం వహించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చింతా గోపాలకృష్ణా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ– ‘‘ఫీల్ గుడ్ కథతో తీసిన ఈ మూవీలో ఫైట్స్, యాక్షన్ గోల ఉండదు. ప్రేక్షకులు రెండు గంటల పాటు హాయిగా సేద తీరేలా మా సినిమా ఉంటుంది. వంశీ, సంధ్య పాత్రలు చాలా బాగుంటాయి. వినయ్ రత్నం చక్కగా తెరకెక్కించాడు. మా సినిమా ‘పెళ్లి చూపులు, కేరాఫ్ కంచరపాలెం’ చిత్రాలకంటే ఇంకా బాగుంటుందని చెప్పగలను. చందు రవి సంగీతం, కీరవాణిగారు పాట పాడటం మాకు ప్లస్. మా మూవీని వంశీ నందిపాటి పంపిణీ చేస్తుండటం హ్యాపీగా ఉంది. ఈ వారం మా సినిమాతో పాటు విడుదలవుతున్న అన్ని సినిమాలూ ప్రేక్షకాదరణ పొందాలి. మా సినిమా టిక్కెట్ ధర కేవలం 99 రూపాయలుగా నిర్ణయించాం. భవిష్యత్‌లో కె. విశ్వనాథ్‌గారి తీసిన తరహా సినిమాలు తీయాలని ఉంది. మా సంస్థలో ప్రస్తుతం ‘రావు బహదూర్’ అనే సినిమాతో పాటు కొత్త దర్శకుడితో మరో మూవీ చేస్తున్నాం. అదే విధంగా 2027లో ‘క’ మూవీ సీక్వెల్‌ను రిలీజ్ చేస్తాం’’ అని పేర్కొన్నారు.

రెండో భాగం లేదు

● మూడు గంటల నిడివితో వారణాసి

● మహేశ్‌బాబు

‘బాహుబలి’ చిత్రంలా ‘వారణాసి’ని కూడా రాజమౌళి రెండు భాగాలుగా విడుదల చేస్తారా? అనే చర్చకు ఫుల్‌స్టాప్ పడేలా ఓ వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమా ఒకే ఒక్క భాగంగా విడుదలవుతుందన్నది ఆ వార్త సారాంశం. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న చిత్రం ‘వారణాసి’. ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రపంచ ప్రేక్షకుల టార్గెట్‌గా రిలీజ్ కానుంది. రెండు భాగాలుగా రూపొందిస్తారనే టాక్ ప్రచారంలో ఉంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి స్పందిస్తూ... ‘‘ముందు రెండు భాగాలుగానే అనుకున్నాం. ఆ తర్వాత ఆ ఆలోచనను విరమించుకున్నాం. మొత్తం మూడు గంటల నిడివితో ఒకే భాగంగా విడుదల చేస్తాం’’ అని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ‘మూడు గంటల నిడివి అంటే... అంత సహనం ప్రేక్షకులకు ఉంటుందా?’ అని ఆ ఇంటర్వ్యూలో అడిగితే... ‘‘మా సినిమా కథలోని దమ్ము మీద నాకు నమ్మకం ఉంది’’ అని కూడా పేర్కొన్నారట. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.

బుల్లెట్ సునీల్

● రాజశేఖర్

బుల్లెట్ సునీల్‌గా ప్రేక్షకులను అలరించనున్నారు రాజశేఖర్. శర్వానంద్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘బైకర్’. అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాజశేఖర్, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్ పై వంశీ–ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది. బుధవారం (ఫిబ్రవరి 4) రాజశేఖర్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ‘బైకర్’ సినిమాలో బుల్లెట్ సునీల్‌గా రాజశేఖర్ నటిస్తున్నట్లు పేర్కొని, రీ స్టార్ట్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘దర్శకుడు అభిలాష్ రెడ్డి క్రియేట్ చేసిన శక్తిమంతమైన పాత్రకు ఈ గ్లింప్స్ ఒక టీజర్‌లా నిలుస్తుంది. తీక్షణమైన చూపులతో రాజశేఖర్ తనదైన శైలిలో ఈ పాత్రకు వెయిట్ తీసుకొచ్చారు. ఈ సినిమాలో శర్వానంద్ డేరింగ్ అండ్ డ్యాషింగ్ బైక్ రేసర్ పాత్రలో కనిపిస్తారు’’ అని యూనిట్ పేర్కొంది.

చిన్న సినిమాలను ప్రోత్సహించాలి

- మధు యాష్కీ గౌడ్



● సుమన్ బాబు, కారుణ్య, మధు యాష్కీ గౌడ్, సుబ్బారెడ్డి

‘‘ఎర్ర చీర’ మూవీ ట్రైలర్ చాలా కొత్తగా అనిపించింది. కచ్చితంగా టికెట్ కొనుక్కుని ఈ సినిమా చూస్తాను. చిన్న నిర్మాతలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ సినిమాలు తీస్తున్నారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహం లభించాలి. సీఎం రేవంత్ రెడ్డిగారు అందుకు కృషి చేస్తున్నారు. ‘ఎర్ర చీర’ విజయం సాధించాలి’’ అని మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ పేర్కొన్నారు. సుమన్ బాబు దర్శకత్వం వహించి, లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఎర్ర చీర’. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా, బేబీ సాయి తేజస్విని ముఖ్య పాత్ర పోషించారు. బేబీ డమరి సమర్పణలో ఎన్వీవీ సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 6న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి మధు యాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్వీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ– ‘‘300 థియేటర్స్‌లో మా సినిమాను రిలీజ్ చేస్తున్నాం’’ అని చెప్పారు.

అదే పట్టుదలతో...

● రామ్‌చరణ్

‘‘అతను వచ్చే తేదీ మారొచ్చు... కానీ అతని పట్టుదల కాదు’’ అంటూ ‘పెద్ది’ సినిమా విడుదల వాయిదా పడిన విషయాన్ని ప్రకటించారు మేకర్స్. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఏప్రిల్ 30న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ‘‘ఇప్పటివరకూ కనిపించని ఓ విభిన్న పాత్రలో రామ్‌చరణ్ ఈ సినిమాలో కనిపిస్తారు. అన్ని దక్షిణాది భాషలు, హిందీలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30న రిలీజ్ చేస్తాం. వేసవి సెలవులు మా సినిమాకి ఉపయోగపడతాయి’’ అని నిర్మాత తెలిపారు. మల్టీ స్పోర్ట్స్ మూవీగా సాగే ఈ చిత్రంలో రామ్‌చరణ్ పట్టుదల గల క్రీడాకారుడిగా కనిపించనున్నారు. అందుకే విడుదల తేదీని వాయిదా వేసిన విషయాన్ని ప్రకటిస్తూ... ‘అతను వచ్చే తేదీ మారొచ్చు... కానీ అతని పట్టుదలలో మార్పు లేదు’ అని మేకర్స్ పేర్కొన్నారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

మారెమ్మ టీజర్ చాలా బాగుంది

- బాబీ కొల్లి

● మాధవ్, బాబీ, దీపా బాలు

‘‘రవితేజగారు సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చారు. ఆయనతో పని చేస్తున్నప్పుడు మాధవ్‌ని చూస్తుండేవాణ్ణి. రవితేజగారిలాగే మాధవ్ తన కాళ్ల మీద తను నిలబడాలని కోరుకుంటున్నారు. ‘మారెమ్మ’ టీజర్ చాలా బాగుంది. మంచి పాయింట్ చుట్టూ కథ నడిపారనిపిస్తోంది. టీజర్ ఎంత అద్భుతంగా ఉందో సినిమా కూడా అంత ఎగ్జయిటింగ్‌గా ఉంటుందని నమ్ముతున్నాను’’ అని డైరెక్టర్ బాబీ కొల్లి చెప్పారు. హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం ‘మారెమ్మ’. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దీపా బాలు కథానాయికగా నటించారు. మయూర్ రెడ్డి బండారు నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ‘మారెమ్మ’ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి బాబీ కొల్లి ముఖ్య అతిథిగా హాజరై, టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ– ‘‘నాగరాజుగారు ఈ మూవీని అద్భుతంగా తీశారు. విహారి మ్యూజిక్ ఇరగదీశాడు. నాకు అవకాశమిచ్చిన నిర్మాతలకు థ్యాంక్స్’’ అని తెలిపారు. ‘‘మా సినిమా అందరికీ నచ్చుతుంది’’ అన్నారు మంచాల నాగరాజు. ‘‘ఇది నా తొలి తెలుగు సినిమా’’ అని దీపా బాలు చెప్పారు. నటుడు వికాస్ వశిష్ఠ, సహ నిర్మాత కుశాల్ రెడ్డి మాట్లాడారు.

థ్రిల్లింగ్ క్యాట్

● అడివి శేష్, జీవీ నాయుడు

జీవీ నాయుడు, వీజే బాలు, లావణ్య, కల్యాణీ రాణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘క్యాట్’. జీవీ నాయుడు దర్శకత్వంలో వీఆర్‌జీఆర్ మూవీస్ పై వై. గంగాధర్ ఐపీఎస్ సమర్పణలో రజనీ గొంగటి ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అడివి శేష్ ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేసి, ‘‘ఈ చిత్రం నటీనటులు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు. ‘క్యాట్’ మంచి విజయం సాధించాలి’’ అని పేర్కొన్నారు. ‘‘థ్రిల్లర్ జానర్‌లో రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది’’ అని దర్శక–నిర్మాతలు తెలిపారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	79	83,818
నిఫ్టీ ▲	48	25,776

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,743	▽	512
డోజోన్స్	49,202	▽	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,427	▽	112
డాక్స్	24,715	▽	66
షాంఘై	4,102	△	34
నికాయ్	54,249	▽	427

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.00	91.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	122.47	125.51
€	యూరో	ఎస్‌బీఐ	105.58	108.42
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.19	58.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	62.36	64.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.82	72.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.15	13.97

సిల్వర్.. అదే ఫైర్

- రూ. 2.98 లక్షలకు అప్
- రూ.14,300 ర్యాలీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పటిష్టమైన ట్రెండ్స్, డాలరు బలహీనంగా ఉండటంతో వెండి, పసిడి రెండో రోజూ జోరు కొనసాగించాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం వెండి కేజీకి రూ. 14,300 ఎగిసి రూ. 2,98,300కి చేరింది. అటు 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రూ. 7,400 పెరిగి రూ. 1,65,100 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో సిల్వర్ ఔన్సుకి (31.1 గ్రాములు) 4.28 డాలర్లు పెరిగి 89.35 డాలర్లకు, పసిడి 100 డాలర్లు పెరిగి 5,047.07 డాలర్లకి చేరాయి.

హైదరాబాద్‌లో యాపిల్ స్టోర్

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ భారత్‌లో తమ రిటైల్ స్టోర్స్‌ని విస్తరిస్తోంది. హైదరాబాద్‌లోనూ కొత్త స్టోర్ ప్రారంభించడంపై కసరత్తు చేస్తోంది. ఇందుకోసం స్టోర్ లీడర్, సీనియర్ మేనేజర్ మొదలైన ఉద్యోగాలను తమ కెరియర్ పోర్టల్‌లో పోస్ట్ చేసింది. సాధారణంగా స్టోర్‌ని ప్రారంభించడానికి యాపిల్ సుమారు ఏడాది ముందు నుంచి రిక్రూట్‌మెంట్ చేపడుతుందని, దీన్ని బట్టి చూస్తే హైదరాబాద్ స్టోర్ 2027 తొలి నాళ్లలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2020లో భారత్‌లో ఆన్‌లైన్ స్టోర్‌ని ప్రారంభించిన యాపిల్ ఆ తర్వాత ముంబై, ఢిల్లీలో ఆఫ్‌లైన్ స్టోర్స్‌ని ఏర్పాటు చేసింది.

ఇండియా టీచింగ్.. వరల్డ్ లెర్నింగ్

దేశీ ఎడ్‌టెక్ ఎక్స్‌పోర్ట్ స్టోరీ స్టార్ట్

- థాయ్, వియత్నాం టార్గెట్
- బెంగళూరు నుంచి బ్యాంకాక్ వరకు ఎడ్‌టెక్ దూకుడు
- యూఏఈ నుంచి ఇండోనేసియా వరకు మన కంపెనీల హవా
- క్యూలో అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 25 శాతం వరకు ఆదాయం

సాక్షి, బిజినెస్‌డెస్క్

దేశీ ఎడ్‌టెక్ కంపెనీలు అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో విదేశాల బాట పడుతున్నాయి. పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలకు విద్యా వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తున్నాయి. అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. మన ఎడ్‌టెక్ కంపెనీలు ప్రధానంగా ఆగ్నేయాసియా, దక్షిణాసియాపై దృష్టి పెడుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వియత్నాం, థాయ్‌ల్యాండ్, ఇండొనేసియా, ఫిలిప్పీన్స్‌లాంటి మార్కెట్లలో విస్తరిస్తున్నాయి. ఆయా మార్కెట్లలో వినియోగదారుల ప్రొఫైల్ దాదాపు మన దేశం తరహాలోనే ఉండటం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

థాయ్, వియత్నాంలో అప్‌గ్రాడ్: టీమ్‌లీజ్ గణాంకాల ప్రకారం ఆగ్నేయాసియా, ఆఫ్రికా తదితర మార్కెట్లలో 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు 2 కోట్ల మంది పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాలపై మన సంస్థలు దృష్టి పెడుతున్నాయి. బెంగళూరుకు చెందిన అప్‌గ్రాడ్ సంస్థ థాయ్‌ల్యాండ్, వియత్నాంలో కార్యకలాపాలు విస్తరించింది. అలాగే యూఏఈ, మేనా ప్రాంతంలో (మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) వర్క్‌ఫోర్స్ శిక్షణకు సంబంధించి వివిధ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే సింప్లీలెర్న్ కంపెనీ వివిధ సంస్థలు, ప్రభుత్వాల భాగస్వామ్యాలతో అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియావ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక కిడ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం అయిన బ్రైట్‌ఛాంప్స్ సంస్థ ఏకంగా 30 పైగా దేశాల్లో విస్తరించింది. యూఏఈ, సౌదీ అరేబియా, వియత్నాం మొదలైనవి వీటిలో ఉన్నాయి.

ఆకర్షణీయంగా ఆగ్నేయాసియా: వియత్నాం, థాయ్‌ల్యాండ్ లాంటి ఆగ్నేయాసియా దేశాలు వేగంగా డిజిటల్ ఎకానమీలుగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో కెరియర్ పురోగతికి సంబంధించిన కోర్సులను నేర్చుకోవడంపై పెరుగుతున్న ఆసక్తిని అవకాశంగా మల్చుకోవడంపై ఎడ్‌టెక్ కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. 2024–25లో అప్‌గ్రాడ్ ఆదాయంలో అంతర్జాతీయ మార్కెట్ల వాటా 20–25 శాతంగా నమోదైంది. అటు సింప్లీలెర్న్ అంతర్జాతీయ యూజర్లలో 11 శాతం మంది బ్రిటన్, పశ్చిమాసియాలో ఉన్నారు. ఇక తమ గ్లోబల్ యూజర్లలో 30 శాతం మంది ఆగ్నేయాసియా, దక్షిణాసియా వారు ఉన్నారని బ్రైట్‌ఛాంప్స్ పేర్కొంది.

అంతర్జాతీయంగా పోటీ: మన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్నప్పటికీ అంతర్జాతీయ దిగ్గజాల నుంచి పోటీ ఎదుర్కొనాల్సి వస్తోంది. యుడెమి, ఎరుడైటస్, యుడాసిటీ, కోర్సెరాలాంటి గ్లోబల్ సంస్థలు కూడా ఈ ప్రాంతాల్లో దూకుడుగా విస్తరిస్తున్నాయి. తమకు విదేశీ మార్కెట్లలో కోర్సెరా, ఎరుడైటస్ నుంచి పోటీ ఉంటోందని అప్‌గ్రేడ్ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఎమెరిటస్, కోర్సెరా, యుడాసిటీలను సింప్లీలెర్న్ ఢీకొంటోంది. మిగతా సంస్థలతో పోలిస్తే తక్కువ వ్యయాలతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా, నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా దేశీ కంపెనీలు.. ఆయా మార్కెట్లలో పటిష్టపడేందుకు ప్రయత్నిస్తున్నాయి. లీడ్ గ్రూప్ ఈ ఏడాది 1,200 పాఠశాలలతో భాగస్వామ్యాలను లక్ష్యంగా పెట్టుకుంది.

షేక్ చేసిన ఐటీ షేర్స్

- ఏఐలో కొత్త టూల్స్ ఆవిష్కరణతో టెక్నాలజీ షేర్లు డీలా
- ఇంట్రాడేలో భారీగా నష్టపోయిన సూచీలు
- ఆదుకున్న ఐసీఐసీఐ, రిలయన్స్
- స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు

ముంబై: ఐటీ షేర్ల అమ్మకాలతో వాటిల్లిన నష్టాలను భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఐసీఐసీఐ బ్యాంకు(1.37%), రిలయన్స్ ఇండస్ట్రీస్(1.30%), ఎటర్నల్(5.22%) షేర్లు రాణించి సూచీలను కోలుకునేందుకు దోహదపడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్ 79 పాయింట్ల లాభంతో 83,818 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్లు పెరిగి 25,776 వద్ద నిలిచింది. అయితే ఒక దశలో సెన్సెక్స్ 619 పాయింట్లు క్షీణించి 83,120 వద్ద, నిఫ్టీ 164 పాయింట్లు కోల్పోయి 25,564 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

➤ బీఎస్‌ఈ ఇండెక్సుల్లో రంగాల వారీగా యుటిలిటీ 2.72%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 2.37%, కన్జూమర్ డ్యూరబుల్స్ 2.36%, విద్యుత్ 2.18%, ఇంధన 1.91%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.56%, మెటల్ 1.27% పతనమయ్యాయి.

ఐటీ కంపెనీల షేర్ల క్రాష్: అమెరికాలో కొత్త ఏఐ టూల్స్ రావడంతో భారత ఐటీ షేర్లు కుదేలయ్యాయి. అమెరికా ఏఐ స్టార్టప్ కంపెనీ ఆంత్రోపిక్ తన క్లాడ్ చాట్‌బాట్ కోసం 11 కొత్త ప్లగిన్‌లను ఆవిష్కరించింది. ఈ కొత్త ఏఐ టూల్స్‌తో ఐటీ, సాఫ్ట్‌వేర్, డేటా అనలిటిక్స్ కంపెనీలకు పెద్ద ముప్పు వాటిల్లుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో అమెరికా, యూరప్ మార్కెట్లలో ఐటీ స్టాక్‌లు భారీగా పడ్డాయి. ఈ పరిణామాలకు తోడు కంపెనీల వాల్యుయేషన్లు గరిష్టాల్లో ట్రేడవుతుండటంతో దేశీయ ఐటీ కంపెనీల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఇన్ఫోసిస్ 7.19%, టీసీఎస్ 7%, ఎల్‌అండ్‌టీమైండ్‌ట్రీ 5.51% హెక్సావేర్ 4.98%, హెచ్‌సీఎల్ టెక్ 4.22%, టెక్ మహీంద్రా 4.12% పడ్డాయి.

ఒక్కటి కాదు వస్తున్నాయ్... 100 రిలయన్స్‌లు

- ప్రపంచానికి గ్రోత్ ఫ్యాక్టరీ భారత్
- ఏఐ భయం కాదు దేశానికి వరం
- రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ
- ఇది భారత్ శకం: బ్లాక్‌రాక్ చైర్మన్ ల్యారీ ఫింక్

ముంబై: దేశాభివృద్ధికి శాంతి భద్రతలు, స్థిరమైన నాయకత్వం కీలకమని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చెప్పారు. భారత్ నిలకడగా రెండంకెల స్థాయి వృద్ధిని సాధించడం సాధ్యమేనని స్పష్టం చేశారు. జియోబ్లాక్‌రాక్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. పటిష్టమైన ఆర్థిక ప్రగతికి 15–20 ఏళ్ల పాటు శాంతి భద్రతలు, సామాజిక సామరస్యత అవసరమని తెలిపారు. సమాచారం, వినియోగం, వాణిజ్యంలాంటి అంశాల్లో పరివర్తనకు భారత్ సాంకేతికతను ఉపయోగించుకుంటున్న తీరు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 100 కంపెనీలు కొత్తగా రిలయన్స్ స్థాయికి ఎదిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అంబానీ చెప్పారు.

ఏఐ గురించి ఆందోళన వద్దు: ఏఐ గురించి భయపడనక్కర్లేదని, పారిశ్రామిక విప్లవంతో కొంత ఆందోళనకర పరిస్థితి ఏర్పడినా, మానవాళి ముందుకే సాగిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. దేశీయంగా ప్రతి గ్రామంలోనూ 5జీ నెట్‌వర్క్ ఉందని, మిగతా ఏ దేశంతో పోల్చినా మెరుగ్గా, చౌకగా 5జీ సేవలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

మార్కెట్‌తోనే సంపద సాధ్యం: ల్యారీ ఫింక్: రాబోయే రోజుల్లో పది సంవత్సరాలకు పైగా భారత్ ఏటా 8–10 శాతం వృద్ధి చెందుతుందని, ఇది భారత్ శకం అని గ్లోబల్ అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ చైర్మన్ ల్యారీ ఫింక్ చెప్పారు. భారతీయులు డబ్బంతా బ్యాంక్ డిపాజిట్లలోనే ఉంచకుండా క్యాపిటల్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక ప్రయోజనం పొందవచ్చని ఆయన తెలిపారు. ఇందుకు అమెరికానే నిదర్శనమని ఫింక్ చెప్పారు. వచ్చే అయిదేళ్లలో దేశీయంగా మ్యుచువల్ ఫండ్స్ ఏయూఎం ప్రస్తుత రూ.

80 లక్షల కోట్ల నుంచి రెట్టింపు స్థాయికి పెరుగుతుందని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ కేవీ కామత్ చెప్పారు. టెక్నాలజీ, ఆర్థిక రంగాల్లో మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో బ్యాంకులు తమను తాము సరికొత్తగా తీర్చిదిద్దుకోవాల్సి ఉంటుందన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హోండా 2 వీలర్ స్పెషల్ ఎడిషన్లు
నియామకాలను శాసిస్తున్న ఏఐ!

స్పీడ్ మీదున్న సేవల రంగం

- జనవరిలో పీఎంఐ 58.5
- రెండు నెలల గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ: తయారీ మాదిరే సేవల రంగం సైతం జనవరిలో జోరు చూపించింది. కార్యకలాపాలు రెండు నెలల గరిష్ట స్థాయికి చేరాయి. కొత్త ఆర్డర్లు రావడం సేవల వృద్ధికి, ఉపాధి కల్పనకు దారితీసింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సేవల రంగ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ జనవరిలో 58.5 పాయింట్లకు పెరిగింది. డిసెంబర్‌లో ఇది 58 పాయింట్లుగా ఉంది. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పరంగా 50 పాయింట్లకు పైన విస్తరణగా పరిగణిస్తుంటారు. కొత్త ఆర్డర్లు రావడం రెండు నెలల గరిష్టానికి చేరినట్టు, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నుంచి డిమాండ్ పెరగడం వృద్ధికి అనుకూలించినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. ప్రధానంగా దేశీ ఆర్డర్లలో ఎక్కువ వృద్ధి నెలకొన్నట్టు సేవల రంగ పీఎంఐ సర్వే నివేదిక తెలిపింది.

ఇషా సింగ్‌కు రెండు స్వర్ణ పతకాలు

ఆసియా సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ ఇషా సింగ్ రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. న్యూఢిల్లీలో బుధవారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో 21 ఏళ్ల ఇషా మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో, టీమ్ విభాగంలో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. వ్యక్తిగత ఫైనల్లో ఇషా సింగ్ 239.8 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. టీమ్ విభాగంలో ఇషా, సురుచి, మను భాకర్‌లతో కూడిన భారత బృందం 1726 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సామ్రాట్ రాణా 220.3 పాయింట్లతో కాంస్యం గెలిచాడు. టీమ్ విభాగంలో సామ్రాట్ రాణా, శ్రవణ్, వరుణ్‌లతో కూడిన భారత జట్టు రజతం నెగ్గింది. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో గావిన్ ఆంటోనీ స్వర్ణం సాధించాడు. టీమ్ విభాగంలో గావిన్, చిరాగ్, ముకేశ్ నేలవల్లి (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత బృందం పసిడి పతకం నెగ్గింది.

భారత్‌ను గెలిపించిన శ్రీకాంత్

కింగ్డావో (చైనా): ఆసియా సీనియర్ బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. గ్రూప్ 'సి'లో భాగంగా సింగపూర్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3–2తో గెలిచింది. ఇరు జట్లు చెరో రెండు మ్యాచ్‌లు నెగ్గి స్కోరు 2–2తో సమమైన దశలో... నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. 40 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 21–15, 21–16తో జియా వె జోయల్ కో (సింగపూర్)పై నెగ్గి భారత్‌కు 3–2తో విజయాన్ని అందించాడు. అంతకుముందు తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ 16–21, 21–19, 16–21తో ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యెవ్ చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ 21–10, 21–8తో ఇంగ్ కీట్ వెస్లీ కో–జున్‌సుకె కుబో జంటపై గెలిచింది. మూడో మ్యాచ్‌లో ఆయుశ్ శెట్టి 21–17, 21–15తో జియా హెంగ్ జేసన్ టెను ఓడించి భారత్‌ను 2–1తో ఆధిక్యంలో నిలిపాడు. నాలుగో మ్యాచ్‌లో పృథ్వీ కృష్ణమూర్తి–సాయి ప్రతీక్ ద్వయం 21–8, 21–23, 20–22తో ఎన్జీ జూ జె–డొనోవాన్ విలార్డ్ వీ జంట చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2–2తో సమమైంది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడుతుంది.

మరోవైపు గ్రూప్ 'వై'లో భారత మహిళల జట్టు 5–0తో మయన్మార్ జట్టుపై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున సింగిల్స్‌లో తన్వీ శర్మ, మాళవిక, రక్షిత శ్రీ, డబుల్స్‌లో ప్రియ–శ్రుతి మిశ్రా; ట్రెసా జాలీ–గాయత్రి జోడీలు గెలుపొందాయి. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత్ ఆడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రికార్డు ఛేదనతో ఫైనల్‌కు...

సెమీస్‌లో భారత అండర్-19 జట్టు ఘనవిజయం

7 వికెట్ల తేడాతో ఓడిన అఫ్గానిస్తాన్ • ఆరోన్ జార్జ్ సెంచరీ
మెరిపించిన వైభవ్, ఆయుశ్ • రేపు ఇంగ్లండ్‌తో ప్రపంచకప్ ఫైనల్

ఆరోన్ జార్జ్

హరారే: ఐదుసార్లు చాంపియన్ భారత జట్టు అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో మరో టైటిల్ కోసం తుది పోరుకు అర్హత సాధించింది. అజేయ జైత్రయాత్ర కొనసాగిస్తూ ఆయుశ్ మాత్రే బృందం... అండర్–19 స్థాయిలో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా రికార్డు సృష్టించింది. మరో 53 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకొని తమ స్థాయిని ప్రదర్శించింది. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత్ 7 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ జట్టును చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఫైసల్ (110; 15 ఫోర్లు), ఉజేరుల్లా (101 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. అనంతరం భారత్ 41.1 ఓవర్లలో 3 వికెట్లకు 311 పరుగులు సాధించి విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... హైదరాబాద్ ప్లేయర్ ఆరోన్ జార్జ్ (104 బంతుల్లో 115; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించగా... వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ ఆయుశ్ మాత్రే (62; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

భారీ భాగస్వామ్యం...

ఓపెనర్లు ఉస్మాన్ (39; 3 ఫోర్లు), ఖాలిద్ అహ్మద్‌జాయ్ (31; 4 ఫోర్లు, 1 సిక్స్‌లు) జాగ్రత్తగా ఆడుతూ అఫ్గానిస్తాన్‌కు శుభారంభం అందించారు. తొలి 10 ఓవర్లలో జట్టు 42 పరుగులు చేసింది. అయితే ఖాలిద్‌ను అవుట్ చేసి దీపేశ్ ఈ జోడీని విడదీయగా, కొద్ది సేపటికి ఉస్మాన్ కూడా వెనుదిరిగాడు. ఈ దశలో ఫైసల్, ఉజేర్ శతక భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరును అందించింది. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు చకచకా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 86 బంతుల్లో ఫైసల్ సెంచరీ పూర్తయింది. అతనికి టోర్నీలో ఇది వరుసగా రెండో శతకం. అంబరీశ్ వేసిన ఓవర్లో ఉజేర్ వరుసగా 6, 4, 4, 4 బాది జోరు పెంచగా, దీపేశ్ చక్కటి బంతితో ఫైసల్ ఆట ముగించాడు. అజీజుల్లా (12) విఫలం కాగా, ఆఖరి ఓవర్లో ఉజేర్ సెంచరీని (85 బంతుల్లో) అందుకున్నాడు.

వైభవ్

వైభవ్ మెరుపులు...

తొలి బంతిని ఆరోన్ ఫోర్ కొట్టడంతో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభం కాగా, వైభవ్ ఎప్పటిలాగే తనదైన శైలిలో చెలరేగిపోయాడు. వహీదుల్లా ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన వైభవ్ 22 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను ఉజేర్ వదిలేశాడు. అనంతరం వహీదుల్లా తర్వాతి ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిన వైభవ్...అజీజ్ ఓవర్లో కూడా 3 ఫోర్లు, సిక్స్ బాది 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఎట్టకేలకు 90 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం తర్వాత వైభవ్ అవుటయ్యాడు. అనంతరం ఆరోన్, ఆయుశ్ కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించారు. 20 పరుగుల వద్ద తాను ఇచ్చిన సులువైన క్యాచ్‌ను వహీదుల్లా వదిలేయడంతో బతికిపోయిన ఆరోన్ దానిని సమర్థంగా వాడుకున్నాడు. రూహుల్లా ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన ఆయుశ్ 43 బంతుల్లో హాఫ్ సెంచరీకీ చేరగా, ఆరోన్ 52 బంతుల్లో ఈ మైలురాయిని దాటాడు. కెప్టెన్ వెనుదిరిగిన తర్వాత విహాన్ (38 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి ఆరోన్ బాధ్యత తీసుకున్నాడు. చూడచక్కటి బౌండరీలు కొట్టిన ఆరోన్ 95 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. విజయానికి 11 పరుగుల దూరంలో అతను అవుటైనా... విహాన్, వేదాంత్ (5 నాటౌట్) మ్యాచ్ ముగించారు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: ఉస్మాన్ (సి) దీపేశ్ (బి) కనిష్క్ 39; ఖాలిద్ (సి) కుందు (బి) దీపేశ్ 31; ఫైసల్ (బి) దీపేశ్ 110; ఉజేరుల్లా (నాటౌట్) 101; అజీజుల్లా (సి) ఖిలాన్ (బి) కనిష్క్ 12; అజీజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 310. వికెట్ల పతనం:** 1–53, 2–117, 3–265, 4–293. **బౌలింగ్:** అంబరీశ్ 9–0–65–0, హెనిల్ 10–0–56–0, దీపేశ్ 10–0–64–2, ఖిలాన్ 10–0–49–0, కనిష్క్ 9–0–55–2, ఆయుశ్ 2–0–14–0.

భారత్ ఇన్నింగ్స్: ఆరోన్ జార్జ్ (సి) (సబ్) నజీఫుల్లా (బి) వహీదుల్లా 115; వైభవ్ సూర్యవంశీ (సి) ఉస్మాన్ (బి) నూరిస్తానీ 68; ఆయుశ్ మాత్రే (సి) ఉస్మాన్ (బి) నూరిస్తానీ 62; విహాన్ (నాటౌట్) 38; వేదాంత్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 3 వికెట్లకు) 311. వికెట్ల పతనం:** 1–90, 2–204, 3–300. **బౌలింగ్:** అజీజ్ 10–0–70–0, వహీదుల్లా 7.1–0–67–1, నూరిస్తానీ 10–0–64–2, ఖాతిర్ 9–0–52–0, రూహుల్లా 4–0–35–0, ఉజేరుల్లా 1–0–8–0.

డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో జెమీమా, స్మృతి

ఢిల్లీ... ఈసారైనా?

- టైటిల్ గెలిచేందుకు క్యాపిటల్స్‌కు నాలుగో అవకాశం
- రెండో ట్రోఫీ వేటలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు
- నేడు మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్ పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రసారం

వడోదర: ఒకటి కాదు రెండు కాదు...వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు... గత మూడు ప్రయత్నాల్లోనూ తుది మెట్టుపై చతికిలపడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సారైనా తమ తొలి కప్ కలను నెరవేర్చుకోవాలని ఒకవైపు పట్టుదలగా ఉంది. మరోవైపు అద్భుత ఫామ్‌తో అగ్రస్థానంలో నిలిచి తుది పోరుకు నేరుగా అర్హత సాధించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు రెండోసారి ట్రోఫీని సొంతం చేసుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్ ఫైనల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. నేడు జరిగే టైటిల్ పోరులో 2024 చాంపియన్ ఆర్‌సీబీతో ఢిల్లీ తలపడనుంది.

జోరు మీదున్న స్మృతి బృందం

అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ లీగ్ చరిత్రలో వరుసగా ఐదు విజయాలు సాధించిన తొలి జట్టుగా నిలిచింది. కెప్టెన్ స్మృతి మంధాన 290, గ్రేస్ హారిస్ 228 పరుగులు నమోదు చేశారు. రిచా ఘోష్ 150కి పైగా స్ట్రయిక్‌రేట్‌తో దూకుడును ప్రదర్శించింది. ఆల్‌రౌండర్‌గా డిక్లెర్క్ అంచనాలకు మించి రాణించింది. 15 వికెట్లు తీసిన డిక్లెర్క్ బ్యాటింగ్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడింది. ప్రధాన పేసర్ లారెన్ బెల్ ప్రత్యర్థిని ఆరంభంలోనే కట్టిపడేస్తోంది. ఈ సీజన్‌లో ఆమె ఏకంగా 116 డాట్ బాల్స్ వేయడం విశేషం. స్పిన్నర్ శ్రేయాంక కూడా 11 వికెట్లతో రాణించగా, ఎలైస్ పెరీ స్థానంలో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన సయాలీ కూడా నమ్మకాన్ని నిలబెట్టుకుంది. ఇదే జోరును అందరూ కొనసాగిస్తే బెంగళూరుకు మరో విజయం దక్కవచ్చు.

బ్యాటర్లదే బాధ్యత...

ఢిల్లీ ఈ సీజన్‌లో సాధించిన ఐదు విజయాలు కూడా ఛేదనలోనే వచ్చాయి. తొలుత బ్యాటింగ్ కంటే టీమ్ ఛేదనకే ఆసక్తి చూపిస్తోంది. అయితే ఫైనల్ ఒత్తిడిని ఏమేరకు అధిగమిస్తుందనేది ఆసక్తికరం. గత సీజన్ ఫైనల్లో ఢిల్లీ ఛేదనలోనే ఓడిపోయింది. తాజా సీజన్‌లో కొత్త కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ నేతృత్వంలో జట్టు మెరుగైన ప్రదర్శనే కనబర్చింది. వన్డే వరల్డ్ కప్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న జెమీమా నాయకురాలిగా తొలి అవకాశాన్ని సమర్థంగా ఉపయోగించుకుంది. ఓపెనర్లు షఫాలీ, లిజెల్ లీ తొలి వికెట్‌కు కనీసం అర్ధ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన మూడు మ్యాచ్‌ల్లో కూడా ఢిల్లీ గెలిచింది. మూడో స్థానంలో వోల్‌వార్ట్ నిలకడగా ఆడుతుండగా, జెమీమా కూడా ఎలిమినేటర్‌లో చక్కటి ఇన్నింగ్స్ ఆడింది. బౌలింగ్‌లో మరోసారి శ్రీచరణి (14 వికెట్లు), నందిని శర్మ (16 వికెట్లు), స్నేహ్ రాణాలపై జట్టు ఆధారపడుతోంది. పేసర్ షినెల్ హెన్రీ కూడా ప్రభావం చూపించగలదు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌బీలో 22,195 గ్రూప్–డి పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో లెవల్–1 గ్రూప్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22,195.
» **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, కోల్‌కతా, ముంబై, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్.
» **విభాగాలు:** ట్రాఫిక్, ఇంజనీరింగ్, మెకానికల్ మొదలైనవి.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ అర్హత ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.01.2026నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.18,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 31.01.2026.
» **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 04.03.2026.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 05.03.2026 నుంచి 14.03.2026 వరకు
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.03.2026
» **వెబ్‌సైట్:** https://www.rrbapply.gov.in

ఐఐటీ సమ్మర్ ఫెలోషిప్–2026

ఐఐటీ మద్రాస్ వేసవి కాలంలో రెండు నెలలపాటు ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాల్లో విద్య పరిశోధనపై విద్యార్థుల్లో అవగాహన, ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఐఐటీ సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్–2026 నిర్వహిస్తుంది. ఆసక్తి కలిగిన, అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **ఫెలోషిప్‌లో పాల్గొనే ఇంజనీరింగ్ విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అప్లైడ్ మెకానిక్స్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఏఐ, ఇంజనీరింగ్ డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెటలార్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఓషన్ ఇంజనీరింగ్.
» **ఫెలోషిప్‌లో పాల్గొనే సైన్స్ విభాగాలు:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్‌మేటిక్స్.
» హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్
» మేనేజ్‌మెంట్ స్టడీస్.
» **అర్హత:** బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్) మూడో సంవత్సరం లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో మూడు/నాలుగో సంవత్సరం చదువుతున్నవారితో పాటు మంచి అకడమిక్ రికార్డ్ కలిగిన ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు అనర్హులు.
» **స్టైపెండ్:** ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.15,000 చెల్లిస్తారు.
» **వసతి:** రెండు నెలల కాలానికి హాస్టల్, మెస్ సదుపాయం ఉంటుంది. దీనికి కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.02.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.03.2026
» **ఫెలోషిప్ ప్రోగ్రామ్:** 18.05.2026న ప్రారంభమై 17.07.2026తో ముగుస్తుంది.
» **వెబ్‌సైట్:** https://ssp.iitm.ac.in

జేఈఈ(మెయిన్)–2026 సెషన్–II

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీల్లో బీటెక్/బీఆర్క్ సీట్ల భర్తీకి జేఈఈ(మెయిన్)–2026 సెషన్–II ప్రవేశ పరీక్ష షెడ్యూళ్లను విడుదల చేసింది. 2026 సెషన్–I పరీక్షలు జనవరి 21 నుంచి 29 మధ్య జరిగాయి. గతంలో ఒకేసారి రెండు విడతలకు దరఖాస్తు చేసినవారు మళ్లీ ఇప్పుడు చేయాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ఈ చివరి విడత పూర్తయ్యాక రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ర్యాంక్‌ను కేటాయిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.02.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.02.2026
» **పరీక్ష తేదీలు:** 02.04.2026 నుంచి 09.04.2026 తేదీల మధ్య జరుగుతాయి.
» **ఫలితాల వెల్లడి తేది:** 20.04.2026.
» **వెబ్‌సైట్:** https://jeemain.nta.nic.in

కోర్ట్ కొలువుల పిలుపు

» తెలంగాణ జిల్లా కోర్టులలో ఉద్యోగాలు
» మొత్తం 859 పోస్టులు

ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే వారికి.. అందులోనూ సొంత జిల్లాల్లోనే.. అవి ఉంటే బాగుంటుందని ఆలోచించే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా కోర్టుల్లో పలు ఉద్యోగాల భర్తీకి తెలంగాణ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతి మొదలు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత వరకూ.. ఆయా పోస్టులను బట్టి దరఖాస్తుకు అర్హత కల్పించారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ జిల్లా కోర్టుల్లోని ఉద్యోగ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపేందుకు మార్గాలు, తదితర వివరాలు..

మొత్తం 859 పోస్టులు

తెలంగాణ హైకోర్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం–తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కోర్టులలో కలిపి మొత్తం తొమ్మిది హోదాల్లో 859 ఉద్యోగాల భర్తీ చేయనున్నారు.

కాపీయిస్ట్: 63 పోస్టులు

✦ **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ టైప్ రైటింగ్‌లో హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండాలి. నిమిషానికి 45 పదాలు టైప్ చేయగలిగే సామర్థ్యం ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** ఇంగ్లిష్ టైప్ రైటింగ్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. కంప్యూటర్‌ను వినియోగించి పది నిమిషాలపాటు స్కిల్ టెస్ట్‌లో పాల్గొనాలి. నిమిషానికి 45 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.
✦ **వయసు:** జూలై 1, 2026 నాటికి 18–46 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు కల్పించారు.

ఎగ్జామినర్: 49 పోస్టులు

✦ **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18–46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** 100 ప్రశ్నలు–100 మార్కులతో రాత పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ నాలెడ్జ్ నుంచి 60 ప్రశ్నలు, జనరల్ ఇంగ్లిష్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

ఫీల్డ్ అసిస్టెంట్: 61 పోస్టులు

✦ **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** జనరల్ నాలెడ్జ్ 60 ప్రశ్నలు–60 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు–40 మార్కులకు చొప్పున మొత్తం 100 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు.

జూనియర్ అసిస్టెంట్: 159 పోస్టులు

✦ **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** 100 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ నుంచి 60 ప్రశ్నలు, ఇంగ్లిష్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు.

ఆఫీస్ సబార్డినేట్: 319 పోస్టులు

✦ **అర్హత:** ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఏ తరగతి ఉత్తీర్ణులైన దరఖాస్తు చేసుకోవచ్చు.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** ఓఎంఆర్ ఆధారిత రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షను జనరల్ నాలెడ్జ్ విభాగంలో 45 మార్కులకు నిర్వహిస్తారు. తర్వాత దశలో అయిదు మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. రాత పరీక్షలో సాధించిన మార్కులను అనుసరించి ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ప్రాథమిక ఎంపిక జాబితాలో నిలిచిన వారికి ఇంటర్వ్యూ ఉంటుంది.

ప్రాసెస్ సర్వర్: 95 పోస్టులు

✦ **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 –46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** జనరల్ నాలెడ్జ్ విభాగం నుంచి 45 మార్కులకు నిర్వహించే రాత పరీక్ష; తదుపరి దశలో 5 మార్కులకు జరిపే ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

రికార్డ్ అసిస్టెంట్: 36 పోస్టులు

✦ **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** మొత్తం 100 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ నుంచి 60 ప్రశ్నలు–60 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ నుంచి 40 ప్రశ్నలు –40 మార్కులకు చొప్పున మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.

స్టెనోగ్రాఫర్ గ్రేడ్–3.. 35 పోస్టులు

✦ **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు ఇంగ్లిష్ టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులవ్వాలి(నిమిషానికి 45 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది). అదేవిధంగా ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండాలి(నిమిషానికి 120 పదాల నైపుణ్యం కలిగుండాలి).
✦ **ఎంపిక విధానం:** షార్ట్ హ్యాండ్ పరీక్షలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. అయిదు నిమిషాల వ్యవధిలో నిమిషానికి 120 పదాలు చొప్పున డిక్టేట్ చేస్తారు. వీటిని షార్ట్ హ్యాండ్ విధానంలో నోట్ చేసుకుని.. సదరు సారాంశాన్ని 45 నిమిషాల్లో కంప్యూటర్‌పై సమగ్రంగా టైప్ చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్షకు 100 మార్కులు కేటాయించారు.

టైపిస్ట్: 42 పోస్టులు

✦ **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ టైప్ రైటింగ్‌లో హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండాలి (నిమిషానికి 45 పదాలు టైప్ చేయగలిగే సామర్థ్యం ఉండాలి).
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి.
✦ **ఎంపిక విధానం:** ఇంగ్లిష్ టైప్ రైటింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. కంప్యూటర్‌పై 10 నిమిషాల వ్యవధిలో నిమిషానికి 45 పదాల చొప్పున టైప్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

✦ మొత్తం 859 పోస్టులు
✦ ఆయా పోస్టులను అనుసరించి 7–10వ తరగతి ఉత్తీర్ణత, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం.
✦ **వయసు:** 2026, జూలై 1 నాటికి 18 – 46 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
✦ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**2026, ఫిబ్రవరి 12
✦ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tshc.gov.in/showChildDocTypes?id=95

మంచి మార్కులకు మార్గం

ఆయా పోస్టులకు నిర్వహించే రాత పరీక్ష, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్–3, కాపీయిస్ట్ పోస్టులకు నిర్వహించే స్కిల్ టెస్ట్‌లలో మంచి స్కోర్ సాధించడానికి వీలుగా ప్రిపరేషన్ సాగించాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగంలో మంచి మార్కులకు తెలంగాణ చరిత్ర, తెలంగాణ ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టాలి. తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే విధంగా.. ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటి ఉద్దేశాలు తెలుసుకోవాలి. దీంతోపాటు విజన్ 2047, ఐటీ పాలసీలపై అవగాహన పొందాలి. దీంతోపాటు కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌ను చదవాలి. ఇందుకోసం దినపత్రికల్లోని సమకాలీన సమాచారాన్ని తెలుసుకోవాలి. చదివే సమయంలో.. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలుగా విభజించుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. దీంతో పాటు న్యాయ వ్యవస్థకు సంబంధించిన పద జాలం, ప్రధాన న్యాయమూర్తుల పేర్లు తెలుసుకోవాలి.

జనరల్ ఇంగ్లిష్

బేసిక్ గ్రామర్ అంశాలపై దృష్టి పెట్టాలి. వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రెహెన్షన్, సినానిమ్స్, యాంటానిమ్స్, ఇడియమ్స్/ఫ్రేజెస్, ఒన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్ విభాగాలపై పట్టు సాధించాలి. అదే విధంగా.. స్పెలింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్, ఫిల్లర్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

స్కిల్ టెస్ట్

టైపిస్ట్, కాపీయిస్ట్ పోస్టులకు ఉండే ఇంగ్లిష్ స్కిల్ టెస్ట్‌లో రాణించడానికి టైపింగ్ ప్రాక్టీస్ చేయాలి. ప్రతి రోజు కనీసం రెండు గంటలు ఇందుకోసం కేటాయించాలి. ముఖ్యంగా కంప్యూటర్‌పై టైప్ చేసే విధంగా ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలో పేర్కొన్న సమయానికి అనుగుణంగా టైమ్ నిర్దేశించుకుని ప్రాక్టీస్ చేయడంద్వారా టైపింగ్ వేగం, పదాల టైపింగ్‌లో కచ్చితత్వం వంటి వాటిని మెరుగుపరచుకోవచ్చు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3 ఉద్యోగాలకు ఉండే షార్ట్ హ్యాండ్ స్కిల్ టెస్ట్‌కు కూడా ప్రాక్టీస్ కీలకమని గుర్తించాలి. ఎవరితోనైనా ఏదైనా అంశాన్ని డిక్టేట్ చేయించుకుని.. దాన్ని పరీక్షలో పేర్కొన్న సమయానికి అనుగుణంగా నమూనా సమయంలో టైప్ చేయడం అలవర్చుకోవాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: బ్యాంకింగ్ అవేర్‌నెస్

చంద్రబాబు, పవన్ ఏకాంత చర్చలు

• తిరుమల లడ్డూ వ్యవహారంలో ఏం చేయాలనే దానిపై మంతనాలు
• రాజ్యసభ స్థానాల పంపకం, క్షేత్రస్థాయిలో రెండు పార్టీల మధ్య సమన్వయ లోపంపైనా చర్చ

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయిందని అడ్డగోలుగా విష ప్రచారం చేసి దొరికిపోయిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇద్దరూ రెండున్నర గంటలపాటు ఏకాంతంగా చర్చలు జరిపినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలు అబద్ధాలని సీబీఐ సిట్ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్ ద్వారా బయటకొచ్చిన నేపథ్యంలో వారి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. చంద్రబాబు శ్రీ వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగి పాపం మూటగట్టుకున్నారని ప్రజలు నమ్ముతుండడం.. వారు చెప్పిన అబద్ధాలను ఎంత సమర్థించుకుంటున్నా ప్రజలు నమ్మకపోవడంతో దీనిపై ఏం చేయాలని కూటమి నేతలు రెండ్రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. అందులో భాగంగానే చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ బుధవారం సమావేశమై చర్చించినట్లు తెలుస్తోంది.

ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోవడంతో..

ఇక లడ్డూ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయాలపై టీడీపీ శ్రేణులతో దాడి చేయించడం వల్ల ప్రభుత్వం తీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోవడంతో ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూడా వారిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ అంశంపైనే ఎక్కువగా వీరు మాట్లాడుకున్నట్లు టీడీపీ నేతల ద్వారా తెలిసింది. అలాగే, త్వరలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల పంపకం పైనా ప్రాథమికంగా చర్చలు జరిపారు. బీజేపీ రెండు రాజ్యసభ స్థానాలు తమకే కావాలని పట్టు బడుతుండడంతో దానిపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. టీడీపీ, జనసేన చెరొకటి పంచుకోవాలా లేక బీజేపీని ఒక్క స్థానంతో సరిపెట్టుకోవాలని ఒప్పించాలా అనే అంశాలపై మాట్లాడుకున్నట్లు తెలిసింది. అయితే, ఈసారి జనసేనకు ఒక స్థానం కచ్చితంగా ఇవ్వాలని చంద్రబాబును పవన్ కోరినట్లు తెలిసింది. అలాగే, తన సోదరుడు నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవడం వంటి అంశాలను కూడా పవన్ ప్రస్తావించినట్లు సమాచారం. దీంతోపాటు ఇంకా భర్తీ కావాల్సిన నామినేటెడ్ పదవులతోపాటు రెండు పార్టీల మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం లేకపోవడంవల్ల ఎదురవుతున్న సమస్యలపైనా చర్చించినట్లు తెలిసింది.

రెండేళ్లలోనే తీవ్ర వ్యతిరేకత

• రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక
• అంబటి ఇంటిపై దాడి నష్టం చేసింది
• శ్రీవారి లడ్డూ వ్యవహారాన్ని కక్ష సాధింపుగా భావిస్తున్నారు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే చంద్రబాబు కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. గుంటూరు నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుపైన, ఆయన ఇంటిపైన జరిగిన దాడి ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగించిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున ప్రజల్లో చర్చ జరిగిందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రెస్‌మీట్ పెట్టి, చేసిన హెచ్చరికలు ప్రభుత్వం పట్ల ఆగ్రహానికి కారణం అయ్యాయని ఇంటెలిజెన్స్ తెలిపింది. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆ నివేదికలో ఇంకా ఏం చెప్పారంటే..

➡ తిరుమల శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ ఛార్జిషీట్ స్పష్టం చేసినప్పటికీ, అదే పనిగా ఇంకా ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుండటాన్ని అత్యధికులు తప్పు పడుతున్నారు.
➡ ప్రతిపక్షంగా ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతుండటం సహజమని, ఎందుకంటే ఆ రోజు జంతువుల కొవ్వు కలిపారని చెప్పింది ప్రభుత్వ పెద్దలే కనుక.. ఈ మాత్రం ప్రభుత్వ పెద్దలను నిలదీయడంలో తప్పు లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.
➡ ఇప్పటికైనా ఈ విషయానికి ఫుల్ స్టాప్ పెట్టకుండా, మళ్లీ విచారణ అంటూ నిర్ణయం తీసుకోవడం కక్ష సాధింపుగా కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు.
➡ ఇదే విషయంపై అంబటి రాంబాబు మాట్లాడినందుకు శనివారం ఉదయం నుంచి టీడీపీ శ్రేణులు ఆయనపై దాడికి యత్నించాయని, వెంటపడి వేధించాయని.. ఓ దశలో ఆయన్ను తీవ్రంగా రెచ్చగొట్టారని.. అందువల్లే ఆయన పరుషంగా మాట్లాడారని చెబుతున్నారు. ఆ పరిస్థితిలో ఆయన స్థానంలో ఎవరున్నా అంతే స్థాయిలో ఆగ్రహానికి గురవుతారని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు.
➡ మళ్లీ పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు అంబటి ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగడం, కార్లు, కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం ఏమాత్రం సరికాదని తప్పుపడుతున్నారు.
➡ ఈ నేపథ్యంలో అంబటి కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం గుంటూరుకు వచ్చినప్పుడు చాలా మంది ప్రజలు స్వచ్ఛందంగా ఆయన్ను చూడటానికి వచ్చారు. చాలా చోట్ల బారికేడ్లు పెట్టినా మహిళలు సైతం రోడ్డుపైకి రావడం కనిపించింది.

విద్యాశాఖలో అంతర్రాష్ట్ర బదిలీలు?

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో అంతర్రాష్ట్ర బదిలీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అంతర్రాష్ట్ర బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రస్తుతం ఎందరున్నారో లెక్క తేల్చాలని ప్రభుత్వం విద్యాశాఖను అదేశించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ వెళ్లేందుకు ఆసక్తి గలవారు సమ్మతి తెలపాలని ఉద్యోగులను కోరారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖలో పనిచేస్తున్న 229మంది తెలంగాణకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎంఈవో, అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉన్నారు. 229 మందితో జాబితా ప్రకటించినా బదిలీ మాత్రం నిలిచిపోయింది. దీంతో కొందరు వ్యక్తిగతంగా ప్రభుత్వం నుంచి జీవోలు తెచ్చుకుని తెలంగాణకు, అక్కడి నుంచి ఏపీకి వచ్చారు. తెలంగాణకు ఆసక్తి చూపిన వారిలో కొందరు పదవీ విరమణ చేశారు. ఇంకొందరు పదోన్నతి పొందడంతో తెలంగాణ వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీంతో మొదట సమర్పించిన 229 మంది జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపే ముందు వాస్తవంగా ఎంతమంది ఆసక్తిగా ఉన్నారో తెలపాలని రాష్ట్ర విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలనకు పంపింది. సుముఖంగా ఉన్న ఉద్యోగుల వివరాలు వెంటనే పంపాలంటూ ఆదేశించింది. అయితే ఈ జాబితాలో కొత్తవారిని అనుమతించరాదని తెలిపింది. దీంతో జిల్లా స్థాయి అధికారులు కసరత్తు ప్రారంభించారు. తుది జాబితా రెండు, మూడు రోజుల్లో తెలంగాణకు పంపించనున్నారు. అయితే, తెలంగాణ నుంచి ఆంధ్రకు వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులను బదిలీపై రప్పించే అంశంపై మాత్రం ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు లేదు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆమోదించలేదు

వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి రిజిజు సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2021–22 తర్వాత మైనారిటీ విద్యార్థులకు ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్, మెరిట్–కమ్–మీన్స్ స్కాలర్‌షిప్‌లు ఆమోదించలేదని కేంద్రం తెలిపింది. ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా ఆరు నోటిఫైడ్ మైనారిటీ సముదాయాల (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ) విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు అమలుచేసినట్లు చెప్పారు. అయితే, 2021–22 తర్వాత ఈ స్కీములు అమలుకు నోచుకోలేదన్నారు.

నేషనల్ ఫ్రీక్వెన్సీ ప్లాన్ అమలులోకి..

దేశంలో గత ఏడాది డిసెంబరు 30న 'నేషనల్ ఫ్రీక్వెన్సీ అలకేషన్ ప్లాన్ (ఎన్ఎఫ్ఏపీ) అమలులోకి వచ్చినట్లు కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు బదులిచ్చారు. ఈప్లాన్ దేశంలోని రేడియో ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్ నిర్వహణ, అలకేషన్‌కు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. వీటితో పాటు 5జీ విస్తరణకు, 6జీ విస్తరణకు కీలక బ్యాండ్‌లను గుర్తించినట్లు మంత్రి చెప్పారు.

98 శాతం పాలు సురక్షితం..

ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్వే ప్రకారం దేశంలో 98 శాతం పాలు సురక్షితమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ తెలిపారు. ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. దేశంలో వినియోగిస్తున్న పాలు సురక్షితమేనని ఇటీవల ఆహార భద్రతా ప్రమాణాల అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పర్యవేక్షణలో తేలిందన్నారు. రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జిల్లాల నుంచి 10,126 నమూనాలు సేకరించి, పర్యవేక్షించగా ఈ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు.

ఏపీలో 935 'పీఎం శ్రీ' బడులు

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా 935 పాఠశాలలను 'పీఎం శ్రీ' పథకం కింద ఎంపిక చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అడిగిన ప్రశ్నకు బుధవారం ఆయన ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రంలో ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3,725 పనులను పూర్తిచేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే.. 2024–25లో ఉపాధ్యాయుల శిక్షణ కోసం కేంద్రం సుమారు రూ.18.10 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పూర్తిగా వినియోగించుకుందన్నారు. పీఎం శ్రీ పాఠశాలలు తమ పరిసరాల్లోని ఇతర బడులకు ఆదర్శంగా నిలుస్తాయని మంత్రి చెప్పారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల నగదు రహిత వైద్యం



రోడ్డు ప్రమాదానికి గురైన బాధితుల ప్రాణాలకు 'గోల్డెన్ అవర్'లో (ప్రమాదం జరిగిన మొదటి గంటలో) రక్షణ కల్పించేందుకు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందించనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. మే 2025లో నోటిఫై చేసిన ఈ పథకం ద్వారా ప్రమాదం జరిగిన ఏడు రోజుల వరకు బాధితులకు చికిత్స అందుతుందని, మోటారు వాహన చట్టం సెక్షన్–162 ప్రకారం ఇది చట్టబద్ధమైనదని మంత్రి వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద చండీగఢ్, అసోం, పంజాబ్ తదితర ఆరు రాష్ట్రాల్లో దీనిని ప్రయోగాత్మకంగా అమలుచేశామని, ఇందులో 5,480 మంది బాధితులకు ఉచిత చికిత్స అందించినట్లు తెలిపారు. త్వరలో ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయనున్నట్లు నితిన్ గడ్కరీ చెప్పారు.

ఏపీలో 350 మంది 'సాగర మిత్ర'ల నియామకం

ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులకు సేవలు అందించేందుకు 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద 350 మంది 'సాగర మిత్ర'ల నియామకానికి ఆమోదం తెలిపామని.. ప్రస్తుతం 325 మంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. సముద్రంలో చేపల లభ్యత సమాచారాన్ని సాగర మిత్రలు ఎప్పటికప్పుడు మత్స్యకారులకు చేరవేస్తున్నారని చెప్పారు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 65 మంది, శ్రీకాకుళంలో 57 మంది, బాపట్లలో 43 మంది సాగర మిత్రలు సేవలందిస్తున్నారని వెల్లడించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'నభమిత్ర' యాప్ అప్‌గ్రేడేషన్ కోసం ఎలాంటి ప్రతిపాదనలు రాలేదన్నారు.

రాజ్యసభ

1.64 కోట్ల మందికి నైపుణ్య శిక్షణ

దేశంలోని యువతకు ఉపాధి కల్పించే దిశగా చేపట్టిన 'ప్రధాన్‌మంత్రి కౌశల్ వికాస్ యోజన' కింద 2015 నుంచి ఇప్పటివరకు (డిసెంబరు 31, 2025 నాటికి) 1.64 కోట్ల మందికి శిక్షణ ఇచ్చినట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్. నిరంజన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. దేశంలో 15 ఏళ్లు పైబడిన వారిలో 72.9 శాతం మంది సెకండరీ విద్యను పూర్తిచేశారంటూ పీఎల్ఎఫ్ఎస్ (2023–24) నివేదికను ఉటంకించారు. ఐటీఐల ద్వారా 1.07 కోట్ల మందికి, అప్రెంటిస్‌షిప్ స్కీమ్ ద్వారా 47 లక్షల మందికి శిక్షణ అందించామని, నూతన విద్యా విధానం ప్రకారం వృత్తి విద్యను ప్రధాన విద్యా విధానంతో అనుసంధానిస్తున్నామని జయంత్ చౌదరి తెలిపారు.

సమగ్ర శిక్ష కింద ఏపీకి రూ.688 కోట్లు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో 'సమగ్ర శిక్ష' అభియాన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు రూ.688.16 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. 2024–25లో రాష్ట్రం రూ.3,624.79 కోట్ల వార్షిక ప్రణాళికను సమర్పించిందని.. నిధుల వినియోగం, పాత బకాయిలు, రాష్ట్ర వాటా విడుదల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిధులు మంజూరు చేస్తామన్నారు.

మహిళా సంఘాలకు రూ.1,100 కోట్ల సాయం



సహకార రంగంలో మహిళా స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'స్వయంశక్తి సహకార్' పథకం కింద ఆంధ్రప్రదేశ్ సింహభాగం నిధులను దక్కించుకుంది. 2024–25లో ఏపీకి ఎన్‌సీడీసీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.1,100 కోట్లు విడుదలైనట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. రాజ్యసభలో ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గత మూడేళ్లలో ఏపీకి ఈ పథకం కింద రూ.2,800 కోట్ల మేర నిధులు అందాయంటూ గణాంకాలను విడుదల చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి అందిన సాయం అత్యధికమన్నారు.

చారడేసి..

ఇది మన దగ్గర హల్‌చల్ చేస్తున్న పులి కాదు.. కొంచెం స్పెషల్ టైపు. చూశారుగా... ఒంటిపై నల్లని చారలు ఎంత వెడల్పుగా ఉన్నాయో... అదే దీని ప్రత్యేకత. జన్యుపరమైన పరిస్థితుల వల్ల ఇలా అయిందట. ఒడిశాలోని అడవుల్లో ప్రసేన్‌జీత్ యాదవ్ అనే ఫొటోగ్రాఫర్ ఈ చిత్రాన్ని తీశారు. దశాబ్దం క్రితం ఇలాంటి పులులు ఒడిశాలో ఏడు మాత్రమే ఉండేవట. అందులో మగది ఇదొక్కటే. అలాంటి పరిస్థితుల్లో టీ12 అని పిలిచే ఈ పులి తన సంతానంతో బలగాన్ని విస్తరించింది. ఇంతకీ విషయం ఏమిటంటే.. ప్రసేన్‌జీత్ తీసిన ఈ చిత్రం ప్రతిష్టాత్మక 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్' పోటీలోని పీపుల్స్ చాయిస్ కేటగిరీలో తుది జాబితాకు ఎంపికైంది. మార్చి 25న విజేతను ప్రకటిస్తారు.

నిందితులను రోడ్లపై ఎలా పెరేడ్ చేయిస్తారు?

నేర నిరూపణ అయ్యే వరకు నిందితులు నిరపరాధులే

- సామాన్యుల పట్ల పోలీసులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారు
- నిందితుల పెరేడింగ్‌పై కౌంటర్లు వేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి, డీజీపీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పోలీసులు సామాన్య ప్రజలతో అమానవీయంగా వ్యవహరిస్తున్నారని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. చట్ట నిబంధనలను పాటించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని తేల్చి చెప్పింది. చట్టానికి లోబడే పోలీసులు శాంతి భద్రతలను కాపాడాల్సి ఉంటుందని చెప్పింది. వివిధ కేసుల్లో అరెస్టు చేసిన నిందితులను రోడ్లపై పెరేడ్ చేయిస్తూ.. ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా ముందు ఎందుకు ప్రవేశపెడుతున్నారని పోలీసులను నిలదీసింది. నేరం నిరూపణ అయ్యేంత వరకు నిందితులు నిరపరాధులేనని స్పష్టం చేసింది. నిందితులను పెరేడ్ చేయిస్తున్న వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి, డీజీపీ, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్‌లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ కేసుల్లో అరెస్టు చేసిన నిందితులను రోడ్లపై పెరేడ్ చేయిస్తూ, ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా ముందు ప్రవేశపెట్టడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ రైట్స్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పరసా సురేష్ కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

పోలీసులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు

పిటిషనర్ తరపు న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ, నిందితులను రోడ్లపై పెరేడ్ చేయించడం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, ఇలా పెరేడ్ చేయించి మీడియా ముందు ప్రవేశపెట్టడం సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధమని తెలిపారు. ఇలా చేయడం ఓ రకంగా నేరం చేశారని తీర్పునిచ్చేయడమేనన్నారు. వాస్తవానికి నేరం చేశారా లేదా అన్నది తేల్చాల్సింది న్యాయవ్యవస్థ మాత్రమేనని, అయితే రాష్ట్రంలో పోలీసులే న్యాయ నిర్ణేతల్లా వ్యవహరిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నేరారోపణ ఉన్న ప్రతి వ్యక్తీ దోషి కాదని, అలాంటప్పుడు వారిని రోడ్లపై పెరేడ్ చేయించడం వారి హక్కులను హరించడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. ఉత్తర భారతదేశంలో ఓ ద్విచక్ర వాహనదారుడిని పోలీసులు దూషిస్తూ కొడుతున్నారని, ఇందుకు సంబంధించిన ఓ వీడియో క్లిప్పింగ్ తమకు వచ్చిందని తెలిపింది. సామాన్య ప్రజల పట్ల పోలీసులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారంది. పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఓ కేసులో నిందితుడిని తీసుకెళ్లే వాహనం మరమ్మతులకు గురి కావడంతో పోలీసులు అతన్ని నడిపించుకు తీసుకెళ్లారని, దీన్ని ఫోటోలు తీసి ప్రచారం చేశారని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ల దాఖలుకు ఆదేశాలిచ్చింది.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

భీష్మాంజలి

తిరుపతి క్రైం : తిరుపతి–రేణిగుంట రోడ్డుకు సమీపంలోని బాలాజీ నర్సింగ్ హాస్టల్‌లో ఓ విద్యార్థిని బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిరసంబేడు గ్రామానికి చెందిన రమణయ్య కుమార్తె భీష్మాంజలి (19) తిరుపతి ఎస్‌బీఐ కాలనీలోని ప్రవీణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో బీఎస్సీ నర్సింగ్ సెకండియర్ చదువుతోంది. కళాశాలకు చెందిన బాలాజీ నర్సింగ్ హాస్టల్‌లో ఉంటోంది. బుధవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లగా హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. హాస్టల్ సిబ్బంది తిరుపతి ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించగా, విద్యార్థిని మృతి చెందినట్లు నిర్ధారించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా..విద్యార్థిని మృతికి కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది వేధింపులే కారణమని సహచరులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తిరుపతి ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశాయి.

రాష్ట్రంలో పాలన హైజాక్ అవుతోంది

- ప్రజాసమస్యలు పక్కదారి పడుతున్నాయి
- రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు కావడం లేదు
- ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోంది
- పది వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం తీర్మానం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో చట్టబద్ధ పాలన హైజాక్ అవుతోందని వామపక్ష నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అధ్యక్షతన సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం పది వామపక్ష పార్టీల సమావేశమై పలు తీర్మానాలు చేశా యి. దాడులు, ఘర్షణలు, అక్రమ కేసులతో ప్రజా స మస్యలు పక్కదారి పడుతున్నాయని, రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు కావడంలేదన్నారు. ప్రజాసమస్యలపై ఉద్యమించే నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. భూసేకరణపై ఉద్యమించిన అనకాపల్లి జిల్లా రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై ప్రభుత్వం పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిందని, కనీసం ములాఖత్‌కు కూడా అనుమతించడం లేదని..డోన్‌లో ఉపాధి హామీపై ప్రశ్నించిన సీపీఐ నేతలను తల్లకిందులుగా చేసి కొట్టారని నేతలు మండిపడ్డారు. ఈనెల 12న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు వామపక్ష పా ర్టీల నేతలు మద్దతు తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ప్రసాద్, సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) నాయకులు హరినాథ్, ఆర్ఎస్పీ నేత జానకిరాములు, ఫార్వర్డ్‌బ్లాక్ నేతలు సుందరరామరాజు, ఎంసీపీఐయూ నాయకులు ఖాదర్‌బాషా, ఎస్‌యూసీఐసీ నాయకులు అమర్‌నాథ్ పాల్గొన్నారు.

హాస్టల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి మృతి

మృతి చెందిన బాలాజీ

చంద్రగిరి: హాస్టల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన బాలాజీ (20) ఎ.రంగంపేటలోని బాలాజీ హాస్టల్‌లో ఉంటూ ఓ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. తోటి విద్యార్థులు గమనించి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలాజీ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. బాలాజీ మృతికి వ్యక్తిగత కారణాలతో పాటు కుటుంబ సమస్యలు ఉన్నట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు.

ప్రైవేటు షిప్పింగ్ కంపెనీ చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య

- షేర్‌మార్కెట్‌లో నష్టాలు రావడంతో అప్పుల భారం
- భార్యకు కాకినాడ వెళ్తున్నట్టు మెసేజ్
- దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్య

హర్షవర్ధన్ (ఫైల్)

అగనంపూడి: ప్రైవేటు షిప్పింగ్ కంపెనీలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలు.. చిత్తూరు జిల్లా కాణిపాకం సమీపంలోని బొమ్మసముద్రం గ్రామానికి చెందిన సి.హర్షవర్ధన్ (36) విశాఖలోని శ్రావణ్ షిప్పింగ్ కంపెనీలో చీఫ్ ఇంజినీర్(సివిల్)గా పని చేస్తున్నాడు. భార్య, కూతురితో కలిసి న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ పరిధి పెదగంట్యాడలో నివాసముంటున్నారు. హర్షవర్ధన్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టాలు చవిచూశాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కాకినాడ వెళ్తున్నట్టు మెసేజ్

బుధవారం ఉదయం కాకినాడ వెళ్తున్నానని భార్యకు మెసేజ్ చేసి ఇంటి వద్ద మొబైల్ వదిలి వెళ్లిపోయాడు. హరిజన జగ్గయ్యపేట సమీపంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి వెళ్లిన కొద్దిసేపటికే హర్షవర్ధన్ పంపిన మెసేజ్‌ను ఆయన భార్య చూసింది. అందులో 'నేను మంచి కొడుకును కాను.. మంచి భర్తను కాను.. మంచి తండ్రిని కాలేకపోయానని..కూతుర్ని బాగా చూసుకోవాలని ఉంది'. దీంతో ఆందోళన చెందిన ఆమె హర్షవర్ధన్‌కు ఫోన్ చేయగా ఇంటి వద్ద ఉంది. ఆమె వెంటనే న్యూపోర్టు పోలీసులకు చెప్పడంతో అదృశ్యం కేసు నమోదు చేసి నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం చేరవేశారు. ఈలోగా రైల్వే ట్రాక్‌పై మృతదేహం ఉందన్న సమాచారం అందడంతో మృతుడి భార్యకు వివరాలు తెలియజేశారు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ, సిబ్బంది మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏపీ సెట్స్-2026 రిజిస్ట్రేషన్లు ప్రారంభం



సాక్షి, అమరావతి: వివిధ విద్యాకోర్సులకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్ ప్రకటించిన విద్యాశాఖ ఆయా సెట్స్ రిజిస్ట్రేషన్లు బుధవారం ప్రారంభించింది. 2026–27 విద్యా సంవత్సరంలో చేపట్టే ప్రవేశాలకు అనుగుణంగా ఏపీ ఈసెట్, ఐసెట్, పీజీసెట్ తదితర 8 ప్రవేశ పరీక్షల తేదీలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఏపీఈసెట్‌కు జేఎన్‌టీయూ అనంతపురం, ఏపీఈఏపీసెట్‌కు జేఎన్‌టీయూ కాకినాడ రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. కాగా ఏపీ ఐసెట్, పీజీఈసెట్స్‌ను ఆంధ్రా యూనివర్సిటీ, లాసెట్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎడ్‌సెట్ ద్రవిడియన్ యూనివర్సిటీ, పీజీసెట్ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, పీఈసెట్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు నిర్వహిస్తున్నాయి.

2026లో ఎంట్రన్స్ టెస్ట్‌లు, రిజిస్ట్రేషన్ షెడ్యూల్ ఇదీ..

సెట్	రిజిస్ట్రేషన్స్ ప్రారంభం	పరీక్ష తేదీ
ఏపీ ఈసెట్	ఫిబ్రవరి 4	ఏప్రిల్ 23
ఏపీఈఏపీసెట్ (ఇంజినీరింగ్)	ఫిబ్రవరి 4	మే 12, 13, 14, 15, 18
ఏపీఈఏపీసెట్ (అగ్రికల్చల్, ఫార్మసీ)	ఫిబ్రవరి 4	మే 19, 20
ఏపీ ఐసెట్	ఫిబ్రవరి 5	ఏప్రిల్ 28
ఏపీ పీజీఈసెట్	ఫిబ్రవరి 6	ఏప్రిల్ 28 - 30
ఏపీ లాసెట్	ఫిబ్రవరి 12	మే 4
ఏపీ ఎడ్‌సెట్	ఫిబ్రవరి 11	మే 4
ఏపీ పీజీసెట్	ఫిబ్రవరి 9	మే 5, 8, 9, 10, 11
ఏపీపీఈసెట్	ఫిబ్రవరి 13	జూన్ 3

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సామూహిక ధ్యానం సానుకూల తరంగం

సామూహిక ధ్యానం అనేది ఒకే చోట లేదా ఒకే సమయంలో సమూహంగా కలిసి చేసే ధ్యానం. వ్యక్తిగతంగా చేసుకునే ధ్యానం కంటే సామూహిక ధ్యానానికి శక్తి ఎక్కువని ఆధ్యాత్మికవేత్తలు, శాస్త్రవేత్తలు సైతం చెబుతుంటారు. దీనివల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు ఏంటంటే... వందల మంది కలిసి ఒకే లక్ష్యంతో ధ్యానం చేసినప్పుడు, ఆ ప్రదేశంలో సానుకూల శక్తి పెరుగుతుంది. దీనిని 'మహర్షి ఎఫెక్ట్' అని కూడా పిలుస్తారు. వ్యక్తిగత ధ్యానం కంటే సమూహంలో ధ్యానం చేయడం వల్ల ఫలితం త్వరగా, గాఢంగా ఉంటుంది. ఒంటరిగా ధ్యానం చేసేటప్పుడు మనసు పక్కకు మళ్లవచ్చు లేదా బద్ధకం రావచ్చు. కానీ పదిమందితో కలిసి కూర్చున్నప్పుడు ఒక రకమైన సామాజిక బాధ్యత, క్రమశిక్షణ ఏర్పడతాయి. పక్కవారి నిశ్శబ్దం మనల్ని కూడా లోతైన ధ్యాన స్థితిలోకి తీసుకెళ్తుంది. సామూహిక ధ్యానం వ్యక్తుల మధ్య ద్వేషాలను, విభేదాలను తగ్గించి, ప్రేమను, ఐక్యతను పెంచుతుంది. ఇది సమాజంలో శాంతిని నెలకొల్పడానికి సహాయపడుతుంది.

మహర్షి ఎఫెక్ట్ అనేది సామూహిక ధ్యానం ద్వారా సమాజంలో వచ్చే సానుకూల మార్పును వివరించే ఒక సిద్ధాంతం. దీనిని ట్రాన్సెండెంటల్ మెడిటేషన్ వ్యవస్థాపకులైన మహర్షి మహేష్ యోగి 1960లలో ప్రతిపాదించారు. సమూహంగా ధ్యానం చేయడం వల్ల మెదడులో 'సెరోటోనిన్', 'డోపమైన్' వంటి సంతోషాన్నిచ్చే హార్మోన్లు విడుదలవుతాయి. ఇది మానసిక ఆందోళనను తగ్గించి, ప్రశాంతతను ఇస్తుంది. ఈ సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే: 'ఒక సమాజంలోని కొద్ది శాతం మంది వ్యక్తులు ధ్యానం చేయడం ద్వారా, ఆ ప్రాంతంలోని మిగిలిన ప్రజల ప్రవర్తనలో కూడా సానుకూల మార్పు వస్తుంది.'

ప్రశాంతమైన, గాలి వెలుతురు ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవాలి. బ్రహ్మ ముహూర్తం (ఉదయం 4 నుండి 6 గంటల మధ్య) లేదా సాయంత్రం వేళలు అనుకూలం. అందరూ కలిసి ఒకే రకమైన ధ్యాన పద్ధతిని (ఉదాహరణకు:



ఆనాపానసతి, ఓంకార ధ్యానం లేదా గైడెడ్ మెడిటేషన్) అనుసరించడం మంచిది. సామూహిక ధ్యానం చేసేటప్పుడు సెల్ ఫోన్లు సైలెంట్ మోడ్‌లో ఉంచడం, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిశ్శబ్దంగా ఉండటం చాలా ముఖ్యం.

మహర్షి ఎఫెక్ట్ ప్రకారం, ఒక నగరంలోని లేదా దేశంలోని మొత్తం జనాభాలో కేవలం 1% మంది క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే, ఆ ప్రాంతంలో నేరాల రేటు తగ్గుతుంది. ప్రమాదాలు, హింసాత్మక సంఘటనలు తగ్గుముఖం పడతాయి. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. సామాజిక శాంతి – సామరస్యం పెరుగుతాయి. తర్వాతి కాలంలో ఒకేచోట కలిసి ధ్యానం చేసినా అదే ఫలితం వస్తుందని పరిశోధకులు గమనించారు. భౌతిక శాస్త్రంలోని 'ఫీల్డ్ థియరీ' ఆధారంగా దీనిని వివరిస్తారు. నీటిలో రాయి వేస్తే అలలు ఎలాగైతే వ్యాపిస్తాయో, ధ్యానం చేసే వ్యక్తుల మెదడు నుండి వెలువడే శాంతికరమైన తరంగాలు విశ్వశక్తి క్షేత్రం ద్వారా ఇతరులకు ప్రసరిస్తాయని నమ్ముతారు.

'వ్యక్తిగత ప్రశాంతతే ప్రపంచ శాంతికి పునాది' అనేదే మహర్షి ఎఫెక్ట్ వెనుక ఉన్న అసలు రహస్యం. మహర్షి ఎఫెక్ట్‌పై జరిగిన పరిశోధనలు కేవలం ఆధ్యాత్మిక కోణంలోనే కాకుండా, గణాంక., సామాజిక శాస్త్ర కోణాల్లో కూడా విశ్లేషించబడ్డాయి. ఈ పరిశోధనల్లో ప్రధానంగా 'శక్తి క్షేత్రం' ప్రభావం ఎలా ఉంటుందో శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు.

శాస్త్రవేత్తలు ఈఈజీ ద్వారా ధ్యానం చేసే వ్యక్తుల మెదడు తరంగాలను పరిశీలించారు. ఒక వ్యక్తి లోతైన ధ్యాన స్థితిలోకి వెళ్ళినప్పుడు, వారి మెదడులో ఆల్ఫా, తీటా తరంగాలు ఒక క్రమ పద్ధతిలో ఏర్పడతాయి. ఒకేచోట ఎక్కువ మంది ధ్యానం చేస్తున్నప్పుడు, అక్కడ ఉన్న ధ్యానం చేయని వ్యక్తుల మెదడు తరంగాల్లో కూడా ఈ క్రమబద్ధత పెరగడాన్ని గమనించారు. దీనినే 'ప్రేరిత శాంతి' అని పిలుస్తారు. ఇది అత్యంత ప్రసిద్ధమైన అధ్యయనాలలో ఒకటి. 1983లో లెబనాన్ యుద్ధం తీవ్రంగా ఉన్న సమయంలో జెరూసలేంలో ఒక ధ్యాన బృందాన్ని ఏర్పాటు చేశారు. ధ్యానం చేసే వ్యక్తుల సంఖ్య పెరిగినప్పుడు., తగ్గినప్పుడు యుద్ధ తీవ్రతను కొలిచారు. ధ్యాన బృందం పరిమాణం గరిష్టంగా ఉన్న రోజుల్లో యుద్ధ మరణాలు 76% తగ్గాయి. నేరాలు అగ్ని ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. స్టాక్ మార్కెట్ సానుకూలంగా స్పందించింది. ఈ సిద్ధాంతాన్ని నిరూపించడానికి అనేక ప్రయోగాలు జరిగాయి. అందులో ప్రముఖమైనవి – వాషింగ్టన్ డి.సి. ప్రయోగం (1993). వేసవి కాలంలో సుమారు 4,000 మంది ధ్యానులు కలిసి ధ్యానం చేసినప్పుడు, ఆ నగరంలో నేరాల రేటు దాదాపు 23% తగ్గిందని ఒక అధ్యయనంలో తేలింది.

క్వాంటమ్ ఫిజిక్స్ ప్రకారం, విశ్వంలోని ప్రతిదీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటుంది, కాబట్టి, ఒక చోట సృష్టించబడిన శాంతి తరంగాలు మరోచోట ప్రభావాన్ని చూపిస్తాయని ధ్యాన పరిశోధకులు బలంగా నమ్ముతారు. ఈ ఎఫెక్ట్ రావడానికి 10 లక్షల జనాభా ఉన్న నగరానికి కేవలం 100 మంది ధ్యానులు కలిసి ధ్యానం చేస్తే మార్పు మొదలవుతుందని తేలింది.

- రామలక్ష్మీ సదానందమ్

● నిర్మల వాణి

కుండలిని ఉత్థానమే ఆత్మసాక్షాత్కారం

పూర్వకాలంలో ఒక్కోకాలంలో ఒకే రాక్షసుడు ఉండేవాడు కాబట్టి అతణ్ణి సంహరించడం అంత కష్టమయ్యేది కాదు. శ్రీ కృష్ణుని చేత కంసుని వధ, శ్రీ రాముని చేత రావణాసుర వధ, అలాగే దుర్గాదేవి చేత మహిషాసుర వధ, జరిగాయి. వారు సంహరించబడిన తరువాత మొత్తం అంతా చక్కబడేది. కాని ఈ ఆధునిక యుగంలో అన్నింటికన్నా క్లిష్టమైన విషయం ఏమిటంటే ఆ రాక్షసులు వేర్వేరు మార్గాల ద్వారా ప్రజల మెదడులోనికి ప్రవేశిస్తున్నారు. భక్తులకు, భగవంతుడికి మధ్య అవరోధంగా నిలిచే వారి మిడిమిడి జ్ఞాన బోధనలవలన, మాయ మాటలవలన చాలామంది గుడ్డిగా అటువంటి వారిని గురువులుగా స్వీకరించి మోసపోతున్నారు. దేవీభక్తులను తమ శిష్యులుగా ముందు పెట్టుకుని ఆ కుగురువులు తమ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. భగవంతుడు వారిని సంహరించాలంటే, వారి ముందు భగవంతుని బిడ్డలైన భక్తులు అడ్డుగా ఉన్నారు. భగవంతుడు ఏమి చేయగలడు? సమయం వచ్చినప్పుడు అటువంటి వారు చేసే అకత్యాలను, అధర్మాలను బాహ్యాపరంగా బహిర్గతంగా బట్టబయలు చేయడం ద్వారా వారిని శిక్షిస్తాడు.

కాని ఇప్పుడు వారే అంతులేకుండా ఒకరి తరువాత ఒకరు ఏదో రూపంలో పుట్టుకొస్తూనే ఉన్నారు. ఆ దుష్టశక్తులన్నీ మానవులలోనికి కూడా ప్రవేశించి, వారిలో అనేకరకాలైన వ్యాధులను, అంటువ్యాధులను కలిగిస్తున్నాయి. అన్ని రకాల బాధలకు, కష్టాలకు గురి చేస్తున్నాయి. అందుచేత సమస్యలన్నీ చాలా లోతుగాను, జటిలంగాను, చాలా కష్టమైనవిగాను ఉండటంవలన ఏకాదశ రుద్రులు తమ పదకొండు శక్తులతో

శ్రీ మాతాజీ నిర్మలాదేవి

రావలసి వచ్చింది. ఈ శక్తి మనలో కూడా సజీవంగా ఉంది. దాన్ని జాగృత పరచుకోవాలి.

ఆత్మ సాక్షాత్కారం ద్వారా మనలోని కుండలినీ శక్తి జాగృతి చెందినప్పుడు ఈ ఏకాదశ రుద్ర శక్తులు నుదుటి పై భాగాన, శిరస్సు చుట్టూ నిలబడి ఆ ప్రదేశాన్నుంచి రక్షకులలాగా సంరక్షిస్తూ ఉంటాయి. ఈ మహోన్నతమైన శక్తి మనలో ఉండే అంతర్గత శక్తియే. మన వ్యక్తిత్వంలో గానీ, అవగాహనలోగానీ, ఏమైనా దుష్టశక్తి (నెగటివిటీ) ఉంటే అవి నశింపబడాలి అని ప్రార్థించాలి. సదా శివుడు తనకున్న ఒక శక్తితోనే తాను సృష్టించినదంతా నాశనం చేయగలడు. అలాంటిది పదకొండు శక్తులు అంటే ఎలా ఉంటుందో ఊహించలేము.

కుండలిని ఉత్థానం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది సహజ యోగా సాధనతో ఏకాదశ రుద్ర శక్తులను మనలో జాగృతి చేసుకోవడం ద్వారా మన చుట్టూ ఉన్న ఈ దుష్ట శక్తుల ప్రభావం మన మీద పడకుండా జాగ్రత్త పడవచ్చును.

- డా. రాకేశ్,
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● సద్బోధ

ప్రపంచంలో వెలకట్టలేని సంపదలు రెండే రెండు...
ఒకటి మనశ్శాంతి!
రెండు సంతృప్తి!!
ఈ రెండింటిని సంపాదించుకున్న వాళ్ళు ప్రతి క్షణం అఖండమైన ఆనందాన్ని అనుభవిస్తారు!
ఇవి... సంపాదించుకోవటానికి కష్టపడక్కర్లేదు.
ఎంతో ఆనందంగా సంపాదించుకోవచ్చు!
కులదైవ (ఇలువేలుపు) నామ స్మరణ చేస్తే చాలు.
ఆ వెలకట్టలేని రెండు సంపదలనూ ప్రసాదిస్తాడు!

● సువార్త

దైవిక సహృదయత



తప్పులు చేయడం సహజం. వాటిని దిద్దుకోవడం దైవత్వం. నేరుగా ఒకరిని లక్ష్యం చేసికొని ప్రతిభావంతంగా హీనపరిస్తే అది తప్పే. రెచ్చగొడుతున్న వేళ క్షణికోద్రేకంలో తప్పు చేయడం సహజమే అయినా, దాన్ని అప్పటికప్పుడు సరిచేసుకొనే ఉన్నత మనస్సుతో దిద్దుబాటు స్వభావాన్ని ప్రేమించేవారే తమ వ్యక్తిత్వంలో మహారాజులు అనిపించుకుంటారు. క్షమించగలిగే స్థాయి, హోదా, అధికారాలు మిక్కుటముగా కలిగి ఉన్ననూ ఇలా దైవికంగా క్షమించలేని

అది సిలువలో చూడగలుగుతాము (లూకా 23:14). క్షమించే అధికారం గల క్రీస్తు ప్రేమిస్తూ క్షమిస్తూ విమోచిస్తూ నేడు సర్వ మానవాళి పట్ల వారి మెరుగైన ఉన్నత రాజస జీవితం కోరుకుంటూ తన దరికి నేరుగా రావాలని ఆశిస్తూ ఉన్నాడు. ప్రయాసపడి

రాజు ఎంతటి ఘనమైన సింహాసనం మీద కూర్చున్నా అతడు ప్రజల దృష్టిలో ఎన్నడూ సహృదయుడైన రాజు కాలేడు.

ఎందుకంటే క్షమాపణ అనేది అద్వితీయ సత్య దేవుని సహజ స్వాభావిక లక్షణం. రాజులకు, అధికారులకు తప్పక ఉండదగ్గ మంచి లక్షణం ఇది.

రాజులకు రాజు ప్రభువులకు ప్రభువైన క్రీస్తు కూడా ఆ మహా దేవుని కుమారునిగా ఎల్లరకు ఆ దైవిక క్షమాపణ సుగుణాన్ని రుచిచూపుతూ దేవున్ని బయలుపరచడం గొప్ప విషయం. ఇతరులను క్షమించే విధానంలో ఈ విధంగా కృపగల దేవున్ని ఇలా వారికి దర్శింపజేయుటను మించిన విధానం మరొకటి లేనేలేదనేది సర్వ సత్యం. కొత్త నిబంధన ప్రారంభంలో క్రీస్తు క్షమాపణ గొప్ప సంచలనం అయ్యింది.

కనికరం చూపేవారు కనికరం పొందుతారు అనేది గ్రంథరాజపు అమూల్య వాక్కు. ఒకరు ఆశ్రయించి శరణుకోరి తనను క్షమించమన్నప్పుడు కనికరించని కఠినాత్ములు దేవుని కనికరం ఎలా పొందుకుంటారు? అల్లర్లు అలజడులు సృష్టిస్తూ క్షమాపణ ధీర గుణాన్ని అడ్డుకుంటే దాని ప్రాచుర్య వ్యాప్తిని తక్షణమే తగ్గిస్తే అట్టి వారు శిక్షకు పాత్రులు. దేవుని కాక ఒక వ్యక్తి తన తోటి వ్యక్తిని క్షమించమని అడగడం అది పెద్ద మనస్సునే చాటుతుంది. సమాజంలో శాంతిని విత్తేవారు, సమాధాన పరచేవారు దేవుని కుమారులుగా ఎంచబడుతారు.

పాపభారం మోయకుండునట్లు దేవుడు వారి విశ్రాంతి విషయమై చింతిస్తూ విశ్వాస విధేయులైన అనేకులను క్రీస్తు ద్వారా చేరదీస్తూ ఉన్నాడు.

ఈ మెస్సీయ జీవితాన్నే నిండుగా మనస్ఫూర్తిగా అనుసరించుట ద్వారా ఆదిమ సంఘపు అపొస్తలుడుగా గొప్ప పేరొందిన స్తెఫను కూడా క్రీస్తువలె విజ్ఞాపన చేస్తూ వారిని క్షమించమని గొప్ప శబ్దంతో పలకడం విశేషం (అపొ. 7:54–66

). తనను హింసించే శత్రువులను క్షమిస్తూ వారిమీద ఈ పాపము మోపకుమని దేవుని సింహాసనాన్ని కదిలించాడు. ఇట్టి కరుణ హృదయుడను, పరిశుద్ధుడను పరదైసుకు ఆహ్వానిస్తూ అకాశం తెరవబడింది. స్తెఫను ఈ భూమి మీదనే ఉండి ప్రాణంతో ఉన్నప్పుడే దేవుని కుడిపార్శ్వమున క్రీస్తు ఉండుటను చూడగలిగాడు. క్షమాపణ దారిచూపించిన ఔన్నత్యం ఇది. దైవిక మార్గం స్పష్టంగా కనుపరచే విధానం దేవుని నిత్య నడిపింపే అనుట నమ్మదగ్గది. దేవుని పక్షాన ఏలే క్రీస్తు అధికారాన్ని చూడడం గొప్ప భాగ్యం. నీ రాజ దండము న్యాయార్థమైనది అంటూ మనం లోబడుతూ ప్రేమ, క్షమాపణ, విమోచన వంటి అధికారిక అలంకారాలతో అలంకరించబడిన క్రీస్తురాజును కన్నులారా చూడడం గొప్ప భాగ్యం కాక మరేమిటీ?

- జేతమ్

● తేనె చుక్కలు

ఆధ్యాత్మికత అనే సరస్సులో నామం అనే రాయి వేసి శబ్దం చేస్తే తరంగాలు మొదలవుతాయి!
ఆ తరంగాలు మనసంతా వ్యాపించి శరీరమంతా నిండిపోతాయి!

ఏ నామాన్నయితే మనం స్మరిస్తున్నామో ఆ దేవుడికి సంబంధించిన రూపాన్ని మన మదిలో నిలుపుతాయి.
నామం అనేది ఆధ్యాత్మిక శబ్ద తరంగం!

అంతరాత్మ సాక్షిగా...

మనిషి స్వభావం బహు చిత్రమైనది. తాను నలుగురిలో మసలుతున్నప్పుడు, తనను ఎవరైనా గమనిస్తున్నారనిపించినప్పుడు, చాలా హుందాగా, ఉన్నతంగా, శాంతంగా, అందంగా తనను తాను ఆవిష్కరించుకొంటాడు. తనలోని అల్పత్వాన్ని, క్రూరత్వాన్ని, చెడును దాచిపెట్టే ప్రయత్నం చేస్తాడు.

ఇతరులకు హాని కలిగించనంత వరకూ అతని ప్రవర్తన ఎలా ఉన్నా ఫర్వాలేదు కానీ పరులకు కీడు చేసేలా ఉంటే ఆ కపట ప్రవర్తన క్షమించరానిది. అలాంటి వాళ్ళను గోముఖ వ్యాఘ్రాలు, మేకవన్నె పులులు, పయోముఖ విషకుంభాలు, తేనె పూసిన కత్తులు, ఇలా రకరకాలుగా అభివర్ణిస్తుంది సమాజం.

'దుర్జనః ప్రియ వాదీతి నైతద్విశ్వా స కారణం / మధు తిష్ఠతి జిహ్వాగ్రే హృదయేతు హాలాహలమ్ '. నాలుక చివర తేనెలొలికే తీపి మాటలు మాట్లాడుతూ, హృదయంలో భయంకరమైన విషపుటాలోచనలు కలిగి ఉన్న దుర్జనులను నమ్మరాదంటుంది నీతి శాస్త్రం.

. అంతేకాదు, వీళ్ళు మనతో మంచిగా మాట్లాడుతూ మన పరోక్షంలో మన కార్యాలను చెడగొట్టే పయోముఖ విష కుంభాలు, అంటే పాల కలశం వలె పైకి కన్పించే విషపు కడవల వంటి స్నేహి తులను విడిచి పెట్టాలని కూడా నీతిశాస్త్రం బోధించింది.

పిల్లి తాను కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తననెవరూ చూడడం లేదని భావించినట్లు, ఎవరూ తమను గమనించలేదనుకొంటూ అధర్మ ప్రవర్తనకు పాల్పడే వాళ్ళ అజ్ఞానాన్ని తొలగించడానికి మన ధర్మ శాస్త్రాలు ఇలా చెప్పి ఉన్నాయి. చుట్టూ ఎవరూ లేరనుకొని భ్రమపడి అధర్మానికి పాల్పడకండి. మనకు తెలియకుండానే నిరంతరం మనల్ని గమనిస్తూండే అష్టాదశ (18) సాక్షులు మన చుట్టూనే ఉన్నాయి. అవి ఏవంటే – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం, అనే నాలుగు వేదాలు; భూమి, నీరు, గాలి, అగ్ని , ఆకాశం, అనే పంచ భూతాలు (5); మన అంతరాత్మ , ధర్మం, సూర్య చంద్రులు, ప్రత్యూష సమయం, పగలు, సంధ్యాకాలం, రాత్రి యముడు. ఈ సాక్షులనుండి ఎవరూ తప్పించుకోలేరు. మన ప్రతి చర్య వీరిచే నమోదు చేయబడుతుంది. మన సత్కర్మల, దుష్కర్మల ఫలితాలను మనం ఎప్పటికైనా అనుభవించేలా చేస్తాయి. కనుక ఇక్కడి న్యాయస్థానాలలో తప్పించుకొన్నా అత్యున్నతమైన దైవ సన్నిధిలో ఆయా కర్మలకు ఫలితాలు నిర్దేశించబడతాయి. కనుక ధర్మభీతి కలిగి ఉండాలి. ధర్మ మార్గం తప్పి నడువకూడదు.

పైన చెప్పిన 18 సాక్షులలో పదవదైన 'అంతరాత్మ' మనలోనే ఉంటుంది. దాన్నే 'మన స్సాక్షి' అంటూంటాం. మనం చేసే పనులలోని మంచి చెడులను విశ్లేషిస్తూ , ప్రోత్సహిస్తూ, హెచ్చరిస్తూ, నివారించే ప్రయత్నం చేసే మన మనస్సాక్షికి మనం జవాబుదారీ వహిస్తే... పొరబాటున కూడా తప్పటడుగులు వేయలేము.

- డా. పాణ్యం వసుంధరాదేవి

● మంచి మాటలు

మనిషి అనేవాడు లోహపు బిందెలా ఉండాలి. లోహపు బిందెకు ఉన్న సొట్టను సరిచేయగలం. కానీ మట్టి పాత్రను సరిచేయాలని చూస్తే ఎందుకూ పనికి రాకుండా పోతుంది. సరిగ్గా కొందరి విషయాల్లో ఇదే జరుగుతుంది. ఎన్ని మంచి మాటలు చెప్పినా కొంత మందిని మార్చలేం. వీళ్ళ అజ్ఞానం అహంకారం మూలాన వీళ్ళు మంచివైపుకు తిరగడానికి ఆసక్తి చూపరు!

అయితే ఇప్పుడు కాకున్నా ఏదో ఒక రోజు తమ తప్పును తెలుసుకుంటారు. కానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోతుంది. తదుపరి ఎవరు వచ్చినా నష్టాన్ని భర్తీ చేయలేరు. కనుక మారడానికి సిద్ధంగా ఉండాలి. చెడు నుండి మంచి వైపుకు, నాస్తికత్వం నుండి ఆస్తికత్వం వైపుకు, అజ్ఞానంనుండి జ్ఞానం వైపుకు మారాలి. మంచి మాటలను, మంచి మార్గాన్ని ఇప్పుడు నిర్లక్ష్యం చేశామా, తరువాత పురాతన తవ్వకాలు జరిపినా కూడా వాటి జాడ కనుగొనలేం,

● ఇస్లాం వెలుగు

రమజాన్ సన్నాహాలు

ఈ ఫిబ్రవరి నెల 19వ తేది రమజాన్ మాసం ప్రారంభం అవుతుంది. ప్రపంచ ముస్లింలు రంజాన్‌ను స్వాగతించటానికి సన్నద్ధం అవుతున్నారు. రమజాన్ మాసం పవిత్రతను, విశిష్టతను ముస్లింలు హృదయపూర్వకంగా స్వాగతిస్తూ ఆస్వాదిస్తారు. ప్రతి ముస్లిం తన పరిధిలో ఒదిగి రమజాన్ వసంత పవిత్రజల్లులో పులకించాలని ఉద్యుక్తుడు అవుతాడు. రమజాన్ మాసాన్ని స్వాగతించడానికి మానసికంగా, పరిస్థితులు అనుకూలించుకోవడంలో లీనం అవ్వడమే ముస్లిం విశ్వాసానికి నాంది అవుతుంది.

మరి ఒకటి రెండు వారాల్లో మన దరి చేరనున్న రమజాన్ మాసం కోసం సన్నద్ధం అవుతూ, ఉపవాసాలు (రోజా), ఈ మాసంలో ప్రత్యేకంగా నిర్వహించే తరావీహ్ నమాజులు, విధిగా ఇచ్చే జకాత్, ఫిత్రా దానాలు, చివరి పది రోజుల్లో చేసే లైలతుల్ ఖదర్, తాఖిరాత్లు, ఇఫ్తార్ విందులు, సహరీ తయారీలు, ఎతెకాఫ్, దివ్య ఖుర్ ఆన్ పారాయణాలు చివరగా ఈదుల్ ఫితర్ పండుగ ఇలా అన్నిటిలో పూర్తిగా సుశిక్షితులు కావాలని ముస్లిం ప్రగాఢంగా విశ్లేషిస్తూ రమజాన్ కోసం ఎదురు చూడాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఉటంకించినట్లు రజబ్ నెలలో విత్తు వేయాలి, షాబాన్ నెలలో నీరు పట్టి సాగు చేయాలి, రమజాన్ నెలలో ఆ ఫలాలు కోసుకోవాలి. అంటే రజబ్ నెల నుండి ర్యాలీలు మొదలు పెట్టాలి. ముసిం ఆత్మ వికాసం రమజాన్ కోసం వికసించాలి. దైవ భీతితో (తఖ్వా) హృదయం ప్రకాశించాలి. రమజాన్ సన్నాహాలు కొన్ని స్పృశిద్దాం.

సామాజిక సన్నాహాలు: రమజాన్ మాసాన్ని అన్నివర్గాల ప్రజలు గౌరవిస్తారు. ఇఫ్తార్, సహారిలకు సమయానుకూలంగా ఆహ్వానిస్తు ఉండాలి. పండ్లు ఫలహారాలు ఇచ్చిపుచ్చుకోవాలి. రమజాన్ మాసంలో ఉపవాసం ఉండేవారికి పనిభారం సులభతరం చేయాలి. నూతనంగా ఉపవాసం ఉండేవారికి ప్రోత్సహించాలి. మిత్రుడు తోడుగా చాలామంది ఇతరులు కూడా ఉపవాసం ఉంటారు. రమజాన్ ప్రాశస్త్యాన్ని తెలిపే పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. వీలైతె దివ్య ఖుర్ఆన్ అనువాదం గ్రంథాలు అందుబాటులో ఉంచాలి. రమజాన్ స్వాగత సమావేశాలు నిర్వహించి వివిధ అంశాల పై ప్రసంగాలు, ఐక్యతా కవితలు వినిపించాలి. మస్జిదులలో తరావి నమాజులో పఠించే ఖుర్ఆన్ భావ విపులీకరణ వినే ఏర్పాటు ఉంటే బాగుంటుంది. రమజాన్ మాసంలో ముస్లిం ప్రభుత్వం ఉద్యోగులకు సాయింత్రం 4గం. వెళ్ళే ఉత్తర్వులు ఉన్నాయి. వాటిని సామరస్యంగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు యాజమాన్యాలకు ముందే సంప్రదించి, అభ్యర్థిస్తే వాళ్ళు సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. రోజా టైమ్ టేబుల్స్ కూడా ప్రకటనలతో చాలా మంది ముద్రిస్తారు. వాటి పై సామాజిక విలువలు తెలిపె ప్రవచనాలు కూడా ముద్రించవచ్చు. రమజాన్ చివర్లో నిర్వహించే ఈదుల్ ఫితర్ పండుగ, ఈద్ మిలాప్‌లలో హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా స్నేహితులను ఆహ్వానించి ఆదర్శం కావాలి.

- షేక్ అబ్దుల్ సమద్

బిజినెస్ రీల్

ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ జీసీసీ ప్రారంభం

హైదరాబాద్: అమెరికాకు చెందిన వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ తాజాగా హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ని (జీసీసీ) ప్రారంభించింది. వచ్చే మూడు నుంచి ఐదేళ్ల వ్యవధిలో టెక్నాలజీ, ఆపరేషన్స్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ తదితర విభాగాల్లో గణనీయంగా రిక్రూట్‌మెంట్ చేసుకోనున్నట్లు సంస్థ తెలిపింది. కంట్రీ హెడ్‌గా రమేష్ కాజాని నియమించినట్లు వివరించింది. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటైన ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ దాదాపు 2.4 లక్షల కోట్ల డాలర్ల నిధులను నిర్వహించే 1,200 ఆర్థిక సంస్థలకు సేవలు అందిస్తోంది.

టఫే మాసే డైనాస్టార్ పోటీలు షురూ

చెన్నై: మాసే డైనాస్టార్ 2026 పోటీలకు సంబంధించి 3వ సీజన్‌ని ప్రారంభించినట్లు ట్రాక్టర్ల తయారీ దిగ్గజం టఫే వెల్లడించింది. వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించేందుకు తోడ్పడే ఐడియాలను ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించింది. మాసే ఫెర్గూసన్ ట్రాక్టర్లను ఉపయోగించి అర్థవంతమైన ప్రభావం చూపగలిగే ఒరిజినల్ కాన్సెప్టులను సమర్పించవచ్చు. ఈ పోటీలో గెలుపొందే విజేతకు సుమారు రూ. 8.2 లక్షల విలువ చేసే మాసే ఫెర్గూసన్ 254 డైనాస్మార్ట్ ట్రాక్టరును బహుమతిగా అందించనున్నట్లు సంస్థ తెలిపింది. పోటీలో పాల్గొనేవారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుని, తమ ఐడియాలను వీడియో లేదా టెక్స్ట్ ఫార్మాట్లో, ఇంగ్లీషులో గానీ ఇతరత్రా ప్రాంతీయ భాషల్లో గానీ సమర్పించవచ్చని పేర్కొంది.

ఇంద్రజాల్‌కి సిగ్మా అడ్వాన్స్‌డ్ రాడార్ల సరఫరా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం ఇంద్రజాల్ కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్‌కి కీలకమైన రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సబ్‌సిస్టమ్స్‌ని సిగ్మా అందించనుంది. తొలి ఏడాది ఈ కాంట్రాక్టు విలువ రూ. 250 కోట్లుగా ఉంటుంది. సంవత్సరాల పరిశోధనలతో ఈ రాడార్లు, టెక్నాలజీలను తయారు చేసినట్లు సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈవో సునీల్ కలిదిండి తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-2-2026

విశాఖ	490-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	4,021.00	5.18
ETERNAL	293.5	4.9
ONGC	266	3.5
NTPC	366.8	2.3
ADANIPORTS	1,565.20	2.25

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,534.00	-7.37
TCS	2,999.90	-6.99
HCLTECH	1,617.60	-4.58
TECHM	1,639.00	-4.52
WIPRO	233.5	-3.79

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,435
ఎన్ఎస్ఈ	135,527
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,79,195
ఎఫ్ఐఐ	+ 30
డీఐఐ	+ 250

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	65.03	$	63.21
బ్రెంట్	69.31	$	67.33

హోండా 2 వీలర్ స్పెషల్ ఎడిషన్లు

'షైన్ 125 లిమిటెడ్', 'డియో 125 ఎక్స్-ఎడిషన్' విడుదల

ముంబై: హోండా మోటార్‌సైకిల్-స్కూటర్ ఇండియా తన పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా 'షైన్ 125 లిమిటెడ్', 'డియో 125 ఎక్స్-ఎడిషన్'లను మార్కెట్లోకి విడుదల చేసింది. హోండా పాపులర్ బ్రాండ్ 'షైన్' దేశ వ్యాప్తంగా మంచి ప్రజాదారణ పొందింది. మారుతున్న ట్రెండ్స్‌ను దృష్టిలో ఉంచుకుని, కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు తాజాగా హోండా షైన్ '125 లిమిటెడ్ ఎడిషన్'ను విడుదల చేసింది. మినిమలిస్ట్ థీమ్‌తో పెర్ల్ సైరెన్ బ్లూ కలరులో అందుబాటులో ఉండే ఈ ఎడిషన్, ఫైరైట్ బ్రౌన్ ఆలాయ్ వీల్స్‌తో వస్తుంది. ఈ లిమిటెడ్ ఎడిషన్ ఇంజిన్ ఎలాంటి మార్పులు చేయలేదు. ధర ఢిల్లీ ఎక్స్ షోరూం వద్ద రూ.86,211గా ఉంది.

హోండా డియో 125 ఎక్స్-ఎడిషన్: యువతను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడిన ఆధునిక స్కూటర్. ప్యానెల్లపై ప్రత్యేక గ్రాఫిక్స్‌తో ఈ ఎడిషన్ సైబర్ డ్రిఫ్ట్ థీమ్ ప్రేరణతో తీర్చిదిద్దారు. నగర ప్రయాణాలకు సరైన మైలేజ్, స్మూత్ డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఇంజిన్‌లో 'ఇండ్లింగ్ స్టాప్ సిస్టమ్' ఉండటం వల్ల ట్రాఫిక్‌లో నిలిచినప్పుడు ఆటోమేటిక్‌గా ఆఫ్ అవుతూ ఇంధనాన్ని ఆదా చేస్తుంది. ధర విషయానికొస్తే..., ఢిల్లీ ఎక్స్ షోరూం వద్ద రూ.87,733గా ఉంది.

ఇప్పటికే ఈ స్పెషల్ ఎడిషన్ బుకింగ్‌లు మొదలయ్యాయి. కస్టమర్లు ఈ మోడళ్లను కంపెనీ ఆన్‌లైన్‌లో కంపెనీ వెబ్‌సైట్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో దగ్గర్లోని డీలర్‌షిప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఫిబ్రవరి రెండో వారం నుంచి డెలివరీ తీసుకోవచ్చు.

ఫ్రాక్టల్ అనలిటిక్స్ @ రూ. 857-900

- ఈ నెల 9-11 మధ్య ఐపీవో
- రూ. 2,834 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సొల్యూషన్లు అందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 857-900 ధరల శ్రేణి నిర్ణయించింది. ఇష్యూ ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 6న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,023.5 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 1,810 కోట్లకుపైగా విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 2,834 కోట్లు సమీకరించే యోచనలో కంపెనీ ఉంది. లిస్టింగ్‌లో రూ. 15,500 కోట్ల విలువను అంచనా వేస్తోంది. కాగా.. తొలుత గతేడాది ఆగస్ట్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పుడు రూ. 4,900 కోట్లు సమకూర్చుకోవాలని ప్రణాళికలు వేసినప్పటికీ తదుపరి ఇష్యూ పరిమాణాన్ని కుదించింది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ ఫ్రాక్టల్ యూఎస్ఏతోపాటు ఆర్అండ్‌డీలో పెట్టుబడులకు, రుణ చెల్లింపులు, దేశీయంగా కొత్త కార్యాలయాల ఏర్పాటు, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 116 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ నెల 16 స్టాక్ ఎక్స్ఛేంజీలలో కంపెనీ లిస్ట్‌కానుంది. 2000లో ఏర్పాటైన కంపెనీ మైక్రోసాఫ్ట్, యాపిల్, ఎన్‌విడియా, అమెజాన్, అల్ఫాబెట్ తదితర గ్లోబల్ దిగ్గజాలకు సర్వీసులు సమకూర్చుతోంది.

ఏఈ ఫైనాన్స్ ఐపీవో 9న

- ధరల శ్రేణి రూ. 122-129
- రూ. 1,010 కోట్లపై కన్ను

న్యూఢిల్లీ: మధ్యస్థాయి ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన ఏఈ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 122-129 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 6న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా రూ. 710 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 300 కోట్లకుపైగా విలువైన షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 1,010 కోట్లు సమీకరించే యోచనలో కంపెనీ ఉంది. లిస్టింగ్‌లో రూ. 3,184 కోట్ల విలువను అంచనా వేస్తోంది. నికర ఐపీవో నిధులను మూలధన పటిష్టతకు, బిజినెస్ విస్తరణలో భాగంగా భవిష్యత్ అవసరాలకు వినియోగించనుంది. ఈ నెల 16 స్టాక్ ఎక్స్ఛేంజీలలో కంపెనీ లిస్ట్‌కానుంది. కంపెనీ ప్రధానంగా బ్యాంకులు పెద్దగా దృష్టిపెట్టని సూక్ష్మ, చిన్నతరహా సంస్థ(ఎంఎస్ఈ)లకు రుణాలు సమకూర్చుతోంది. వెరసి ఆయా సంస్థల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు చిన్నతరహా రుణాలను అందిస్తోంది. తయారీ, ట్రేడింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు బిజినెస్ ఆస్తులపై రుణాలు జారీ చేస్తోంది.

యురేకా ఫోర్బ్స్ లాభాలకు చిల్లు

- రూ.10 కోట్లకు పరిమితం
- కొత్త కార్మిక చట్టాల ప్రభావం

న్యూఢిల్లీ: నీటి శుద్ధి, గృహోపకరణాల సంస్థ యురేకా ఫోర్బ్స్ కన్సాలిడేటెడ్ లాభం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే ఏకంగా 71 శాతానికి పైనే తగ్గిపోయి రూ.10 కోట్లకు పరిమితమైంది. ముఖ్యంగా వ్యయాలు పెరిగిపోవడం, కొత్త కార్మిక చట్టాలకు అనుగుణంగా కేటాయింపులు చేయాల్సి రావడం లాభాలు తగ్గేందుకు దారితీసింది. క్రితం ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో లాభం రూ. 35 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం ఇదే కాలంలో రూ.598 కోట్ల నుంచి రూ.645 కోట్లకు దూసుకుపోయింది. ముఖ్యంగా కార్మిక చట్టాల రూపంలో రూ.40.44 కోట్లను పక్కన పెట్టాల్సి వచ్చింది. 2025-26 క్యూ3లో సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ బలమైన పనితీరును చూపించినట్టు యురేకా ఫోర్బ్స్ ఎండీ, సీఈవో ప్రతీక్ పోట తెలిపారు. పండుగల అనంతరం వాటర్ ప్యూరిఫయర్ అమ్మకాలు తగ్గడం, పంపిణీ ఛానల్‌లో నిల్వలు పెరగడం రూపంలో సవాళ్లను ఎదుర్కొన్నట్టు చెప్పారు. అయినప్పటికీ ఈ విభాగంలో తాము మెరుగైన పనితీరుతో వాటాను పెంచుకున్నట్టు తెలిపారు. రోబోటిక్స్, సాఫ్ట్‌నర్స్‌లో బలమైన వృద్ధి కనిపించినట్టు చెప్పారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 7 శాతానికి పైగా నష్టపోయి రూ.504 వద్ద ముగిసింది.

ముత్తూట్ మైక్రోఫిన్‌తో యాక్సిస్‌లైఫ్ జట్టు

న్యూఢిల్లీ: ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్‌తో యాక్సిస్ మ్యాక్స్‌లైఫ్ ఇన్సూరెన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. టైర్ 2, 3 పట్టణాల్లో జీవిత బీమా సేవల విస్తరణకు, లక్షలాది మందికి ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. కస్టమర్ల భవిష్యత్తు ఆకాంక్షలకు భద్రత కల్పించే పరిష్కారాలను అందించనున్నట్టు మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. తమ జీవనోపాధి కోసం తీసుకునే రుణాలకు రక్షణ కల్పించుకోవడం ద్వారా మహిళా వ్యాపారవేత్తలు తమ వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించుకునేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని పేర్కొంది. ముత్తూట్ మైక్రోఫిన్‌కు దేశవ్యాప్తంగా ఉన్న శాఖల పరిధిలో కస్టమర్లకు మ్యాక్స్ లైఫ్ తన జీవిత బీమా ఉత్పత్తులను ఆఫర్ చేయనుంది.

భారత్ కంటెయినర్ షిప్పింగ్ లైన్

ఏర్పాటుకు వీలుగా ఒప్పందం

ముంబై: అంతర్జాతీయంగా షిప్పింగ్‌కు డిమాండ్ పెరుగుతున్న క్రమంలో.. దేశంలో సమగ్ర కంటెయినర్ ఎకోసిస్టమ్ నిర్మాణానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. భారత్ కంటెయినర్ షిప్పింగ్ లైన్ (బీసీఎస్ఎల్) ఏర్పాటుకు వీలు కల్పించే ఒప్పందంపై సంతకం చేసినట్టు ప్రకటించింది. ఈ పథకం స్ఫూర్తికి అనుగుణంగా ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడే కంటెయినర్ తయారీ వ్యవస్థను దేశీయంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించడం గమనార్హం. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ), వీవో చిదంబరనార్ పోర్ట్ అథారిటీ, చెన్నై పోర్ట్ అథారిటీ, సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది.

నియామకాలను శాసిస్తున్న ఏఐ!

- సరైన అర్హతలు, నైపుణ్యాల గుర్తింపు
- రిక్రూటర్ల పని సులభతరం
- లింక్డ్ఇన్ నివేదిక వెల్లడి

ముంబై: కృత్రిమ మేథ (ఏఐ) నియామకాల ప్రక్రియను మరింత సమర్థవంతం, సులభతరం చేస్తోంది. సరైన నైపుణ్యాలతో కూడిన అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం రిక్రూటర్లకు (నియామకాలు చేపట్టేవారు) సవాలు కాగా.. వీరు ఏఐ సాయాన్ని తీసుకుంటున్నారు. తమకు కావాల్సిన సరైన అర్హతలు, నైపుణ్యాలు దాగి ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు ఏఐ సాయపడుతున్నట్టు రిక్రూటర్లు లింక్డ్ఇన్ సర్వేలో భాగంగా తెలిపారు. ఒత్తిళ్ల మధ్య ఏఐని పరిష్కారంగా వారు భావిస్తున్నారు. 2025 నవంబర్ 13 నుంచి 28 మధ్య 19,113 మంది అభిప్రాయాలను, నవంబర్ 10 నుంచి 27 మధ్య 6,554 అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణులను లింక్డ్ఇన్ సర్వే చేసి వివరాలు విడుదల చేసింది.

- గతంలో తాము గుర్తించలేని నైపుణ్యాలు కలిగిన అభ్యర్థుల నియామకానికి ఏఐ సాయపడుతున్నట్టు 71 శాతం మంది చెప్పారు.
- అభ్యర్థుల నైపుణ్యాలను మరింత లోతుగా విశ్లేషించేందుకు ఏఐ ఉకపరిస్తున్నట్టు 80 మంది పేర్కొన్నారు.
- నియామకాలను ఏఐ వేగవంతం చేసిందని 76 శాతం మంది అభిప్రాయపడుతున్నారు.
- నియామకాలు కరోనా ముందునాటితో పోల్చితే 40 శాతం పెరిగినా.. అర్హులైన అభ్యర్థులను గుర్తించడంలో ఇబ్బంది పడుతున్నట్టు 74 శాతం మంది రిక్రూటర్లు తెలిపారు.
- ఏఐ ఆధారిత దరఖాస్తులు పెరిగినట్టు 53 శాతం మంది తెలిపారు.
- కావాల్సిన నైపుణ్యాల్లో లోటు ఉంటున్నట్టు 47 శాతం రిక్రూటర్లు పేర్కొన్నారు.
- తప్పుదోవ పట్టించే, తక్కువ నాణ్యత కలిగిన వాటి నుంచి నిజమైన దరఖాస్తులను వడబోయడంలో ఏఐ సాయపడుతున్నట్టు 48 శాతం మంది చెప్పారు.
- 2026లోనూ ఇంటర్వ్యూల ముందస్తు స్క్రీనింగ్‌కు, వేగవంతమైన నియామకాలకు, మెరుగైన అభ్యర్థుల ఎంపికకు ఏఐని ఉపయోగించనున్నట్టు మెజారిటీ రిక్రూటర్లు తెలిపారు.

క్యూ3 ఫలితాలు

టాటా పవర్ లాభం ఫ్లాట్

క్యూ3లో రూ. 1,194 కోట్లు

న్యూఢిల్లీ: విద్యుత్ రంగ టాటా గ్రూప్ దిగ్గజం టాటా పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 1,194 కోట్లను తాకింది. ఆదాయం నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,188 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 10 శాతం క్షీణించి రూ. 14,269 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 15,793 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 14,249 కోట్ల నుంచి రూ. 13,465 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్ఎస్ఈలో 1.6 శాతం బలపడి రూ. 371 వద్ద ముగిసింది.

ట్రెంట్ లాభం ఫ్లాట్

క్యూ3లో రూ. 510 కోట్లు



న్యూఢిల్లీ: రిటైల్ రంగ టాటా గ్రూప్ దిగ్గజం ట్రెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం పుంజుకుని రూ. 510 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 497 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 15 శాతం ఎగసి రూ. 5,345 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 4,657 కోట్ల టర్నోవర్ అందుకుంది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 13.2 శాతం నుంచి 13.8 శాతానికి బలపడ్డాయి. ఈ కాలంలో కొత్త కార్మిక చట్టాల అమలుతో రూ. 26.1 కోట్లమేర ప్రభావం పడినట్లు కంపెనీ పేర్కొంది. ఈ పద్దుకు ముందు ఇబిటా 11 శాతం వృద్ధితో రూ. 690 కోట్లను దాటింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 14 శాతం పెరిగి రూ. 4,674 కోట్లకు చేరాయి. కంపెనీ వెస్ట్‌సైడ్, జూడియో, స్టార్ బ్రాండ్లతో రిటైల్ స్టోర్లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో ట్రెంట్ షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 4,013 వద్ద ముగిసింది.

బజాజ్ ఫైనాన్స్ లాభం డౌన్

క్యూ3లో రూ. 4,066 కోట్లు

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం నీరసించి రూ. 4,066 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ.4,3708 కోట్లు ఆర్జించింది. అయితే నికర వడ్డీ ఆదాయం రూ. 9,382 కోట్ల నుంచి రూ. 11,317 కోట్లకు బలపడింది. మొత్తం మొత్తం ఆదాయం సైతం రూ. 18,058 కోట్ల నుంచి రూ. 21,215 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.12 శాతం నుంచి 1.21 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.48 శాతం నుంచి 0.47 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 7 శాతం జంప్‌చేసి రూ. 965 వద్ద ముగిసింది.

అపోలో టైర్స్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 471 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అపోలో టైర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 471 కోట్లను తాకింది. దేశ, విదేశీ మార్కెట్లలో అమ్మకాలు ఊపందుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 337 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 6,928 కోట్ల నుంచి రూ. 7,743 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 512 వద్ద ముగిసింది.

కల్పతరు ప్రాజెక్ట్స్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 149 కోట్లు

న్యూఢిల్లీ: మౌలిక రంగ దేశీ దిగ్గజం కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 149 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 140 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,743 కోట్ల నుంచి రూ. 6,694 కోట్లకు ఎగసింది. 2025 డిసెంబర్31కల్లా కన్సాలిడేటెడ్ ఆర్డర్ బుక్ విలువ రూ. 63,287 కోట్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం నీరసించి రూ. 1,124 వద్ద ముగిసింది.

ఇమామీ లాభం అప్

- క్యూ3లో రూ. 319 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగ దేశీ దిగ్గజం ఇమామీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం ఎగసి రూ. 319 కోట్లను అధిగమించింది. ధరల పెంపు, వ్యయ నియంత్రణ, కీలక బ్రాండ్లు బలపడటం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 279 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లింపునకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. ఈ క్యూ3లో మొత్తం ఆదాయం సైతం 10 శాతం వృద్ధితో రూ. 1,152 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 1,049 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు 8 శాతం పెరిగి రూ. 768 కోట్లకు చేరాయి. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 1.1 శాతం మెరుగుపడి 33.4 శాతాన్ని తాకాయి. ఇబిటా 13 శాతం పుంజుకుని రూ. 384 కోట్లయ్యింది.

ఫలితాల నేపథ్యంలో ఇమామీ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 488 వద్ద ముగిసింది.

ఈ కప్‌లో మనమే ప్రమాదకరం

మంచుతో సమస్య ఉండొచ్చు • రోహిత్, కోహ్లి బాగా ఆడుతున్నారు
ఇక మీదటా ఆడతారు • ఆడినంత సులువుకాదు కామెంట్రీ

న్యూఢిల్లీ: ఐసీసీ మొదలుపెట్టిన తొలి టి20 ప్రపంచకప్‌నే చేజిక్కించుకున్న భారత కెప్టెన్ ధోని. తర్వాత మరో రెండు ఐసీసీ (వన్డే ప్రపంచకప్, చాంపియన్స్) ట్రోఫీలను అందించిన విజయవంతమైన సారథిగా ఘనతకెక్కిన 'మిస్టర్ కూల్' ఎమ్మెస్ ధోని శనివారం మొదలయ్యే టి20 ప్రపంచకప్ గురించి వ్యాఖ్యానించాడు. ఇంకా కొనసాగుతున్న 38 ఏళ్ల రోహిత్ శర్మ, 37 ఏళ్ల విరాట్ కోహ్లి కెరీర్‌పై స్పందన కోరితే ఘాటుగానే జవాబిచ్చాడు. ఎక్కడా తగ్గలేదు. అన్నింటికి తగిన సమాధానాలిచ్చాడు. మైదానంలో వికెట్ల వెనక చురుకైన వికెట్ కీపర్‌గా, తెలివైన కెప్టెన్ వ్యవహరించిన ధోని కామెంట్రీ మాత్రం కష్టమంటున్నాడు. స్పోర్ట్స్ బ్రాడ్‌కాస్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ధోని ఇంకా ఏమన్నాడంటే...

వయసు అడ్డంకి కాదు

రోహిత్, కోహ్లి బాగానే ఆడుతున్నారు. 2027 వన్డే ప్రపంచకప్ ఆడతారు. అయితే ఏంటి? ఎందుకు ఆడకూడదు? పెరిగిన వయసే అడ్డంకా? నా దృష్టిలో వయసు అసలు ప్రాతిపదికే కాదు. ప్రదర్శనే ప్రామాణికం. ఫిట్‌నెస్సే ప్రధానం. అలాంటప్పుడు వయసును పరిగణించాల్సిన పనేంటి చెప్పండి. ఆ వయసులో ఉన్న వారందరూ ఒకటేనా... అందరిని ఒకేలా చూస్తామా? నా విషయమే చెబుతా... నేను 24 ఏళ్ల వయసులో అరంగేట్రం చేశాను. అప్పుడెవరూ మాట్లాడలేదు. పదేళ్లకు పైగానే భారత్‌కు ఆడాను. 20 ఏళ్లయినా ఇంకా (ఐపీఎల్) ఆడుతున్నాను. ఇప్పుడు ఎవరూ మాట్లాడరు. కానీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి గురించే ఎందుకు ఈ చర్చంతా! ఎంతకాలం ఆడాలనేది వాళ్లకే వదిలేయండి ఆ విషయాన్ని. ఫామ్, ప్రదర్శన బాగున్నంత కాలం ఆడతారు. ఇందులో తప్పేంటి. నొప్పి ఎవరికి?.

ఆ అనుభవం ఒక్క సచిన్‌కే

అనుభవమనేది ఆడుతుంటేనే వస్తుంది. ఒక్క సచిన్ తప్ప 20 ఏళ్లకే అనుభవజ్ఞులైన ఆటగాళ్లుండటం అరుదు. 16, 17 ఏళ్లకు అరంగేట్రం చేస్తేనో రాదు. క్రమంగా ఆడితేనే వస్తుంది. ఒత్తిడిని ఎదుర్కొంటేనే అబ్బుతుంది. పరిస్థితులకు ఎదురొడ్డి నిలిస్తేనే అలవాటవుతుంది. అనుభవమంటే అదే. ఏదో 20, 25 మ్యాచ్‌లు ఆడినంత మాత్రాన అనుభవజ్ఞులైపోరు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడగలిగే సామర్థ్యం ఉంటుందో అనే అనుభవజ్ఞున్ని చేస్తుంది.

భారత జట్టే ప్రమాదకారి

సొంతగడ్డపై జరిగే టి20 ప్రపంచకప్‌లో మనకు ఎదురుపడే ప్రత్యర్థులకు మనతోనే ముప్పు. ఈ మెగా ఈవెంట్‌లో ప్రమాదకర జట్టు ఏదైనా ఉందంటే అది టీమిండియానే. ఒక మేటి జట్టులో ఏమేమి ఉండాలో అవన్నీ మన బృందంలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఫార్మాట్‌నే పరిగణిస్తే మన టీమ్‌కు మంచి అనుభవం ఉంది. ఈ విశేషానుభవం మన జట్టుకు అదనపు బలంగా పనికొస్తుంది. ఎంతటి ఒత్తిడిలోనైనా ఆడగలిగే స్థైర్యం అనుభవంతోనే వస్తుంది. అయితే నాకు జట్టుపై ఎలాంటి బెంగా లేదు కానీ మంచుతోనే ఏదైనా సమస్య ఉండొచ్చు. శీతాకాలం కాబట్టి ఇది బాగా ఇబ్బంది పెట్టొచ్చు. దీంతో టాస్ కీలకంగా మారుతుంది.

కామెంట్రీ కష్టం... అందుకే దూరం

మైదానంలో మైక్ పట్టుకొని మాట్లాడటం వేరు. టీవీల్లో మైక్ పట్టుకొని వ్యాఖ్యానించడం వేరు. అందుకే కామెంటరీ కష్టమనే అంటాను. మ్యాచ్ జరుగుతున్నప్పుడు దీన్ని వివరించే ప్రక్రియలో ఆడుతున్న ఆటగాళ్లను విమర్శించే వైనానికి మధ్యలో సన్నని గీత ఒకటి ఉంటుంది. దాన్ని చెరపలేం... అతిక్రమించలేం. వ్యాఖ్యాతగా మాట్లాడుతుంటే ఆ గీత ఒకటుంది అది తప్పని అనిపించదు. మ్యాచ్ వివరించేందుకు ఓ వైపు ఉండటానికే ఇష్టపడతారు. మ్యాచ్ సమయంలో తప్పని అనిపిస్తే వెంటనే దాన్ని బయటికి చెప్పాల్సి ఉంటుంది. సున్నితంగా విమర్శించగలితే నేర్పుండాలి. హుందాగా వ్యాఖ్యానించాలి. ఎవరినీ లక్ష్యపెట్టకుండా, నొప్పించకుండా వ్యాఖ్యానించగలిగే నైపుణ్యం కూడా ఉండాలి. నాకు ఇవేమీ లేవు. అందుకే కామెంట్రీకి దూరం. అంతేందుకు గణాంకాలు సైతం గుర్తుండాలి. నాకేమో నా గణాంకాలే తెలియవు. కొందరైతే ఇందులో నిష్ణాతులై ఉంటారు. వారైతేనే కామెంటేటర్ పాత్రకు న్యాయం చేస్తారు.

నేనో మంచి స్పీకర్‌ను కాదు

నాకు వినడం మీద ఉన్న శ్రద్ధ మాట్లాడటం మీద ఉండదు. వాదించడం నా వల్ల కానేకాదు. అందుకే అనిపిస్తుంది... నేను మంచి స్పీకర్‌ను కాదు. ఎప్పటికీ కాలేను కూడా! నేను మాట్లాడేది చాలా తక్కువ. నాకు అనువైన, నా మాటలు అర్థం చేసుకోగలిగిన వారితోనే మాట్లాడతాను. అందరితోనూ మాట్లాడలేను. కానీ ఎవరు చెప్పినా వినే ఓపికైతే నాకు చాలానే ఉంది. ఎంత సేపయినా వింటాను.

ఇషాన్, తిలక్ మెరుపులు

• రెండో వార్మప్ మ్యాచ్‌లోనూ భారత్ గెలుపు
• 30 పరుగులతో దక్షిణాఫ్రికా ఓటమి

ముంబై: టి20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు భారత ఆటగాళ్లు ఫుల్‌ఫామ్ చాటుకుంటున్నారు. ఇటీవల న్యూజిలాండ్‌పై టి20 సిరీస్‌లో దంచికొట్టిన మనవాళ్లు... వార్మప్ మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించారు. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ పోరులో మన బ్యాటర్లు సమష్టిగా సత్తాచాటారు. ఫలితంగా టీమిండియా 30 పరుగుల తేడాతో సఫారీ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఇషాన్ కిషన్ (20 బంతుల్లో 53; 2 ఫోర్లు, 7 సిక్సలు) హాఫ్‌సెంచరీతో కదంతొక్కగా... హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (19 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్సలు) దంచికొట్టాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్సలు), అక్షర్ పటేల్ (23 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సలు), హార్దిక్ పాండ్యా (10 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్సలు) ధనాధన్ షాట్‌లతో ఆకట్టుకున్నారు. క్రీజులో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ చూడచక్కటి షాట్‌లతో చెలరేగారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన వికెట్‌కీపర్ సంజూ సామ్సన్ ఈమ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. అతడి స్థానంలో ఆడిన ఇషాన్ కిషన్ మెరుపు హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో ప్రపంచకప్ ప్రారంభపోరులో శనివారం అమెరికాపై అభిషేక్‌తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్ ఆరంభించడం దాదాపు ఖాయమే. అనంతరం భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 210 పరుగులు చేసింది. కెప్టెన్ మార్క్‌రమ్ (19 బంతుల్లో 38; 2 ఫోర్లు, 4 సిక్సలు), రికెల్టన్ (21 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సలు), జాసన్ స్మిత్ (23 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్), స్టబ్స్ (21 బంతుల్లో 45 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సలు) తలాకొన్ని పరుగులు చేశారు. 9 మంది భారత బౌలర్లు బౌలింగ్ చేయగా... అభిషేక్ శర్మకు రెండు వికెట్లు దక్కాయి.

2031 ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి భారత్ బిడ్

కౌలాలంపూర్: 2031లో ఆసియా కప్‌ను మన దేశంలో నిర్వహించేందుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) బిడ్ దాఖలు చేసింది. భారత్‌తో పాటు ఆరు దేశాలు ఈ టోర్నీ నిర్వహణకు ఆసక్తి చూపుతున్నట్లు ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) బుధవారం వెల్లడించింది. ఈ టోర్నీ ఆతిథ్య హక్కులు దక్కించుకునేందుకు ఆస్ట్రేలియా, ఇండోనేసియా, కొరియా, కువైట్ కూడా పోటీ పడుతున్నాయి. కిర్గిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ కలిసి ఉమ్మడిగా ఆతిథ్యం కోసం ప్రయత్నిస్తున్నాయి. యూఏఈ ఈ రేసు నుంచి తప్పుకుంది. 'ఆసియాకప్ 2031 కోసం బిడ్‌ల ప్రక్రియ పూర్తయింది. భారత సమాఖ్య గతేడాదే బిడ్ దాఖలు చేసింది' ఏఎఫ్‌సీ ఒక ప్రకటనలో తెలిపింది. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలనుకుంటున్న ప్రభుత్వం... అంతకుముందు మెగా టోర్నీలు నిర్వహించి అనుభవం సాధించాలనుకుంటోంది. ఆసియా కప్ నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారం అందించనున్నట్లు కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ గతంలోనే వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వలేదు. 2023, 2027 ఆసియాకప్‌లు నిర్వహించాలని గతంలో భారత్ బిడ్‌లు దాఖలు చేసినా... ఆ తర్వాత పోటీ నుంచి తప్పుకుంది.

పెర్ల్ ఫెర్నాండెజ్ 'హ్యాట్రిక్'

ఫైనల్లోకి భారత్ • 'శాఫ్' అండర్-19 మహిళల చాంపియన్‌షిప్

పొఖారా (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత అండర్-17 జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన రౌండ్ రాబిన్ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 8-0 గోల్స్ తేడాతో భూటాన్‌ను చిత్తు చేసింది. ఈ ఏడాది చైనా వేదికగా ఏఎఫ్‌సీ అండర్-17 ఆసియా కప్ జరగనున్న నేపథ్యంలో... ఈ టోర్నీలో భారత్ అండర్-17 బాలికల జట్టును బరిలోకి దింపింది. భారత జట్టు తరఫున పెర్ల్ ఫెర్నాండెజ్ (16వ, 39వ, 41వ నిమిషాల్లో) 'హ్యాట్రిక్' గోల్స్‌తో విజృంభించింది. ప్రీతిక బర్మన్ (25వ, 90 నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తా చాటగా... అలీషా లింగ్డో (6వ నిమిషంలో), అభిష్ట బాస్నెట్ (10వ నిమిషంలో), దివ్యాణి లిండా (17వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బుధవారమే జరిగిన మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ జట్టు 4-0 గోల్స్ తేడాతో ఆతిథ్య నేపాల్‌పై నెగ్గింది. నాలుగు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన బంగ్లాదేశ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్ మూడు మ్యాచ్‌ల్లో 2 విజయాలు, ఒక పరాజయంతో 6 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం కనబర్చింది. ఆట ఆరంభమైనప్పటి నుంచే మన అమ్మాయిలు వరుస దాడులు చేస్తూ విజృంభించారు. ఆరో నిమిషంలో అలీషా గోల్ కొట్టడంతో భారత్ ఖాతా తెరిచింది. పెర్ల్ ఫెర్నాండెజ్ ప్రథమార్ధంలోనే మూడు గోల్స్ కొట్టడంతో మన అమ్మాయిలు పూర్తి ఆధిపత్యం కనబర్చారు. తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 7-0తో నిలిచింది. రెండో అర్ధభాగంలో భారత్ తరఫున ఒక గోల్ నమోదు కాగా... భూటాన్ మ్యాచ్ మొత్తంలో ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది.

త్వరలోనే బరిలోకి...

రిషభ్ పంత్ విశ్వాసం

ముంబై: గాయం నుంచి కోలుకుంటున్న భారత డాషింగ్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ త్వరలోనే మైదానంలోకి దిగుతానని ధీమా వ్యక్తం చేశాడు. రోజు రోజుకి తన ఫిట్‌నెస్ మెరుగవుతోందని అన్నాడు. ప్రపంచ పికిల్‌బాల్ లీగ్ కార్యక్రమంలో ముంబై పికిల్ పవర్ సహ యజమాని హోదాలో పాల్గొన్న పంత్ తను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో తిరిగి క్రికెట్ ఆడేందుకు చెమటోడ్చుతున్నట్లు చెప్పాడు. 'నా ఫిట్‌నెస్ క్రమంగా మెరుగవుతోంది. త్వరలోనే క్రికెట్ మైదానంలోకి దిగుతాను' అని 27 ఏళ్ల పంత్ ఆశాభావం వ్యక్తం చేశడు. గత నెల వడోదరలో ప్రాక్టీస్ సెషన్‌లో అతను గాయపడ్డాడు. క్రికెట్‌పై తనకున్న ప్రేమే ఎన్ని గాయాలైనా... కష్టనష్టాలెదురైనా కోలుకునే స్థైర్యాన్నిస్తుందని ఈ స్టార్ వికెట్ కీపర్ చెప్పుకొచ్చాడు. 'ప్రతి గాయం, పునరాగమనం నాకో పాఠం నేర్పింది' అని పంత్ తెలిపాడు.

ముంబై రంజీ జట్టుకు సచిన్ సలహాలు

ముంబై: కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎలా జయించాలనే అంశంపై ముంబై రంజీ జట్టుకు... క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పలు సూచనలు చేశాడు. గ్రూప్ దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన ముంబై జట్టు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో కర్ణాటకతో తలపడనుంది. ఇప్పటి వరకు ముంబై జట్టు రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ కైవసం చేసుకోగా... కర్ణాటక జట్టు ఎనిమిదిసార్లు విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో బుధవారం సచిన్ టెండూల్కర్ ముంబై జట్టుతో ముచ్చటించాడు. ప్లేయర్లు, కోచింగ్ స్టాఫ్‌తో సుదీర్ఘంగా సంభాషించాడు. 'డ్రెస్సింగ్ రూమ్‌లో సచిన్ సార్‌ను కలవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. విజయ పరంపర కొనసాగించడం, మానసిక దృఢత్వం, ఒత్తిడిని ఎదుర్కోవడం వంటి ఎన్నో అంశాలపై కీలక సూచనలు చేశారు. ప్లేయర్లు, కోచింగ్ స్టాఫ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఆయన మాటలు ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. కీలక సమరాల్లో ఒత్తిడిని ఎలా అధిగమించవచ్చో చక్కగా వివరించారు. రంజీ ట్రోఫీలో

ఆ సూచనలు పాటిస్తూ విజయాలు సాధించాలని భావిస్తున్నాం' అని ముంబై కెప్టెన్ శార్దుల్ ఠాకూర్ పేర్కొన్నాడు.

హుసాముద్దీన్ శుభారంభం

లా నుసియా (స్పెయిన్): తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (60 కేజీలు) బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. 21 దేశాలకు చెందిన 214 మంది బాక్సర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో తొలి రోజు హుసాముద్దీన్‌తో పాటు పలువురు భారత బాక్సర్లు బోణీ కొట్టారు. తొలి రౌండ్‌లో హుసాముద్దీన్ 4-1 తేడాతో డెన్మార్క్ బాక్సర్ మతియాస్ మెహ్మెత్ బుయుక్‌డెమిర్‌పై విజయం సాధించాడు. మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి 5-0తో అలియాస్కర్ సింబట్ (కజకిస్తాన్)పై విజయం సాధించింది. 57 కేజీల విభాగంలో ప్రాచి 5-0తో వనెసా మొరెల్ రమిరెజ్ (స్పెయిన్)పై... 60 కేజీల విభాగంలో ప్రియ 5-0తో అలెసియా మన్‌సుట్టో (కెనడా)పై గెలిచారు. 65 కేజీల విభాగంలో కాజల్ 4-1తో అసెమ్ టనాటర్ (కజకిస్తాన్)పై నెగ్గి ముందంజ వేసింది. పురుషుల 70 కేజీల విభాగంలో హితేశ్ 5-0తో ఫిన్ బాస్ (నెదర్లాండ్స్)పై... 60 కేజీల విభాగంలో సచిన్ 5-0తో బ్రాండన్ అలెజాండ్రో (స్పెయిన్)పై... 65 కేజీల విభాగంలో అభినాష్ జమ్వాల్ 5-0తో ఖాలిద్ ఉస్మాన్ (డెన్మార్క్)పై... 70 కేజీల ఈవెంట్‌లో దీపక్ 4-1తో హార్నెల్ (బెల్జియం)పై గెలిచారు. ఆకాశ్ (75 కేజీలు), అంకుశ్ (80 కేజీలు) కూడా విజయాలు సాధించగా... ఆదిత్య ప్రతాప్ యాదవ్ (65 కేజీలు) పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

చెస్ టోర్నీ విజేతలు సార్థక్, ప్రణయ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ క్రీడాకారులను ఎంపిక చేసేందుకు సెలెక్షన్ టోర్నీ జరిగింది. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీజీసీఏ) ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని ఏర్పాటు చేశారు. బ్లిట్జ్ విభాగంలో కరణం నాగసాయి సార్థక్ విజేతగా నిలిచాడు. నిర్ణీత ఏడు రౌండ్ల తర్వాత నాగసాయి సార్థక్, తిప్పర్తి శ్రేయాన్ 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... సార్థక్‌కు తొలి స్థానం, శ్రేయాన్‌కు రెండో స్థానం లభించాయి. ఈ ఇద్దరూ జాతీయ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు. ర్యాపిడ్ విభాగంలో ఆకుల ప్రణయ్ విజేతగా అవతరించాడు. నిర్ణీత ఏడు రౌండ్ల తర్వాత ప్రణయ్ 7 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. అధ్యాయన్ బెనర్జీ 6.5 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. వీరిద్దరు జాతీయ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు. టీజీసీఏ జనరల్ సెక్రటరీ జయచంద్ర, ఉపాధ్యక్షురాలు పుణ్యవతి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ డైరెక్టర్‌గా కేఎస్ ప్రసాద్, చీఫ్ ఆర్బిటర్‌గా రేఖలిగా చంద్రమౌళి, డిప్యూటీ చీఫ్ ఆర్బిటర్‌గా బర్ల మణికంఠ, ఆర్బిటర్లుగా సాత్విక, మంగ్యా వ్యవహరించారు.

పీఎస్‌ఎల్‌లో స్టీవ్ స్మిత్

సియాల్‌కోట్ స్టాలియన్స్ జట్టుతో ఒప్పందం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టి20 జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్... పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాడు. పీఎస్‌ఎల్ ఫ్రాంచైజీ సియాల్‌కోట్ స్టాలియన్స్ తరఫున స్మిత్ ఆడనున్నాడు. తద్వారా తిరిగి జాతీయ జట్టులోకి రావాలని స్మిత్ భావిస్తున్నాడు. యాషెస్ సిరీస్‌తో పాటు బిగ్ బాష్ లీగ్‌లో చక్కని ప్రదర్శన చేసినప్పటికీ క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్లు స్మిత్‌ను టి20 వరల్డ్ కప్‌నకు ఎంపిక చేయలేదు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేయనుండగా... అందులో జాతీయ జట్టు తరఫున ఆడాలనుకుంటున్నట్లు 36 ఏళ్ల స్మిత్ గతంలోనే వెల్లడించాడు. ఈ లీగ్‌లో ఇప్పటి వరకు ఆరు జట్లు పాల్గొంటుండగా... ఈ ఏడాది నుంచి మరో రెండు కొత్త జట్లు చేరాయి. అందులో సియాల్‌కోట్ స్టాలియన్స్ ఒకటి కాగా... మరొకటి కింగ్స్‌మెన్ హైదరాబాద్. దీంతో సియాల్‌కోట్ జట్టు స్మిత్‌ను ప్రధాన ఆటగాడిగా ఎంపిక చేసుకుంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ టిమ్ పైన్ సియాల్‌కోట్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తుండగా... ఆసీస్ మాజీ పేసర్ జేసన్ గెలెస్పీ హైదరాబాద్ జట్టుకు కోచింగ్ ఇవ్వనున్నాడు. ఈనెల 11న తొలిసారి పీఎస్‌ఎల్ వేలం జరగనుంది. అయితే అంతకుముందే ఒక ఆటగాడిని ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో ... సియాల్‌కోట్ ఫ్రాంచైజీ స్మిత్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది బిగ్ బాష్ లీగ్‌లో స్మిత్ 6 ఇన్నింగ్స్‌ల్లో 299 పరుగులు చేశాడు.

అంతరిక్ష సంక్షేమం కోసం స్టార్‌గేజ్

ఇతరుల బాగు కోరే వారే మంచి మనిషి అని శతాబ్దాలుగా వింటున్నాం. ఇప్పుడీ మంచి పనిని అంతరిక్ష వేదిగా ఆచరించి చూపుతామని ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' సంస్థ శనివారం ప్రకటించింది. అంతరిక్షంలో వందల కిలోమీటర్ల ఎత్తులో వేర్వేరు కక్ష్యల్లో తిరిగే కృత్రిమ ఉపగ్రహాలు హఠాత్తుగా స్థానచలనం చెందిన విపత్కర సందర్భాల్లో సమీప ఉపగ్రహాల ఆపరేటర్లను అప్రమత్తంచేసే అత్యాధునిక ఆన్‌లైన్ టూల్ 'స్టార్‌గేజ్'ను అందుబాటులోకి తెచ్చినట్లు స్పేస్‌ఎక్స్ ప్రకటించింది. దీనిని స్పేస్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ సిస్టమ్ అని కూడా పిలుస్తున్నారు.

ఉపగ్రహాలు ఢీకొట్టకుండా అప్రమత్తం చేయనున్న వ్యవస్థ

వేల ఉపగ్రహాల తాజా లొకేషన్ ఉచితంగా షేరింగ్

కొత్తగా అందుబాటులోకి తెచ్చిన స్పేస్‌ఎక్స్



ఇదొక అప్రమత్త వ్యవస్థ. ఉపగ్రహాల ఇంధనం ఖాళీ అవడం, లేదా ఉపగ్రహం విఫలమై దిగువ కక్ష్యలోకి జారిపోవడం లేదా స్వేచ్ఛగా ఇష్టమొచ్చినట్లు తిరిగే సందర్భాల్లో అవి అంతరిక్ష బాంబుల్లా మారిపోతాయి. సమీప ఉపగ్రహాలకు ఢీకొట్టి సర్వనాశనం చేస్తాయి. తర్వాత ఇది శృంఖల చర్యలా విశృంఖలంగా జరిగి వందల ఉపగ్రహాలు ధ్వంసమయ్యే పెను ప్రమాదముంది. ఈ అంతరిక్ష ప్రమాదాన్ని మొగ్గదశలోనే తుంచేసే శక్తి ఈ స్టార్‌గేజ్‌కు ఉంది. అస్తవ్యస్తంగా కదులుతున్న ఉపగ్రహాల జాడ, లొకేషన్‌ను ఇతర ఆపరేటర్లకు ఉచితంగా స్పేస్‌ఎక్స్ అందిస్తుంది. దాంతో తమ ఉపగ్రహాలను ఆ ప్రమాదకర ఉపగ్రహం నుంచి దూరంగా తీసుకెళ్లడమో, దిగువ కక్ష్యలోకి సురక్షితంగా మార్చడమో సాధ్యమవుతుంది. దీంతో ఉపగ్రహాల యాక్సిడెంట్‌ను నివారించవచ్చు. కేవలం ఉపగ్రహాలు మాత్రమేకాకుండా హఠాత్తుగా దూసుకొచ్చిన చిన్నపాటి గ్రహశకలాల లొకేషన్‌నూ ఆపరేటర్లకు స్టార్‌గేజ్ అందిస్తుంది. అత్యంత ఖచ్చితత్వంతో కూడిన సమాచారం ఇవ్వడం స్టార్‌గేజ్ ప్రత్యేకత. అత్యాధుని సెన్సార్లు, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ సాయంతో పాత ఉపగ్రహాల శకలాలనూ స్టార్‌గేజ్ గుర్తించి వాటి జాడను ఆపరేటర్లకు అందజేస్తుంది. ఒకచోట పోగుబడిన శకలాల ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంచేస్తుంది. ఉపగ్రహాలు ఢీకొట్టే అవకాశాలు గణనీయంగా తగ్గించి తద్వారా అంతరిక్ష చెత్త పోగుబడకుండా, ఆ ప్రాంతంలో మరో కొత్త ఉపగ్రహం వచ్చి చేరేందుకు మార్గం సుగమం చేస్తుంది. పౌర, సైనిక, నిఘా, వాతావరణ ఉపగ్రహాల ప్రయోగాలతో దిగువ భూకక్ష్యల్లో కొత్త ఉపగ్రహాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీనికితోడు వేలాది ఉపగ్రహాల కూటమి స్టార్‌లింక్‌తో ఉపగ్రహాల సంఖ్య వేలాదిగా ఎక్కువైంది. ఈ తరుణంలో అంతరిక్షం సైతం ఒక రద్దీ అయిన రహదారిలో మారింది. రోడ్డుపై వాహనాలను క్రమబద్ధీకరించే ట్రాఫిక్ కానిస్టేబుల్ తరహా వ్యవస్థ తక్షణావసరమైంది. ఈ అవసరాన్ని స్టార్‌గేజ్ తీర్చనుంది.

ఏమిటీ స్టార్‌గేజ్?

ఇప్పుడున్న ఉపగ్రహాలు కొన్ని గంటల తర్వాత ఏ దిశగా ఎంత దూరం కదులుతాయి అనే వివరాలను స్టార్‌గేజ్ ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఉపగ్రహాల ఆపరేటర్లకు ఉచితంగా అందివ్వనుంది. దీంతో తోటి ఉపగ్రహాలతోపాటు ఖగోళ వస్తువులు, స్పేస్ చెత్త ఎక్కడున్నాయో ఇట్టే తెల్సిపోతుంది. వీటికి అనుగుణంగా ఆపరేటర్లు తమ భవిష్యత్ ఉపగ్రహాల ప్రయోగాల తేదీలను సవరించుకోవచ్చు. దీని వల్ల అత్యంత విలువైన సమయం, ప్రయోగాల ఖర్చు కలిసివస్తాయి. స్టార్‌గేజ్ అందించనున్న అత్యంత విలువైన డేటా షేరింగ్ సమాచారాన్ని నాసా, ఇతర అంతర్జాతీయ ఉపగ్రహ ఆపరేటర్లు ఎప్పట్నుంచో కోరుతుండగా ఇన్నేళ్లకు ఇది సాకారమైంది. గత ఏడాది డిసెంబర్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ కూటమికి అత్యంత సమీపంగా చైనా ఉపగ్రహం దూసుకొచ్చింది. అవి ఢీకొట్టే పెనువినాశనం సంభవించేది. దీంతో భయపడిన స్టార్‌లింక్ ఏకంగా తమ 4,400 ఉపగ్రహాలను వెనువెంటనే 480 కిలోమీటర్ల దిగువ కక్ష్యలోకి తీసుకురావాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దనే సదుద్దేశంతో ఉచితంగా ఈ సేవలను స్టార్‌లింక్ అంతర్జాతీయంగా అన్ని దేశాలకు అందుబాటులోకి తెచ్చింది. కంజంక్షన్ డేటా మెసేజెస్(సీడీఎం)లను ఎప్పటికప్పుడు స్టార్‌గేజ్ పంపనుంది. కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్ ద్వారా గంటల తర్వాత రావాల్సిన డేటాను కేవలం నిమిషాల్లోనే సీడీఎంల రూపంలో ఆపరేటర్లు పొందొచ్చు.

అదనంగా కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్..

– సాక్షి, నేషనల్ డెస్క్

నీట్ పీజీ కటాఫ్ వివాదంపై కేంద్రానికి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నీట్ – పీజీ2025 – 26 ప్రవేశపరీక్షలో కటాఫ్ పర్సంటైల్‌ను దారుణంగా తగ్గించడంపై దాఖలైన పిటిషన్ విషయంలో మీ స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్), జాతీయ వైద్య కమిషన్‌లకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం నోటీసులు జారీచేసింది. ప్రవేశపరీక్షలో అభ్యర్థులు అత్యల్ప మార్కులు తెచ్చుకోవడంతో, అనర్హత కారణంగా దేశవ్యాప్తంగా 18,000 పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయన్న సాకుతో రిజర్వ్‌డ్ కేటగిరీలకు అర్హత పర్సంటైల్‌ను 40 నుంచి ఏకంగా సున్నాకు తగ్గించారని సామాజిక కార్యకర్త హరిశంకర్ దేవగణ్‌సహా పలువురు వైద్యులు కేసు వేశారు. పర్సంటైల్ తగ్గించడంతో 800 మార్కులకు మైనస్ 40కూడా లేని అభ్యర్థులు సైతం పీజీ మెడికల్ సీట్ల మూడో రౌండ్ కౌన్సిలింగ్‌కు అర్హత సాధించారని పిటిషనర్లు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కేసును ఫిబ్రవరి ఆరో తేదీన విచారిస్తామని కోర్టు తెలిపింది.

వాంగ్‌చుక్ విడుదల కోసం యోచించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: లద్దాఖ్‌లో పర్యావరణకార్యకర్త, సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్ విడుదలపై పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని జస్టిస్ అరవింద్, జస్టిస్ పీబీ వరాలేల సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ''నిర్బంధంలో ఉన్న వాంగ్‌చుక్ మెడికల్ రిపోర్ట్‌లను పరిశీలించాం. ఆయన ఆరోగ్యం ఏమాత్రం బాగోలేదు. విడుదలపై పునరాలోచించండి లేదా మీ పాత నిర్ణయంపై పునఃసమీక్ష చేయండి'' అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌ను ధర్మాసనం ఆదేశించింది. మీ సలహాలను సంబంధిత ఉన్నతాధికారులకు చేరవేస్తానని కోర్టుకు నటరాజ్ హామీ ఇచ్చారు.

బెయిల్ కేసుల సంగతి తేల్చండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బెయిల్ కోరుతూ వ్యక్తులు పెట్టుకునే దరఖాస్తులకు సత్వరం మోక్షం లభించట్లేదని సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. జనవరి ఒకటో తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న లక్షలాది బెయిల్ పిటిషన్లపై నివేదిక ఇవ్వాలంటూ అన్ని హైకోర్టులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం బుధవారం ఆదేశించింది. బెయిల్ కోసం ఏ తేదీన దరఖాస్తు చేసుకున్నారో, ఆ కేసుల తదుపరి విచారణ ఎప్పుడు, బెయిల్‌పై ఎప్పుడు తీర్పు ఇవ్వబోతున్నారు? వంటి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

ఎవరి నుంచైనా చమురు కొనొచ్చు

భారత నిర్ణయాన్ని సమర్థించిన రష్యా

మాస్కో: ముడి చమురు కొనుగోళ్లకు సంబంధించి ఏ సంస్థ నుంచి చమురును దిగుమతి చేసుకోవాలనే పూర్తిస్వేచ్ఛ భారత్‌కు ఉందని రష్యా ప్రకటించింది. ''మేము సైతం అంతర్జాతీయ ఇంధన నిపుణుల బాటలోనే నడుస్తున్నాం. భారత్‌కు ఒక్క రష్యాయే కాదు ఎన్నో దేశాలు తమ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. ఎవరి నుంచి ఏం కొనాలనే స్వేచ్ఛ భారత్‌కు మొదట్నుంచీ ఉంది. ఇందులో కొత్తేమీ లేదు''అని రష్యా అధ్యక్షభవనం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి మోదీ సర్కార్ రష్యా నుంచి పూర్తిగా ముడిచమురు కొనుగోళ్లను ఆపేసిందన్న వార్తలపై మీ స్పందన ఏంటని మీడియా ప్రశ్నించగా పెస్కోవ్ పై విధంగా సమాధానం ఇచ్చారు. అయితే రష్యా హైడ్రోకార్బన్‌లను భారత్ కొనుగోలుచేయడం ఉభయతారకమని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా అన్నారు.

శుక్రవారం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు

దుబాయ్: ఇరాన్ అణ్వాయుధాల తయారీ యత్నాలను అడ్డుకునే లక్ష్యంతో ఒమన్‌లో శుక్రవారం అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు జరగబోతున్నాయి. ఈ మేరకు ఇరాన్ మీడియాలో బుధవారం కథనాలు వెలువడ్డాయి. గతంలో ఈ రెండు దేశాల మధ్య పలుమార్లు చర్చలకు ఒమన్ వేదికగా ఉన్న విషయం విదితమే. అయితే శుక్రవారం చర్చలపై ఒమన్ సుల్తానేట్, అమెరికా ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువర్చలేదు. మరోవైపు ఖమేనీ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని అణిచేస్తూ ఇరాన్ పాలకులు నియంతల్లా వ్యవహరిస్తున్నారని ఉద్యమకారులు బుధవారం వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల అరెస్ట్‌ల సంఖ్య బుధవారం 50,000 దాటిందని వెల్లడించారు. ఘర్షణల్లో ఇప్పటిదాకా 6,876 మంది ప్రాణాలు కోల్పోయారు. వాస్తవ మరణాలు చాలా ఎక్కువగా ఉండొచ్చని అంచనావేస్తున్నారు.

2.5 కోట్లకుపైగా ఆధార్ నంబర్ల డియాక్టివేట్

- లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్‌తో మోసాలను అరికట్టేందుకేనని వివరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆధార్ డేటాబేస్‌ను మరింత సురక్షితంగా, విశ్వసనీయంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకుపైగా ప్రజల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు వెల్లడిచింది. ఈ మేరకు బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వంగా సమాధానం ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థగా నిలిచిన ఆధార్‌లో ప్రస్తుతం సుమారు 134 కోట్ల మందికి సంబంధించిన వినియోగదారులు ఉన్నారని తెలిపారు. అయితే వ్యక్తి మరణించిన తర్వాత ఆధార్ నంబర్ క్రియాశీలకంగా ఉంటే, సంక్షేమ పథకాల దుర్వినియోగం, గుర్తింపు సంబంధ మోసాలు జరిగే ఆస్కారం ఉండటంతో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) దేశవ్యాప్తంగా భద్రతా చర్యలు, సంస్కరణ కార్యక్రమం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఆధార్ వినియోగదారుడి చిరునామాలో నమోదైన రాష్ట్రం, మరణం నమోదైన రాష్ట్రం వేరుగా ఉంటే అలాంటి వ్యక్తుల వివరాలు సమీకరించి మరణాలను ధృవీకరించుకుంటామని వెల్లడించారు. ఆ తర్వాత ఆయా వ్యక్తుల ఆధార్ నంబర్లను నిలిపిస్తున్నట్లు స్పష్టం చేశారు. గుర్తింపు మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ–కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేశామని జితిన్ ప్రసాద స్పష్టం చేశారు.

'జ్ఞానేశ్ కుమార్ అభిశంసన'పై ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంటాం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై ప్రతిపక్షాలతో చర్చిస్తామని, తామంతా ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో అక్రమాలకు జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యుడిని చేయాలని, ఆయనను అభిశంసించాలని, పదవి నుంచి తొలగించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై మాట్లాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరాకరించారు. మమతా బెనర్జీ సూచనను తాము సానుకూలంగా స్వీకరిస్తున్నామని కె.సి.వేణుగోపాల్ చెప్పారు. ఆయన బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. జ్ఞానేశ్ కుమార్ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలన్నీ కలిసి చర్చించుకొని, ఒక ఉమ్మడి నిర్ణయం తీసుకుంటాయని వివరించారు. ఈ విషయంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తమను సంప్రదించిందని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మమతా బెనర్జీకి సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ సైతం మద్దతు పలికారు. బీజేపీ నల్ల చర్యలకు వ్యతిరేకంగా మమత నల్లకోటు ధరించారని ప్రశంసించారు. ప్రజలు సైతం ముందుకు రావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటును కోల్పోవడం అంటే హక్కులు కోల్పోయినట్లేనని తేల్చిచెప్పారు. పౌరసత్వం కూడా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌ను శివసేన(ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది తప్పుపట్టారు. పారదర్శకత పాటించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌పై మమతా బెనర్జీ సాగిస్తున్న పోరాటాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

24న రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఈసీ సదస్సు

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర స్థాయి ఎలక్షన్ కమిషన్‌లలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయ సాధనే ధ్యేయంగా ఈనెల 24వ తేదీన ఢిల్లీలో సదస్సు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తలపోస్తోంది. ఈ సదస్సుకు రాష్ట్రాల ఎలక్షన్ కమిషనర్లతోపాటు లీగల్ నిపుణులు హాజరుకానున్నారు. ఇలా నేషనల్ స్టేట్ ఎలక్షన్ కమిషర్ల సమావేశం నిర్వహించడం గత 27 ఏళ్లలో ఇదే తొలిసారికావడం విశేషం. చివరిసారిగా ఇలాంటి కాన్ఫరెన్స్‌ను 1999లో చేపట్టారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ సారథ్యంలో ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీల ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించనున్నారు. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు సదస్సులో పాల్గొని కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పని సమన్వయంపై చర్చించనున్నారు. తమ రాష్ట్రాల్లో పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను స్టేట్ ఎలక్షన్ కమిషనర్లు ఈసీ ఎదుట ప్రస్తావించే వీలుంది.

హిమంతకు 4వేల ఎకరాల భూములు

దురాక్రమణ చేశారంటూ గౌరవ్ గొగోయ్ ఆరోపణ

గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత హిమంత బిశ్వ శర్మ కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,000 ఎకరాల భూములను ఆక్రమించిందని కాంగ్రెస్ అస్సాం రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ఆరోపించారు. బుధవారం గువాహటిలో గొగోయ్ మీడియాతో మాట్లాడారు. ''గొగోయ్ కుటుంబం తమ భూకుంభకోణాన్ని కప్పిపుచ్చుకోవడానికి నాకు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు అంటగట్టింది. 12,000 బిఘాల(3,960 ఎకరాల) భూములను ఆక్రమించిన విషయంపై కాంగ్రెస్ సొంతంగా దర్యాప్తుచేసింది. ఈ దర్యాప్తు ఇంకా ముగిసిపోలేదు. దురాక్రమణలో ఉన్న భూముల సంఖ్య పెరగొచ్చు. పాకిస్తాన్‌తో గొగోయ్ సంబంధాలన గత ఏడాది సెప్టెంబర్ పదోతేదీనే బయటపెడతానని సీఎం ఆనాడే ప్రకటించారు. ఆ తర్వాత ఈ ఐదు నెలలు ఆయన మొద్దునిద్ర పోతున్నారా?. ఒక్కసారిగా ఇప్పుడెందుకు ఈయనకు ఈ అంశం గుర్తొచ్చింది?'' అని గొగోయ్ ప్రశ్నించారు. ఈ ఆరోపణలను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి రంజీవ్ శర్మ కొట్టిపారేశారు. ''గొగోయ్ ప్రకటనలో కాస్తయినా నిజముందా?. భారతీయ చట్టాల ప్రకారం ఒక వ్యక్తి 50 బిఘాలకు మించి భూమికి హక్కుదారుగా ఉండకూడదు. ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం చూసినా ఇది నేరమే. గొగోయ్‌కు ఈ మాత్రం కూడా తెలీదా?''అని రంజీవ్ ఎద్దేవాచేశారు.

గడాఫీ కుమారుని హత్య

53ఏళ్ల సైఫ్ అల్ ఇస్లాంను హత్య చేసిన నలుగురు సాయుధులు

కైరో: లిబియా దివంగత నియంత మొమర్ గడాఫీ కుమారుడు, సైఫ్ అల్ ఇస్లాం (53) హత్యకు గురయ్యారు. సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు జింటాన్ పట్టణంలో ఉన్న గడాఫీ నివాసంలోకి అక్రమంగా ప్రవేశించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలను ధ్వంసం చేసి, అనంతరం సైఫ్‌పై కాల్పులు జరిపారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఆయన మరణించారు. సైఫ్ న్యాయవాది ఖలీద్ అల్ జైదీ అతని మరణాన్ని ధృవీకరించారు. సైఫ్ రాజకీయ సలహాదారు అబ్దుల్లా ఒత్మాన్ అబ్దుర్రహీమ్ కూడా మరణాన్ని ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. 'మనం దేవునికి చెందినవాళ్లం. తిరిగి ఆయన దగ్గరకే వెళ్తాం. సైఫ్ అల్ ఇస్లాం ఇప్పుడు దేవుని సంరక్షణలో ఉన్నాడు' అని ఆయన పేర్కొన్నారు. అయితే, తుపాకీ గాయాలవల్లే ఆయన మరణించారని దర్యాప్తు, ఫోరెన్సిక్ బృందాలు తెలిపాయి.

పదవిలో లేకపోయినా...

సైఫ్ 1972 జూన్‌లో ట్రిపోలీలో జన్మించారు. అతను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. దేశంలో చాలాకాలంపాటు తండ్రి తర్వాత అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా కొనసాగారు. లిబియాకు అమెరికా, యూకే, ఇతర పశ్చిమ దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక పదవి లేనప్పటికీ విధానాలను రూపొందించడంలో కీలకంగా పనిచేశారు. అనేక ఉన్నత స్థాయి చర్చలకు నాయకత్వం వహించారు. ఈ ఒప్పందాల ఫలితంగా లిబియాపై అనేక అంతర్జాతీయ ఆంక్షలను ఎత్తివేశారు. తనను తాను సంస్కరణ వాదిగా చెప్పుకొన్న ఆయన.. తన తండ్రి నుంచి అధికారాన్ని వారసత్వంగా పొందాలనుకుంటున్నారనే ఆరోపణలను ఎప్పుడూ ఖండించేవారు. అధికార పగ్గాలు వారసత్వంగా పొందే 'పాలం కాదు' అని చెప్పేవారు. 40 ఏళ్లకు పైగా అధికారంలో ఉన్న మొమర్ గడాఫీ 2011లో నాటో మద్దతుతో జరిగిన తిరుగుబాటుతో గఢాఫీ పాలన అంతమైంది. అనంతరం అంతర్యుద్ధాల సమయంలో అక్టోబర్ 2011లో హత్యకు గురయ్యారు. అప్పటినుంచి దేశంలో సాయుధ సమూహాలు, మిలీషియాల మధ్య విభజన వచ్చింది. తండ్రి పదవీచ్యుతుడయ్యాక ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను సైఫ్ క్రూరంగా అణచివేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో ఆయనను ప్రత్యర్థి మిలీషియా జింటాన్ నగరంలో దాదాపు ఆరేళ్లపాటు జైలులో ఉంచింది. ఐక్యరాజ్యసమితి మద్దతున్న ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ట్రిపోలీలోని ఒక కోర్టు దీనిపై విచారణ జరిపింది. 2015లో అతనికి మరణశిక్ష విధించింది. ఈ కేసుకు ఆయన హాజరు కాకపోవడం గమనార్హం. కానీ రెండేళ్ల తరువాత.. క్షమాభిక్ష ప్రసాదించింది. 2017లో ఆయన విడుదలయ్యారు. అప్పటినుంచి జింటాన్‌లోనే నివసిస్తున్న సైఫ్.. 2021 నవంబర్‌లో దేశ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ దేశ హై నేషనల్ ఎలక్షన్స్ కమిటీ ఆయనను అనర్హుడిగా తేల్చింది. సాయుధ సమూహాల మధ్య వివాదాల కారణంగా ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు.

రెండోదశలోపు కుల 'ప్రశ్నావళి'

రాజ్యసభలో ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ: జనాభా లెక్కలకు ప్రక్రియలో రెండో దశ ఆరంభం అయ్యేలోపు కులగణనకు సంబంధించిన ప్రశ్నావళిపై నోటిఫికేషన్ విడుదలచేస్తామని ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఒక ప్రశ్నకు సమాధానంగా రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ లిఖితపూర్వకంగా ఈ వివరాలు వెల్లడించారు. ''రెండో దశ అయిన పాపులేషన్ ఎన్యూమరేషన్ (పీఈ) మొదలుకావడానికి ముందే కులగణనకు సంబంధించి ఏఏ ప్రశ్నలు అడగబోతున్నారో నోటిఫై చేస్తాం. పీఈ ద్వారా ప్రజల జన, సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక లెక్కలను సమీకరిస్తాం. ఈ ప్రక్రియలో 30 లక్షల మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటారు. డిజిటల్ పరికరాలతో 1.3 లక్షల మంది సిబ్బంది సైతం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. తొలి దశలో మొబైల్ యాప్‌తోపాటు సెన్సస్ మేనేజ్‌మెంట్, మానిటరింగ్ పోర్ట్, సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తాం. యాప్‌లో ఆఫ్‌లైన్‌లో డేటా సేకరిస్తారు. అది కూడా కుదరని పక్షంలో కాగితంపై డేటా పొందుపరిచి తర్వాత డిజిటైజ్‌చేస్తారు'' అని మంత్రి వెల్లడించారు. 2027జనాభా లెక్కలను 2026 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి మొదలెడతారు. 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదాపడిన విషయం విదితమే.

ముక్తినాథ్‌యాత్ర కోసం నేపాల్‌కు బస్సు

కాఠ్మండూ: నేపాల్‌లోని హిమాలయ సానువుల్లో కొలువైన హిందూ పుణ్యక్షేత్రాలు, బౌద్ధారామాలను దర్శించే భారతీయ భక్తుల సౌకర్యార్థం ముక్తినాథ్ యాత్రలో భాగంగా భారత్–నేపాల్ మధ్య బుధవారం నూతన డైరెక్ట్ బస్సు సేవలను ఆరంభించారు. ఈ బస్సు సేవలు ఢిల్లీ నుంచి నేపాల్‌లోని బేనీ మున్సిపాలిటీ దాకా ఉంటాయి. గండకీ ప్రావిన్సులోని ముస్తాంగ్ జిల్లాలోని పురాతన వైష్ణవాలయం ముక్తినాథ్‌కు బేనీని ముఖద్వారంగా భక్తులు భావిస్తారు. ముక్తినాథ్ ఆలయాన్ని ఉదారవాద ఆలయంగా కీర్తిస్తారు. ఈ ఆలయాన్ని హిందువులతోపాటు బౌద్ధులు దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోంది.



తుర్కియే విమానం ఇంజిన్‌లో మంటలు

కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

కోల్‌కతా: నేపాల్ నుంచి తుర్కియేకు బయల్దేరిన తుర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానం హఠాత్తుగా కుడి ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా దిగింది. దీంతో విమానంలోని 11 మంది సిబ్బంది, 236 మంది ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు కాఠ్మండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్‌బస్ ఏ330–300 రకం విమానం బయల్దేరింది. కొద్దిసేపటికే కుడి ఇంజిన్‌లో మంటలు రావడంతో మధ్యాహ్నం 2.30 గంటలకు కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులను వెంటనే దింపేశారు. విమానం మార్గమధ్యంలోనే ఆ మంటలు వాటంతట అవే తర్వాత ఆగిపోయాయి. అందర్నీ మరో విమానంలోకి గురువారం ఉదయం ఎక్కించి గమ్యస్థానానికి పంపిస్తామని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

పెన్నీ.. విన్నర్

150వ వెస్ట్‌మినిస్టర్ డాగ్ షోలో విన్నర్‌గా నిలిచిన డాబర్‌మాన్ జాతి శునకం

న్యూయార్క్: అమెరికాలో పెంపుడు శునకాల క్రమశిక్షణ, అద్భుత నైపుణ్యాల ప్రదర్శనకు పెట్టింది పేరైన వెస్ట్‌మినిస్టర్ షోలో నాలుగేళ్ల నలుపు డామర్‌మాన్ శునకం 'పెన్నీ' విజేతగా నిలబడి అందరి మదినీ దోచేసింది. దీని వయసు కేవలం నాలుగేళ్లే. బెస్ట్ ఇన్ షో టైటిల్ నెగ్గడంతో దీని పెంపకందారు పెద్దాయన యాండీ లిన్టన్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పెన్నీ ద్వారా తనకు గుర్తింపు దక్కిందని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. 200 జాతులకు చెందిన మొత్తం 2,500 శునకాల నుంచి గట్టి పోటీ ఎదురైనాసరే పెన్నీ తన ఆట నైపుణ్యం, తెలివితేటలతో విజయకేతనం ఎగురవేసింది. ''నాకింకా ఎన్నో విజయాలను వరించాలని ఉంది. కానీ ఈ 150వ వెస్ట్‌మినిస్టర్ కెన్నెల్ క్లబ్ డాగ్ షోను గెలవడం ఎంతో ప్రత్యేకం. పెన్నీ నిజంగా ఎంతో మంచి డాబర్‌మాన్. ఇలాంటి శునకాన్ని ఎన్నడూ చూడలేదు'' అని యాండీ లిన్టన్ అన్నారు. ఈసారి విజేతలు చరిత్రలో నిలిచిపోతారని పోటీలకు న్యాయమూర్తి డేవిడ్ ఫిజ్‌ప్యాట్రిక్ వ్యాఖ్యానించారు. పెన్నీ గత ఏడాదిసైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజేత శునకాలలకు ట్రోఫీతోపాటు రిబ్బన్, బ్రాగింగ్ హక్కులను కల్పిస్తారు. బ్రాగింగ్ రైట్స్‌తో శునకాల సంరక్షకులు వాటి పెంపకానికి అత్యధిక ఫీజులు వసూలుచేస్తారు. శునకం జాతికీ సమాజంలో అత్యధిక విలువ దక్కుతుంది.

120 కేజీల వెండి ఆభరణాల చోరీ

రాజ్‌కోట్: అంతర్జాతీయ అనిశ్చితి కారణంగా అంతకంతకూ అమాంతం పెరుగుతున్న బంగారం, వెండి ధరలతో దొంగల దృష్టి ఇప్పుడు స్వర్ణాభరణాలతోపాటు వెండి వస్తువుల మీదా పడింది. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నగర శివారులోని రణ్‌చోడ్ నగర్‌లో ఏకంగా 120 కేజీల బరువైన వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ నగల విలువ ఏకంగా 1 కోటి రూపాయలు ఉంటుందని అంచనా. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అతుల్ బుసా అనే వ్యక్తి ఫిర్యాదుచేశారు.

పావురాలకు దాణా వేస్తే 2.2 లక్షల జరిమానా

సింగపూర్‌లో భారతీయ వృద్ధురాలికి చేదు అనుభవం

సింగపూర్: భారత్‌లో పలు నగరాల్లో విపరీతంగా కన్పించే పావురాలను అమితంగా ఇష్టపడుతూ వాటికి జొన్నల వంటి తిండి గింజలను దాణాగా వేస్తూ పిల్లలుపెద్దలు ఎంతో ఆనందపడతారు. అచ్చం అదే పని చేసి సింగపూర్‌లో ఓ భారతీయ వృద్ధురాలు లక్షల రూపాయల జరిమానా కట్టాల్సి వచ్చింది. పావురాల రెట్ట, వ్యర్థాల్లో పలు రకాల శ్వాసకోశ వ్యాధికారక క్రిములు ఉంటాయి. గాలిలో ఇవి కలిశాక మనుషులు పీలిస్తే ఇబ్బందుల్లో పడతాము. దీంతో పావురాల సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవద్దనే ఉద్దేశంతో వీటికి దాణా వేసే ప్రక్రియపై సింగపూర్‌లో నిషేధం విధించారు. ఈ విషయం తెలీక 71 ఏళ్ల షణ్ముగనాథన్ శ్యామల అనే పెద్దావిడ గత ఆరు నెలల్లో తొమ్మిదిసార్లు పావురాలకు దాణా వేశారు. విషయం తెల్సి అధికారులు ఈమెపై కేసు నమోదుచేశారు. విచారించిన కోర్టు ఈమెకు 2,518 డాలర్ల(దాదాపు రూ.2,27,753) జరిమానా విధించింది.

పురుషసూక్తం దేని గురించి తెలుపుతుంది?

ప్రపంచ సామాజిక వ్యవస్థలో ఏదో ఒక రకమైన మతం ఉంది. ఇది సమాజంలో అనాదిగా వేల ఏళ్ల నుంచి మనుగడలో ఉంది. భిన్నత్వంలో ఏకత్వం ప్రత్యేకతగా ఉన్న భారతీయ సమాజ లక్షణాలకు సంబంధించి అత్యంత ప్రధానమైన అంశాల్లో మతం ఒకటి. భారతదేశం బహుళ మతాలతో కూడుకొని ఉంది. అనేక మతాలు ఉన్నప్పటికీ మత సహనంతో విరాజిల్లడం భారతీయ సమాజ విశిష్ట లక్షణం. ఈ లక్షణం పురాతన కాలంలోగానీ, ఆధునిక కాలంలోగానీ మరెక్కడా కనిపించదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

మతం

మానవుడు తన పుట్టుక నుంచి మరణం వరకు ప్రకృతిలో సంభవించే వివిధ అంశాలు అగమ్యగోచర శక్తి ప్రభావాలే అని నమ్మాడు. తన ప్రశ్నలు, సందేహాలన్నింటికీ ఊహాత్మక భావనల మేరకు సమాధానం వెతుక్కున్నాడు. అంతిమంగా అవన్నీ 'మానవాతీత శక్తి సృష్టి' అనే భావనకు వచ్చాడు. సామాజిక మానవ శాస్త్రవేత్తలు ఈ మానవాతీత శక్తి (సూపర్ పవర్)నే అలౌకిక శక్తిగా విశ్లేషించారు. ఈ అలౌకిక శక్తుల మనుగడకు సంబంధించిన విశ్వాసమే మతంగా ఆవిర్భంచిందని చెప్పవచ్చు.

మతానికి సామాజిక శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలు

- మానవాతీత శక్తులపై ఉండే వైఖరులే మతం.
  – ఆగ్బర్న్
- మానవ జీవితం, స్వభావానికి మార్గం చూపి, వాటిని నియంత్రించే మానవాతీత శక్తులపై ఉన్న విశ్వాసమే మతం.
  – జేమ్స్ అండ్ ఫ్రేజర్
- మానవుడికి, మానవుడికి మధ్య ఉండే సంబంధమే కాకుండా అతీతమైన శక్తితో మానవుడికి ఉండే సంబంధాన్ని తెలియజేసేదే మతం.
  – మెకైవర్

మతం విశ్వజనీనమైంది. మతం లేని సమాజం లేదు. మానవాతీత శక్తుల్లో విశ్వాసం కలిగి ఉండటమే మతంలోని ప్రధానాంశం.

భారతదేశంలోని ప్రధాన మతాలు

1. హిందూ మతం 2. ఇస్లాం
3. క్రైస్తవం 4. సిక్కు మతం
5. బౌద్ధం 6. జైనం
7. జొరాస్ట్రియన్ (పార్శీ) మతం

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వివిధ మతాలవారు

1. హిందువులు	79.8 శాతం
2. ముస్లింలు	14.2 శాతం
3. క్రైస్తవులు	2.3 శాతం
4. సిక్కులు	1.7 శాతం
5. బౌద్ధులు	0.7 శాతం
6. జైనులు	0.4 శాతం
7. ఇతరులు	0.7 శాతం

హిందూ మతం

'హిందూ' అనే పదం భారతదేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవహిస్తున్న 'సింధూ' నది పేరు నుంచి వచ్చిందని భావిస్తున్నారు. కాలక్రమంలో సింధూ అనేది 'హిందూ'గా మారింది. భారతదేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు సింధూనదిని 'ఇండస్' అని పిలిచారు. దీని ఆధారంగా భారతదేశానికి 'ఇండియా' అనే పేరు వచ్చింది. భారతీయులందరినీ 'హిందువులు'గా పిలిచారు.

హిందూ మతాన్ని ఒక మతం అని పిలవడం కంటే 'విశ్వాసాల సమ్మేళనం'గా పేర్కొనడం ఉత్తమం. పురాతన కాలం నుంచి భారతీయులకు అనేక విశ్వాసాలు ఉన్నాయి.

ఉదా: పితృదేవతలను పూజించడం, ప్రకృతి శక్తుల ఆరాధన (నదులు, చెట్లు), బహు దేవతారాధన, ఏకేశ్వర ఉపాసన.

ప్రాచీన కాలంలో భారతీయ నాగరిక ఆశయాల్లో అన్ని మానవ విశ్వాసాలు సమ్మిళితమయ్యాయని ఎస్.కె. బోస్ పేర్కొన్నారు. క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం మాదిరిగా హిందూ మతానికి ఒక ప్రారంభకుడు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

హిందూ మతానికి చెందిన వ్యక్తి జీవితమంతా మత విలువలపైనే ఆధారపడి ఉంది. మంచి కార్యాలు చేసినవారు మరణించిన తర్వాత ఉత్తమ జీవితాన్ని పొందుతారు, చెడ్డ పనులు చేసినవారు తర్వాతి జన్మలో అనేక బాధలు అనుభవిస్తారనే నమ్మకంపై హిందూ మత విలువలు ఆధారపడి ఉన్నాయి.

హిందూ మత మౌలిక ధార్మిక గ్రంథాలు రెండు రకాలు. **అవి: 1. శృతులు 2. స్మృతులు.**

1. శృతులు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం'గా పేర్కొంటారు. దీన్ని అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. వీటినే 'అపౌరుషేయాలు' అంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారని అర్థం.

2. స్మృతులు

వేదాంగాలు, పురాణాలు, ఉపవేదాలు, ఇతిహాసాలను 'స్మృతి సాహిత్యం' అంటారు. వీటిని జ్ఞాన సముపార్జులైన రుషులు రాశారు.

పైన పేర్కొన్న అంశాల ద్వారా హిందూ జీవన విధానాన్ని తెలుసుకోవచ్చు. కర్మ సిద్ధాంతం, వర్ణ వ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ, పురుషార్థాలు హిందువులు ఆచరించాల్సిన విధానాల గురించి వివరిస్తాయి.

కర్మ సిద్ధాంతం

హిందూ మతంలోని ప్రతి వ్యక్తిపై కర్మ సిద్ధాంతం ప్రభావం ఉంటుంది. వ్యక్తి చేసే పనులు, మంచి చెడుల ఆధారంగా ప్రస్తుత జీవితం, పునర్జన్మ ఉంటాయని కర్మ సిద్ధాంతం తెలుపుతుంది. 'ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఇది శాశ్వతమైంది. దీనికి పునర్జన్మ ఉంటుంది. ప్రస్తుత జీవితం గత జీవితంలో చేసిన మంచి – చెడుల ఫలితం' అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

వర్ణ వ్యవస్థ

ఇది అత్యంత కీలకమైంది. రుగ్వేదంలోని 10వ అధ్యాయంలో పురుషసూక్తం దీని గురించి తెలుపుతుంది. దీని ప్రకారం ఈ సృష్టికర్త బ్రహ్మ. ఆయన తన శరీరం నుంచి ఈ సృష్టిని వర్ణం ఆధారంగా 4 రకాలుగా సృష్టించారని పేర్కొన్నారు. దీన్నే 'దైవాంశ సంభూత సిద్ధాంతం' అంటారు. దీని ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాల వారిని దైవం (బ్రహ్మ) సృష్టించాడని భావించారు. వీరిలో మొదటి మూడు వర్ణాల వారిని 'ద్విజులు' అంటారు. వీరికి ఉపనయనం, క్రతువులు ఉంటాయి. గాయత్రి మంత్రం ఆచరించడానికి, ఉచ్చరించడానికి వీరికి అర్హత ఉంటుంది. కింది స్థాయిలోని శూద్రులకు ఇవేవి ఉండవు. ఈ వర్ణవ్యవస్థ నుంచి తదనంతర కాలంలో కులాలు, ఉపకులాలు, ఆవిర్భవించాయి. కానీ వీటికి, ప్రస్తుతం ఉన్న కులాలకు చాలా తారతమ్యం ఉంది.

ఆశ్రమ వ్యవస్థ

హిందూ సామాజిక వ్యవస్థలో ప్రతి వ్యక్తి అంతిమ లక్ష్యం 'మోక్షం' పొందడం. ప్రతి హిందువు నాలుగు దశల ద్వారా దీన్ని చేరాలి.

హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం ఆశ్రమం అంటే వ్యక్తి తన జీవిత కాలంలో చేసే ఒక్కో మజిలీ. ఒక వ్యక్తి తర్వాత దశ చేరుకోవడానికి అర్హత పొందే శిక్షణా దశలే ఆశ్రమాలు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త అల్టేకర్ ప్రకారం క్రీ.పూ. 100 నుంచే హిందువుల్లో ఆశ్రమ పద్ధతి అమల్లో ఉంది. నాలుగు రకాల ఆశ్రమాలు ఉన్నాయి. బ్రహ్మను చేరుకోవడానికి ఈ ఆశ్రమాలు నాలుగు మెట్లు కలిగిన నిచ్చెన లాంటివని భీష్ముడు పేర్కొన్నట్లు హిందువులు భావిస్తారు.

i) **బ్రహ్మచర్యాశ్రమం:** ఒక వ్యక్తి ఉపనయనం తర్వాత మొదటిదశ అయిన బ్రహ్మచర్యాశ్రమంలోకి చేరుకోవచ్చు. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటి జన్మ. ఈవిధంగా పుట్టిన వ్యక్తిని ఎలాంటి లక్ష్యం లేనివాడిగా భావిస్తారు. ఆ తర్వాత బ్రహ్మచర్యాశ్రమంలోకి ప్రవేశింపజేయడానికి ఒక ఉత్సవం నిర్వహిస్తారు. దీన్నే 'ఉపనయనం' అంటారు. అంటే 'మళ్లీ జన్మించినవాడు' అని అర్థం. ఉపనయనం జరిగిన వ్యక్తిని 'ద్విజుడు' అంటారు. మహిళలు, శూద్రులకు ఉపనయనం లేదు.

ఉపనయనంలో ఒక లక్ష్యంలేని, క్రమబద్ధం కాని జీవితాన్ని ఒక నిర్దిష్ట ఆశయం ఉన్న జీవితంగా మారుస్తారు. వర్ణాల ఆధారంగా ఉపనయనం అర్హత నిర్ధారిస్తారు. సాధారణంగా బ్రాహ్మణులకు 8, క్షత్రియులకు 10, వైశ్యులకు 12 ఏళ్ల వయసులో దీన్ని నిర్వహిస్తారు. అనివార్య పరిస్థితుల్లో ఇలా జరగకపోతే మరో నాలుగేళ్ల తర్వాత ఉపనయనం చేస్తారు. దీని తర్వాత సంబంధిత వ్యక్తి గాయత్రీ మంత్రం నేర్చుకోవడానికి అర్హత పొందుతాడు. వేదాంగాల్లో భాగమైన కల్పలోని గృహసూత్రంలో 11వ యాగం ఉపనయనం గురించి తెలియజేస్తుంది.

వేదాంగాలు 6 రకాలు. **అవి:**

1. శిక్ష 2. నిరుక్త
3. వ్యాకరణం 4. జ్యోతిషం
5. ఛందస్సు 6. కల్ప

కల్ప 3 రకాలు

1. **గృహసూత్రం:** మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 యాగాల (షోడశ కర్మలు) గురించి తెలుపుతుంది. 11వ యాగం ఉపనయనం గురించి వివరిస్తుంది.
2. **శ్రేతసూత్రం:** చక్రవర్తి ప్రజల కోసం నిర్వహించాల్సిన యాగాల గురించి తెలుపుతుంది.
3. **సుళువ సూత్రం:** హోమగుండాల నిర్మాణం గురించి తెలుపుతుంది.

ఉపనయనం తర్వాత బ్రహ్మచర్య ఆశ్రమం ప్రారంభమవుతుంది. ఈ ఆశ్రమంలో వ్యక్తి ఉపాధ్యాయుడి గృహంలో విద్యార్థిగా ప్రవేశిస్తాడు. గురువు అతడికి వెంటనే విద్య నేర్పటం ప్రారంభించడు. వ్యక్తి ముందుగా గురువు ఇంటి పనులు చేయాలి. గురువు అతడికి పశువులు కాయడం; వంట చెరకు తీసుకురావడం; క్రతువులకు ఏర్పాట్లు చేయడం; తనకు, తన గురువుకు భిక్షను యాచించడం లాంటి పనులు అప్పగిస్తాడు. ఈ సేవల ద్వారా సంతృప్తి పొందితే గురువు వెలుగును (విద్యా) వేదాధ్యయనం ద్వారా బోధించడం మొదలుపెడతాడు. 'విద్' అంటే వెలుగు. జ్ఞానమనే వెలుగులో అజ్ఞానాంధకారాన్ని పారదోలడానికి గురువు వారధి లాంటివారు.

సన్మార్గం కోసం హిందువులకు ఒక బాధ్యతగా వేదాధ్యయనం నేర్పిస్తారు. పుట్టిన ప్రతి వ్యక్తి 3 రుణాలను చెల్లించాలని హిందూ మతం చెబుతోంది. అవి..

ఎ. రుషులకు రుణం చెల్లించడం: వేదాలు వల్లె వేయడం ద్వారా గురువు కంటే ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించి గురువుతో ప్రశంసలు పొందేలా జ్ఞానాన్ని పొందడం. దీంతో రుషి రుణం తీరినట్లవుతుంది.

బి) దైవ రుణం తీర్చడం: యజ్ఞయాగాదుల ద్వారా ఈ రుణం తీర్చుకోవచ్చని హిందూ ధర్మగ్రంథాలు తెలుపుతున్నాయి.

సి) పితృ (తల్లిదండ్రుల) రుణం: జన్మ ఇచ్చిన తల్లిదండ్రులను గౌరవించడం, వృద్ధాప్యంలో వారికి సేవలందించడం ద్వారా వారికి మోక్ష ప్రాప్తి లభించేలా చూడాలి.

ii) **గృహస్థ ఆశ్రమం:** బ్రహ్మచర్యంలో సంపాదించిన జ్ఞానం ఆధారంగా స్వశక్తితో జీవించడం ప్రారంభించిన తర్వాత వివాహం ద్వారా గృహస్థాశ్రమ ప్రవేశం జరుగుతుంది. హిందువుల్లో వివాహానికి ధర్మ, ప్రజా, రతి అనే మూడు లక్షణాలు ఉన్నాయి.

ధర్మ: సాంఘిక, మతపరమైన బాధ్యతలను నిర్వర్తించడం.

ప్రజా: సంతానాన్ని పొందడం. పురుష సంతానం వాంఛితమైందిగా భావిస్తారు. అతడు తల్లిదండ్రులను పుత్ (నరకం)లో పడకుండా రక్షిస్తాడనే నమ్మకం ఉంది.

రతి: ఇది లైంగిక వాంఛలు, కోరికలను తృప్తి పరుస్తూ సంతానోత్పత్తికి అవసరమైంది.

ఈ మూడు లక్ష్యాలను వ్యక్తి గృహస్థ దశలో సాధిస్తాడు. మనుసంహిత ప్రకారం ఒక గృహస్థు రోజూ 'పంచ మహాయజ్ఞాలు' చేయాలి. అవి.. బ్రహ్మయజ్ఞం, పితృ యజ్ఞం, దైవ యజ్ఞం, భూత యజ్ఞం, నరయజ్ఞం.

బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు పోషణార్థం గృహస్థు ఆశ్రమంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల దీన్ని ఉన్నతమైందిగా భావిస్తారు.

వార్థక్య ఛాయలు (ముఖంపై ముడతలు, జుట్టు నెరవటం) వచ్చిన తర్వాత లేదా కుమారులకు వివాహమైన అనంతరం గృహస్థు తన ఇంటిని కుమారులకు అప్పగించి భార్య సహాయంతో గృహస్థ ఆశ్రమాన్ని వదిలి వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించాల్సి ఉంటుంది.

iii) **వానప్రస్థ ఆశ్రమం:** ఇది గృహస్థ, సన్యాస ఆశ్రమాలకు వారధి లాంటిది. ఈ ఆశ్రమంలో ఒక వ్యక్తి వెంట భార్య వెళ్లవచ్చు. ఈ దశలోనూ 'పంచ మహాయజ్ఞాలు' నిర్వర్తిస్తారు. దీన్ని ప్రజా జీవనానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో గడపాలి. అందువల్ల అడవిలో ఆశ్రమం నిర్మించుకొని జీవిస్తారు. వ్యక్తి ప్రారంభంలో పచ్చి ఆకులు, వేర్ల సహాయంతో ఆకలి తీర్చుకోవాలి. ఆ తర్వాత నీరు, చివరకు గాలి మాత్రమే సేవించి ఆకలి తీర్చుకోవాలి. శారీరక సుఖాలన్నింటిని వదిలేయాలి. ఈ దశలో అర్థకామాలు ఉండవు. వేదాలు, వేదాంగాలు, స్మృతుల పఠనం ద్వారా ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడానికి శరీరానికి క్రమశిక్షణ అలవాటు చేయాలి.

సన్యాస ఆశ్రమం స్వీకరించే ముందు భార్యను కుమారులతో కలిసి జీవించడానికి ప్రోత్సహించాలి. వ్యక్తి క్రమంగా తన అభిమానం, కుటుంబం, గ్రామం అనే సంకుచిత పరిధుల నుంచి బయటపడి విశ్వమానవాళిని ప్రేమించాలి. ఇవన్నీ సాధించిన తర్వాత సన్యాసి రూపంలో సంఘ ప్రవేశం చేయాలి.

iv) **సన్యాస ఆశ్రమం:** ఇది చివరి దశ. ఈ దశలో కఠినమైన జీవితాన్ని గడపాలి. ప్రాపంచిక విషయాల పట్ల అనాసక్తత ప్రదర్శించాలి. మోక్ష సాధనకు ప్రయత్నించాలి. భిక్షాటన ద్వారా మాత్రమే జీవించాలి. సన్యాసి తాను తిరుగాడే ప్రజల నుంచి గొప్ప గౌరవాన్ని పొందాలి. ఆ ప్రజల మనసులు, జీవితాలపై గొప్ప ప్రభావాన్ని చూపాలి. వ్యక్తిగత ఉదాహరణ ద్వారా, మతబోధ ద్వారా మార్గదర్శకంగా ఉండేలా సమాజానికి ప్రోత్సాహం కల్పించాలి. అంటే సన్యాసి ఒక మహత్తర సాంఘిక పాత్రను నిర్వహిస్తాడు.

మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. భారత్‌తో అత్యధిక భూసరిహద్దును పంచుకుంటున్న దేశం ఏది?
1) చైనా 2) నేపాల్
3) పాకిస్తాన్ 4) బంగ్లాదేశ్

2. కర్కాటక రేఖ ($23\frac{1}{2}^\circ$ ఉత్తర అక్షాంశం) కింద పేర్కొన్న ఏ రాష్ట్రం ద్వారా వెళ్లదు?
1) మిజోరాం 2) త్రిపుర
3) మేఘాలయ 4) జార్ఖండ్

3. సింధూనదిని 'ఇండస్' అని ఎవరు పిలిచారు?
1) పర్షియన్లు 2) గ్రీకులు
3) డచ్‌వారు 4) ఫ్రెంచ్‌వారు

4. భారతదేశ ఉత్తర, దక్షిణ చివరల మధ్య దూరం ఎంత?
1) 3,214 కి.మీ. 2) 2,933 కి.మీ.
3) 1,324 కి.మీ. 4) 3,514 కి.మీ.

5. $82\frac{1}{2}^\circ$ తూర్పు రేఖాంశం ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతోంది?
1) 6 2) 7
3) 8 4) 5

6. రాడ్‌క్లిఫ్ రేఖ ఏ దేశాల మధ్య సరిహద్దుగా ఉంది?
1) భారత్ – పాకిస్తాన్
2) భారత్ – చైనా
3) భారత్ – మయన్మార్
4) భారత్ – బంగ్లాదేశ్

7. పాంబన్ దీవి వేటి మధ్య ఉంది?
1) భారత్ – శ్రీలంక
2) భారత్ – మాల్దీవులు
3) భారత్ – ఇండోనేషియా
4) భారత్ – మారిషస్

8. కింద పేర్కొన్న ఏ రాష్ట్రాలకు తీరరేఖ, విదేశాలతో భూ సరిహద్దు ఉన్నాయి?
1) గుజరాత్, మహారాష్ట్ర
2) గుజరాత్, పశ్చిమబెంగాల్
3) పశ్చిమబెంగాల్, త్రిపుర
4) పశ్చిమబెంగాల్, తమిళనాడు

9. లక్షదీవుల రాజధాని ఏది?
1) సిల్వస్సా 2) పోర్ట్‌బ్లెయిర్
3) కవరత్తి 4) పాండిచ్చేరి

10. మలబార్ తీరం ఏ రాష్ట్రానికి ఉంది?
1) గోవా 2) మహారాష్ట్ర
3) కేరళ 4) ఒడిశా

11. 'డంకన్ పాస్' వేటి మధ్య ఉంది?
1) ఉత్తర అండమాన్, తూర్పు అండమాన్
2) అండమాన్, నికోబార్ దీవులు
3) ఉత్తర అండమాన్, దక్షిణ అండమాన్
4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్

12. భారతదేశంలోని మొత్తం దీవుల (Distant Islands) సంఖ్య?
1) 240 2) 247
3) 204 4) 194

13. ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
1) జోంగ్‌మా 2) కోమలాంగిని
3) సాగరమాత 4) చోగొరీ

14. మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
1) ఉత్తరాఖండ్
2) నాగాలాండ్
3) అరుణాచల్ ప్రదేశ్
4) బీహార్

15. భారతదేశంలో ఎత్తైన కనుమ ఏది?
1) బుర్జిలా 2) కారకోరం
3) ఖార్దుంగ్లా 4) జోజిలా

16. ఫిర్ పంజాల్, దౌలాధార్ పర్వత శ్రేణులు ఎక్కడ ఉన్నాయి?
1) హిమాద్రి హిమాలయాలు
2) హిమాచల్ హిమాలయాలు
3) శివాలిక్ కొండలు
4) ట్రాన్స్ హిమాలయాలు

17. భారతదేశంలో అతిపెద్ద నదీ ఆధారిత దీవి ఏది?
1) గోవిందసాగర్ 2) మజులీ
3) బైసాలా 4) ఏదీకాదు

18. సాత్పురా పర్వతాల్లో ఎత్తైన శిఖరం ఏది?
1) అమర్ కంటక్ 2) మైకుల
3) పంచమర్హి 4) ధవళగిరి

19. హిమాలయాలు ఏ యుగంలో ఆవిర్భవించాయి?
1) ప్లిస్టోసీన్ 2) టెర్షియోరరీ
3) కేంబ్రియన్ 4) ఏదీకాదు

20. సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
1) అమృత్‌సర్ 2) సిమ్లా
3) డెహ్రాడూన్ 4) త్రివేండ్రం

21. కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
1) యాలకుల కొండలు
2) పళని కొండలు
3) బాబా బుడాన్ గిరికొండలు
4) తమిళనాడు కొండలు

22. మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
1) వింధ్య
2) సాత్పురా
3) పశ్చిమ కనుమలు
4) తూర్పు కనుమలు

23. ముంబై – నాసిక్‌ను కలిపే కనుమ ఏది?
1) థాల్‌ఘాట్ 2) బోర్‌ఘాట్
3) పాల్‌ఘాట్ 4) కలహట్టి

24. సాడిల్ పీక్ ఎక్కడ ఉంది?
1) నికోబార్ దీవులు
2) అండమాన్ దీవులు
3) సుహేలి దీవులు
4) మినికాయ్ దీవులు

25. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ' ఎక్కడ ఉంది?
1) చెన్నై 2) పనాజీ
3) బెంగళూరు 4) కొచ్చిన్

26. 'గ్రీష్మ రుతువు' కాలం ఏది?
1) మార్చి, ఏప్రిల్
2) మే, జూన్
3) జూలై, ఆగస్టు
4) సెప్టెంబర్, అక్టోబర్

27. భారత వాతావరణ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
1) కోల్‌కతా 2) హైదరాబాద్
3) పుణే 4) బెంగళూరు

28. అధిక వర్షపాతం సంభవించే 'మాసిన్ రామ్' ఏ రాష్ట్రంలో ఉంది?
1) మణిపూర్ 2) అసోం
3) నాగాలాండ్
4) మేఘాలయ

29. జాతీయ వరద నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
1) 1956 2) 1975
3) 1954 4) 1974

30. భారతదేశంలో ఎత్తైన జలపాతం ఏది?
1) దూద్‌సాగర్ 2) జోగ్
3) రకిమ్‌కుండ్ 4) కుంతల

31. కాలబైశాఖీలు అనే రుతుపవన ఆరంభ జల్లులు ఏ రాష్ట్రంలో కురుస్తాయి?
1) ఉత్తరప్రదేశ్
2) పశ్చిమబెంగాల్
3) అసోం 4) కేరళ

32. లానినో, ఎల్‌నినోలు ఎక్కడ సంభవిస్తాయి?
1) హిందూ మహాసముద్రం
2) పసిఫిక్ మహాసముద్రం
3) అట్లాంటిక్ మహాసముద్రం
4) బంగాళాఖాతం

33. భారతదేశంలో అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే రుతుపవనాలు ఏవి?
1) ఆగ్నేయ రుతుపవనాలు
2) వాయువ్య రుతుపవనాలు
3) నైరుతి రుతుపవనాలు
4) ఈశాన్య రుతుపవనాలు

34. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం పొందే రాష్ట్రం ఏది?
1) కేరళ 2) కర్ణాటక
3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు

35. విస్తీర్ణపరంగా అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
3) మిజోరాం 4) ఉత్తరప్రదేశ్

36. తీర ప్రాంతాల్లో అత్యధికంగా తుపాన్లకు గురయ్యే రాష్ట్రం ఏది?
1) తమిళనాడు 2) ఒడిశా
3) గోవా 4) అసోం

37. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
1) లఢక్ 2) బికనీర్
3) లే 4) జైసల్మీర్

38. మనదేశంలో అధిక విస్తీర్ణంలో ఉన్న అడవులు ఏవి?
1) క్షారజల అరణ్యాలు
2) సతతహరిత అరణ్యాలు
3) ఆకురాల్చే అడవులు
4) చిట్టడవులు

39. దచిగామ్ దుప్పి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఉత్తరాంచల్ 2) జమ్ము-కశ్మీర్
3) బీహార్ 4) హిమాచల్ ప్రదేశ్

40. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
1) మార్చి 21 2) మార్చి 22
3) మార్చి 29 4) మార్చి 24

41. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
1) 1992 2) 1991
3) 1990 4) 1994

42. మనదేశంలో మొదటి టైగర్ రిజర్వ్ కేంద్రం ఏది?
1) కజిరంగా 2) బందీపూర్
3) నామ్‌దఫా 4) సిమిపాల్

43. భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న నేలలేవి?
1) చిత్తడి నేలలు 2) ఒండలి నేలలు
3) నల్ల నేలలు 4) ఎర్ర నేలలు

44. సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1951 2) 1954
3) 1958 4) 1960

45. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
1) బళ్లారి 2) కోటా
3) పసద్ 4) ఊటీ

46. చేతివేళ్ల ఆకారంలో జరిగే క్రమక్షయాన్ని ఏమంటారు?
1) వట క్రమక్షయం
2) వంక క్రమక్షయం
3) అవనాళికా క్రమక్షయం
4) వాలు క్రమక్షయం

47. వరి పంటను ఏ మృత్తికల్లో అత్యధికంగా పండిస్తారు?
1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
3) నల్లరేగడి నేలలు 4) జేగురు నేలలు

48. వేదకాలంలో 'చంద్రభాగ'గా పేర్కొన్న నది ఏది?
1) రావి 2) చినాబ్
3) బియాస్ 4) సట్లేజ్

49. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
1) మజిలీ 2) పద్మా
3) మేఘన 4) ఐరావతి

50. 'దక్షిణ గంగ' అని ఏ నదిని పిలుస్తారు?
1) నర్మద 2) తపతి
3) గోదావరి 4) కృష్ణా

51. రామ్‌గంగ తీరంలో ఉన్న కాంస్య నగరం ఏది?
1) ఉజ్జయినీ
2) రూర్కెలా
3) మొరాదాబాద్
4) ఫిరోజ్‌పూర్

52. 'కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు

53. దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
1) సాంబర్ 2) ఊలార్
3) చిల్కా 4) లోక్‌తక్

54. బాగ్లీహర్ ప్రాజెక్ట్ విషయంలో భారత్‌కు ఏ దేశంతో వివాదం ఉంది?
1) నేపాల్ 2) చైనా
3) బంగ్లాదేశ్ 4) పాకిస్తాన్

55. బాబ్లీ ప్రాజెక్టు ఏ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైంది?
1) కర్ణాటక –ఆంధ్రప్రదేశ్
2) మహారాష్ట్ర – తెలంగాణ
3) తమిళనాడు –కర్ణాటక
4) కేరళ – తమిళనాడు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 1;
5) 4; 6) 1; 7) 1; 8) 2;
9) 3; 10) 3; 11) 4; 12) 2;
13) 3; 14) 3; 15) 3; 16) 2;
17) 2; 18) 3; 19) 2; 20) 3;
21) 2; 22) 4; 23) 2; 24) 2;
25) 2; 26) 2; 27) 3; 28) 4;
29) 3; 30) 2; 31) 2; 32) 2;
33) 3; 34) 4; 35) 1; 36) 2;
37) 4; 38) 3; 39) 2; 40) 1;
41) 1; 42) 2; 43) 4; 44) 3;
45) 4; 46) 2; 47) 2; 48) 2;
49) 3; 50) 3; 51) 3; 52) 4;
53) 2; 54) 4; 55) 2.

తెలంగాణ రాజకీయ జేఏసీ ఎప్పుడు ఏర్పడింది?

తెలంగాణ ఉద్యమం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష.. దాన్ని సాకారం చేసుకోవడంలో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లు.. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థుల పాత్ర అనిర్వచనీయం. 1969 మొదలు 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్ణయం వెలువడిన దశ వరకు ఇవి ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించాయి. రాజకీయ పార్టీలను సైతం ఈ జేఏసీలు, ప్రజా సంఘాలు ప్రభావితం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించాయి. 2009 డిసెంబర్ 24న ఏర్పడిన రాజకీయ జేఏసీకి నేతృత్వం వహించి.. సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, మానవ హారం, సకల జనుల సమ్మె, సాగర హారం, జైల్‌భరో, రైల్‌రోకో, వంటా వార్పు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ప్రొఫెసర్ ఎం.కోదండరాం.. తెలంగాణ ఉద్యమంలో జేఏసీలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర ప్రజా సంఘాల పాత్రపై అందిస్తున్న ప్రత్యేక వ్యాసం..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోని వివిధ దశల్లో అనేక సంయుక్త కార్యాచరణ కమిటీలు (జేఏసీలు) ఏర్పడి తెలంగాణ ప్రజల ఆశలు– ఆకాంక్షల స్ఫూర్తిగా పోరాడాయి. తెలంగాణకు నదీజలాలు, ఉద్యోగాలు, విద్యావకాశాల విషయంలో అన్యాయం జరగడం, రాష్ట్ర ఆదాయాన్ని పంపిణీ చేసుకోవడంలో వివక్షలు, భారీ స్థాయిలో భూ ఆక్రమణలు, సాంస్కృతిక దురాక్రమణ, తెలంగాణ ప్రజల పట్ల చిన్నచూపు, ఇతర ఆధిపత్య ధోరణుల కారణంగా ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవాలనే నిర్దిష్ట లక్ష్యంతో జేఏసీలు ఏర్పడ్డాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న తెలంగాణ ఉద్యమంలో తొలి నుంచీ జేఏసీలు, ప్రజా సంఘాలే కీలక పాత్ర పోషించాయి. 1969 ఉద్యమంలో సైతం వీటి పాత్రే కీలకం. అప్పట్లో ప్రత్యేకంగా విద్యార్థి, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటం.. తెలంగాణ ప్రాంతంలోని మిగతా అన్ని వర్గాలను తెలంగాణ ఉద్యమం దిశగా కదిలించింది.

ఎన్‌జీవోలు.. విద్యార్థులు.. ప్రజాసమితి..

తెలంగాణ ఉద్యమంలో ఎన్‌జీవోలు, విద్యార్థులది ఘనమైన పాత్ర. 1968లో విద్యార్థులు, ఎన్‌జీవోలు ఒక్కతాటిపై నిలిచి హైదరాబాద్‌లో పీపుల్స్ కన్వెన్షన్‌ను నిర్వహించారు. ఈ సదస్సు తర్వాతి క్రమంలో ప్రజా సమితిగా మారింది. విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన స్ఫూర్తితో ఏర్పడిన ప్రజా సమితి.. 1969 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)గా రూపొందింది. దీనికి అప్పటి కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి నేతృత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచే తెలంగాణ వాదం వినిపించిన పలువురు నేతలు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చి తెలంగాణ ప్రజా సమితిలో చేరారు. ప్రజా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఎన్నో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ ఉద్యోగుల సంఘం 1969 జూన్ 10న సమ్మె నిర్వహించింది. చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితి తర్వాత క్రమంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. తర్వాత కూడా అదే స్ఫూర్తి కొనసాగించింది. ముఖ్యంగా 1969 జూన్‌లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్‌కు వచ్చి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అయినా కాంగ్రెస్ పార్టీ నిర్ణయంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. దాంతో తెలంగాణ ప్రజా సమితి 1971 పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పోటీ చేసింది. దీనికి తెలంగాణ ప్రాంతంలోని అన్ని వర్గాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంతంలోని 14 పార్లమెంట్ సీట్లకు గాను 10 స్థానాల్లో టీపీఎస్ విజయం సాధించింది. తర్వాత కాలంలో తెలంగాణ ప్రజా సమితిలోని నాయకులు తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ మనుగడ సాగించలేకపోయింది.

1996.. ముందుకొచ్చిన ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష, ఆ దిశగా మలి దశ ఉద్యమం 1996లో మొదలైంది. దీనికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం అనుసరించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలే. ఉపాధి కల్పన, జీవనోపాధి, ప్రజల సంక్షేమం పరంగా ప్రభుత్వం నుంచి అంతగా ఆశించకూడదని పేర్కొనడం, ప్రైవేటు వర్గాలకు చేయూతనిచ్చే విధంగా వ్యవహరించడం జరిగింది. దీంతో అప్పటికే తాము వివక్షకు గురవుతున్నామనే భావనలో ఉన్న తెలంగాణ ప్రజలు.. ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల తాము మరింత వివక్షకు గురవుతామని, విద్యా, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయని ఆందోళన చెందారు. దీనికి పరిష్కారం ప్రత్యేక తెలంగాణ సాధనే అనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో మలి దశ ఉద్యమం మొదలైంది. ఈ క్రమంలోనూ విద్యార్థులు కీలక పాత్ర వహించారు. తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్; తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ వంటి సంఘాలు ఆవిర్భవించాయి.

ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో సభ

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల జేఏసీ ఆధ్వర్యంలో 1993 ఆగస్టులో చిన్న రాష్ట్రాల ఏర్పాటుపై జాతీయ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఇందులో జార్జి ఫెర్నాండెజ్, జస్టిస్ మాధవ రెడ్డి, సురేంద్ర మోహన్ వంటి జాతీయ స్థాయి రాజకీయ, మేధావి వర్గాల వారు పాల్గొన్నారు. ఆ తర్వాత 1996లో తెలంగాణ జర్నలిస్టులు, రచయితల నేతృత్వంలోని ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పేరుతో సభ జరిగింది. 1996 నవంబర్ 1న వరంగల్‌లో తెలంగాణ ప్రజా సమితి నిర్వహించిన సభ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను ప్రస్ఫుటం చేసింది. ఈ సభకు భారీ ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. వాస్తవానికి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, తీవ్రతరం చేయడంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ ఉద్యమాన్ని క్రియాశీలకంగా నడపడంలో కృషి చేశాయి. తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా విద్యార్థి జేఏసీ 2009లో చలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చింది. అలాగే 2010 జనవరిలో విద్యార్థి జేఏసీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరసనకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే, హైకోర్టును ఆశ్రయించి భారీ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు మొదటి నుంచీ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో క్రియాశీలంగా వ్యవహరించారు.

టీఆర్ఎస్ ఆవిర్భావం

మలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత ప్రత్యేక పరిణామం.. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పాటు. అప్పటివరకు ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఈ ప్రాంత ప్రజలు చేపట్టిన అనేక ఆందోళన కార్యక్రమాలను, ఇతర నిరసనలను ప్రభుత్వాలు తమ అధికారంతో అణచివేశాయి. తెలంగాణ ఆకాంక్షను రాజ్యాంగబద్ధంగా తెలపాలనే ఉద్దేశంతో అప్పటివరకు తెలుగుదేశం పార్టీలో ఉన్న కె.చంద్రశేఖరరావు.. ప్రత్యేక తెలంగాణ అంశమే ఎజెండాగా 2001లో టీఆర్ఎస్ పార్టీని నెలకొల్పారు. దీంతో ఉద్యమంలో రాజకీయ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఏదో ఒక విధంగా ఉద్యమ కార్యక్రమాలు జరగడం, వాటిలో విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని వర్గాలు మమేకమయ్యాయి. మలి దశలో 1990ల నుంచి 2009 వరకు వేర్వేరుగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించిన వర్గాలు.. 2009లో ఐక్యమవడం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దిశగా కీలక పరిణామం. 2009 నవంబర్ 29 నుంచి టీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో మళ్లీ పౌర సంఘాల పాత్ర తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల ఐక్య వేదికలు కేసీఆర్ దీక్షకు సంఘీభావంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమాలను అణచివేయాలని అప్పటి ప్రభుత్వం ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లోని విద్యార్థులపై చేసిన లాఠీచార్జి, కాల్పుల కారణంగా సాధారణ ప్రజానీకం సైతం ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు.

మలిదశలోనూ.. ప్రజా సంఘాలే

మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులదే ముఖ్య పాత్ర అని చెప్పాలి. తొలుత 1989లో తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ ఏర్పాటయింది. దీని ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసంత్ టాకీస్‌లో భారీ సభ జరిగింది. 1969 ఉద్యమంలో పాల్గొన్న నేతలంతా ఈ సభకు హాజరై.. పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, వాటికి ఆంధ్ర నేతల అడ్డంకుల గురించి చర్చించారు. ఈ చర్చలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరడంతో తెలంగాణ ఆకాంక్ష మరింత తీవ్రమైంది. ఉద్యమంలో పల్లె స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పాల్పంచుకోవడం ప్రారంభమైంది. 1970ల తర్వాత విద్యావకాశాలు విస్తృతమయ్యాయి. రిజర్వేషన్లు, ఇతర కారణాల వల్ల ఆర్థిక కోణంలో మధ్యతరగతి వర్గం పెరిగింది. ఈ వర్గం నుంచి విద్యావంతుల సంఖ్య పెరిగింది. దాంతో తెలంగాణ ప్రజలు వివక్షకు గురవుతున్న విధానంపై మరింత చైతన్యం వచ్చింది. వారంతా తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. క్రమేణా 1990ల నాటికి ఈ పౌర సంఘాలు బలపడ్డాయి. మలి దశ ఉద్యమంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాయి. తెలంగాణ మహా సభ, తెలంగాణ జన సభ, తెలంగాణ ఐక్య వేదిక ఇలా ఎన్నో సంఘాలు ఏర్పడ్డాయి.

2009 నాటికి ప్రాధాన్యం గుర్తించిన అన్ని పార్టీలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు దిశగా రాజకీయ పార్టీలు విభిన్న శైలుల్లో వ్యవహరించాయి. 1999 ఎన్నికల సమయంలో కాకినాడ ప్లీనరీలో 'ఒక ఓటు–రెండు రాష్ట్రాలు' నినాదం చేసిన భారతీయ జనతాపార్టీ తర్వాత ఏకాభిప్రాయం పేరుతో వెనుకడుగు వేసింది. 2001లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం కూడా తెలంగాణకు వ్యతిరేకంగానే ఉంది. ఈ తీర్మానం అస్పష్టంగా ఉంది. రెండో ఎస్సార్సీని వేయాలని తీర్మానం చేసి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను గుర్తించడం గమనార్హం. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దిశగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలు.. 2009 నాటికి దీని ప్రాధాన్యం, ఆవశ్యకతను గుర్తించాయి.

ముఖ్యంగా ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని చెప్పడంతోపాటు ఈ దిశగా ముందుకెళతామని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ మాత్రం మొదటి నుంచి పూర్తి వ్యతిరేకతతో వ్యవహరించింది. 2012 డిసెంబర్ 28న ఆల్ పార్టీ మీటింగ్‌లో తెలంగాణకు మద్దతు తెలిపినా.. రాజకీయంగా మాత్రం వ్యతిరేకంగా వ్యవహరించింది. ఎంఐఎం పార్టీ మాత్రం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీకే వదిలేసింది.

చివరికి 2014లో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టగా అధికార, విపక్ష సభ్యులు మద్దతు తెలిపారు! 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభ, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును 2014 మార్చి1న రాష్ట్రపతి ఆమోదించారు. దశాబ్దాల పోరాటం ఫలించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా, భారతదేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది!!

పొలిటికల్ జేఏసీ.. ఇలా:

తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు తెలంగాణ ఉద్యమ క్రమంలో అత్యంత ప్రత్యేకమైన పరిణామం. కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో డిసెంబర్ 9, 2009న అప్పటి కేంద్ర హోం శాఖ మంత్రి పి.చిదంబరం 'తెలంగాణ ఏర్పాటు దిశగా అవసరమైన చర్యల ప్రక్రియను ప్రారంభిస్తున్నాం' అని ప్రకటించారు. అయితే డిసెంబర్ 23 నాటికి పరిస్థితి తలకిందులైంది. డిసెంబర్ 9 ప్రకటనకు భిన్నమైన ప్రకటన విడుదలైంది. అన్ని పార్టీలను సంప్రదించిన తర్వాతే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని ఆ ప్రకటన సారాంశం.

దీంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఆయా పార్టీల్లోని తెలంగాణ ప్రాంత నేతలు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో డిసెంబర్ 24, 2009న అన్ని రాజకీయ పార్టీల నేతలంతా కలిసి రాజకీయ ఐక్య వేదిక(జేఏసీ)ను ఏర్పాటు చేశారు.ప్రధానంగా జేఏసీ నేతృత్వంలో సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె చరిత్రలో నిలిచిపోయేలా జరిగాయి. తెలంగాణ ప్రత్యేక ఉద్యమ క్రమంలో తెలంగాణ ఉద్యోగులు, పౌర సంఘాలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో.. 2011 ఫిబ్రవరి 17 నుంచి 16 రోజుల పాటు ఉద్యోగుల సహాయ నిరాకరణ; తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో 2011 మార్చి 10న మిలియన్ మార్చ్; 2011 సెప్టెంబర్ 13 నుంచి 42 రోజులపాటు జరిగిన సకల జనుల సమ్మె; 2011 సెప్టెంబర్ 24, 25 తేదీల్లో సడక్ బంద్; 2012 సెప్టెంబర్ 30న సాగర హారం నిర్వహణ ముఖ్య ఘట్టాలుగా పేర్కొనొచ్చు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – ఆవశ్యకతపై 2010 ఫిబ్రవరి 10న కేంద్రం ఐదుగురు సభ్యులతో శ్రీ కృష్ణ కమిటీని నియమించింది.

Currency Notes are printed at?

BANK EXAMS
BANKING AWARENESS

1. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
   a) It can be accepted since the nominees are the family members of the depositor
   b) Cannot be considered since the request is not received at the time of opening of account
   c) Can be considered with 50% share each
   d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
   e) None of the above
2. For recovery of NPA from the defaulted borrowers, SARFAESI Act 2002, is implemented. What does the letter 'S' stands for in SARFAESI
   a) Social b) Security
   c) Seasonal d) Stamp
   e) Systematic
3. Bank holidays under Sec.25 of N.I. Act are declared by
   a) RBI
   b) State govt. for the respect state
   c) Central govt.
   d) LHO
   e) Prime Minister
4. One rupee coin issued under _____ Act
   a) Coinage Act 1906
   b) RBI c) BR
   d) All the above
   e) None of these
5. Clean Note policy has been introduced as per
   a) Banking Regulation Act
   b) RBI Act c) SBI Act
   d) PNB Act e) None of these
6. Under prevention of Money laundering Act 2002, the financial transaction records have to be preserved for ______ years.
   a) 5 b) 10 c) 20 d) 40
   e) None of these
7. Under prevention of Money laundering Act 2002, banks have to report suspicious transaction to ______
   a) RBI b) CBI c) FIU-IND
   d) LHO e) Central Govt.
8. RBI Has relaxed KYC norms for small account holders who do not intend to make deposits over Rs.50,000/- and total credits in the account in a year is limited to Rs. 1 lakh. Total withdrawls/ Transfer in a month does not exceed Rs. ____
   a) 10,000 b) 20,000
   c) 50,000 d) 60,000
   e) None of these
9. When form15-H has been received, the bank shall forward the same to I.T. Department on or before _____ day of next month.
   a) 3rd b) 5th c) 7th
   d) 15th e) 17th
10. In which of the following transaction PAN should be quoted?
    a) A time deposit exceeding Rs.50,000
    b) Payment in cash to purchase bank draft or banker's cheque for an amount aggregating Rs.50,000 or more during any one day
    c) Deposit cash aggregating Rs. 50,000 or more during any one day
    d) All the above e) None of these
11. Currency Notes are printed at:
    a) Nasik b) Dewas c) Mysore
    d) Salboni e) All of these
12. If the customer does not cooperate for making their accounts KYC compliant, despite repeated communication/ contacts, their accounts should be ______.
    a) Frozen b) Closed
    c) Close the account only after compliance of KYC
    d) a or c e) a & b
13. As per KYC Norms / AML measures risk categorization of all customer accounts should be done and review of risk categorization should be cared out at ____ months intervals every year.
    a) 3 b) 6 c) 9
    d) 12 e) 15
14. SLR has to be maintained by banks under _______
    a) Sec. 24 of BR Act
    b) Sec. 24 of RBI Act
    c) Sec. 42 of RBI Act
    d) Sec. 42 of BR Act
    e) None of these
15. RBI injects liquidity through
    a) Increase Bank Rate
    b) Reduction of Repo Rate
    c) Reduction of Reverse Repo
    d) Increase CRR
    e) Increase SLR
16. Who is the authority for referring appeals against the award of banking ombudsman?
    a) Deputy Governor, RBI
    b) RBI Governor
    c) CMD of concerned bank
    d) Group of CMDs formed by RBI
    e) None of the above
17. The sponsoring bank's share in RBIs is:
    a) 50% b) 35% c) 15%
    d) 75% e) None of these
18. Can a HUF join as a partner in a partnership firm?
    a) Can be included
    b) Can be included with company
    c) Cannot join
    d) Can join subject to the approval of CMD
    e) None of the above
19. Bank's Lien is:
    a) General lien
    b) Particular lien
    c) Contingent lien
    d) b & c e) None of these
20. Within how many days the CPIO (Central Public Information Officer) has to provide information under RTI Act?
    a) 30 days b) 15 days
    c) 45 days d) 10 days
    e) 60 hours
21. Which of the following is not a negotiable instrument as per N.I. Act?
    a) Promissory note b) Draft
    c) TDR (Term Deposit Receipt)
    d) Cheque
    e) None of the above
22. Which of the following is not correct in respect of issue of CP:
    a) It can now be issued as a standalone facility
    b) Minimum issue is Rs. 5 lakh
    c) CPs can be underwritten by a bank
    d) Minimum Tangible net worth of the Corporate should be Rs. 4 crore e) All the above
23. The maximum period for which a CD can be issued is ______
    a) 1 month b) 3 months
    c) 180 days d) 1 year
    e) None of these
24. What is not true about CDs?
    a) It is transferable from the data issues
    b) It can be issued for a minimum period of 7 days
    c) It is not all transferable
    d) It can be issued in demat form only
    e) None of these
25. Gilt edged securities refer to ___
    a) Govt. securities
    b) Shares of first class companies
    c) Securities issued by first class companies
    d) Duplicate securities
    e) Securities issued by RBI Identified Companies
26. The standard rate at which the RBI is prepared to buy or rediscount export bills or other commercial paper eligible for purchase from banks under the RBI Act is known as _____
    a) Bank rate b) Repo Rate
    c) Card rate d) PLR
    e) Base Rate
27. The result of increase in SLR by RBI is
    a) Decrease in lendable resources of banks
    b) Increase in loadable resources of banks
    c) There will not be any change in loan able resources of banks
    d) Only b and c e) None of these
28. Blue chip securities mean ____
    a) Shares of progressive, well managed companies with excellent record of payment of dividends.
    b) The shares which are in blue ink
    c) Securities issued by Chip Manufacturing companies
    d) Securities identified by the concerned state governments
    e) None of the above
29. Cash kept in the currency chest is owned by
    a) Currency Chest Branch Bank
    b) Central Government
    c) Reserve Bank of India
    d) State Bank of India
    e) None of the above
30. Bank can't proceed against the borrower under SARFAESI Act where:
    a) Security is agricultural land
    b) Liability is less than Rs.1 lakh
    c) Liability is less than 20% of the principal
    d) Pledge of movables
    e) All the above
31. The minimum capital required to start a new private sector bank is________
    a) 100 crore b) 200 crore
    c) 300 crore d) 400 crore
    e) 500 crore

KEY

1) d; 2) b; 3) b; 4) a; 5) a; 6) b; 7) c; 8) a; 9) c; 10) d; 11) e; 12) b; 13) b; 14) a; 15) b; 16) a; 17) b; 18) c; 19) a; 20) a; 21) c; 22) c; 23) d; 24) e; 25) a; 26) a; 27) a; 28) a; 29) c; 30) e; 31) e